'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 275

శుక్రవారం 26-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



లిస్టింగ్‌కు శాంసంగ్ నో

ప్రొడక్టులతో ఏఐ వినియోగంపై దృష్టి
కన్జూమర్ ఫైనాన్స్ విస్తరణ -13లో

ఏఐ ముప్పు తక్కువే

ఏఐతో భారత్‌లో ఉద్యోగాలకు ముప్పు లేదన్న ఐటీ శాఖ కార్యదర్శి కృష్ణన్ -13లో

'370' గోడను బద్దలుకొట్టాం..

అభివృద్ధికి అవరోధంగా మారిన 'ఆర్టికల్ 370' గోడను బద్దలు కొట్టే అదృష్టం తమకే దక్కిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

వివరాలు 6లో ▸



అణు పాటవంలో ముందడుగు

కిమ్ జోంగ్ ఉన్ చిరకాల స్వప్నమైన అణు జలాంతర్గామి నిర్మాణాన్ని ఉత్తర కొరియా దాదాపు పూర్తి చేసేసింది.

వివరాలు 6లో ▸

బంగ్లా డార్క్ ప్రిన్స్ పునరాగమనం

వచ్చే ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా భావిస్తున్న బీఎన్‌పీ తాత్కాలిక చైర్మన్ తారిఖ్.. 17 ఏళ్ల తరువాత బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టారు.

వివరాలు 6లో ▸

సిరీస్ విజయంపై గురి

తిరువనంతపురంలో నేడు శ్రీలంకతో భారత జట్టు మూడో టి20 ఆడనుంది. టీమిండియా ఈసారీ గెలిస్తే సిరీస్ సొంతమవుతుంది.

వివరాలు 13లో ▸

న్యూస్‌రీల్

పీపీపీ ద్వారానే సంపద సృష్టి

హైదరాబాద్‌ను హైటెక్ సిటీతో అభివృద్ధి చేసినట్టే..అమరావతిని క్వాంటం వ్యాలీతో అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. గుంటూరు జిల్లా వెంకటపాలెం లోని 14 అడుగుల వాజ్‌పేయి కాంస్య విగ్రహావిష్కరణలో ఆయన పాల్గొన్నారు.

వివరాలు 2లో ▸

నోటిఫికేషన్‌కు మనసొప్పట్లే!

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఇంజినీర్ పోస్టులు భర్తీ చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వానికి మనసు రావడం లేదు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లను సైతం పూర్తి చేయకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

వివరాలు 14లో ▸

'రుషికొండ'పై మా అభిప్రాయాలు తీసుకోలేదు

రుషికొండ భవనాల వినియోగంలో స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తీసుకోలేదని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు చెప్పారు. రుషికొండను ఆదాయ వనరుగా చూడకూడదని వ్యాఖ్యానించారు.

వివరాలు 2లో ▸

అణ్వాయుధ సామర్థ్య క్షిపణి ప్రయోగం విజయవంతం

అణ్వాయుధ పరీక్షల్లో భారత రక్షణ దళం సత్తా చాటింది. విశాఖ తీరం వేదికగా అత్యంత కీలకమైన ప్రయోగాన్ని నౌకాదళం విజయవంతంగా నిర్వహించింది. అణ్వాయుధ సామర్థ్యం గల కే-4 క్షిపణిని అరిఘాత్ జలాంతర్గామి నుంచి ఈ నెల 24న దీన్ని ప్రయోగించారు.

వివరాలు 14లో ▸

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹96	ఫారం దగ్గర లైవ్ బర్డ్	140 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	242 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	167 కిలో	స్కిన్ లెస్	276 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇలాంటోళ్ళొస్తే

వేళాకోళంగా ఉందా?
వీళ్ల పేర్లు రెడ్ బుక్‌లో రాయండి!!

కేంద్ర నిధులపై బాబు సర్కారు పెత్తనం

గ్రామాలకు గ్రహణం

15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు గ్రామ పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన నిధులపై ఆంక్షలు

రాజ్యాంగబద్ధంగా స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన నిధులను అడ్డుకుంటూ నిరంకుశత్వం

స్థానిక అవసరాలకు అనుగుణంగా ఖర్చు పెట్టనివ్వకుండా గ్రామ స్వరాజ్యానికి తూట్లు

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించే పనులకే నిధులంటూ పంచాయతీ రాజ్ సర్క్యులర్

విజయనగరం సహా పలు జిల్లాల్లో ఎంపీడీవోలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ

సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న సమయంలో బాబు సర్కార్ రాజకీయ ఎత్తుగడలు



సాక్షి, అమరావతి: గ్రామ స్వరాజ్యానికి చంద్రబాబు సర్కారు గ్రహణం పట్టిస్తోంది! పంచాయతీలకు రాజ్యాంగబద్ధంగా కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను అడ్డుకుని దొడ్డిదారిన మళ్లించే కుతంత్రానికి తెర తీసింది. 15వ ఆర్థిక సంఘం

మిగతా 2వ పేజీలో ▶

దేవుడా..

ఏమిటీ పరీక్ష?

అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో ఆర్తనాదాలు

శ్రీవారి దివ్య దర్శన టోకెన్ల కోసం పోటెత్తిన భక్తులు

క్యూలైన్లలో అరుపులు, కేకలు, తోపులాటలు

ఉద్రిక్తతకు దారితీసిన పరిస్థితులు

టీటీడీ నిర్లక్ష్యం.. నియంత్రణలో సిబ్బంది వైఫల్యం

10లో

క్యూలైన్‌లో జరిగిన తొక్కిసలాటలో కింద పడిపోతున్న వృద్ధురాలు

మీ కులం.. మతం ఏమిటి?

ఏకీకృత సర్వే ముసుగులో 1.40 కోట్ల కుటుంబాల్లో పౌరుల వ్యక్తిగత సమస్త సమాచారం సేకరిస్తున్న బాబు సర్కారు

పంట అమ్మకం ద్వారా ఎంత వచ్చింది?

కరెంట్ ఎన్ని యూనిట్లు వాడతారు?

రాజకీయ దురుద్దేశాలతోనే సర్వేకు శ్రీకారం

ఏకీకృత కుటుంబ సర్వే ముసుగులో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కుటుంబాల్లో పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని సమస్తం తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు బాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏకీకృత కుటుంబం సర్వే పేరుతో ఇంటింటికి వెళ్లి 25 రకాల అంశాలకు సంబంధించి పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా సేకరించనుంది. వివిధ పథకాలు, పౌర సేవలకు సంబంధించి ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతో దీన్ని పోల్చనున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

2లో

క్రిస్మస్ వేడుకలలో వైఎస్ జగన్

కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

3లో

కృష్ణా డెల్టాకు

పెనుముప్పు

- షెల్ ఆయిల్, గ్యాస్ వెలికితీతతో సాగునీటికే కాదు తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు
- వేదాంతకు షెల్ గ్యాస్, ఆయిల్ వెలికితీత అనుభవం లేదు
- తక్షణమే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి సైంటిస్ట్స్ ఫర్ పీపుల్ శాస్త్రవేత్తల లేఖ

5లో

బచావత్ ట్రిబ్యునల్‌కు విరుద్ధంగా..

'గోదావరి–కావేరి' అనుసంధానం

- ఇచ్చంపల్లి నుంచి 85 టీఎంసీలు వాడుకోవడానికి ఉమ్మడి ఏపీకి ట్రిబ్యునల్ అనుమతి
- కానీ అక్కడి నుంచి 148 టీఎంసీలను కావేరికి మళ్లించేలా ఎన్‌డబ్ల్యూడీఏ డీపీఆర్
- ఇది ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధమే అంటోన్న సాగునీటిరంగ, న్యాయ నిపుణులు

2లో

మంటల్లో మరో

ట్రావెల్స్ బస్సు

ఎదురుగా దూసుకొచ్చి ఢీకొన్న కంటైనర్ లారీ

ఐదుగురు ప్రయాణికులు, లారీ డ్రైవర్ సజీవదహనం

ముగ్గురికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఘోర ప్రమాదం

10లో

'నువ్వు కావాలి..

మాట్లాడుకుందాం రా'

ఎస్టీ మహిళతో టీడీపీ నేత అసభ్య ప్రవర్తన

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

14లో

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌తో వెంకటరాముడు (ఫైల్)

క్లుప్తంగా...

ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు పిలవాలి

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: విద్యాశాఖలో రోజుకో ఉత్తర్వు, పూటకో నిర్ణయంతో ఉపాధ్యాయులపై తీవ్రమైన ఒత్తిడి పెరిగిపోయిందని, ఈ సమస్యలపై తక్షణం విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. విద్యాశక్తి పేరుతో సంవత్సరం ప్రారంభం నుంచి వేధిస్తున్నారని, 100 రోజుల ప్రణాళిక పేరుతో డిసెంబర్ నుంచి ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి పెంచారని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్లు రఘునాథరెడ్డి, ఎల్.సాయి శ్రీనివాస్ పేర్కొన్నారు. బోధనేతర కార్యక్రమాలు ఉండవంటూనే రోజుకో బోధనేతర కార్యక్రమం ఉత్తర్వులిచ్చి ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతున్నారని, బోధన తప్ప అన్ని కార్యక్రమాలను చేయమంటున్నారన్నారు. ఇది విద్యా వ్యవస్థకు తీరని నష్టం చేకూరుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

హైకోర్టు నిర్మాణ పనులు ప్రారంభం

శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ

తాడికొండ: అమరావతిలో హైకోర్టు నిర్మాణానికి రాఫ్ట్ ఫౌండేషన్ పనులను గురువారం రాత్రి మంత్రి నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మొత్తం 7 ఐకానిక్ భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ఇచ్చిన డిజైన్‌తో హైకోర్టు పనులు ప్రారంభించామని, దీన్ని మొత్తం 21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 52 కోర్టు హాల్స్‌తో బి+జి+7 అంతస్తుల్లో ఐకానిక్ భవనంగా నిర్మిస్తున్నామని తెలిపారు. 2, 4, 6వ అంతస్తుల్లో కోర్టు హాళ్లు ఉంటాయని, 8వ అంతస్తులో ప్రధాన న్యాయమూర్తి హాల్, కమ్యూనిటీ హాల్ ఉంటుందన్నారు. 2027 చివరికి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

'రుషికొండ'పై మా అభిప్రాయాలు తీసుకోలేదు

బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

ఏయూ క్యాంపస్: రుషికొండ భవనాలపై బీజేపీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం బీచ్‌రోడ్డులోని మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రుషికొండ భవనాల వినియోగంలో స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తీసుకోవాలని కోరారు. రుషికొండను ఆదాయ వనరుగా చూడకూడదన్నారు. ఈ భవనాలను స్టార్ హోటల్స్‌కు ఇచ్చి సామాన్యులకు దూరం చేయవద్దని కోరారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని, పార్టీ పరంగా మాట్లాడటం లేదన్నారు. విశాఖ అంటే సాఫ్ట్‌వేర్ పెట్టుబడులే కాదని, ఆధ్యాత్మిక కేంద్రంగా కూడా అభివృద్ధి చేయాలని అన్నారు. రుషికొండ భవనాల గురించి పునరాలోచించాలని సూచించారు. మంత్రుల కమిటీ తమ అభిప్రాయాలు తీసుకోలేదన్నారు. తనను కానీ, ఇతర ఎమ్మెల్యేలను కానీ ఎవరూ అభిప్రాయం అడగలేదన్నారు. ప్రజల అభిప్రాయాలు కూడా తీసుకోవాలని చెప్పారు. మంత్రుల కమిటీ నిర్ణయం తీసుకుని దాన్ని అమలు చేస్తామనడం తగదన్నారు. బడా హోటల్స్‌కు ఈ భవనాలు ఇవ్వాలని నిర్ణయించిన విషయం వార్తాపత్రికల్లోనే తెలుసుకున్నానని తెలిపారు. ఈ భవనాలను టీటీడీకి ఇచ్చి వివాహ వేదిక నిర్మించి, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు తెలిపే వేదికగా నిలపాలని విష్ణుకుమార్ రాజు సూచించారు.

రైతు నేత అప్పలరాజు విడుదలకు డిమాండ్

సాక్షి, అమరావతి: అనకాపల్లి రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పీడీ చట్టం ఉపసంహరించాలని, ఆయన్ను వెంటనే విడుదల చేయాలని పది వామపక్ష పార్టీల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీల రాష్ట్ర నేతలు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనకాపల్లి ప్రాంత ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న అప్పలరాజుపై తప్పుడు కేసులు బనాయించి నిర్బంధించడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. అప్పలరాజు అరెస్టు నోటీసులో 2013 మే నుంచి ఈ ఏడాది డిసెంబర్ 10 వరకు మొత్తం 19 కేసుల్లో నిందితునిగా పేర్కొన్నారని, వాటిలో రెండు కేసుల్లో నిర్దోషిగా తేల్చగా 12 కేసులు మూసివేశారని, నాలుగు కేసులు దర్యాప్తులో ఉన్నాయని వామపక్ష నేతలు పేర్కొన్నారు. ఆ కేసుల్లో అత్యధిక భాగం 151 సెక్షన్ కేసులేనని, ప్రజలను భయభ్రాంతులను చేసేందుకే అప్పలరాజుపై అక్రమంగా పీడీ చట్టం కేసు నమోదు చేశారని వి.శ్రీనివాసరావు (సీపీఎం), జి.ఈశ్వరయ్య (సీపీఐ), పి.ప్రసాద్ (సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), జాస్తి కిషోర్‌బాబు (సీపీఐ ఎంఎల్), కాటం నాగభూషణం (ఎంసీపీఐయు), బి.బంగార్రావు (సీపీఐఎంఎల్ లిబరేషన్) తదితర వామపక్ష పార్టీ నేతలు ఆరోపించారు.

కేంద్ర నిధులపై బాబు సర్కారు పెత్తనం

గ్రామాలకు గ్రహణం

▶ మొదటి పేజీ తరువాయి

సిఫారసు మేరకు రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు విడుదలైన రూ.వందల కోట్ల నిధులను ఆయా స్థానిక సంస్థలు అక్కడ అవసరాలకు ఖర్చు పెట్టనివ్వకుండా ఆదేశాలు జారీ చేసింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి స్థానిక సంస్థలకు కేంద్ర నిధులు ఇవ్వకుండా తొక్కిపెడుతున్న బాబు సర్కారు తాజాగా మరో అడుగు ముందుకేసి వాటిని తాము చెప్పిన పనులకు మాత్రమే వినియోగించాల్సి ఉంటుందని ఆంక్షలు విధించడం ద్వారా గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడిచింది.

బాబు సర్కారు కర్ర పెత్తనం..!

2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి విడతగా రూ.1,026 కోట్ల నిధులను ఈ ఏడాది అక్టోబరులో రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. నిబంధనల ప్రకారం కేంద్రం నుంచి నిధులు విడుదలైన పది రోజుల్లో వాటిని సంబంధిత గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఖాతాల్లో జమ చేయాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించి మూడు నెలలకు పైగా ఇతర అవసరాలకు వాడుకుంది. తప్పనిసరి పరిస్థితి కావడంతో ఎట్టకేలకు డిసెంబరు 18న ఆ నిధులను విడుదల చేసినా మరో మెలిక పెట్టింది. ఈ నిధులను తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఖర్చు చేయవద్దని ఎంపీడీవోలను ఆదేశించింది. వాటిని తాము చెప్పిన ప్రకారమే వినియోగించాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. ఇలా 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులపై చంద్రబాబు సర్కారు కర్ర పెత్తనం చేస్తోంది.



Rc.No.3110/2025/E1, Dt. 19.12.2025

Zilla Praja Parishad, Vizianagaram.

CIRCULAR

Sub: Establishment - Zilla Praja Parishad, Vizianagaram - Certain instructions on utilization of 15th Finance Grants - Issued.

Ref: Teleconference held by the Commissioner, Panchayat Raj & Rural Development, A.P., Tadepalli, Guntur District, dt.18.12.2025.

** ** **

With reference to the instructions issued by the Commissioner, Panchayat Raj & Rural Development, Andhra Pradesh, in the reference cited, it is informed that the Government of Andhra Pradesh is in the process of issuing a Government Order prescribing detailed guidelines for the utilization of 15th Finance Commission Grants.

In view of the above, all the Mandal Parishad Development Officers in the district are hereby directed not to utilize the 15th Finance Commission Grants until the said Government Order is issued. Further, they shall issue necessary instructions to the Panchayat Secretaries in their respective Mandals to refrain from utilization of the 15th Finance Commission Grants until further orders.

Strict compliance of these instructions is required.

Chief Executive Officer,
Zilla Praja Parishad, Vizianagaram.

To
All the MPDOs in the district
Copy to the District Panchayat Officer, Vizianagaram
Copy to all the DDOs in Vizianagaram district
Copy to the Accounts Section, ZPP, Vizianagaram
Copy submitted to the Commissioner, Panchayat Raj & Rural Development, Andhra Pradesh, Tadepalli, Guntur.

గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్రమిచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు పెట్టనీయవద్దంటూ విజయనగరం జిల్లాలో ఎంపీడీవోలకు ఆ జిల్లా జెడ్పీ సీఈవో జారీ చేసిన ఆదేశాలు..

రాజ్యాంగబద్ధంగా స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన నిధులను అడ్డుకుని గ్రామీణ స్వరాజ్యానికి తూట్లు పొడుస్తోంది. గ్రామ పంచాయతీల పీక నులుముతూ చంద్రబాబు సర్కారు నిరంకుశంగా వ్యవహరించడం పట్ల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ తాజాగా జిల్లాల డీపీవోలు, జడ్పీ సీఈవోలతో నిర్వహించిన సమావేశంలో కేంద్ర నిధులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తెలియచేసినట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

సర్పంచుల పదవీ కాలం మరో మూడు నెలలే..

ప్రస్తుత సర్పంచుల పదవీ కాలం మరో మూడు నెలల్లో ముగియనుంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 2 కల్లా సర్పంచుల కాలం పూర్తవుతుంది. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా ఇచ్చిన రూ.1,026 కోట్లతో పాటు రానున్న మార్చి నెలాఖరులోగా రెండో విడతగా మరో రూ.1,000 కోట్లు కేంద్రం నుంచి గ్రామీణ స్థానిక సంస్థలకు నిధులు రావాల్సి ఉంది. ఇలా రూ.రెండు వేల కోట్లకుపైగా కేంద్రం నిధులిస్తున్నప్పటికీ బాబు సర్కారు స్థానిక సంస్థలకు అందకుండా అడ్డుపడుతోంది. స్థానిక అవసరాలకు అనుగుణంగా కాకుండా తాము చెప్పిన ప్రకారం వాడాలని ఆంక్షలు పెడుతోంది. ఈ ఏడాది కేంద్రమిచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచులు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు ఆయా గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల అవసరాలకు అనుగుణంగా కాకుండా రాష్ట్ర ప్రభుత్వం సూచించే పనులకే ఖర్చు పెట్టాలంటూ పంచాయతీరాజ్ శాఖ సర్క్యులర్ జారీ చేసింది. విజయనగరం సహా పలు జిల్లాల్లో ఈ మేరకు ఎంపీడీవోలకు ఆదేశాలు వెలువడ్డాయి.

కేంద్రం కరుణించినా..

అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చంద్రబాబు సర్కారు గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్రం ఇస్తున్న నిధులను తొక్కిపెడుతూ తీవ్ర జాప్యం చేస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులను కేంద్రం గతేడాది సెప్టెంబరులో రూ.988.76 కోట్లు విడుదల చేయగా.. దాదాపు రెండు నెలల తర్వాత నవంబరులో స్థానిక సంస్థల ఖాతాలకు చేరాయి. ఇక గతేడాదికి సంబంధించి రెండో విడతగా రూ.1,121 కోట్లను 2024 డిసెంబరులో కేంద్రం విడుదల చేస్తే.. దాదాపు తొమ్మిది నెలల తర్వాత ఈ ఏడాది సెప్టెంబరులో వాటికి మోక్షం లభించింది.

☞ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడతగా రూ.998 కోట్ల కేంద్ర నిధులు 2024 మార్చి నెలాఖరులో విడుదలయ్యాయి. అయితే అప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలై కోడ్ అమలులోకి రావడంతో అప్పటి అధికారులు ఆ నిధులను గ్రామీణ స్థానిక సంస్థలకు విడుదల చేయలేదు. ఎన్నికల అనంతరం టీడీపీ కూటమి ప్రభుత్వం జూన్ 12వ తేదీనే బాధ్యతలు చేపట్టినప్పటికీ 2024 ఆగస్టు దాకా ఆ నిధులను ఆయా స్థానిక సంస్థలకు విడుదల చేయకపోవడం గమనార్హం.

జగన్ హయాంలో.. సర్పంచుల ఆధ్వర్యంలోనే చెల్లింపులు

15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్రం ప్రత్యేకించి గ్రామీణ స్థానిక సంస్థలకు విడుదల చేసే నిధులపై రాష్ట్ర ప్రభుత్వ ఆంక్షలు లేకుండా వైఎస్సార్‌సీపీ హయాంలో అడుగులు ముందుకు పడ్డాయి. సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీ చైర్మన్ల ఆధ్వర్యంలోని స్థానిక సంస్థల పాలకవర్గాలు వాటి పరిధిలో స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు నిధులను ఖర్చు చేసుకునే కొత్త విధానం గత ప్రభుత్వ హయాంలోనే మొదలైంది. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల తీర్మానాల ప్రకారం చేపట్టే అభివృద్ధి పనులకు ఆయా స్థానిక సంస్థలే నేరుగా బిల్లులు చెల్లించేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనికి సంబంధించి రాష్ట్ర ట్రెజరీ ఆంక్షలు లేకుండా, ఆ నిధులను ఆయా గ్రామీణ స్థానిక సంస్థల ప్రత్యేక బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చింది. అంతకు ముందు టీడీపీ హయాంలో కేంద్ర ఆర్థిక సంఘం నిధులపై నియంత్రణను సీఎఫ్‌ఎంఎస్ పరిధిలో ఉంచడంతో గ్రామ పంచాయతీలు మొక్కుబడి కార్యకలాపాలకే పరిమితమయ్యాయి. కళ్ల ముందు కేంద్రం ఇచ్చిన నిధులున్నా.. రాష్ట్ర ప్రభుత్వం సీఎఫ్‌ఎంఎస్ వద్ద బిల్లులు పాస్ కాకుండా అడ్డంకులు సృష్టించడంతో గ్రామీణ స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయి.

బిల్లులు అడిగితే కేసులు!

- పంచాయతీ నిధుల విడుదలపై కక్షసాధింపు
- టీడీపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్న ఎంపీడీవో

సాక్షి టాస్క్‌ఫోర్స్: చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని కోరిన సర్పంచ్‌పై అక్రమంగా కేసు నమోదు చేసిన ఘటన ప్రకాశం జిల్లా రాచర్ల మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని అనుములపల్లె పంచాయతీలో 8 నెలల క్రితం చేసిన అభివృద్ధి పనులకు రూ.5 లక్షల బిల్లులు రావాల్సి ఉందని, వాటిని మంజూరు చేయాలని ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ సిరిగిరి రమేష్ ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డిని పలుమార్లు కోరారు. ఎన్నిసార్లు అడిగినా ఎంపీడీవో ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. సర్పంచ్ రమేష్ గ్రామంలోని కొంతమంది వ్యక్తులతో కలిసి సోమవారం మరోసారి ఎంపీడీవోని కలిశారు. బకాయిల బిల్లుల విషయంపై మాట్లాడారు. ఆగ్రహించిన ఎంపీడీవో.. సర్పంచ్ పదేపదే బిల్లులు అడుగుతున్నారని, తనతో అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించారంటూ టీడీపీ నాయకులతో కుమ్మక్కై బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సర్పంచ్ రమేష్, ఉప సర్పంచ్ నరసింహులుతో పాటు వారి అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంపీడీవో టీడీపీ నాయకులతో కలిసిపోయి ఆ పార్టీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారంటూ గ్రామస్తులు, నాయకులు మండిపడుతున్నారు.

ఇది .. బ్లాక్ మెయిల్ చేయడమే!

రాజ్యాంగబద్ధంగా స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడం దారుణం. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు స్థానిక సంస్థలు ఆ నిధులు వినియోగించకూడదని ఆదేశించడం గ్రామ స్వరాజ్య స్ఫూర్తికి వ్యతిరేకం. విజయనగరం జెడ్పీ సీఈవో ఈమేరకు సర్క్యులర్ జారీ చేయడం అంటే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను బ్లాక్ మెయిల్ చేయడమే. కేంద్ర నిధులపై రాష్ట్ర ప్రభుత్వ పెత్తనం ఏమిటి? స్థానిక సంస్థల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఇదే వైఖరి కొనసాగిస్తే ప్రజా ప్రతినిధులు, ప్రజలతో కలసి ఉద్యమానికి సమాయత్తం అవుతాం.

–వెన్నపూస రవీంద్రారెడ్డి,
వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు

ఉపసంహరించుకోకుంటే ఉద్యమమే..

15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీరు ఆక్షేపణీయం. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను వినియోగించుకోనివ్వకుండా అడ్డుపడుతూ సర్క్యులర్ జారీ చేయడం శోచనీయం. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు 15 ఆర్థిక సంఘం నిధులను ఖర్చు పెట్టకూడదని పంచాయతీరాజ్ కమిషనర్ ఆంక్షలు విధించడం దారుణం. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇవ్వాల్సిన సర్‌చార్జీ, స్టాంప్ డ్యూటీ నిధులు ఇవ్వడం లేదు. మినరల్ సెస్ రూపంలో ఇవ్వాల్సిన నిధులు కూడా ఇంతవరకు ఇవ్వలేదు. సీనరేజ్ నిధులను కూడా ఇవ్వకుండా గ్రామాల అభివృద్ధికి అడ్డుపడుతూ వస్తోంది. సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలకు గౌరవ వేతనం కూడా చెల్లించకుండా వారిని అగౌరవ పరుస్తోంది. 15వ ఆర్థిక సంఘం నిధులపై సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలి. లేనిపక్షంలో ఉద్యమించక తప్పదు.

–మామిడి అప్పలనాయుడు,
లోకల్ గవర్నమెంట్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు.

బచావత్ ట్రిబ్యునల్‌కు విరుద్ధంగా..

'గోదావరి-కావేరి' అనుసంధానం

సాక్షి, అమరావతి: గోదావరి-కావేరి అనుసంధానానికి జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) రూపొందించిన డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక) బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధంగా ఉందని సాగునీటి రంగ, న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉమ్మడి మధ్యప్రదేశ్ రాష్ట్రాల మధ్య 1978 ఆగస్టు 7న కుదిరిన అంతర్రాష్ట్ర ఒప్పందం మేరకు.. ఇచ్చంపల్లి బాహుళార్థక సాధక ప్రాజెక్టు చేపట్టి, దాని నుంచి 85 టీఎంసీలకు మించకుండా గోదావరి నీళ్లను వినియోగించుకోవడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు జస్టిస్ బచావత్ నేతృత్వంలోని గోదావరి ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చింది. కానీ.. అక్కడి నుంచి 148 టీఎంసీల గోదావరి జలాలను కావేరికి మళ్లించేలా ఎన్‌డబ్ల్యూడీఏ డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక)ను 2021 మార్చిలో రూపొందించింది. ఆ నీళ్లు కూడా ఉమ్మడి మధ్యప్రదేశ్ నేటి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి ఇంద్రావతి సబ్ బేసిన్‌లో కేటాయించి, ఇప్పటికీ వాడుకోనివేనని చెబుతోంది. అయితే, తమ కోటా నీటిని పూర్తి స్థాయిలో వాడుకోవడానికి ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని, వాటిని కావేరికి మళ్లించడానికి ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని ఛత్తీస్‌గఢ్ సర్కార్ పదే పదే స్పష్టం చేస్తోంది. అయినా ఇచ్చంపల్లి నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టేలా బేసిన్ పరిధిలోని రాష్ట్రాలను ఒప్పించి, అవగాహన ఒప్పందంపై సంతకం చేయించడానికి ఎన్‌డబ్ల్యూడీఏ నాలుగున్నరేళ్లుగా సంప్రదింపుల జరుపుతోంది. ఇప్పటికీ ఆ ప్రయత్నాలు ఓ కొలిక్కి రాకపోవడం గమనార్హం. ఈనెల 23న కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ కూడా ఇదే అంశంపై నిర్వహించిన సమావేశంలో తమ కోటా నీటిని వాడుకోవడానికి అనుమతించబోమని ఛత్తీస్‌గఢ్ తేల్చిచెప్పడమే అందుకు నిదర్శనం.



ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదన ఇదీ..

ఇచ్చంపల్లి వద్ద గోదావరిపై 87 మీటర్ల గరిష్ఠ నీటి మట్టంతో బ్యారేజీ నిర్మించి, అక్కడి నుంచి 148 టీఎంసీలను నాగార్జునసాగర్(కృష్ణా), సోమశిల(పెన్నా), అరణియార్ రిజర్వాయర్ మీదుగా కావేరికి తరలించేలా గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలని ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ఇందులో ఆవిరి ప్రవాహ నష్టాలు పోను తెలంగాణకు 43.65, ఆంధ్రప్రదేశ్‌కు 43.86, తమిళనాడుకు 40.93, కర్ణాటకకు 15.90, పుదుచ్చేరికి 2.19 టీఎంసీలు కేటాయిస్తామన్నారు. దీని వల్ల 6,78,797 హెక్టార్లకు నీళ్లందించడంతోపాటు తాగునీటిని అందించవచ్చునని పేర్కొంది. దుర్భిక్ష ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చే ఈ అనుసంధాన ప్రాజెక్టును చేపట్టడానికి అంగీకారం తెలపాలని గోదావరి, కృష్ణా, పెన్నా, కావేరి బేసిన్ పరిధిలోని తొమ్మిది రాష్ట్రాలు, పుదుచ్చేరితో ఎన్‌డబ్ల్యూడీఏ ఆరు దఫాలు ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించింది. ఈ 148 టీఎంసీలు ఇంద్రావతి సబ్ బేసిన్‌లో ఛత్తీస్‌గఢ్‌కు కేటాయించి వాడుకోనివేనని పేర్కొంది. రానున్న రోజుల్లో హిమాలయ, ద్వీపకల్ప నదుల అనుసంధానంలో భాగంగా గంగ–మహానదుల అనుసంధానం చేపడతామని, మహానది–గోదావరి అనుసంధానం చేపడతామని, గంగ నుంచి గోదావరికి జలాలను తరలిస్తామని, అప్పుడు ఛత్తీస్‌గఢ్ తన కోటా నీటిని వాడుకోవచ్చని పేర్కొంది. కానీ దీనికి ఛత్తీస్‌గఢ్ ససేమిరా అంటోంది.

ట్రిబ్యునల్ అవార్డు ఉల్లంఘనే..

గోదావరిపై ఇచ్చంపల్లి బహుళార్థ సాధక బ్యారేజీ నిర్మాణానికి అయ్యే వ్యయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 78.10, మహారాష్ట్ర 10.50, మధ్యప్రదేశ్ 11.40 శాతం చొప్పున భరించాలి. ఇచ్చంపల్లి బ్యారేజీ విద్యుదుత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి చేసే విద్యుత్‌లో మహారాష్ట్రకు 35 శాతం, మధ్యప్రదేశ్‌కు 28 శాతం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 27 శాతం చొప్పున పంపిణీ చేసుకోవాలి. వాటికి అదనంగా మహారాష్ట్ర 3, మధ్యప్రదేశ్ 4, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మరో 5 టీఎంసీలను వినియోగించుకోవచ్చు. అంతకు మించి నీటిని వాడుకోకూడదని ఆ ఒప్పందంలో పేర్కొన్నారు. ఈ మేరకు గోదావరి ట్రిబ్యునల్ అవార్డు జారీ చేసింది. ఇప్పుడు ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించిన మేరకు ఇచ్చంపల్లి నుంచి 148 టీఎంసీలు తరలిస్తే గోదావరి ట్రిబ్యునల్ అవార్డును ఉల్లంఘించినట్లేనని సాగునీటిరంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

పీపీపీ ద్వారానే సంపద సృష్టి

- ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఈ యాత్ర ఆగదు
- వాజ్‌పేయి విగ్రహావిష్కరణ సభలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: హైదరాబాద్‌ను హైటెక్ సిటీతో అభివృద్ధి చేసినట్టే.. అమరావతిని క్వాంటం వ్యాలీతో అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా వెంకటపాలెంలో ఏర్పాటు చేసిన వాజ్‌పేయి స్మృతి వనంలో 14 అడుగుల ఏబీ వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ పూర్తిగా సహకరిస్తున్నారన్నారు. పీపీపీ విధానంలో దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. పీపీపీ ద్వారా సంపద సృష్టిస్తుంటే.. ఏమీ తెలియని కొందరు నాయకులు ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నా, ఉద్యోగాలు కల్పించాలన్నా పీపీపీ మోడల్ కరెక్ట్ అనే విషయాన్ని 30 ఏళ్లుగా చూస్తున్నామన్నారు. తాము అధికారంలోకి వస్తే కాలేజీలు కట్టిన వాళ్లను జైలులో పెడతామంటున్నారని.. అభివృద్ధి చేసే వాళ్లను, జైలులో పెట్టేవాళ్లను ఏవిధంగా చూడాలో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ఎంతమంది ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఈ యాత్ర ఆగదన్నారు.

అపరదేశ భక్తుడు వాజ్‌పేయి: చౌహాన్

సభకు హాజరైన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. మాజీ ప్రధాని అపర దేశభక్తుడని కొనియాడారు. పార్టీలు వస్తాయి, పోతాయి గానీ దేశభక్తి అన్న భావన ప్రతి వ్యక్తిలో ప్రధానంగా ఉండాలని చెప్పిన నేత వాజ్‌పేయి అన్నారు. వాజ్‌పేయి తొలిసారి ప్రధాని అయిన సమయంలో ఫిరాయింపులను ప్రోత్సహించాలని చెప్పినా విలువలకే కట్టుబడి నిలబడ్డారని చెప్పారు. వాజ్‌పేయి వేసిన పునాదుల కారణంగానే దేశం, ఏపీ ముందుకు సాగుతున్నాయన్నారు. సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రులు భూపతిరాజు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్రమంత్రులు సత్యకుమార్, కందుల దుర్గేష్, ఎమ్మెల్యే శ్రవణ్‌కుమార్ మాట్లాడారు. వాజ్‌పేయిపై రూపొందించిన ప్రత్యేక పోస్టల్ స్టాంప్‌ను, కవర్‌ను కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు.

పునర్విభజన చట్టం కింద కేంద్ర అగ్రి వర్సిటీ నెలకొల్పండి

ఏపీలో కొబ్బరి పార్క్, ఆక్వా ల్యాబ్, మ్యాంగో బోర్డు సహా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అమరావతి పర్యటనలో భాగంగా గురువారం సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన కేంద్రమంత్రికి చంద్రబాబు వినతి పత్రం అందించారు. ఏపీ పునర్విభజన చట్టం–2014 షెడ్యూల్ 13లో పేర్కొన్న మేరకు రాష్ట్రంలో కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. దీనికోసం రూ.2,585 కోట్ల అంచనాలతో డీపీఆర్ సమర్పించినట్టు చెప్పారు. సూక్ష్మ సాగునీటి విస్తరణకు అదనంగా రూ.695 కోట్లు కేటాయించాలని, ఏపీని సహజ సాగుకు జాతీయ వనరుల రాష్ట్రంగా ప్రకటించాలని, అమరావతిలో అత్యాధునిక ఆక్వా ల్యాబ్, పులికాట్ సరస్సు అభివృద్ధికి నిధులు కేటాయించాలనే తదితర అంశాలను వినతిపత్రంలో చేర్చారు.

మీ కులం.. మతం ఏమిటి?

సాక్షి, అమరావతి: ఏకీకృత కుటుంబ సర్వే ముసుగులో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కుటుంబాల్లో పౌరుల వ్యక్తిగత సమాచారం సమస్తం గుప్పిట్లో పెట్టుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఆధార్ కార్డుల్లో పౌరుల సమగ్ర సమాచారం ఉన్నప్పటికీ 'ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' అంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆరా తీయడం పట్ల పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలో రాజకీయంగా వినియోగించుకోవాలనే దుర్బుద్ధితోనే పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారనే సందేహాలు ముసురుకుంటున్నాయి.

పెన్షన్లు, రేషన్ కార్డులు, స్కాలర్‌షిప్‌లు ట్రాకింగ్..!

ఏకీకృత కుటుంబం సర్వే పేరుతో పౌరుల వ్యక్తిగత సమాచ్నారి సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే ద్వారా ఇంటింటికి వెళ్లి 25 రకాల అంశాలకు సంబంధించి పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సేకరించనున్నారు. వివిధ పథకాలు, పౌర సేవలకు సంబంధించి ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతో దీన్ని పోల్చనున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఏకీకృత కుటుంబ సర్వే ఆధారంగా 'స్మార్ట్ ఫ్యామిలీ' కార్డు జారీ చేయనున్నారు. పెన్షన్లు, రేషన్ కార్డులు, స్కాలర్‌షిప్‌లు, కుల ధృవీకరణ, ఇతర పథకాలు, సేవలకు సంబంధించిన వివరాలను ఫ్యామిలీ కార్డు ద్వారా ట్రాకింగ్ చేయనున్నారు.

డేటా లేక్‌లో నిక్షిప్తం

ఏకీకృత కుటుంబ సర్వే ద్వారా కులం, మతం, పంట అమ్మకం ద్వారా ఎంత వచ్చింది? తదితర వివరాలతో పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తారు. వివిధ వర్గాల నుంచి ఇలా తీసుకున్న వ్యక్తిగత సమాచారాన్ని రియల్‌టైమ్ గవర్నెన్స్ డేటా లేక్‌లో నిక్షిప్తం చేయనున్నారు. సర్వే ప్రశ్నావళి చూస్తుంటే కచ్చితంగా ఎన్నికల సమయంలో అధికార దుర్వినియోగానికి పాల్పడాలనే దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోందని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇప్పటికే ఆధార్‌తో పాటు రేషన్ కార్డుల్లో పౌరుల సమాచారం ఉండగా కొత్తగా ఏకీకృత కుటుంబ సర్వే పేరుతో వ్యక్తిగత వివరాలను సేకరించాల్సిన అవసరం ఏముందని పేర్కొంటున్నాయి. కొత్తగా రాష్ట్రంలోని 1.40 కోట్ల కుటుంబాల్లోని పౌరుల వ్యక్తిగత సమాచారం సేకరించడంతో పాటు క్యూఆర్ కోడ్‌తో ఫ్యామిలీ కార్డు ప్రత్యేకంగా ఇవ్వాల్సిన అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సర్వే ద్వారా సమాచారం సేకరించాక కుటుంబాల ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఐదు వర్గాలుగా విభజించనున్నారు.

సర్వేతో పౌరుల వ్యక్తిగత సమాచార సేకరణ ఇలా..

- కుటుంబం ఐడీ
- ఆధార్ నంబర్
- పేరు
- లింగం
- పుట్టిన తేదీ
- భర్త /తండ్రి పేరు
- కుల వర్గం
- బియ్యం కార్డు ఐడీ
- విద్యార్హత
- వృత్తి
- మొబైల్ నంబర్
- చిరునామా
- మతం
- వైవాహిక స్థితి
- వైకల్యం
- నివాస స్థితి
- ఆదాయపు పన్ను చెల్లింపుదారు
- భూమి యాజమాన్యం
- మునిసిపల్ ఆస్తి పరిమాణం
- జీఎస్టీ చెల్లింపు
- విద్యుత్ వినియోగం
- పంట అమ్మకం మొత్తం
- ఈపీఎఫ్ కంట్రిబ్యూషన్
- సొంత వాహనాలు
- ప్రభుత్వ ఉద్యోగులు

రియాద్ విమానానికి బాంబు బెదిరింపు

శంషాబాద్: రియాద్ విమానాన్ని ఆర్‌డీఎక్స్ బాంబుతో పేల్చేస్తామంటూ గురువారం తెల్లవారుజామున శంషాబాద్ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) కస్టమర్ సపోర్ట్‌కు మరో బెదిరింపు మెయిల్ వచ్చింది. ఫ్లైనాస్ ఎయిర్‌లైన్స్‌కి చెందిన ఎక్స్‌వై-325 విమానం రియాద్ నుంచి బయలుదేరి ఉదయం 7.50 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావాల్సి ఉంది. ఇదే సమయంలో బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో అధికారులు వెంటనే భద్రతా చర్యలు చేపట్టారు. విమానం సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత పూర్తిగా తనిఖీలు చేశారు. ప్రయాణికులను మరోమారు తనిఖీలు నిర్వహించి ఎలాంటి బాంబులు లేవని నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్‌చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్

తల్లి విజయమ్మతో కలిసి క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో మాజీ సీఎం వైఎస్ జగన్

క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతీరెడ్డి

క్రిస్మస్ వేడుకలలో వైఎస్ జగన్

కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు

చిన్నారులను ఎత్తుకొని బుజ్జగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అక్కచెల్లెమ్మలను ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పులివెందుల: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా పులివెందులలోని సీఎస్‌ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అక్కడికి హాజరైన వారిని ఆప్యాయంగా, చిరునవ్వుతో పలకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలలో వైఎస్ జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్ ఇక్కడికి విచ్చేసిన బంధువర్గానికి, స్నేహితులు, ఆప్తులు, అభిమానులకు క్రిస్మస్ పర్వదినం, ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ×ఏటా క్రిస్మస్ పర్వదినం రోజున నా సొంత గడ్డపై కుటుంబ సభ్యులు, బంధుగణం, స్నేహితులతో కలిసి పండుగలో పాల్గొనడం మనసుకు ఆనందాన్ని ఇచ్చింది. మీ అందరి అభిమానం, ఆశీస్సులు, దేవుని చల్లని దీవెనలు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను₹ అని చెప్పారు. అనంతరం వైఎస్ జగన్ తన మాతృమూర్తి వైఎస్ విజయమ్మ, కుటుంబ సభ్యులు, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పారిశ్రామికవేత్త వైఎస్ ప్రకాష్‌రెడ్డి, దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, చర్చి ఫాదర్లు రెవరెండ్ డాక్టర్ థామస్ ప్రసాదరావుబాబు, నరేష్ బాబు, మృత్యుంజయరావులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. 2026 నూతన సంవత్సర చర్చి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చిలో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆకేపాటి అమరనాథరెడ్డి, డాక్టర్ సుధ, మాజీ మంత్రి అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మాజీ మేయర్ సురేష్, కడప మేయర్ పాకా సురేష్, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, వైఎస్ జోసఫ్‌రెడ్డి పాల్గొన్నారు.

కుమారుడు వైఎస్ జగన్‌ను ఆప్యాయంగా ముద్దాడుతున్న మాతృమూర్తి వైఎస్ విజయమ్మ

ఒక మహిళ సమస్యను కిందకూర్చుని ఓపిగ్గా వింటున్న మాజీ సీఎం వైఎస్ జగన్

పశ్చాత్తాపమునొంది, పవిత్ర కార్యములు చేయుచు, విశ్వాసమునొందిన వారి చెడు కార్యములను కూడా అల్లాహ్ మంచివాటిగా మార్చును.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 26 డిసెంబర్ 2025

ఆరావళి ఆరాటం

ఆరావళి పర్వతశ్రేణి పరిరక్షణ కోసం అసాధారణ రీతిలో పలు రాష్ట్రాల ప్రజానీకం రోడ్డెక్కడంతో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు మొదలెట్టింది. ఢిల్లీ, గుజరాత్, హరియాణా, రాజస్థాన్‌లలో ఆరావళి పర్వతాలకు సంబంధించి కొత్తగా మైనింగ్ లీజులు ఇవ్వొద్దని బుధవారం ఆదేశాలు జారీచేసింది. ఇది పర్యావరణ పరిరక్షణ కోసమేనం టున్నది కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ. మంచిదే! కానీ ఈ విజ్ఞత ముందేవుంటే సమస్య ఇంత దూరం వచ్చేది కాదు. గత ఆదివారం ఆరావళి గురించి కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ చెప్పిన కొత్త నిర్వచనమైనా, చుట్టుపక్కల భూమి కన్నా కనీసం వంద మీటర్లు, అంతకన్నా ఎక్కువ ఎత్తులో ఉంటేనే, మూడు డిగ్రీల ఏటవాలు కనబడితేనే ఆరావళిలో భాగంగా పరిగణించాలన్న ఆ మంత్రిత్వశాఖ సిఫార్సును ఆమోదిస్తూ గత నెల 20న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలైనా పర్యావరణ కార్యకర్తలను విస్మయానికి గురిచేశాయి. ఇప్పుడైనా కొత్త మైనింగ్ లీజులు ఇవ్వొద్దన్న ఆదేశాలు తప్ప, ఈ పర్వతాలను అమాంతం కబళించే ప్రమాదమున్న కొత్త నిర్వచనానికి స్వస్తి పలుకుతున్నామన్న భరోసా లేదు.

ఈ నేలపై సమస్త జీవరాశి కన్నా కోట్లాది సంవత్సరాల ముందే ఆవిర్భవించిన పర్వతశ్రేణి ఆరావళి. వాటి వయసు 250 కోట్ల సంవత్సరాలంటారు. వాయవ్య భారత్‌లో 670 కిలోమీటర్ల పొడవునా, లక్షా 44వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో విస్తరించి, నాలుగు రాష్ట్రాల్లోని 34 జిల్లాలను తాకుతూపోయే ఈ ఆరావళిని దశాబ్దాలుగా అధికార, అనధికార మైనింగ్ కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఆ పర్వతశ్రేణి పర్యావరణపరమైన ప్రయోజనాలను విస్మరించి, అవి మాయమైతే వచ్చే ఉత్పాతాలను బేఖాతరు చేసి కాసుల కక్కుర్తితో కొంచెం కొంచెంగా చిదిమేస్తున్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో నిర్వచనం చెప్పుకుంటూ ఇప్పటికే చాలా భాగాన్ని స్వాహా చేసిన వైనం కనబడుతూనే ఉంది. ఆ పర్వతశ్రేణిలో కేవలం 0.19 శాతంలో మాత్రమే మైనింగ్ లీజులు నడుస్తున్నాయని కేంద్రమంత్రి అంటున్నారు. అంటే 99 శాతానికిపైగా విస్తీర్ణం సురక్షితంగా ఉన్నట్టు లెక్క. కనుక మైనింగ్ ప్రాంతం తక్కువనిపిస్తుంది. కానీ అంకెల్లో చూస్తే అసలు సంగతి బోధపడుతుంది. అది ఏకంగా 68,000 ఎకరాలు! మైనింగ్ సంస్థలు గోరంత లీజుకు కొండంత తవ్వుకుపోవటం మన దేశంలో వింతేమీ కాదు. కనుక వాస్తవంలో ఇది మరింత ఉండొచ్చు.

అసలు పర్యావరణ శాఖ కమిటీ సుప్రీంకోర్టుకు అందించిన నివేదిక గమనిస్తే అది ఆరావళిని రక్షించదల్చుకున్నదా... భక్షించే వారికి వంత పాడదల్చుకున్నదా అనే సందేహం తలెత్తుతుంది. 'ఆరావళిలో ప్రతి భాగమూ పర్వతం కాదు, అలాగే ప్రతి పర్వతమూ ఆరావళిలో భాగం కాదు' అని అనడంతోపాటు 'కేవలం ఏటవాలే హద్దుల నిర్ణయానికి గీటురాయైతే చేర్పులకు సంబంధించి తప్పులు దొర్లే ప్రమాదం ఉంటుంద'ని చెప్పడంలో పర్యావరణహితం ఆవగింజంతైనా కనబడుతోందా? దశాబ్దాల తరబడి అక్కడి అక్రమ, 'సక్రమ' మైనింగ్ కార్యకలాపాల వల్ల పర్వతరహిత ప్రాంతాలుంటే ఉండొచ్చు. కానీ పర్యావరణ శాఖ కమిటీగా 'చేర్చాలన్న' ఆత్రుత కన్నా మినహాయింపుల వైపే మొగ్గటం సరైందేనా?

మనిషి తాను ప్రకృతిలో భాగమన్న సంగతి మరిచి చాన్నాళ్లయింది. దాన్నుంచి వేరు చేసుకుంటే ఏం జరుగుతుందో ఆరావళి ఆవలున్న థార్ ఎడారి చూపుతోంది. అక్కడి ఇసుక తుపాన్లు మన వైపు రాకుండా అడ్డుపడుతున్నవీ, స్థానికంగా భూగర్భజలాలను పెంచుతున్నవీ, జనం జీవనోపాధికి అండగా నిలుస్తున్నవీ ఈ పర్వతాలే! ఇంతకూ ఆరావళి ప్రాంతాన్ని మైనింగ్‌కు ఇవ్వబోమన్న హామీ వినబడుతోంది గానీ... జాతీయ రాజధాని ప్రాంతం(ఎన్సీఆర్)లో రియల్ ఎస్టేట్ దందాను సాగనివ్వబోమన్న వాగ్దానమైతే ఇంతవరకూ లేదు. నిజానికి వందమీటర్ల గీటురాయి ఆ ప్రాంతాన్ని ఉద్దేశించి రూపొందించినట్టే కనబడుతోంది. ఎందుకంటే ఆరావళికి ఇటువైపున్న చిట్టచివరి ప్రాంతం ఎన్సీఆర్. అక్కడ కొండలు దాదాపు కనుమరుగయ్యాయి. కానీ ఇంకా చిన్న గుట్టలు, పొదలూ విస్తారంగా ఉన్నాయి. వీటిని సైతం కాపాడుకోవాల్సిందే! యునెస్కో అరుదైన ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిన ఆరావళిలో అంగుళం కూడా నష్టపోకూడదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** శు.షష్ఠి ఉ.10.06 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర తె.6.03 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** ప.12.37 నుండి 2.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.39 నుండి 9.23 వరకు, తదుపరి ప.12.19 నుండి 1.03 వరకు, **అమృత ఘడియలు:** రా.10.02 నుండి 11.38 వరకు.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం: 5.28
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

మెకానిక్



నేను నాయకుడిని అవాలని ఎప్పుడూ కోరుకోలేదు. ఆయిల్ క్యాన్‌తో తిరుగుతుండే వ్యక్తిని అవాలనుకున్నాను. ఆయిల్ అయిపోయి, బండి ఆగిపోయిన వాళ్లకు ఆయిల్ ఇచ్చి సహాయం చేయటానికి! 'ఆయిల్ పట్టుకుని తిరిగే మెకానిక్'. అదీ నా ఆదర్శ జీవితం.

– ప్రకాశ్ బాబా ఆమ్టే, సోషల్ వర్కర్

... కష్టపడకు!

నీలో లేని దాని కోసం నువ్వు కష్టపడకు. నీ విషయమై జీవితానికి ఉన్న ఉద్దేశాలకు అడ్డుపడకు. బలవంతంగా నెరవేర్చుకోవాలని చూసేవేవీ ఫలవంతం కావని గ్రహించు. ప్రయత్నం మాత్రమే నీ చేతుల్లో ఉంటుంది. అదీ కొంత వరకే! ఆ పైన అంతా అప్రయత్నమే!

– మదర్ మీరా, ఆధ్యాత్మిక గురువు

ప్రశాంతత

వైమానిక దళానికి ఆకాశం హద్దు కాదు. ప్రారంభం మాత్రమే! క్లిష్టమైన పరిస్థితుల్లో, అపరిమితమైన ఒత్తిడిలో ప్రశాంతంగా ఉండటం ఇక్కడ నేర్చుకుంటాం. సంక్షోభ సమయాల్లో సమర్థమైన నిర్ణయాలు తీసుకోటానికి ఈ ప్రశాంతత మాకు తోడ్పడుతుంది.

– అరూప్ రాహా, మాజీ ఎయిర్ చీఫ్

వినాలి... చూడాలి

ప్రతి శిలకూ, ప్రతి నిశ్చలతకూ ఒక కథ ఉంటుంది, కదలిక ఉంటుంది. శిల్పి ఆ కథను వినగలగాలి. ఆ కదలికను చూడగలగాలి. అప్పుడే వాటికి ఆకృతిని ఇవ్వగలడు, ప్రాణం పోయగలడు. ఈ అంతర్దృష్టి శిల్పిని సృష్టికర్తకు సమానుడిని చేస్తుంది.

– గుర్‌ప్రీత్ సింగ్ ధూరి, శిల్పకారుడు

హతం చేయొద్దు!

తుఫానుకు వంగే గడ్డిపోచలా, అనుకూలంగా లేని పరిస్థితులకు తలొగ్గితే మీరు తక్కువయ్యేదేమీ లేదు. తిరిగి లేచి నిలబడతారు. కనుక స్థిరంగా ఉండండి. మొండిపట్టుతో మాత్రం ఉండకండి. కఠినంగా ఉన్నవే పెకిలింపునకు గురవుతాయి.

– సోనూ శర్మ, మోటివేషనల్ స్పీకర్

ఆహార విహారం



ఆహారంలో రుచి మాత్రమే ఉండదు. కలిసి తింటూ, పంచుకున్న మాటలూ ఉంటాయి. మిగుల్చుకున్న జ్ఞాపకాలూ ఉంటాయి. సంస్కృతులు, సంప్రదాయాలను తెలుసుకోవటం ఉంటుంది. ఆహారం ఒక ఆహ్లాదకరమైన విహారం.

– కల్యాణ్ కర్మాకర్, ఫుడ్ రైటర్

పరిహారం 'అణు'వంతేనా?

విశ్లేషణ

దినేశ్ సి. శర్మ

భారత రూపాంతరీకరణకు ఉద్దేశించిన 'అణు శక్తి స్థిర వినియోగ–పురోగతి బిల్లు (శాంతి) 2025'కు పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపింది. ఇది అణు శక్తికి సంబంధించి మూడు కీలక అంశాలపై చిరకాలంగా ఉన్న చర్చను మళ్ళీ రేకెత్తించింది. అవి: అణుశక్తి అభివృద్ధి–నియంత్రణ; ప్రమాదాలు సంభవించినపుడు సివిల్ లయబిలిటీ; అణు శక్తి ఉత్పాదనలో ప్రైవేటు భాగస్వామ్యం. అటామిక్ ఎనర్జీ చట్టం (1962), సివిల్ లయబిలిటీ–న్యూక్లియర్ డ్యామేజ్ చట్టం (2010) స్థానంలో ఈ కొత్త చట్టాన్ని తెచ్చారు. అణుశక్తి అభివృద్ధి–వినియోగానికి 1962 నాటి చట్టం వీలు కల్పిస్తే, అణు ప్రమాదాలు సంభవించిన పక్షంలో బాధ్యత వహించడం, పరిహారం చెల్లించడానికి సంబంధించి ఒక చట్రాన్ని 2010 నాటి చట్టం అందించింది.

స్వతంత్ర నియంత్రణకు సుముఖం కాదా?

విద్యుదుత్పాదనకు చిన్న మాడ్యులర్ రియాక్టర్లు (ఎస్ఎంఆర్) అందుబాటులోకి రావడం, 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుదుత్పాదన గడించాలనే ఆశావహ లక్ష్యసాధనకు ప్రైవేటు రంగ భాగస్వామ్యం అవసరమవడం అనే రెండు కారణాల రీత్యా కొత్త చట్టం అవసరమైందని ప్రభుత్వం వివరించింది.

అణు విద్యుదుత్పాదనలో ప్రైవేటు రంగానికి ద్వారాలు తెరవాలని ప్రభుత్వం నిర్ణయించడంతో... నియంత్రణ, లయబిలిటీ చట్రాలు రెండూ అత్యంత ముఖ్యమైనవిగా పరిణమించాయి. అవి రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నవి. నియంత్రణకు సంబంధించి కొత్త చట్టం యథాతథ స్థితినే కొనసాగించింది. అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్బీ) గతంలో మాదిరిగానే పని చేస్తుంది. అణుశక్తి అభివృద్ధి మొగ్గ తొడుగుతున్న 1960లలో, రేడియేషన్ సదుపాయాలలో రేడియేషన్ సురక్షణను అమలుపరచేందుకు, అటామిక్ ఎనర్జీ శాఖ (డీఏఈ)కు వెలుపల డైరెక్టరేట్ ఆఫ్ రేడియేషన్ ప్రొటెక్షన్ (డీఆర్పీ) ఏర్పాటు చేశారు.

హోమీ భాభా తర్వాత అణుశక్తి శాఖ బాధ్యతలు చేపట్టిన విక్రమ్ సారాభాయ్, స్వతంత్ర అణుశక్తి నియంత్రణ సంస్థ (ఏఈఆర్‌ఏ) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారుగానీ, ఆ భావన అమలుకు నోచుకోక ముందే, ఆయన కన్నుమూశారు. ఆయన వారసుడు హోమి ఎన్.సేత్నా ఏఈఆర్‌ఏ ఆలోచనను పక్కనపెట్టి, డీఆర్పీని కొనసాగించాలని నిర్ణయించారు. రాజా రామన్న 1983లో నియంత్రణ సంస్థ (ఏఈఆర్బీ)కు పచ్చ జెండా ఊపారు. కానీ, అది ఇతర రంగాలలోని అదే రకమైన సంస్థలలాగా పూర్తిగా స్వయం ప్రతిపత్తి కలిగినది కాదు. ఈ 2025 చట్టం కూడా ప్రస్తుత ఏఈఆర్బీ చట్రాన్ని కొనసాగించేందుకే మొగ్గు చూపింది.

స్వతంత్ర నియంత్రణ సంస్థ ఆలోచనకు అణుశక్తి వ్యవస్థ సానుకూలంగా లేదని స్పష్టమవుతోంది. అణుశక్తి శాఖ పరిధిలోనే

◆ 'ద సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా – ఎస్‌హెచ్‌ఏఎన్‌టీఐ – శాంతి, 2025' బిల్లును ఇటీవలే పార్లమెంట్ ఆమోదించింది. అయితే, అణు విద్యుదుత్పాదనలో ప్రైవేటు రంగానికి ద్వారాలు తెరుస్తున్నందున సాంకేతికంగా పారదర్శకమైన నియంత్రణ సంస్థ అవసరం.

ఏఈఆర్బీ పనిచేస్తున్నప్పటికీ, గతంలో అది నీళ్ళు నమలకుండా పనిచేసిన దాఖలాలు లేకపోలేదు. వివిధ సందర్భాలలో నియమాల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించినపుడు ఏఈఆర్బీ–ముఖ్యంగా ఎ. గోపాలకృష్ణన్ అధ్యక్షుడిగా ఉన్నపుడు– విద్యుదుత్పాదన కేంద్రాలు, ఇతర సంస్థలపై ఆంక్షల రూపంలో కొరడా ఝుళిపించింది.

పరిహారానికి పరిమితులా?

ఇపుడు ప్రైవేటు రంగానికి ద్వారాలు తెరుస్తున్నారు కనుక, నిజాయతీగా పనిచేసే, సాంకేతికంగా బలోపేతమైన స్వతంత్ర వ్యవస్థ అవసరం ఉంది. దేశ పురోగతి ముసుగులోనే అయినప్పటికీ, ఏఈఆర్బీ యథాతథ స్థితిని కొనసాగించడం శుభ సూచకం కాదు. ప్రైవేటు రంగాన్ని అనుమతించిన అంతరిక్ష రంగంలో కూడా ప్రభుత్వం స్వతంత్ర నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయడానికి బదులుగా ఇన్–స్పేస్ పేరుతో, ఏ ఎండకా గొడుగు పట్టే సంస్థనే సృష్టించింది. ఒక విధానాన్ని ప్రోత్సహించే, నియంత్రించే రెండూ ఒకే చూరు కింద ఉండకూడదన్నది మూలసూత్రం కావాలి.

అణు దుర్ఘటనలు సంభవిస్తే కలిగే నష్టానికి లయబిలిటీ విషయంలో నియంత్రణ సంస్థ ఎలా వ్యవహరిస్తుందన్నది ప్రశ్న. నియంత్రణ కఠినంగా లేకపోతే, ప్రమాదాలకు తావు ఇచ్చినట్లు అవుతుంది. లయబిలిటీకి సంబంధించి అంతర్జాతీయంగా పాటించే నియమాలు చాలా సంక్లిష్టంగా ఉంటాయి. జాతీయ చట్టాలు కూడా వాటికి అనుగుణంగా రూపొందాలి. అణు ప్రమాదం సంభవించిన చోట మూడవ పక్షానికి పరిహారం చెల్లించే బాధ్యత న్యూక్లియర్ ఇన్‌స్టలేషన్ ఆపరేటర్ పైనే ఉంటుందని అంతర్జాతీయ కట్టుబాట్లు చాలా వరకు నిర్దేశిస్తున్నాయి. ఇక్కడ న్యూక్లియర్ ఇన్‌స్టలేషన్ అంటే న్యూక్లియర్ రియాక్టర్ కిందనే లెక్క. కానీ, ఇతర సదుపాయాలున్న న్యూక్లియర్ సైట్ వద్ద కూడా దుర్ఘటన సంభవించవచ్చు.

లయబిలిటీని అనేక అంశాలు నిర్ణయిస్తాయి. ప్రస్తుత చట్టంలో పరిహారంపై రూ. 3,000 కోట్ల పరిమితి విధించడం, దాన్ని న్యూక్లియర్ ప్లాంట్ ప్రదేశంతో ముడిపెట్టడం అసంబద్ధం. చిన్న రియాక్టర్లకు (150 మెగావాట్ల నుంచి 750 మెగావాట్ల ఉత్పాదన సామర్థ్యం ఉన్నవి) లయబిలిటీని మరీ తక్కువగా రూ. 300 కోట్లుగా నిర్ణయించారు. ఇక 150 మెగావాట్ల కన్నా తక్కువ సామర్థ్యం ఉన్నవాటికి కేవలం రూ. 100 కోట్లనే నిర్ణయించారు. చిన్న మాడ్యులర్ రియాక్టర్లను ప్రోత్సహిస్తున్న సంస్థలను మచ్చిక చేసుకునేందుకే అలా నిర్ణయించారని తేటతెల్లమవుతోంది. హెచ్చు సామర్థ్యమున్న భారీ అణు విద్యుదుత్పాదన కేంద్రాలను నెలకొల్పేందుకు పెద్ద మొత్తాలలో పెట్టుబడులు అవసరమవుతాయి. అవి నిర్మాణం పూర్తి చేసుకుని, ఉత్పాదన ప్రారంభించేందుకు సమయం కూడా ఎక్కువ పడుతుంది. అణు విపత్తులలో లయబిలిటీ చట్రాన్ని సడలించడం ద్వారా, మాడ్యులర్ రియాక్టర్ల వల్ల పెద్ద నష్టం ఉండబోదని ఆ పరిశ్రమ నమ్మించే ప్రయత్నం చేస్తోంది. లయబిలిటీలను వర్గీకరించడం ద్వారా కొత్త చట్టం ఆ పరిశ్రమను సంతృప్తి పరచింది.

భోపాల్ దుర్ఘటన పాఠాలు నేర్చుకున్నామా?

అణు రియాక్టర్ల వద్ద (అణు ఇంధన వలయ సదుపాయాలతో కూడుకుని) తలెత్తే ప్రమాదాలను కొత్త చట్టం నిర్వచించి, లయబిలిటీలను కూడా నిర్ణయించింది. కానీ, 'అణు సదుపాయాలు'గా నిర్వచించిన చోట్ల ప్రమాదాలు సంభవిస్తే, లేదా అణు ధార్మికత వెలువడితే ఏమిటన్న దానిపై మౌనం వహించింది. అలాంటి పరిసరాలలో ఏదైనా సంభవిస్తే ఆ నష్టాలకు పరిహారం చెల్లించే బాధ్యత ఎవరిది? 'న్యూక్లియర్ డ్యామేజీ' అనే దానికి మాత్రం చట్టంలో విస్తృతార్థం ఇచ్చారు. ప్రాణ నష్టం, గాయపడటం, ఆస్తి నష్టం, ఆర్థిక నష్టం, అణు ప్రమాదం వల్ల దెబ్బతిన్న పర్యావరణాన్ని పునరుద్ధరించేందుకు అయ్యే వ్యయం అంటూ దానిలో చాలా వాటిని చేర్చారు. కానీ, లయబిలిటీ పరిమితిని మాత్రం రూ. 100 కోట్ల నుంచి రూ. 3,000 కోట్లుగా పేర్కొన్నారు.

2010లో సంభవించిన సముద్ర ప్రమాదానికి గానూ బ్రిటిష్ పెట్రోలియం సంస్థ 65 బిలియన్ డాలర్లు చెల్లించింది. అదే భోపాల్‌లో యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో మిథైల్ ఐసోసైనేట్ గ్యాస్ లీకవడాన్ని ప్రపంచంలోనే అత్యంత ఘోరమైన పారిశ్రామిక ఉపద్రవంగా చెబుతారు. కానీ దాని బాధితుల్లో పరిహారం కోసం ఎదురు చూస్తున్నవారు ఇంకా ఉన్నారు. పర్యావరణ నష్టానికి ఎవరూ చెల్లించింది ఏమీ లేదు. మళ్లీ మధ్యవర్తిత్వం నెరపే ప్రయత్నమూ లేదు. అణుశక్తి విషయంలో అడుగు ముందుకేసే ముందు గతం నుంచి పాఠాలు నేర్చుకోవాలి. పెంపొందించే పని, నియంత్రణ ఒకే చూరు కింద సంసారం చేయకూడదు.

వ్యాసకర్త సైన్స్ కామెంటేటర్

నూరేళ్ల ఎర్రజెండా!

భారతదేశంలో శ్రామిక, పీడిత వర్గాల విముక్తి కోసం, సోషలిజం స్థాపన లక్ష్యంతో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 2025 డిసెంబర్ 26 నాటికి వంద సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటోంది. నూరేళ్ల కమ్యూనిస్టు చరిత్ర ఎన్నో వీరోచిత పోరాటాలతో, అలుపెరగని సైద్ధాంతిక పోరాటాలతో నిండి ఉంది.

1925 డిసెంబర్ 26 నుండి 28 వరకు ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జరిగిన మహాసభలో దాదాపు 500 మంది ప్రతినిధులు పాల్గొని భారత కమ్యూనిస్టు పార్టీని లాంఛనంగా స్థాపించారు. ఈ సభలో పార్టీ కేంద్ర కార్యాలయం బొంబాయిలో ఉండాలని నిర్ణయించి, సింగార వేలును అధ్యక్షునిగా, ఆజాద్ సాహీని ఉపాధ్యక్షునిగా, ఎస్.వి. ఘాటే, జానకీ ప్రసాద్ బాగెర్ హాట్‌లను ప్రధాన కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. బొంబాయి, కలకత్తా, కాన్పూర్, మద్రాస్, లాహోర్‌లను ప్రావిన్షియల్ కేంద్రాలుగా చేశారు.

అయితే, అంతకంటే ముందే 1920 అక్టోబర్ 17న తాష్కెంట్‌లో ఎం.ఎన్. రాయ్ బృందం లెనిన్‌తో చర్చించిన అనంతరం పార్టీ ఏర్పాటును ప్రకటించినప్పటికీ, అది కొన్ని రహస్య కార్యకలాపాలకే పరిమితమైంది. ఆంగ్లేయ ప్రభుత్వం 1924లోనే కమ్యూనిస్టు భావజాలంపై కాన్పూర్ కుట్ర కేసు బనాయించిన నేపథ్యంలో, బహిరంగంగా ప్రజల్లో పని చేయాలని పార్టీ నిర్ణయించుకుంది.

చారిత్రక పోరాటాలు

బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుండి దేశాన్ని విముక్తి చేయడం, ఉత్పత్తి సాధనాలు సమాజానికి చెందేలా కార్మిక, కర్షక రిపబ్లిక్‌ను స్థాపించడం పార్టీ ప్రధాన ఆశయంగా ప్రకటించింది. స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టులు అత్యంత క్రియాశీలక పాత్ర పోషించారు. పెషావర్, మీరట్ కుట్ర కేసుల వంటి కఠిన నిర్బంధాలనూ, బ్రిటిష్ వలసవాదుల నిషేధాన్నీ ఎదుర్కొంటూనే ఉద్యమాన్ని నడిపారు. ముఖ్యంగా నిజాం నిరంకుశత్వం, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన 'తెలంగాణ సాయుధ పోరాటం', 'తెభాగా'(బెంగాల్), 'వర్లీ'(మహారాష్ట్ర), 'పున్నప్ర–వాయలార్' (కేరళ) పోరాటాలు భారత చరిత్రలో చెరగని ముద్ర వేశాయి.

1942 'క్విట్ ఇండియా' ఉద్యమం వంటి కొన్ని కీలక సందర్భాలలో తీసుకున్న నిర్ణయాలు ప్రజల వాంఛలకు భిన్నంగా ఉండటంతో పార్టీ కొంత నష్టాన్ని చవిచూసింది. 1950ల తర్వాత ప్రవేశించిన మితవాద, అతివాద ధోరణుల ఫలితంగా 1964లో పార్టీ చీలిపోయింది. ఆ తర్వాత 1967 నక్సల్బరీ పోరాటం దరిమిలా 1969లో చారు మజుందార్ నాయకత్వంలో సీపీఐ (ఎంఎల్) ఏర్పడింది. అయితే, వర్గశత్రు నిర్మూలన వంటి అతివాద దుస్సాహసిక పద్ధతుల వల్ల విప్లవ శిబిరం అనేక గ్రూపులుగా విడిపోయి, సైద్ధాంతిక పిడివాదంలో చిక్కుకుపోయింది.

నేటి భారతంలో పెట్టుబడిదారీ విధానం, గ్లోబల్ కార్పొరేట్ సామ్రాజ్యం కొత్త రూపాల్లో ప్రజలను దోపిడీ చేస్తున్నాయి. మతోన్మాద ఫాసిజం, కుల వివక్ష, ఆర్థిక అణచివేతల నుంచి ప్రజలను విముక్తి చేయడమే నేటి కమ్యూనిస్టుల ప్రథమ కర్తవ్యం.

ఈ వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమ అనుభవం– నక్సల్బరీ, శ్రీకాకుళ, గోదావరి లోయ, దండకారణ్య తదితర ఉద్యమాల అనుభవం మనకు త్యాగాల దారినే కాదు... ఎన్నెన్నో గుణపాఠాలను, వైఫల్యాల పార్శ్వాలను అందించింది. ఆ అనుభవంతో భారతదేశంలో బలమైన ఐక్య విప్లవ కమ్యూనిస్టు పార్టీని సరైన సైద్ధాంతిక, రాజకీయ పునాదుల మీద నిర్మించడమే అమరవీరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి.

– పోటు రంగారావు । సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ కార్యదర్శి (భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా రేపు హైదరాబాద్ ఎస్వీకేలో సదస్సు)

దార్శనిక నేత

ఇన్ బాక్స్

భారత మాజీ ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్ కేవలం ఒక ఆర్థికవేత్త మాత్రమే కాదు, దేశ గమనాన్ని మార్చిన దార్శనికుడు. రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా (1982–85), కేంద్ర ఆర్థిక మంత్రిగా, దేశ ప్రధానిగా ఆయన అందించిన సేవలు నిరుపమానం. మృదు స్వభావి అయినప్పటికీ, దేశ ప్రయోజనాల కోసం కఠిన నిర్ణయాలు తీసుకోవడంలో ఆయన ఎప్పుడూ వెనుకాడలేదు.

1991లో దేశం ఆర్థిక దివాళా అంచున ఉన్న సమయంలో, పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో కొనసాగుతున్న 'లైసెన్స్ రాజ్'కు చరమగీతం పాడుతూ, ఆర్థిక వ్యవస్థను సరళీకరించారు. విదేశీ పెట్టుబడులకు తలుపులు తీయడం, ఎగుమతులను ప్రోత్సహించడం ద్వారా కునారిల్లుతున్న భారత ఆర్థిక రథాన్ని పరుగులు పెట్టించారు. బ్రిటన్ బ్యాంకులో బంగారం నిల్వలను తనఖా పెట్టి మరీ విదేశీ మారక ద్రవ్యాన్ని సమీకరించి దేశాన్ని గట్టెక్కించిన ఘనత ఆయనది.

డా॥ మన్మోహన్ సింగ్

2004లో యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఎంపికతో అనూహ్యంగా ప్రధాని బాధ్యతలు చేపట్టిన మన్మోహన్, 2014 వరకు పదేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. ఆయన హయాంలోనే 'సమాచార హక్కు చట్టం', 'ఉపాధి హామీ చట్టం', 'విద్యాహక్కు చట్టం', 'ఆహార భద్రత చట్టం' వంటి విప్లవాత్మక నిర్ణయాలు రూపుదిద్దుకున్నాయి. ముఖ్యంగా సుమారు 72 వేల కోట్ల రూపాయల 'రైతు రుణమాఫీ పథకం' కోట్లాది మంది చిన్న, సన్నకారు రైతులకు ఊరట నిచ్చింది.

సాంకేతిక రంగంలో నేడు మనం చూస్తున్న ఆధార్ కార్డు, త్రీ జీ, ఫోర్ జీ సేవలు మన్మోహన్ హయాంలోనే ప్రారంభమయ్యాయి. అలాగే, రాజకీయంగా ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకుని భారత శక్తిని ప్రపంచానికి చాటారు. సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు బిల్లు పార్లమెంటులో గట్టెక్కడం వెనుక మన్మోహన్ చతురత ఉంది.

విపక్షాలు ఆయన మౌనాన్ని విమర్శించినా, తన పనితీరుతోనే వారికి సమాధానం చెప్పారు. ప్రధానిగా పదేళ్ల పాలన తర్వాత 'ఛేంజింగ్ ఇండియా' పుస్తకం ద్వారా తన మౌనం వెనుక ఉన్న అంతరార్థాన్ని వివరించారు. వ్యక్తిగత జీవితంలో అత్యంత సాదాసీదాగా ఉండే ఆయనకు తన పాత 'మారుతి–800' కారు అంటే ప్రాణం. మాటల కంటే చేతలకు విలువనిచ్చే మన్మోహన్ సింగ్, ఆధునిక భారతదేశ చరిత్రలో ఒక చెరగని ముద్ర వేశారు.

– ఎస్. అబ్దుల్ ఖాలిక్ । సీనియర్ జర్నలిస్ట్
(నేడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తొలి వర్ధంతి)

సగం 'స్వచ్ఛ' ఇంధనమే!

దేశంలో 2025 అక్టోబరు 31 నాటికి మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యం 5,05,023 మెగావాట్లు. ఇందులో పునరుత్పాదక ఇంధనం వాటా దాదాపు సగం.

అంశాల వారీగా...	స్థాపిత సామర్థ్యం (మెగావాట్లలో)	మొత్తంలో శాతం
శిలాజ ఇంధనాలు	2,45,600	48.63
శిలాజేతర ఇంధనాలు	2,59,423	51.37
శిలాజేతరలో...		
పునరుత్పాదక	2,50,643	49.63
అణు విద్యుత్	8,780	1.74

ఆధారం: కేంద్ర ఆర్థిక శాఖ

పరమాత్మ స్వరూపం

జ్యోతిర్మయం

కనుచూపు మేరలో ఎక్కడా పచ్చదనం అంటూ లేకుండా, కేవలం రాళ్ళూ రప్పలతో పూర్తిగా నిండి ఏ మాత్రమూ నీటిచెమ్మ తగలని భూభాగంలో ఒక ఎదిగిన మొక్క వికసిత పుష్పంతో కనిపిస్తే ఎంత ఆశ్చర్యం వేస్తుందో! సృష్టికి మూల కారణమైన ఆదిమ శక్తి సంక్షిప్త స్వరూపం కనుల ఎదుట ప్రత్యక్షమైన అనుభూతి అప్పుడు కలుగుతుంది. ఆ విధమైన అనుభూతినే పరమాత్మ స్వరూపాన్ని ప్రత్యక్షంగా దర్శించే అవకాశం దొరికినప్పుడు మనిషికి కలిగే అనుభూతిగా చెప్పుకోవచ్చు. చాలా ఎక్కువసార్లు ప్రకృతిలో ప్రత్యక్షమయ్యే చిన్న చిన్న మార్పులే పరమాత్మ స్వరూపాన్ని కనుల ముందు పరుచుకుని కనబడేలా చేసే సామర్థ్యం కలిగినవిగా ఉంటాయి. ప్రకృతి ప్రసాదించే ఇటువంటి అనుభవాలను ఆధారం చేసుకునే పలువురు కవులు పరమాత్మ స్వరూపాన్ని తమ కావ్యాలలోని పద్యాలలో వివరించి చెప్పారు. అటువంటి పద్యాలలో ఒక ఉత్తమమైన పద్యం దంతులూరి బాపకవి రచించిన 'మూర్తిత్రయోపాఖ్యానం' కావ్యం, ప్రథమాశ్వాసంలో ఉంది.

**చం. అనలుని యందు నుష్ణగుణ మర్కుని యందు దగంజగత్ప్రకా
శనరుచి యిందునందు నతి శైత్యము నిత్యము గాగ వాయునం
దును బల మూర్వియం దరయ ధూర్వహనోన్నత శక్తి యేమహా
త్ముని కళలయ్యె నయ్యనుపముం బరమేశ్వరుడండ్రు పండితుల్.**

'అగ్నియందు వేడిమి, సూర్యుని యందు స్వయం ప్రకాశకత్వం, చంద్రుని యందు చల్లదనం, వాయువునందు బలము, భూమి యందు ఎంత బరువునైనా మోసే శక్తి... ఇవన్నీ ఏ మహాత్ముని క్రియాశీల లక్షణాల కారణంగా సాధ్యమైనాయో ఆయననే పరమేశ్వరుడు అని తెలిసినవాళ్ళు పిలుస్తారు!' అని పరమాత్మ స్వరూపాన్ని పై పద్యంలో వివరించాడు బాపకవి.

– భట్టు వెంకటరావు

త్రిపురాంతకంలో జస్టిస్ మల్లికార్జున రావు పూజలు

త్రిపురాంతకంలో బాలాత్రిపురసుందరీ దేవి, పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయాల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జున రావు గురువారం కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల్లో కుంకుమార్చనలు, అభిషేకాలనంతరం అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. – త్రిపురాంతకం

దుర్గమ్మ సేవలో జస్టిస్ కృష్ణమోహన్

ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. – ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)

ఖాద్రీశుడిని దర్శించుకున్న జస్టిస్ కిరణ్మయి

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి మండవ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఈవో వి.శ్రీనివాసరెడ్డి, అర్చకులు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. – కదిరి టౌన్

శ్రీవారి సన్నిధిలో జడ్జీలు

తిరుమల శ్రీవారిని పలువురు న్యాయమూర్తులు గురువారం దర్శించుకున్నారు. వారిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్, హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) వీఎస్ఎస్ శ్రీనివాస శర్మ, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ కుమార్ సింగ్ ఉన్నారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. – తిరుమల

ఆలయం వెలుపల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్

హైకోర్టు రిజిస్ట్రార్ వీఎస్ఎస్ శ్రీనివాస శర్మ

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ కుమార్ సింగ్

కృష్ణా డెల్టాకు పెనుముప్పు

షెల్ ఆయిల్, గ్యాస్ వెలికితీతతో సాగునీటికే కాదు తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు

- వెలికితీతకు వినియోగించిన నీటిలో అణుధార్మిక పదార్థాలు
- భారీఎత్తున వెలువడే వ్యర్థ జలాలను ఎక్కడకు తరలిస్తారు?
- ఇదే అంశంపై డాక్టర్ల సంస్థ పీఎస్సార్ అధ్యయనం... నోబెల్ శాంతి బహుమతి కూడా పొందింది
- దాని నివేదిక ప్రకారం... వ్యర్థ జలాల వల్ల ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం
- వేదాంతకు షెల్ గ్యాస్, ఆయిల్ వెలికితీత అనుభవం లేదు
- అనేక ప్రయోగాలు, పరిశోధనల తర్వాత దేశంలో షెల్ గ్యాస్, ఆయిల్ వెలికితీతకు అనుకూలం కాదని తేల్చిన ఓఎన్జీసీ
- అయినా సరే వేదాంతకు అనుమతులు...
- ప్రైవేటు సంస్థల లాభాల కోసం ప్రజల ప్రాణాలు, నీరు, భూమి తాకట్టు
- తక్షణమే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.. జీవో 75ను ఉపసంహరించుకోవాలి.. ప్రభుత్వానికి సైంటిస్ట్స్ ఫర్ పీపుల్ శాస్త్రవేత్తల లేఖ

సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లా కాజా, తరకటూరుతో పాటు 14 గ్రామాల పరిధిలో బావులు తవ్వి (షెల్) చమురు (ఆయిల్), గ్యాస్ (సహజ వాయువు) వెలికితీస్తే డెల్టాకు పెనుముప్పు తప్పదని, సాగు నీరే కాదు, తాగడానికి గుక్కెడు మంచి నీళ్లూ దొరకవని 'సైంటిస్ట్స్ ఫర్ పీపుల్' శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ''చమురు, గ్యాస్‌ను వెలికితీసేందుకు బావులను అత్యంత లోతుకు తవ్వుతారు. భారీఎత్తున నీటిని తోడడంతో భూగర్భ జలాలు అడుగంటుతాయి. గ్యాస్, చమురు వెలికితీత (ఫ్రాకింగ్) సమయంలో వెలువడే వ్యర్థ జలాల్లో అణుధార్మిక పదార్థాలు ఉంటాయి'' అని పేర్కొన్నారు. భారీగా వెలువడే వ్యర్థ జలాలను తరలించడం అసాధ్యమని... వాటిని వదిలేయడం వల్ల భూమి, నీరు, గాలి కలుషితం అవుతాయన్నారు. ఫ్రాకింగ్ వ్యర్థాలపై విస్తృతంగా అధ్యయనం చేసి నోబెల్ శాంతి బహుమతి పొందిన డాక్టర్ల సంస్థ ఫిజీషియన్స్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (పీఎస్సార్) నివేదికను వారు ఉటంకించారు. అణు ధార్మిక పదార్థాలు ఉండే ఫ్రాకింగ్ జలాల ప్రభావం ప్రజారోగ్యంపై తీవ్రంగా ఉంటుందని ఎత్తి చూపారు. షెల్ గ్యాస్, చమురు వెలికితీత వల్ల ప్రపంచవ్యాప్తంగా జరిగిన నష్టాలపై వందలాది పరిశోధనలు ఉన్నాయని గుర్తుచేశారు. శాస్త్రీయ ఆధారాలను విస్మరించి... సమగ్ర పరిశీలన లేకుండా వేదాంత సంస్థకు నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) ఇవ్వడం బాధ్యతారాహిత్యంగా అభివర్ణించారు. తక్షణమే ఈ ఎన్వోసీ రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పీఎస్సార్ సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ కె.బాబూరావు, డాక్టర్ కె.వెంకటరెడ్డి, డాక్టర్ డి.రాంబాబు, డాక్టర్ అహ్మద్‌ఖాన్, డాక్టర్ పీజీ రావు, డాక్టర్ ఎం.బాపూజీతో పాటు, మరో 24 మంది శాస్త్రవేత్తలు బుధవారం ప్రభుత్వానికి లేఖ రాశారు. దానిని రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పంపారు.



లేఖలోని ముఖ్యాంశాలు..

1. వేదాంత కంపెనీకి షెల్ గ్యాస్, ఆయిల్ వెలికితీతకు కేంద్రం లీజు ఇచ్చింది. ఆ ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతంలో పుట్టి పెరిగిన మేము... ప్రపంచ వ్యాప్తంగా షెల్ బావులు సృష్టించిన పర్యావరణ విధ్వంసం, ఆరోగ్య నష్టాల గురించి తెలిసి, ఆందోళన చెందాం. స్థానిక ప్రజలకు ఎదురయ్యే ముప్పును వివరించే ప్రయత్నం చేశాం. మీడియా సంస్థలు మా వాదనలకు వేదిక కల్పించినా, రాష్ట్ర పీసీబీ సహకరించలేదు. పర్యావరణ ప్రభావ అంచనా (ఈఐఏ) నివేదికపై మేం లేవనెత్తిన ప్రశ్నలకు వేదాంతతో సమాధానాలు ఇప్పించలేదు. నిజానికి వేదాంతకు షెల్ ఆయిల్, గ్యాస్ వెలికితీతలో అనుభవం లేదు. అంతేకాదు, భారత ప్రభుత్వానికి షెల్ గ్యాస్, ఆయిల్ ఫ్రాకింగ్‌పై స్పష్టమైన పర్యావరణ, భద్రతా నియమ నిబంధనలు కూడా లేవు.
2. ఫ్రాకింగ్ చేయడానికి కోట్ల లీటర్ల నీరు అవసరం. అందులో వందల సంఖ్యలో హానికర రసాయనాలు కలుపుతారు. వ్యాపార రహస్యాల పేరుతో వాటిని ప్రజలకు వెల్లడించరు. బావుల నుంచి వచ్చే వ్యర్థ జలాల్లో అణుధార్మికత (రేడియో యాక్టివిటీ) ఉంటుంది. అంత నీరు ఈ ప్రాంతంలో దొరకదు. భూగర్భ జలాలను తోడేస్తే వ్యవసాయం కుప్పకూలుతుంది. తాగునీరు కూడా లభించదు. ఫ్రాకింగ్ వ్యర్థ జలాలను శుద్ధి చేయలేం. మరి ఎక్కడకు వదులుతారు?
3. ఫ్రాకింగ్ వల్ల కలిగే ఆరోగ్య నష్టాలపై పీఎస్సార్ అనేక నివేదికలు విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన నష్టాలపై వందలాది పరిశోధనలున్నా అన్నీ పక్కనపెట్టి, శాస్త్రీయ ఆధారాలను విస్మరించి, సమగ్ర పరిశీలన లేకుండా ఎన్వోసీ ఇవ్వడం ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ఇంత అధిక జనాభా సాంద్రత ఉన్న, తాగునీటి కొరత ఉన్న ప్రాంతంలో ఫ్రాకింగ్‌కు అనుమతించడం ప్రాణాంతకం.
4. భారత ప్రభుత్వం గతంలో ఓఎన్జీసీ సంస్థకు ఫ్రాకింగ్‌కు అనుమతులు ఇచ్చింది. కొన్నేళ్ల పరిశోధన, ప్రయోగాల తర్వాత దేశంలో షెల్ నిర్మాణాలు వాణిజ్యపరంగా అనుకూలం కావని తేల్చి ఓఎన్జీసీ స్వయంగా వదిలేసింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేటు సంస్థ లాభాల కోసం ప్రజల ప్రాణాలు, నీరు, భూమిని తాకట్టు పెట్టే ప్రయత్నాన్ని తక్షణమే నిలిపివేయాలి.

రోడ్డుపైనే సీఐ, ఏఎస్ఐ కొట్లాట

- బాపట్ల జిల్లా చీరాలలో ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ఏఎస్ఐను వీఆర్‌కు పంపిన ఎస్పీ

సీఐ పైకి దూసుకువస్తున్న ఏఎస్ఐ రవికుమార్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రోడ్డుపైనే ఏఎస్ఐ, సీఐ ఘర్షణ పడిన ఘటన బాపట్ల జిల్లా చీరాలలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. చీరాల రూరల్ ఏఎస్ఐ రవికుమార్ బుధవారం అర్ధరాత్రి చీరాల చర్చి సెంటర్‌లో కారు పార్కు చేశారు. అక్కడ ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న ఆ కారును పక్కకు తీయాలని స్థానిక పోలీసులు చెప్పారు. దీంతో ఏఎస్ఐ ఆగ్రహిస్తూ..తనకారునే తీయమంటారా అంటూ వారిపై చిందులు తొక్కాడు. పోలీసులకు, ఏఎస్ఐకి మధ్య మాటామాటా పెరగడంతో అక్కడకు వన్‌టౌన్ సీఐ సుబ్బారావు వచ్చారు. అక్కడి నుంచి కారు తీసుకొని వెళ్లిపోవాలని ఏఎస్ఐని ఆదేశించారు. దీంతో మరింతగా ఆగ్రహించిన ఏఎస్ఐ..సీఐతో వాగ్వాదానికి దిగాడు. ఏఎస్ఐని అక్కడినుంచి పంపించేయాలని పోలీసులకు సీఐ చెప్పి వెళ్తుండగా అతడిని ఏఎస్ఐ వెంబడించి దూషించాడు. ఓ దశలో సీఐ వైపు ఏఎస్ఐ దూసుకురావడంతో ఇరువురూ కలియబడ్డారు. దీంతో పోలీసులు ఏఎస్ఐకు నాలుగు దెబ్బలు వేసి స్టేషన్‌కు లాక్కెళ్లారు. ఈ గొడవనంతా స్థానికులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఏఎస్ఐ ప్రవర్తనే గొడవకు దారి తీసిందని పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులకు వన్‌టౌన్ సీఐ ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఏఎస్ఐను వీఆర్‌కు పంపించి శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం చర్యలు తీసుకోనున్నారు.

ప్రైవేటు బస్సు ఢీకొని దంపతుల మృతి

మృతి చెందిన నవీన్‌కుమార్, కళ్యాణి

అడ్డతీగల (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని కొట్టంపాలెం వద్ద జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్త దంపతులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా మేరకు.. అడ్డతీగల మండలం వేటమామిడిలో బుధవారం రాత్రి జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న దంపతులు కె.నవీన్‌కుమార్ (25), బేబీ కల్యాణి (23) బైక్‌పై చెరుకుంపాలెం వస్తున్నారు. అదే సమయంలో అడ్డతీగల వైపు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో నవీన్‌కుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన బేబీ కల్యాణిని అడ్డతీగల సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచింది. రాజవొమ్మంగి మండలం చెరుకుంపాలెం గ్రామ సచివాలయంలో నవీన్‌కుమార్ వ్యవసాయ సహాయకుడిగా పని చేస్తున్నాడు. వై.రామవరం మండలం ఎర్రంరెడ్డిపాలెంకు చెందిన నవీన్‌కుమార్, బేబీకల్యాణికి ఏడాది క్రితమే వివాహమైనట్టు సమాచారం.

గంజాయి మత్తులో పోలీసుపై దాడి

డోన్ టౌన్ (నంద్యాల) : నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని తారకరామనగర్‌లో సిద్దూ అనే యువకుడు గంజాయి మత్తులో ఓ పోలీసుపై గురువారం దాడి చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. జులాయిగా తిరిగే సిద్దూ (24) గురువారం గంజాయి మత్తులో కాలనీలో కారుతో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ స్థానికులను భయాందోళనలకు గురిచేశాడు. దీంతో స్థానికులు 100కు కాల్ చేసి చెప్పడంతో ఓ కానిస్టేబుల్ హోంగార్డుతో కలిసి ఘటనా స్థలానికి వచ్చారు. సిద్దూను అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా అతను కానిస్టేబుల్‌పై ఎదురుదాడి చేశాడు. పోలీసులు అతి కష్టం మీద అతడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై సీఐ ఇంతియాజ్‌బాషాను వివరణ కోరగా సిద్దూపై డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే

మమ్మల్ని అనుసరించండి X @SCRailwayindia ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

PUB/1669

ఇ-వేలం లీజింగ్ ద్వారా కమర్షియల్ ఎర్నింగ్ కాంట్రాక్టులు ఇచ్చేందుకు గుంటూరు డివిజన్‌లో కంబైన్డ్ మంత్లీ కేటలాగ్

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు డివిజన్, గుంటూరు వారు IREPS వెబ్ పోర్టల్‌లోని ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్ ద్వారా ఇ-బిడ్లు కోరుతున్నారు. ప్రచురించబడిన కేటలాగ్ వివరాలు దిగువ విధంగా ఉన్నాయి.

పే అండ్ యూజ్ టాయిలెట్ ఆపరేషన్ మరియు నిర్వహణ

క్ర. సం.	కాంట్రాక్ట్ రకం	స్టేషన్	కాంట్రాక్ట్ కాలవ్యవధి	బయానా విలువ	వేలం ప్రారంభ తేది మరియు సమయం
1	పే అండ్ యూజ్ టాయిలెట్	గుంటూరు PF No. 1, 2 & 3	3 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	06.01.2026న 11.30 గంllలు
2	పే అండ్ యూజ్ టాయిలెట్	మిర్యాలగూడ	3 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	06.01.2026న 11.40 గంllలు

ఇ-టెండర్లలో పాల్గొనుటకు ireps ఇ-వేలం లీజింగ్‌లో డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ పొందుటకు మరియు తమంతటతాము నమోదు చేసుకొనుట టెండరుదారుదే బాధ్యతగా ఉంటుంది. ireps పోర్టల్ ద్వారా ఇ-వేలం లీజింగ్‌లో నమోదు చేసుకొనుటకు మరియు పాల్గొనుటకు ముందస్తు ఆవశ్యకతలు www.ireps.gov.in పోర్టల్‌లోని మాన్యువల్ మరియు మార్గదర్శకాల క్రింద లభిస్తాయి. దిగువ సంతకందారు కోరినపుడు టెండరుదారు అవసరమైన డాక్యుమెంట్లను కార్యాలయంలో దాఖలు చేయాలి. టెండరుకు సంబంధించి చెల్లింపు సమయంలో లేదా అవసరమైన డాక్యుమెంట్ల అప్‌లోడింగ్ సమయంలో IREPS పోర్టల్‌లో సంభవించే ఏదేని అవాంతరానికి రైల్వే అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించదు. టెండరు ఫారంలో నిర్దేశించిన నిబంధనలన్నింటినీ నెరవేర్చకుండా స్వీకరించిన టెండర్లు కచ్చితంగా తిరస్కరించబడును. పైన తెలిపిన టెండరు యొక్క పూర్తి వివరాలు www.ireps.gov.in పోర్టల్‌లోని ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్‌లో లభిస్తాయి.

A2124 — సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్,గుంటూరు

అసాధారణ పత్రం
పార్ట్-II- సెక్షన్ 3-సబ్-సెక్షన్ (ii)
రైల్వే మంత్రిత్వ శాఖ
(దక్షిణ మధ్య రైల్వే)

PUB/1661

ప్రకటన

సికింద్రాబాద్, 18 డిసెంబర్ 2025

S.O.5928(E).- రైల్వే చట్టం, 1989లోని సెక్షన్ 2లో క్లాజ్ (7A) ద్వారా సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ, అధికారిక గెజిట్‌లో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి వర్తింపుతో సదరు పట్టికలోని కాలమ్ (3)లో తెలిపిన రాష్ట్రంలో ఎగ్జిక్యూషన్, మెయిన్‌టెనెన్స్, మేనేజ్‌మెంట్ మరియు ఆపరేషన్ కొరకు, పట్టికలోని కాలమ్ (2)లో తెలిపిన విధంగా ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ కోసం సమర్థ ప్రాధికారి విధులను నిర్వర్తించడానికి దిగువ పట్టికలోని కాలమ్ (5)లో తెలిపిన అధికారికి కేంద్ర ప్రభుత్వం ఇందుమూలంగా అధికారం ఇస్తోంది.

పట్టిక

క్ర. సం.	ప్రత్యేక రైల్వే ప్రాజెక్టు	రాష్ట్రం	జిల్లా	భూసేకరణ కోసం సమర్థ ప్రాధికారి
(1)	(2)	(3)	(4)	(5)
1.	నంబూరు-మంగళగిరి స్టేషన్ల మధ్య కి.మీ. 19/7-9 వద్ద లెవెల్ క్రాసింగ్ నం. 14 స్థానంలో 4-లేన్ రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం	ఆంధ్రప్రదేశ్	గుంటూరు	సబ్ కలెక్టర్, తెనాలి

[F. No. CAO/CON/RSP/ROB/LAND AQ/2025/7A/148]

A2116 — మనోజ్ కుమార్, చీఫ్ ఇంజినీర్/C/RSP

రెచ్చగొట్టి.. రెచ్చిపోయిన తెలుగు తమ్ముళ్లు

- ఉప్పలపాడులో టీడీపీ వర్గీయుల వీరంగం
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి, ఇద్దరికి గాయాలు
- ఇరువర్గాలపై కేసులు నమోదు

జీపు బానెట్‌పైకి ఎక్కి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న టీడీపీ శ్రేణులు

గుంటూరు: సెమీ క్రిస్మస్ వేడుకల్లో టీడీపీ వర్గీయులు వీరంగం సృష్టించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ వారిపై దాడికి పాల్పడిన ఘటన గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం ఉప్పలపాడులో చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పుట్టినరోజున టీడీపీ శ్రేణులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి అడ్డుగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండటంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు అడ్డుకున్నాడు. దీంతో అక్కడ స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 23న గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరుగుతున్న సమయంలో టీడీపీ శ్రేణులు అక్కడకు వచ్చి నానా హంగామా సృష్టించారు. జీపును రోడ్డుపై నిలిపి బానెట్‌పై నిలబడి వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా కవ్వింపు చర్యలకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ దాడిలో టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడి చేయడంతో గ్రామానికి చెందిన సైమన్, అశోక్‌కు రక్త గాయాలయ్యాయి. ఇరువర్గాలు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసుకోవడంతో రెండు వర్గాలకు చెందిన 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, దాడికి పాల్పడిన టీడీపీ క్యాడర్‌ను కాపాడేందుకు ఆ పార్టీ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తూ, వైఎస్సార్‌సీపీ నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడుతున్నారు. బుధవారం సాయంత్రం వరకు వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు స్టేషన్‌లోనే ఉంచారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు అరుంధతీదేవి కన్నుమూత



ముప్పాళ్ల అరుంధతి దేవి (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు ముప్పాళ్ల అరుంధతీ దేవి (101) గురువారం కన్నుమూశారు. 1930వ దశకంలో మహాత్మాగాంధీ పిలుపు మేరకు ఉన్నవ లక్ష్మీనారాయణ-లక్ష్మీబాయమ్మ, వావిలాల గోపాలకృష్ణయ్యతో కలిసి స్వరాజ్య ఉద్యమంలో ఆమె పాల్గొన్నారు. విద్యావంతురాలైన అరుంధతి దేవి పెద్ద బాలశిక్షతో పాటు రామాయణ, మహాభారత, భాగవతాలను వల్లె వేశారని ఆమె మనవడు, హైకోర్టు న్యాయవాది కవివరపు పట్టాభిరాముడు చెప్పారు. ఎనిమిది మంది సంతానంతో 15 మంది మనవళ్లు, 15 మంది మనవరాళ్లతో అరుంధతి దేవి సంపూర్ణ జీవితం గడిపారన్నారు. పెదపలకలూరు రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో అరుంధతిదేవి భౌతికకాయాన్ని ఉంచగా, పలువురు నివాళులర్పించారు.

'370' గోడను బద్దలుకొట్టే భాగ్యం మాకే దక్కింది

లక్నోలో అటల్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రధాని మోదీ, చిత్రంలో రాజ్‌నాథ్

కేవలం ఒకే ఒక్క కుటుంబం కోసమే వారసత్వ రాజకీయాలు చేశారు

- కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శల జడి
- లక్నోలో జాతీయ స్మారకం 'రాష్ట్రీయ ప్రేరణ స్థల్'ను ఆవిష్కరించిన ప్రధాని

సదైవ్ అటల్ వద్ద ఓ కళాకారిణికి ప్రధాని మోదీ ప్రతినమస్కారం, చిత్రంలో రాష్ట్రపతి ముర్ము

సదైవ్ అటల్ వద్ద రాష్ట్రపతి ఘన నివాళి

వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని గురువారం ఢిల్లీలోని ఆయన స్మారకం 'సదైవ్ అటల్'వద్ద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ ఘన నివాళులర్పించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్, రాజీవ్ రంజన్ సింగ్, పలువురు సహాయ మంత్రులు, ఎంపీలు, ఢిల్లీ మహిళా సీఎం రేఖా గుప్తా, బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబిన్ సైతం అంజలి ఘటించారు.

లక్నో/న్యూఢిల్లీ: భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన భారీ కాంస్య విగ్రహంతో కూడిన జాతీయ స్మారకం 'రాష్ట్రీయ ప్రేరణ స్థల్'ను లక్నోలో ఆవిష్కరించిన సందర్భంగా విపక్ష కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శల జడివాన కురిపించారు. దశాబ్దాలుగా అభివృద్ధికి అవరోధంగా తయారైన 'ఆర్టికల్ 370'గోడను బద్దలు కొట్టే అదృష్టం తమ ప్రభుత్వానికి దక్కడంపై బీజేపీ ఎంతో గర్విస్తోందని మోదీ వ్యాఖ్యానించారు. గురువారం లక్నోలో 65 అడుగుల ఎత్తయిన శ్యామప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయిల కాంస్య విగ్రహాలను, 98,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో తామర పుష్పాకృతిలో నిర్మించిన అత్యాధునిక మ్యూజియంను ప్రధాని మోదీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. విపక్ష కాంగ్రెస్‌పై విమర్శలతో విరుచుకుపడ్డారు. ''బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సుపరిపాలనకు కొత్త నిర్వచనం ఇచ్చింది. ఇప్పుడా సుపరిపాలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో సమున్నత శిఖరాలకు చేరింది. అయితే స్వాతంత్ర్యం తర్వాత దేశంలో ఎక్కడ అభివృద్ధి జరిగినా, మంచి పనులు పూర్తియినా కేవలం ఒకే ఒక్క కుటుంబం (గాంధీల) కారణంగా అవన్నీ జరిగాయనే భ్రమలు కల్పించారు. పాఠ్యపుస్తకాలు కావొచ్చు, ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వరంగ సంస్థలు, వీధులు, రోడ్డు, కూడళ్లు.. అన్నింటికీ ఆ ఒకే ఒక్క కుటుంబం పేర్లు పెట్టేశారు. వాళ్ల విగ్రహాలే నెలకొల్పారు. ఇదే ఆనాటి నుంచి అలాగే కొనసాగింది. ఈ కుటుంబ బంధనాల నుంచి భారత్‌ను బీజేపీ విముక్తం చేసింది. దేశం కోసం ప్రాణత్యాగాలకు సైతం సిద్ధపడిన ప్రతి ఒక్క భరతమాత బిడ్డను బీజేపీ నేడు సమున్నత స్థాయిలో గౌరవిస్తోంది. వీటికి కొన్ని ఉదాహరణలూ చెప్తా. నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఢిల్లీలో కీలక కర్తవ్యపథంలో ప్రతిష్టించాం. నేతాజీ త్రివర్ణ పతాకాన్ని ఎగరేసిన అండమాన్ నికోబార్ దీవుల్లోని ఒక దీవికి నేడు ఆయన పేరును పెట్టాం''అని మోదీ అన్నారు. ''బాబా సాహెబ్ అంబేడ్కర్ ఘనతను మరుగునపరిచే కుతంత్రాలను మీరంతా చూశారు. కాంగ్రెస్ రాజకుటుంబం ఢిల్లీలో ఎన్నో దారుణాలకు ఒడిగట్టింది. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ అదే పనిచేసింది. అంబేడ్కర్ గొప్పతనాన్ని తగ్గించే కుట్రలను ఇప్పుడు బీజేపీ అడ్డుకుంటోంది. ఢిల్లీ నుంచి లండన్ దాకా అంబేడ్కర్‌కు సంబంధించిన ఐదు పుణ్యక్షేత్రాలను మేం అద్భుతంగా అభివృద్ధిచేశాం'' అని మోదీ గుర్తుచేశారు. ''బీజేపీని కాంగ్రెస్ ఎప్పుడూ అంటరాని పార్టీగా తప్పుడు ప్రచారంచేశాయి. కానీ బీజేపీ ఎల్లప్పుడూ అన్ని పార్టీలు, నేతలను గౌరవించింది. పీవీ నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీలకు మేమే భారతరత్న ఇచ్చాం. ములాయం సింగ్ యాదవ్, తరుణ్ గొగోయ్ ఇలా ఎందరో గౌరవించాం. ఇలాంటి మర్యాదలను కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల నుంచి ఎన్నడూ ఆశించలేం. వాళ్ల హయాంలో బీజేపీ దారుణ అవమానాలను ఎదుర్కొంది''అని మోదీ అన్నారు.

ఈ స్మారకం దేశ ఆత్మగౌరవానికి తార్కాణం

''రాష్ట్రీయ ప్రేరణ స్థల్ జాతీయ స్మారకం .. దేశం చూపిన ఆత్మగౌరవ, సమగ్రత, సేవా మార్గానికి నిదర్శనం. డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీన్‌దయాళ్, వాజ్‌పేయిల నిలువెత్తు విగ్రహాలు మనకు సమున్నత స్ఫూర్తి నిస్తున్నాయి. మనసావాచా ప్రజాసంక్షేమం కోసం పాటుపడాలని, ఆ ప్రయత్నంలో వందల సార్లయినా త్యాగాగ్నిలో కాలిపోయినా ఫర్వాలేదని గతంలో వాజ్‌పేయి అన్నారు. ఇప్పుడీ ప్రేరణ స్థల్ సైతం అదే సందేశం ఇస్తోంది. మన ప్రతి అడుగు దేశ నిర్మాణానికి ఉపయోగపడాలి. అభివృద్ధి చెందిన భారత్‌గా దేశం మారాలంటే ప్రతి ఒక్కరూ ఆ దిశగా సంకల్పించాలి. నూతన జాతీయస్మారకం ద్వారా ఆధునిక స్ఫూర్తిస్థల్‌కు చిరునామాగా నిలిచిన యూపీకి శుభాకాంక్షలు. ఇప్పుడీ ప్రేరణ స్థల్ నిర్మించిన 30 ఎకరాల ప్రాంతంలో గతంలో దశాబ్దాలపాటు భారీ చెత్తకుప్పలుండేవి. వాటిని పూర్తిగా తొలగించి అధునాతన నేషనల్ మెమోరియల్ కాంప్లెక్స్‌ను సాకారంచేసిన కార్మికులు, కళాకారులు, ప్రణాళిక కర్తలు, సీఎం యోగిజీకి నా మనస్ఫూర్తిగా అభినందనలు''అని మోదీ అన్నారు.

8వ అంతస్తు కిటికీకి చిక్కుకొని తలకిందులుగా వేలాడుతున్న నితిన్‌ను కాపాడుతున్న సహాయక సిబ్బంది

పడిపోయినా ప్రాణాలు 'పది'లం!

పదో అంతస్తు పైనుంచి పడి.. ప్రాణాలతో బయటపడి..

బుధవారం ఉదయం.. సూరత్‌లోని జహంగీర్‌పురా 'టైమ్స్ గెలాక్సీ' అపార్ట్‌మెంట్ వాసులకు ఒళ్లు జలదరించే దృశ్యంతో ఆరోజు తెల్లారింది. నిశ్శబ్దంగా ఉండే ఆ ప్రాంతం ఒక్కసారిగా హాహాకారాలతో నిండిపోయింది. అందరూ తలెత్తి ఆకాశం వైపు భయం భయంగా చూస్తున్నారు. అక్కడ.. ఎనిమిదో అంతస్తు కిటికీ గ్రిల్‌కు ఒక మనిషి తలకిందులుగా వేలాడుతున్నాడు.

అసలేం జరిగింది?

సూరత్: 57 ఏళ్ల నితిన్ భాయ్ అడియా తన పదో అంతస్తు ఫ్లాట్‌లో కిటికీ పక్కనే గాఢ నిద్రలో ఉన్నారు. నిద్రలో అటు ఇటు దొర్లుతూ, ప్రమాదవశాత్తు కిటికీలోంచి ఒక్కసారిగా బయటకు జారిపోయారు. పదో అంతస్తు అంటే దాదాపు వంద అడుగుల పైచిలుకు ఎత్తు. అక్కడి నుంచి పడితే ప్రాణాలు దక్కడం అసాధ్యం. కానీ, ఆయన అదృష్టం బావుంది. కిందకు పడిపోతున్న వేగంలో, సరిగ్గా ఎనిమిదో అంతస్తు కిటికీకి ఉన్న గ్రిల్ బాక్స్‌లో ఆయన కాలు బలంగా ఇరుక్కుపోయింది.

తలకిందులుగా గంటపాటు..

శరీరం మొత్తం గాలిలో.. ఒకే ఒక్క కాలు ఆ ఇనుప ఊచల మధ్య ఇరుక్కుపోయింది. తలకిందులుగా వేలాడుతూ, కాలి నొప్పిని భరిస్తూ ఆయన దాదాపు గంట కాలం మృత్యువుతో ఆయన పోరాడారు. ఏ క్షణమైనా పట్టు తప్పితే ప్రాణాలు గాల్లో కలిసిపోయే స్థితి. ఆ దృశ్యాన్ని చూస్తున్న చుట్టుపక్కల వారి గుండెలు ఆగిపోయినంత పనయ్యింది. సమాచారం అందుకున్న వెంటనే జహంగీర్‌పురా, పాలన్‌పూర్, అడాజన్ ఫైర్ స్టేషన్ల నుంచి సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. కింద జనం రక్షణ వలలు పట్టుకోగా, అగ్నిమాపక సిబ్బంది పదో అంతస్తు నుంచి తాళ్లు, సేఫ్టీ బెల్టులతో కిందకు దిగారు. గాలిలో వేలాడుతున్న నితిన్ భాయ్‌ను చాకచక్యంగా పట్టుకుని, ఆయన కాలిని గ్రిల్ నుంచి తప్పించారు. సురక్షితంగా ఎనిమిదో అంతస్తు కిటికీ గుండా అతన్ని లోపలికి లాగారు.

వెనుదిరిగిన మృత్యువు

నితిన్ భాయ్ సురక్షితంగా లోపలికి వెళ్లగానే అపార్ట్‌మెంట్ నివాసితులంతా ఆనందంతో కేరింతలు కొట్టారు. ప్రాణాలతో బయటపడటం ఒక ఎత్తైతే, ఆ గంట సేపు ఆయన చూపిన ధైర్యం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అజాగ్రత్త ప్రాణాల మీదకు తెస్తుంది.. కానీ అదృష్టం కలిసొస్తే మృత్యువు కూడా వెనుదిరుగుతుందని ఈ ఘటన నిరూపించింది.

ఢాకాలో తారిఖ్ కాన్వాయ్ చుట్టూ భారీగా అభిమానులు (ఇన్‌సెట్) తారిఖ్ అభివాదం

సురక్షిత బంగ్లా

మత విద్వేషానికి తావులేదు: తారిఖ్

ఢాకా: 'బంగ్లాదేశ్ ను సురక్షిత దేశంగా మార్చుకుందాం. స్వేచ్ఛాయుత, ప్రగతికాముక ప్రజాస్వామిక దేశంగా తీర్చిదిద్దుదాం' అని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎంపీ) తాత్కాలిక చైర్మన్ తారిఖ్ రెహ్మాన్ పిలుపునిచ్చారు. ఇందుకోసం దేశవాసులంతా కలసికట్టుగా ముందుకు రావాలన్నారు. ముఖ్యంగా యువత దేశ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. దేశ మాజీ ప్రధాని బేగం ఖలీదా జియా కుమారుడైన తారిఖ్ 17 ఏళ్ల లండన్ ప్రవాసం నుంచి గురువారం తిరిగొచ్చారు. విమానాశ్రయం నుంచి నేరుగా తన రాక కోసం భారీగా గుమిగూడిన మద్దతుదారులు, అభిమానులు, పార్టీ కార్యకర్తల వద్దకు వెళ్లారు. వారినుద్దేశించి భావోద్వేగంతో ప్రసంగించారు. 'పార్టీలు, మతాల విభేదాలకు అతీతంగా దేశ వికాసానికి పనిచేద్దాం. బంగ్లాదేశ్ ముస్లింలతో పాటు హిందువులు, సిక్కులు, క్రైస్తవులు అందరిదీ. మత విద్వేషానికి మన దేశంలో చోటు లేదు. కులమతాలు, వర్గాలకు అతీతంగా ప్రజలంతా హాయిగా జీవించే సురక్షిత బంగ్లాయే మన లక్ష్యం. ఇందుకోసం నా దగ్గర ప్రణాళిక ఉంది' అంటూ అమెరికా హక్కుల ఉద్యమ నేత మార్టిన్ లూథర్ కింగ్ నినాదాన్ని తలపించే వ్యాఖ్యలు చేశారు. దాని అమలుకు మీ అందరి మద్దతు కావాలి' అన్నారు.

బంగ్లాలో మరో హిందువు హత్య

అమృత్

ఢాకా: దీపు చంద్రదాస్ అనే హిందూ కార్మికుని దారుణ హత్యోదంతాన్ని మరవకముందే బంగ్లాదేశ్‌లో అలాంటిదే మరో ఘోరం జరిగింది. అమృత్ మొండల్ అలియాస్ సమ్రాట్ అనే 30 ఏళ్ల హిందూ యువకున్ని సొంత గ్రామస్తులే కొట్టిచంపారు. ఈ దారుణం రాజ్ బరీ జిల్లాలో బుధవారం రాత్రి జరిగింది. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని తెల్లవారుజాము రెండింటికి ఆస్పత్రికి తీసుకెళ్లామని, అప్పటికే చనియిపోయినట్టు వైద్యులు నిర్ధారించారని పోలీసులు తెలిపారు. సమ్రాట్ ఒక గ్యాంగ్ స్టర్ అని వారన్నారు. 'అతనిపై హత్య కేసుతో సహా రెండు కేసులున్నాయి. సమ్రాట్ వాహిని అనే గ్యాంగ్ తయారు చేసి జనం నుంచి డబ్బు గుంజేవాడు. వారంతా బుధవారం రాత్రి కూడా ఒక స్థానికుని ఇంట్లో దూరి డబ్బు డిమాండ్ చేశారు. దోపిడీ దొంగలు అంటూ వాళ్లు అరవడంతో గ్రామస్తులు పోగయ్యారు. తోటివారు తప్పించుకోగా చేతికి చిక్కిన సమ్రాట్ కు దేహశుద్ధి చేశారు' అని వివరించారు. గతేడాది ఆందోళనల వేల సమ్రాట్ భారత్ వెళ్లాడని ఇటీవలే తిరిగొచ్చాడని చెప్పారు. మహమ్మద్ సలీం అనే సమ్రాట్ సన్నిహితున్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రెండు మారణాయుధాలు దొరికినట్టు వారు చెప్పారు.

బంగ్లా డార్క్ ప్రిన్స్... పునరాగమనం

17 ఏళ్లకు తిరిగొచ్చిన ఖలీదా కుమారుడు తారిఖ్

- రాజకీయాల్లో ఇక కీలక పాత్ర
- బీఎన్పీ పగ్గాలు ఆయన చేతికే
- ఫిబ్రవరి సాధారణ ఎన్నికల్లో బరిలోకి
- భారత వ్యతిరేకిగా పేరు

నానాటికీ పతనావస్థకు చేరుతున్న కల్లోల బంగ్లాదేశ్ లో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా అంతా భావిస్తున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) తాత్కాలిక చైర్మన్, మాజీ ప్రధాని బేగం ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ 17 ఏళ్ల స్వీయ దేశ బహిష్కరణకు ముగింపు పలికారు. లండన్ నుంచి గురువారం స్వదేశానికి తిరిగొచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు బీఎన్పీ శ్రేణులు కనీవినీ ఎరుగని రీతిలో స్వాగతం పలికాయి. విమానాశ్రయానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు లక్షలాదిగా పోటెత్తారు. తారిఖ్, తారిఖ్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. తల్లి హయాంలో రాజ్యాంగేతర శక్తిగా అపరిమిత అధికారాలు చెలాయించిన తారిఖ్ డార్క్ ప్రిన్స్‌గా చెడ్డపేరు మూటగట్టుకున్నారు. తల్లి మాదిరిగానే ఆయనకు కూడా భారత వ్యతిరేకిగా పేరుంది. ఈ నేపథ్యంలో పొరుగు దేశం బంగ్లాలో చోటుచేసుకున్న ఈ కీలక రాజకీయ పరిణామాన్ని కేంద్రం నిశితంగా గమనిస్తోంది.

కాబోయే ప్రధాని!

తారిఖ్ రెహ్మాన్ (60). బంగ్లా అంతటా గత 17 ఏళ్లుగా ఆయన ఫోటోలు, పోస్టర్లు మాత్రమే కనిపిస్తూ వచ్చాయి. బీఎన్పీ ర్యాలీల్లో ఆయన వీడియో సందేశాలే మాట్లాడుతూ వచ్చాయి. అవినీతి కేసులు తదితర కారణాలతో 2008 నుంచీ భార్య జుబైదా, కూతురు జైమాతో పాటు తారిఖ్ లండన్ లో తలదాచుకోవడమే ఇందుకు కారణం. గురువారం భార్య, కూతురితో కలిసి ఢాకా చేరుకున్నాక, '6,314 సుదీర్ఘ రోజుల అనంతరం సొంత గడ్డపై అడుగు పెట్టా. నా బంగ్లా వాసులారా! ఇకనుంచీ మీ అందరితో నేరుగానే మాట్లాడతా' అంటూ సోషల్ మీడియాలో తారిఖ్ పెట్టిన పోస్టు దేశమంతటా వైరల్ అయింది. ఆయన తల్లి 80 ఏళ్ల ఖలీదా సుదీర్ఘ కాలంగా ఆస్పత్రిలో ఉండటంతో బీఎన్పీ పగ్గాలను తారిఖ్ పూర్తిస్థాయిలో చేపట్టడం లాంఛనమే కానుంది. బంగ్లాలో శక్తిమంతమైన నేతగా వెలుగొందిన షేక్ హసీనా గతేడాది చెలరేగిన హింసాకాండ నేపథ్యంలో ప్రధాని పదవితో పాటు దేశాన్ని కూడా వీడి భారత్ లో తలదాచుకుంటున్నారు. ఆమె అవామీ లీగ్ పార్టీపైనా ఇప్పటికే అనర్హత వేటు పడింది. ప్రభుత్వ తాత్కాలిక సారథి, నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ కు కూడా మంచిపేరే ఉన్నా ఏడాదికి పైగా అసమర్థ పాలనతో చెడ్డపేరు తెచ్చుకున్నారు. దాంతో ప్రకటించిన మేరకే వచ్చే ఫిబ్రవరిలో సాధారణ ఎన్నికలు జరిగితే తారిఖ్ ప్రధాని పగ్గాలు చేపట్టడం దాదాపుగా ఖాయమేనంటున్నారు.

జమాతేకు ముకుతాడు!

భారత వ్యతిరేకే అయినా, తారిఖ్ రాక మనకు ఊరటనిచ్చే పరిణామమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బంగ్లాలో ప్రస్తుతం.నెలకొని ఉన్న తీవ్ర రాజకీయ అస్థిరతే ఇందుకు కారణం. ఏ పార్టీలోనూ పెద్దగా జనాదరణ ఉన్న నాయకుడు లేకపోవడంతో ప్రజల్లోని ఆగ్రహావేశాలను మతోన్మాద శక్తులు సొమ్ము చేసుకునే పనిలో పడ్డాయి. ముఖ్యంగా పాకిస్తాన్ ఐఎస్ఐ జేబు సంస్థ అయిన జమాతే ఇస్లామీ నానాటికీ కోరలు చాస్తోంది. హసీనా హయాంలో పడ్డ నిషేధాన్ని వదిలించుకుని యువత, ముఖ్యంగా విద్యార్థులను ఆకర్షిస్తోంది. రాజకీయ శక్తిగా బలపడుతోంది. ఇటీవలి ఢాకా వర్సిటీ ఎన్నికల్లో జమాతే విద్యార్థి విభాగమే ఘనవిజయం సాధించింది. ఇతర చోటామోటా పక్షాలతో కలిసి ఏకంగా అధికార పీఠంపైనే జమాతే ఇప్పుడు కన్నేసింది. ఈ పరిస్థితుల్లో దానితో పోలిస్తే ఉదారవాది అయిన తారిఖ్ రాక భారత్ కు ఊరటనిచ్చే పరిణామమే. పైగా భారత్ తో సత్సంబంధాలు కోరుకుంటున్నామన్న బీఎన్పీ ప్రకటనను విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. జమాతే వంటి మతోన్మాద శక్తికి ముకుతాడు పడటం మన జాతీయ ప్రయోజనాల రీత్యా చాలా ముఖ్యమని చెబుతున్నారు. తారిఖ్ పై ఉన్న అవినీతి, హసీనా హత్యాయత్నం తదితర కేసులన్నింటినీ కోర్టులు ఇటీవలే కొట్టేశాయి. దాంతో ఆయన ఎన్నికల పోటీకి మార్గం సుగమమైంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

క్రీస్తు బోధనలతో సమాజంలో సామరస్య స్ఫూర్తి

క్రిస్మస్ వేడుకల్లో ప్రధాని మోదీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: క్రీస్తు బోధనలతో సమాజంలో సామరస్య స్ఫూర్తి నెలకొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. పవిత్ర క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రధాని మోదీ గురువారం ఉదయాన్నే 'మార్నింగ్‌మాస్'లో భాగంగా ఢిల్లీలోని ప్రముఖ 'క్యాథడ్రల్ చర్చ్ ఆఫ్ ది రిడెంప్షన్'కు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తర్వాత ప్రధాని మోదీ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. ''ఢిల్లీలోని ప్రఖ్యాత క్యాథడ్రల్ చర్చ్ ఆఫ్ ది రిడెంప్షన్‌కు ఉదయాన్నే వెళ్లా. ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్నా. అక్కడి సేవా తత్పరత కాలాతీత ప్రేమ, శాంతి, దయాగుణాలకు ప్రతిబింబంగా నిలిచింది. క్రిస్మస్ పండుగ స్ఫూర్తి సమాజంలో శాంతి, సామరస్యాలకు స్ఫూర్తినిస్తుంది. ఈ సందర్భంగా క్రైస్తవులందరికీ నా క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు. శాంతి, నమ్మకం, జాలితో నిండిన సంతోషదాయక క్రిస్మస్‌ను అందరూ జరుపుకోవాలి. ఏసు క్రీస్తు అద్భుత బోధనలు సమాజంలో సామరస్యాన్ని మరింత పటిష్టవంతం చేయాలని మనసారా ప్రార్థిస్తున్నా''అని మోదీ అన్నారు. ఉదయం చర్చికి విచ్చేసిన సందర్భంగా ముందు వరస సీట్లో కూర్చుని క్రైస్తవులతో పాటు ప్రత్యేక గీతాలను మోదీ ఆలపించారు. చర్చిలో ఢిల్లీ బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ పాల్ స్వరూప్ చేసిన బోధనలను మోదీ ఆసక్తిగా విన్నారు.

ఢిల్లీలోని రిడెంప్షన్ కేథడ్రల్‌లో ఉదయం ప్రార్థనల సమయంలో ప్రధాని మోదీ

విశ్వవ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- బెత్లెహాంలో భారీస్థాయిలో జరిగిన వేడుక
- పదవి చేపట్టాక తొలిసారిగా క్రిస్మస్ సంబరాలు నిర్వహించిన పోప్ లియో-14

బెత్లెహాం: కరుణామయుడు ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. విశ్వవ్యాప్తంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలతో క్రిస్మస్ పర్వదిన సంబరాలు అంబరాన్ని తాకాయి. క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. గాజాలో హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా రెండేళ్లుగా బెత్లెహాంలో కళ తప్పిన క్రిస్మస్ వేడుకలు మళ్లీ ఈ ఏడాది ఆనాటి అద్భుతపాత శోభను సంతరించుకున్నాయి. దేశవిదేశాల నుంచి పెద్దసంఖ్యలో క్రైస్తవులు బెత్లెహాంలోని ప్రఖ్యాత మ్యాంగర్ కూడలికి చేరుకుని వేడుకను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. పోప్‌గా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా నూతన పోప్ లియో-14 వాటికన్ సిటీలోని ప్రఖ్యాత సెయింట్ పీటర్స్ బాసిలికా చర్చిలో బుధవారం అర్ధరాత్రి మాస్ ప్రత్యేక వేడుకను నిర్వహించారు. మానవాళిని రక్షించేందుకు బాలయేసు జన్మించిన వృత్తాంతాన్ని చర్చికి వచ్చిన విశ్వాసకులకు పోప్ వివరించారు. జీసస్ జన్మించిన బెత్లెహాంలో మ్యాంగర్ స్క్వేర్‌లో విద్యుత్‌దీపాలంకరణతో ఏర్పాటు చేసిన అతిపెద్ద క్రిస్మస్ చెట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతకుముందు జెరూసలేం నుంచి బెత్లెహాంకు క్యాథలిక్ మతగురువు కార్డినల్ పెయిర్‌బటిస్తా పిజాబల్లా వందలాది మంది క్రైస్తవులతో ఊరేగింపుగా వచ్చి బెత్లెహాంలో క్రిస్మస్ వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. అమెరికాలోని న్యూయార్క్ సిటీలో ఐస్‌స్కేటింగ్ చేస్తూ కొందరు ఆనందంగా పండగ సంబరాల్లో మునిగితేలితే మరికొందరేమో ఉత్తర ఐర్లాండ్‌లోని గడ్డకట్టించే అతిశీతల సముద్రజలాల్లో ఈతకొడుతూ ఆనందంగా గడిపారు. ఫ్లోరిడా తీర ప్రాంతాల్లో, ఆస్ట్రేలియా నగరాల్లో.. ఇలా పలు దేశాలు, నగరాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. శాంటా క్లాజ్ వేషంలో పలువురు.. నిరాశ్రయులు, పేదలకు నిత్యావసర సరకులు, కానుకలు బహూకరించారు. క్యాన్సర్ వంటి మహమ్మారుల బారిన పడిన రోగుల కోసం ఫ్లోరిడా సర్ఫ్ మ్యూజియం సహా పలు లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థలు క్రిస్మస్ వేళ విరాళాలు సేకరించాయి.

జలాంతర్గామి

అణు పాటవంలో ఉ.కొరియా ముందడుగు

సియోల్: అణు పాటవం విషయంలో ఉత్తర కొరియా కీలక ముందడుగు వేసింది. అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ చిరకాల స్వప్నమైన అణు జలాంతర్గామి నిర్మాణాన్ని దాదాపుగా పూర్తి చేసేసింది. కొద్ది నెలల్లో అది జలప్రవేశం చేయనుందని దక్షిణ కొరియా రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి. కిమ్ ఇటీవలే తన కూతురితో పాటు షిప్ యార్డ్ ను సందర్శించి పనుల ప్రగతిని సమీక్షించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఉత్తర కొరియా అధికారిక మీడియా గురువారం విడుదల చేసింది. అందులో ఆయన నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న జలాంతర్గామిని చూస్తూ కనిపిస్తున్నారు. ఇందుకు అవసరమైన రియాక్టర్ ను రష్యా నుంచి సంపాదించి ఉంటుందని భావిస్తున్నారు. లేదంటే రష్యా సాంకేతిక సహకారంతో ఉత్తర కొరియానే దాన్ని స్వయంగా రూపొందించుకుని ఉండొచ్చన్నది దక్షిణ కొరియా రక్షణ వర్గాల అభిప్రాయం. జలాంతర్గామి 8,700 టన్నుల బరువుంటుందని కొరియా మీడియా పేర్కొంది. పరిమాణంలో ఇది అమెరికా వద్ద ఉన్న అతి పెద్ద జలాంతర్గాములకు సమానం.

సెంగార్ శిక్ష రద్దుపై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ: 2017నాటి ఉన్నావ్ రేప్ కేసులో బీజేపీ బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగార్ జైలు శిక్షను రద్దు చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. హైకోర్టు ఆదేశాలపై స్టే విధించాలని లాయర్లు అంజలీ పటేల్, పూజా శిల్పకర్ తమ పిటిషన్‌లో కోరారు. బతికినంత కాలం సెంగార్ జైలులోనే ఉండాలంటూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోకుండానే ఢిల్లీ హైకోర్టు ఈ ఆదేశాలను ఇచ్చినట్లుగా కనిపిస్తోందన్నారు. బెయిల్ మంజూరు, జైలు శిక్ష రద్దు విషయంలో నిబంధనలను, ప్రత్యేక పరిస్థితులను పట్టించుకోకుండా హైకోర్టు తీవ్ర తప్పిదానికి పాల్పడిందని పేర్కొన్నారు. 'ప్రాసిక్యూషన్ సమర్పించిన కీలక సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకోవడంలో హైకోర్టు విఫలమైంది. నిందితుడి కిరాతకాన్ని, క్రూరత్వాన్ని ఆ సాక్ష్యాలు స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. నిందితుడికి ఉన్న అంగబలం, ఆర్థిక పలుకుబడి, నేర ప్రవృత్తి ఎంతటిదంటే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న బాధితురాలి తండ్రిని చంపించాడు. ఆ కుటుంబాన్ని భయపెట్టాడు' అని తెలిపారు.



నేడు హుండీ కానుకల లెక్కింపు

పెదకాకాని: స్థానిక మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో హుండీల కానుకల లెక్కింపు శుక్రవారం జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 566.40 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 51,426 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

మేరి మాత గ్రామోత్సవం

తాడేపల్లి రూరల్: తాడేపల్లిలోని ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో గురువారం రాత్రి మేరిమాత గ్రామోత్సవం నిర్వహించారు. విచారణ గురువు దానయ్య ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.

న్యూస్‌రీల్

ప్రమాద భరితంగా ఘాట్ రోడ్ మార్గం

మంగళగిరి టౌన్: మంగళగిరిలో ఎగువ సన్నిధిలో వేంచేసిఉన్న పానకాల లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానానికి వెళ్లే ఘాట్‌రోడ్ ప్రమాద భరితంగా మారింది. తరచూ ఘాట్‌రోడ్ మార్గంలో బండరాళ్లు జారిపడుతున్నాయి. దీంతో స్వామివారిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్ రోడ్ వెంబడి కొండకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగక ముందే చర్యలు చేపట్టాలని భక్తులు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. రానున్న ముక్కోటి ఏకాదశి సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనార్థం రానున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని దేవస్థాన అధికారులు స్పందించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, దేవాలయ పవిత్రతను కాపాడాలని భక్తులు కోరుకుంటున్నారు.

ఆంధ్రరత్న పంట కాలువలో మద్యం సీసాలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి నుంచి చిర్రావూరు వరకు రైతుల కోసం ఏర్పాటు చేసిన ఆంధ్రరత్న ఎత్తిపోతల పథకం కాలువలో ఎక్కడ చూసినా మద్యం సీసాలు తేలియాడుతున్నాయి. ఎత్తిపోతల పథకం కాలువ పక్కన వైన్‌షాపు ఏర్పాటు చేయడంతో మందు బాబులు ఖాళీచేసిన సీసాలను కాలువలో పడేస్తున్నారు. ఆ సీసాలు రైతుల పంట పొలాల్లోకి వెళుతున్నాయి. పనులు చేసుకుంటున్న సమయంలో ఆ సీసాలు పగిలి గాజు పెంకులు గుచ్చుకుంటున్నాయిని రైతులు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభాదేవికి డాక్టర్ ఉళ్లక్కి స్మారక బంగారు పతకం ప్రదానం

తెనాలి రూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ మేజర్ కాకుమాను ఉళ్లక్కి వర్ధంతి సభ నిర్వహించారు. బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొని డాక్టర్ ఉళ్లక్కి సేవలను స్మరించుకున్నారు. ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో విజయవాడకు చెందిన ప్రభ నర్సింగ్ హోం వైద్యురాలు కోడె ప్రభాదేవికి డాక్టర్ ఉళ్లక్కి స్మారక గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 'ఎంపవరింగ్ హెల్త్ ఇన్ మిడ్ లైఫ్' అనే అంశంపై డాక్టర్ ప్రభాదేవి ప్రసంగించారు. కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ కోటేశ్వరప్రసాద్, డాక్టర్ జి.రవిశంకరరావు, డాక్టర్ టి.అఖిలేష్, డాక్టర్ కె.అనిల్ కుమార్, డాక్టర్ జి.నరసింహారావు, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావులు పాల్గొన్నారు.

పరశురామావతారంలో వేంకటేశ్వరస్వామి

తెనాలి టౌన్: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ముక్కోటి ఏకాదశి సందర్భంగా లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో స్వామివారి ముక్కోటి ఏకాదశి దశావతార మహోత్సవాలు కనులపండువగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం స్వామివారిని పరశురామావతారంలో అలంకరించి పురవీధుల్లో రథంపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పునీత ఆగ్నేసమ్మ చర్చిలో జరిగిన ప్రార్థనలలో పాల్గొన్న క్రైస్తవ విశ్వాసులు

పునీత ఆగ్నేసమ్మ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ మత పెద్దలు



ఫిరంగిపురంలో ప్రార్థనలు చేస్తున్న మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య

క్రీస్తు జననం..లోకానికి పర్వదినం

ఏసు క్రీస్తు జన్మదినాన్ని విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని బుధవారం అర్ధరాత్రి నుంచి గుంటూరు నగరంలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువారం ఉదయం విశ్వాసులు పెద్ద ఎత్తున తరలిరావడంతో చర్చిల వద్ద సందడి నెలకొంది. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మత పెద్దలు వాఖ్య పరిచయం చేశారు. ఫిరంగిపురంలో మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

గుంటూరులోని హిందూ కళాశాల కూడలి సమీపంలోని లూథరన్ (పశ్చిమ గురుమండలం) చర్చిలో ప్రార్థనలలో పాల్గొన్న క్రైస్తవ విశ్వాసులు

నార్త్ ప్యారీస్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న రెవ.బాబూరావు

ప్రార్థనలలో పాల్గొన్న క్రైస్తవ విశ్వాసులు

డాన్‌బాస్కో చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బిషప్స్

నార్త్ ప్యారీస్ చర్చిలో ప్రార్థనలలో పాల్గొన్న క్రైస్తవ విశ్వాసులు

ఓఆర్ఆర్ భూ సేకరణకు
రంగం సిద్ధం

గుంటూరు జిల్లాలో 67.15 కిలోమీటర్లు..



- పల్నాడు జిల్లాలో 17 కిలోమీటర్లు...
- 140 మీటర్ల వెడల్పుతో భూసేకరణ...
- ఈ వారంలో నోటిఫికేషన్ విడుదల చేయనున్న జేసీ
- నందివెలుగు నుంచి కాజ వరకు 17.5 కిలోమీటర్ల లింక్ రోడ్డు
- జాతీయ రహదారితో అనుసంధానం....

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు భూ సేకరణకోసం అడుగులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం గుంటూరు, పల్నాడు జిల్లాలలో భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం ఓఆర్ఆర్ ఐదు జిల్లాలు, 23 మండలాలు, 97 గ్రామాల్లో భూసేకరణ చేయనున్నారు. 189.90 కిలోమీటర్ల మేర పరిధిలో ఓఆర్ఆర్ నిర్మాణం చేపట్టనున్నారు. దీనిలో భాగంగా గుంటూరు జిల్లాలో 67.15 కిలోమీటర్లు, పల్నాడులో 17 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మాణం జరగనుంది. ఇప్పటికే ఎన్‌టీఆర్ జిల్లా తప్ప మిగిలిన నాలుగు జిల్లాలకు గెజిట్‌ను ప్రచురించింది. గుంటూరు జిల్లాకు ఆదివారం కేంద్రం గెజిట్‌ను ప్రకటించిది. పల్నాడు జిల్లాకు ఈ నెల ఏడున గెజిట్ వచ్చింది. గుంటూరు జిల్లాలో త్వరలో జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో 21 రోజులు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. దీంతో పాటు తెనాలి మండలం నందివెలుగు గ్రామం నుంచి జాతీయ రహదారి కాజ గ్రామం వరకు లింక్ రోడ్డు ఏర్పాటు చేయనున్నారు.

- అమరావతి ఔటర్ రింగ్ రోడ్ ఐదు జిల్లాల్లోని 23 మండలాలు, 121 గ్రామాల గుండా వెళ్లనుంది. గుంటూరు జిల్లాలో మంగళగిరి మండలంలోని కాజ, చిన కాకాని గ్రామాలు, గుంటూరు నగరంలోని బుడంపాడు, ఏటుకూరు, పాతూరు, అంకిరెడ్డిపాలెం, మేడికొండూరు మండలం సిరిపురం, వరగాని, వెలవర్తిపాడు, మేడికొండూరు, డోకిపర్రు, విశదల, పేరేచర్ల, మందపాడు, మంగళగిరిపాడు, తాడికొండ మండలం పాములపాడు, రావెల, దుగ్గిరాల మండలం చిలువూరు, గొడవర్రు, ఈమని, చింతలపూడి, పెనుమూలి, కంఠంరాజు కొండూరు, పెదకాకాని మండలం నంబూరు, అనుమర్లపూడి, దేవరాయబొట్లపాలెం, తెనాలి మండలం కొలకలూరు, నందివెలుగు, గుడివాడ, అంగలకుదురు, కఠెవరం, సంగంజాగర్లమూడి, కొల్లిపర మండలం వల్లభాపురం, మున్నంగి, దంతలూరు, కుంచవరం, అత్తోట, చేబ్రోలు మండలం నారా కోడూరు, వేజెండ్ల, శుద్ధపల్లి, చేకూరు, వట్టిచెరుకూరు మండలం కొర్నేపాడు, అనంతవరప్పాడు, చమళ్లమూడి, కుర్నూతల గ్రామాల మీదుగా వెళ్లనుంది.

పల్నాడులో

పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం ముస్సాపురం, పాటిబండ్ల, తాళ్లూరు, లింగంగుంట్ల, జలాల్‌పురం, కంభంపాడు, కాశీపాడు, అమరావతి మండలం ధరణికోట, లింగాపురం, దిడుగు, నెమలికల్లు గ్రామాల మీదుగా వెళ్తుంది. పల్నాడు జిల్లాకు సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. త్వరలో అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఇప్పటికే ఆయా సర్వే నెంబర్లను ప్రకటించారు. ఈ సర్వే నెంబర్లలో క్రయవిక్రయాలు నిలిపివేయనున్నారు. సర్వే నెంబర్లలో రైతులు, ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత క్షేత్రస్థాయిలో పెగ్ మార్కింగ్ చేస్తారు. అన్నీ పరిశీలించిన తర్వాతే కేంద్రం 3–డి నోటిఫికేషన్ జారీ చేస్తారు. భూసేకరణ ప్రక్రియ మొదలు కావడంతో ఓఆర్ఆర్ ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చింది.

అయ్యో..'పాప'ం ..!

శిశువును ఎత్తుకుని చిన్నారి భిక్షాటన..!

ఇక్కడ కనిపిస్తున్న ఈ చిన్నారిని చూడండి. ఈ పాపకు పట్టుమని ఆరేడేళ్లు కూడా ఉండవు. బడిలో పుస్తకాలతో, ఇంటి వద్ద ఆట బొమ్మలతో, కల్మషం లేని చిరునవ్వులతో సరదాగా ఆడుకోవాల్సిన పసిప్రాయం. కానీ ఆ చిన్నారి చేతిలో నెలల పసికందుతో బతుకు పోరు సాగిస్తోంది. గుక్కపట్టి ఏడుస్తున్న శిశువును లాలిస్తూ భిక్షాటన చేస్తున్న చిన్నారి గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులో కనిపించింది. అలసిపోయి దుకాణాల ఎదుటనే కూర్చుని ఏడుస్తున్న శిశువుని ఓదార్చుతున్న చిన్నారిని చూసిన వారంతా అయ్యో 'పాప'ం అంటూ.. తమకు తోచిన సాయం అందించారు. ఆటపాటలు, అల్లరి పనులతో అందంగా సాగిపోవాల్సిన బాల్యాన్ని ఇలా యాచన బాటలో చూడడం బాధ కలిగిస్తోంది.

– ప్రత్తిపాడు

కల్లూరి తులశమ్మ స్వాతంత్య్ర పోరాటస్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

115వ జయంతి వేడుకల్లో వక్తలు

తెనాలి: గాంధీజీ బ్రహ్మచర్యం, అహింస ఆదర్శాలుగా స్వాతంత్య్ర పోరాటంలోకి దూకిన వీర మహిళ కల్లూరి తులశమ్మ జీవితాంతం ఆదర్శంగా జీవించారని అభ్యుదయ రైతు, సామాజిక సేవకుడు శాఖమూరి తిమ్మనాయుడు అన్నారు. రూరల్ మండలం పెదరావూరులోని కల్లూరి తులశమ్మ విగ్రహం వద్ద గురువారం ఆమె 115వ జయంతి నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు సమర్పించి, ఆమె సేవలను స్మరించుకున్నారు. పెదరావూరుకు చెందిన తులశమ్మ, గాంధీజీ పిలుపునకు స్పందించి భర్తను ఒప్పించి ఆయనకు వివాహం చేసి మరీ స్వరాజ్య పోరాటంలోకి ప్రవేశించినట్టు తెలిపారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన పోరాటంలో జైలుజీవితాన్ని అనుభవించారని చెప్పారు. దేశానికి స్వాతంత్య్రం లభించాక కూడా జీవితాంతం ఆదర్శంగా జీవించారని వివరించారు. తులశమ్మ జీవితాన్ని నేటితరం తెలుసుకుని దేశభక్తిని, నమ్మిన సిద్ధాంతానికి అనుగుణంగా జీవించటం నేర్చుకోవాలని వక్తలు సూచించారు. తులశమ్మ జయంతిని పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. శాఖమూరి తిమ్మనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాలడుగు సురేంద్ర, జాస్తి నరేంద్ర, పూర్ణచంద్రరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బెడ్ సైడ్ బోధనకు మంగళం

- రోగుల పడకల వద్ద వైద్య విద్యార్థులకు బోధన చేయటం లేదు
- ఉదయం ఓపీ వేళల్లోనే అంతా మమ అనిపించేస్తున్నారు
- మధ్యాహ్నం నుంచి ఇళ్లకు, సొంత క్లినిక్‌లకు సీనియర్ వైద్యుల పరుగులు
- పట్టించుకోని కాలేజ్ ప్రిన్సిపాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్

జీజీహెచ్ ఓపీ విభాగానికి చికిత్స కోసం వచ్చిన రోగులు

గుంటూరు మెడికల్: రెండు తెలుగు రాష్ట్రాల్లో గుంటూరు పెద్దాసుపత్రి(జీజీహెచ్)కి ప్రత్యేక గుర్తింపు ఉంది. అనుబంధంగా ఉన్న మెడికల్ కాలేజీలో నిపుణులైన అధ్యాపకులు ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఎందరో విద్యార్థులు ఇక్కడ చేరుతుంటారు. అయితే, కొంత మంది వైద్య విభాగాధిపతులు, ప్రొఫెసర్లు బాధ్యతలు మరుస్తున్నారు. ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులకు బెడ్ సైడ్ బోధన తప్పనిసరి. అయితే, సీనియర్ వైద్యులు నిబంధనలకు విరుద్ధంగా ఓపీలోనే వైద్య విద్యార్థులకు బోధన చేస్తున్నారు. ఇందుకు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఓపీ వైద్యసేవలకు పురమాయిస్తున్నారు. వార్డుల్లో రోగి పడక వద్దకు వైద్య విద్యార్థులను తీసుకెళ్లకుండా బోధన చేయడంతో పాఠాలు అంతంత మాత్రంగానే వంట బడుతున్నాయనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

బెడ్‌సైడ్ టీచింగ్ తప్పనిసరి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీజీహెచ్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సీనియర్ వైద్యులు అందుబాటులో ఉండి అవుట్ పేషెంట్ విభాగం (ఓపీ) రోగులకు సేవలు అందించాల్సి ఉంటుంది. అయితే, దీన్ని ఎవరూ పాటించడం లేదు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓపీ సేవలు అందించి, గంట సేపు భోజన విరామం తీసుకున్న తరువాత మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు వార్డుల్లో బెడ్ సైడ్ టీచింగ్ చేస్తూ రోగులను చూడాల్సి ఉంటుంది. కాని కొంత మంది సీనియర్ వైద్యులు ఓపీలోనే జూనియర్ వైద్యులకు పాఠాలు చెబుతూ వేచి ఉండేలా చేస్తున్నారు. మరికొంత మంది విభాగాధిపతులు ఓపీలకు రాకుండా వార్డుల్లో ఉంటూ సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారు. నిబంధనల ప్రకారం విభాగాధిపతులు కూడా ఓపీలకు హాజరై రోగులను పరీక్షించాల్సి ఉంటుంది. కొంత మంది సీనియర్ వైద్యులు, విభాగాధిపతులు హాజరు కాకపోవడంతో జూనియర్లు తమకు తోచిన వైద్యంతో నెట్టుకొస్తున్నారు. సకాలంలో వ్యాధి నిర్ధారణ, చికిత్సలు, అందక రోగులు పలుమార్లు ఆసుపత్రికి రావాల్సి వస్తోంది.

పర్యవేక్షణ నిల్

అడిషనల్ డీఎంఈ హోదాలో పని చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వి.సుందరాచారి, సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణలు వైద్య విద్యార్థులకు ఎంతో మేలు చేకూర్చే బెడ్‌సైడ్ టీచింగ్ గురించి పట్టించుకోవడం లేదు. రోగులకు ఓపీ వేళల్లో సకాలంలో, సక్రమంగా వైద్యసేవలు అందకపోతున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బెడ్‌సైడ్ టీచింగ్ అంటే ?

ఆస్పత్రిలోని రోగి బెడ్ (పడక) వద్దకు వైద్య విద్యార్థులను, జూనియర్ వైద్యులను తీసుకెళ్లాలి. వారికి రోగికి వచ్చిన జబ్బు.. వైద్య పరీక్షలు.. చికిత్స గురించి వివరించాలి. ఇలా ప్రతి విషయాన్ని కేస్ షీట్‌లో చూపించి ప్రొఫెసర్లు, విభాగాధిపతులు బోధన చేయడాన్ని బెడ్ సైడ్ టీచింగ్ అంటారు. పెద్దాసుపత్రిలో కొందరు సీనియర్ డాక్టర్స్ ఓపీ విభాగంలో రోగులకు చికిత్స అందించాల్సిన సమయంలోనే మెడికల్ స్టూడెంట్స్‌ను పిలించి పాఠాలు చెప్పేస్తున్నారు. ఉదయం ఓపీ సమయంలోనే తమ డ్యూటీ అంతా మమ అనిపించేస్తున్నారు. మధ్యాహ్నం నుంచి ప్రైవేటు ఆస్పత్రుల సేవల్లో తరిస్తున్నారు. దీంతో జూనియర్ వైద్యులు వ్యాధిని గుర్తించేందుకే పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఎక్కువ రోజులు రోగుల్ని ఆస్పత్రిలో ఉంచేస్తున్నారు.ఫలితంగా చిన్నపాటి రోగానికి కూడా రోగులు ఎక్కువ రోజులు ఆస్పత్రిలోనే గడపాల్సి వస్తుంది.

గుంటూరు నగరంలోని నార్త్ ప్యారిస్ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పొన్నూరు నియోజకవర్గం చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

తెనాలిలో సంఘస్తులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

వైభవంగా బాల ఏసు తిరునాళ్ల

- ఆర్సీఎం గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిన భాగ్యయ్య హాజరు
- అధిక సంఖ్యలో తరలి వచ్చిన క్రైస్తవులు
- ప్రత్యేక ప్రార్థనలతో హోరెత్తిన చర్చి ప్రాంగణం

అచ్చంపేట: క్రిస్మస్ వేడుకలలో భాగంగా మండలంలోని తాళ్లచెరువులోని బాల ఏసు దేవాలయంలో తిరునాళ్ల మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. వేకువ జాము నుంచే భక్తులు మందిరానికి తరలి వచ్చి, కొవ్వొత్తులు సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విద్యుత్ దీప కాంతులతో చర్చి ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది. గుంటూరు రోమన్ క్యాథలిక్ మిషన్ పీఠాధిపతి చిన్నాబత్తిన భాగ్యయ్య దివ్యపూజా బలి నిర్వహించారు. క్రీస్తు సందేశాన్ని బోధించారు. క్రిస్మస్ అనగా దేవుడైన క్రీస్తు మానవరూపుడై భువికి అరుదెంచిన వేళ అన్నారు. అందిరిపై క్రీస్తు దీవెనలు మెండుగా ఉండాలని ప్రార్థించారు. లోకరక్షకుడైన ఏసు క్రీస్తు పాపులను రక్షించుటకు భూమిపై అవతరించారని చెప్పారు. ఎదుటి వారి పట్ల ప్రేమ, దయ కలిగి ఉండాలని బోధించారు. పొరుగు వారిని ప్రేమించాలని, ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించాలని ప్రబోధించారు. విచారణ గురువులు తుమ్మా మర్రెడ్డి, రెవ. ఫాదర్ తుమ్మా కరుణాకరరెడ్డి, రెవ. ఫాదర్ పవన్, రెవ. ఫాదర్ రేపూడి రాయప్ప, రెవ ఫాదర్ థామస్ బైబిల్ పఠనం చేశారు. 64 మంది కన్య స్త్రీలు ప్రార్థనలో పాల్గొన్నారు. క్రైస్తవ గీతాలు ఆలపించారు. ప్రత్యేక బృందాలచే కోలాటం ప్రదర్శన చేశారు. గ్రామ సృష్టికర్త అరళానందస్వామి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి దేవాలయ సమీపంలో అన్నదానం నిర్వహించారు. బాలఏసు స్వరూపంతో అలంకరించిన తేరు ప్రదక్షిణ మహోత్సవం కనుల పండువలా జరిగింది. తాళ్లచెరువు గ్రామవీధులలో మేళతాళాలు, బాణసంచాలతో తేరు ఉరేగింపు ఆకట్టుకుంది. పలు గ్రామాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. క్రీస్తుకు కొవ్వొత్తులు సమర్పించుకున్నారు. రైతులు తమ వ్యవసాయ సామగ్రిని చర్చి చుట్టూ తిప్పి పంటలు బాగా పండాలని కోరుకున్నారు. సందర్శకులను ఆకట్టుకునేలా చర్చి ముందు స్టాల్స్, రంగుల రాట్నాలు, చెరుకు గడల విక్రయాలు ఏర్పాటయ్యాయి. మండలంలోని పలు గ్రామాలలో కూడా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. అచ్చంపేట, మాదిపాడు, తాడువాయి, చెరుకుంపాలెం, కోనూరు, గ్రంథసిరి, వేల్పూరు, చింతపల్లి, చిగురుపాడు తదితర గ్రామాలలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయకులు

సాగరమాత ఆలయంలో ఘనంగా క్రిస్మస్

- ఏసు క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శం
- విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్

విజయపురి సౌత్: స్థానిక ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగరమాత దేవాలయంలో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం దివ్యపూజా బలి కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పశువుల పాక నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శనీయం అన్నారు. మానవుడిగా మన మధ్య జన్మించిన రోజే క్రిస్మస్ పర్వదినమని, ఆయన సందేశాలను సమస్త మానవాళి ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్లు అనిల్, కిరణ్, సిస్టర్స్, భక్తులు పాల్గొన్నారు.

క్రిస్మస్ ప్రార్థనల్లో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి

ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న జస్టిస్ లావు నాగేశ్వరరావు కుటుంబం

ప్రత్తిపాడు: పెదనందిపాడులోని ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చిలో గురువారం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఫాదర్లు ప్రార్థనల అనంతరం క్రీస్తు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా లావు నాగేశ్వరావు సంఘ పెద్దలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ అంటే ప్రేమ, కరుణకు ప్రతీక అని చెప్పారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పని దొరకడం లేదని..

- కత్తితో మెడ కోసుకున్న వ్యక్తి
- నెల్లూరు నగరంలో ఘటన

అమీర్‌వలీని పరిశీలిస్తున్న పోలీస్ సిబ్బంది

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పట్టపగలు ఓ వ్యక్తి కత్తితో తన మెడ కోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటన నెల్లూరులోని కనకమహల్ సెంటర్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా వడ్డేశ్వరం గ్రామానికి చెందిన 41 సంవత్సరాల వయసున్న అమీర్‌వలీ బేల్దారి పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో పనుల కోసం కొద్దిరోజుల క్రితం నెల్లూరుకు వచ్చాడు. ఇక్కడ పనులు దొరక్కపోవడంతో మానసికంగా ఆందోళనకు గురై గురువారం ఉదయం కనకమహల్ సెంటర్ వద్ద మెయిన్ రోడ్డుపై చిన్న కత్తితో తన మెడ, పొట్ట భాగాల్లో కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న సంతపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అమీర్‌వలీని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో భార్య, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేశారు.

యువతిపై కానిస్టేబుల్ దాడి.. కేసు నమోదు

లక్ష్మీపురం: యువతిపై దాడికి పాల్పడిన కానిస్టేబుల్‌పై అరండల్‌పేట పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలానికి చెందిన యువతి (29) గుంటూరు బ్రాడీపేటలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలానికి చెందిన కత్తి శ్రీను గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. మూడేళ్లుగా యువతితో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో తనకు వివాహం కాలేదని మాయమాటలు చెప్పాడు. అతనికి వివాహమైన విషయం ఇటీవల తెలియడంతో ఆమె దూరంగా ఉంటోంది. కానిస్టేబుల్ మాత్రం తనతో ఉండాలని వేధిస్తున్నాడు. ఆమె వెంట పడుతూ, హాస్టల్ వద్దకు వచ్చి గొడవ పడుతున్నాడు. శారీరకంగా వేధించడం ప్రారంభించాడు. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో కానిస్టేబుల్ ఏకంగా హాస్టల్ వద్దకు వచ్చి ఆమెతో గొడవ పడ్డాడు. దాడి చేసి కొట్టి గాయపరిచాడు. ఆపై చంపుతానని బెదిరించాడు. బాధితురాలు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివైక్యం చెందిన బ్రహ్మయ్య గురూజీ

బాపట్ల: ఆంజనేయస్వామి ఉపాసకులు, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, ఎందరో ప్రముఖులకు మార్గదర్శి అయిన బ్రహ్మయ్య గురూజీ(79) శివైక్యం చెందారు. బాపట్ల కేంద్రంగా గత 25 సంవత్సరాలుగా హనుమ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖులకు, ఆశీర్వాదాలు అందజేస్తూ బ్రహ్మయ్య గురూజీ ఆధ్యాత్మిక జీవనం గడుపుతున్నారు. ఆయన మరణ వార్త తెలుసుకొని పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం ఆయన అంత్యక్రియల్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు, శిష్యులు, బంధువుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. భవిష్యత్తులో బ్రహ్మయ్య గురూజీ స్మృతి వనం ఏర్పాటు చేసి, గడిచిన 25 సంవత్సరాలుగా ఆయన ప్రజలకు అందించిన ఆధ్యాత్మిక పరిమళాలను కొనసాగించేలా కార్యక్రమాల రూపకల్పన చేసేందుకు శిష్యులు సిద్ధమవుతున్నారు. అంతిమయాత్రలో ఆడిటర్ పుప్పాల చిన్న సాయిబాబు, బొమ్మిశెట్టి వెంకటరత్న గుప్తా, కొత్తమాసు సత్యనారాయణ, న్యాయవాది అలపర్తి నాగేశ్వరరావు, అలపర్తి శ్రీనివాసరావు, సామాజికవేత్త చింతకాయల పార్థసారథి, పెదమల్లు ఉదయ్ చంద్రరావు, మూర్తి, పలువురు ఆధ్యాత్మికవేత్తలు పాల్గొని నివాళులర్పించారు.

గురూజీ అంతిమ యాత్ర

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన హైవేపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం పదహారవ నంబరు జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున సుమారు రెండు గంటల సమయంలో రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వయస్సు సుమారు 30- 35 మధ్య ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు 86888 31386, 91548 76312 నంబర్లకు సమాచారం అందించాలని ప్రత్తిపాడు ఎస్ఐ కె.నరహరి తెలిపారు.

కార్పొరేట్ ఆస్పత్రుల్లో

ఉచిత వైద్యం ఉత్తిదే

- ఉచిత వైద్యం రికార్డులకే పరిమితం
- పేదల ఉచిత సేవలకు మంగళం
- సేవలను అందించకుండానే అనుమతులు
- నిబంధనలు తుంగలో తొక్కుతున్న ఆస్పత్రుల నిర్వాహకులు

గుంటూరు మెడికల్: పేద ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా ఖరీదైన వైద్య సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలకు ప్రభుత్వ వైద్యాధికారులు, ఆస్పత్రుల నిర్వాహకులు తూట్లు పొడుస్తున్నారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించకుండానే అందించినట్లుగా ఆస్పత్రుల యజమానులు తప్పుడు రికార్డులు చూపెడుతూ పేదల ఉసురు పోసుకుంటున్నారు. వారి తప్పుడు పనులకు ప్రభుత్వ వైద్యాధికారులు అందినంత పుచ్చుకుని వత్తాసు పలుకుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ పెన్షనర్స్‌కు, వారి కుటుంబ సభ్యులకు, ఎంఎల్ఏలకు, మాజీ ఎంఎల్ఏలకు, ఇతర సిబ్బందికి వైద్య సేవలందించేందుకు ప్రైవేటు ఆస్పత్రులు, రిఫరల్ ఆస్పత్రుల నిర్వాహకులు తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు ఉన్నట్లు సర్టిఫికెట్ తీసుకోవాలి. సదరు సర్టిఫికెట్‌ను పొందాలంటే 'ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ మెడికల్ అటెండెన్స్ రూల్స్, 1972'ను తప్పనిసరిగా పాటించాలి. జిల్లాలో ఉన్న కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఈ నిబంధనలు అమలు కావటం లేదనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

నిబంధనలు ఇవీ....

తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారు, దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వ్యక్తులకు ఉచితంగా ప్రభుత్వ గుర్తింపు ఉన్న కార్పొరేట్, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించాలి. ఆస్పత్రిలో ఉన్న పడకల్లో ఐదుశాతం ఈ పేదల కోసం కేటాయించి అన్ని వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఉచిత వైద్య సేవలను ఇవ్వాలి. అవసరమైతే ఆపరేషన్లు కూడా ఉచితంగా చేయాలి. ఓపీ సేవలు, వార్డు సేవలు కూడా ఉచితంగా అందించాలి. అంతేకాకుండా రెండు గ్రామాలను దత్తత తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రతి నెలా ఒక ఉచిత వైద్యశిబిరం సదరు గ్రామంలో ఏర్పాటుచేయాలి.

విద్యార్థులకు సైతం ఉచిత వైద్యం...

కేవలం పెద్దవాళ్ళకే కాకుండా విద్యార్థులకు కూడా ఉచిత వైద్య సేవలను అందించాల్సి ఉంది. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు , ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, బీసీ వెల్ఫేర్ స్కూల్, ఎస్టీ హాస్టల్స్, ఎస్టీ ఆశ్రమ్ స్కూల్స్ విద్యార్థులకు, మాబడి స్కూల్స్ విద్యార్థులకు ఉచితంగా వైద్య సేవలు అందించాలి. వీరితో పాటు ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్, జిల్లా రిఫరల్ కమిటీ, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ,ఇతర ప్రభుత్వ అధికారులు రిఫర్ చేసే విద్యార్థులకు కూడా గుర్తింపు ఉన్న ఆస్పత్రులు ఉచితంగా సేవలందించాలి. కానీ జిల్లాలో రెన్యూవల్ అయిన ఆస్పత్రుల్లో పేదలకు ఉచిత వైద్యం అందించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జీజీహెచ్ వైద్యుల మొక్కుబడి తనిఖీలు

ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తున్నారో లేదో తనిఖీ చేసేందుకు విజయవాడకు చెందిన డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయం, జిల్లాకు చెందిన పలువురు వైద్యులు, వైద్యాధికారులను ముఖ్యంగా గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాలకు చెందిన సీనియర్ వైద్యులను నియమిస్తుంది. తనిఖీ కోసం వెళ్లే వైద్యులకు, వైద్యాధికారులకు సదరు ఆస్పత్రి నిర్వాహకులే కారు ఏర్పాటుచేసి, మధ్యాహ్నం స్టార్ హోటల్స్‌లో విందు ఏర్పాటు చేసి, తిరిగి వచ్చే సమయంలో భారీగానే తాయిలాలు ఇస్తున్నట్లు పలువురు చెవులు కొరుక్కుంటున్నారు.

తప్పనిసరిగా తనిఖీలు చేయాలి

ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు జిల్లాలో సుమారు 80 వరకు ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో ప్రతి నెలా ఎంత మంది రోగులకు చట్ట ప్రకారం ఉచిత వైద్య సేవలను అందించారో పూర్తి వివరాలతో నివేదిక పంపించాల్సి ఉంది. అయితే కొన్ని ఆస్పత్రుల్లో తనిఖీల ఊసే లేదు. గతంలో విజిలెన్స్ అధికారులు కూడా ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల్లో పేదలకు ఉచిత వైద్య సేవలను అందించటం లేదనే విషయాన్ని నిర్ధారించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వారికి విజయవాడ, గుంటూరు జిల్లాలలో మార్కెటింగ్ చేయుటకు (M/F) అభ్యర్థులు కావలెను. అర్హత: 10th to Any Degree. జీతం: అర్హత అనుభవమును బట్టి 16 వేల నుండి 35 వేల వరకు. సంప్ర: 9394 66 77 88
- డ్యూటీ డాక్టర్స్, రిసెప్షనిస్ట్, నర్సెస్ (MPHW) వాచ్‌మెన్స్ కావలెను. కొత్తవారికి కూడా ప్రాధాన్యత.అహల్యా నర్సింగ్‌హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 92464 27459
- ప్రముఖ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు గుంటూరు, చిలకలూరిపేట, నరసరావుపేట ప్రాంతాల నుండి M/F Executives కావలెను. మంచి కమీషన్ + ఇన్సెంటివ్స్, LIC ఏజెంట్స్, రిటైర్డ్ టీచర్స్, గృహిణులు & Freshers కూడా సంప్ర: 82478 24262
- తెనాలిలోని ప్రముఖ కంపెనీ నందు పని చేయుటకు అనుభవం గల లేడీ కంప్యూటర్ ఆపరేటర్ (M.S. Office) మంచిజీతం. సంప్ర: 86869 35606
- టోల్ ప్లాజా నందు పని చేయుటకు 10 to PG కంప్యూటర్ ఆపరేటర్,క్యాషియర్ కావలెను 8గంల డ్యూటీ భోజనం వసతి ఉచితం. ✆ 78934 36019.
- డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారు చేసి మాకు ఇవ్వండి వీక్లీ పేమెంట్. 9640729906

గుంటూరు
7075167663
7075167541

గమనిక

క్లుప్తంగా

387 రోజులుగా కార్మికుల దీక్షలు

తాడేపల్లి రూరల్: న్యాయంగా తమకు రావాల్సిన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 387వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కె.స్టీవెన్, బూరగ అంకయ్య, బి.సూర్యప్రకాష్‌లు ప్రారంభించారు. దీక్షల్లో కొరప్రాటి ఆదినారాయణ, ముసలా సాంబశివరావు, షైక్ సుభాని, దామవరపు నాగేశ్వరావు, ఏనుగుల సాంబయ్య కూర్చున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో వై.రమాదేవి, ఎం.శారదా, బి.నవనేతమ్మ, వేముల లక్ష్మీ పాల్గొన్నారు. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కార్మికులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మరింత పట్టుదలగా ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని కార్మికులను కోరారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి

దుగ్గిరాల: భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని దుగ్గిరాల బీజేపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు అడపా వెంకట్రావు అధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రిగా ఆయన సారధ్యంలో దేశం పలు రంగాలలో అభివృద్ధి చెందిందని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

బీటల రోడ్డులో ప్రయాణం అవస్థలు!

దుగ్గిరాల: పెదపాలెం నుంచి శృంగారపురం గ్రామాల మధ్య గల సిమెంట్ రోడ్డు సుమారు 3 కిలో మీటర్ల మేర బీటలు తీసింది. బీటలు తీసిన రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రయాణికుల తీవ్ర అవస్థలు పడుతున్నారు. బీటలు తీసిన ఈ రోడ్డుకు గతంలో తారు వేసి మరమ్మతులు జరిపారు. అయినప్పటికీ ఇటీవల తుపాను కారణంగా కురిసిన వర్షాలకు పనుల నాణ్యత బయటపడింది. ఈ రహదారిలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో కిందపడి గాయాలపాలైనవారు ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. పలు చోట్ల రోడ్డు విపరీతంగా పక్కకు ఒరిగి దర్శనమిస్తోందని వాపోతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు

తెనాలి: స్థానిక మారీస్‌పేటలో వేంచేసివున్న శ్రీ కోదండరామస్వామివారి దేవస్థానంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా గురువారం శ్రీగోదాదేవి అమ్మవారికి భక్తులతో ఊరేగింపు చేశారు. సాకినేని విజయలక్ష్మి ఆధ్వర్యంలోని శ్రీరామ భక్త హనుమాన్ కోలాట బృందంచే కోలాటం ఆడుకుంటూ అమ్మవారికి సారే సమర్పించారు. ధనుర్మాసం సందర్భంగా ప్రతిరోజు ప్రాతఃకాల సమయంలో శ్రీదుర్గాపూర్ణ కుమారి గారి భవజ్ఞ మండలి సభ్యులతో తిరుప్పావై పారాయణం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 30న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నామని ధర్మకర్త శ్రీలంక శివానంద్ కుమార్ తెలియజేశారు. ధర్మకర్తలు కునపల్లి నారాయణస్వామి, లంక శివానంద్ కుమార్, లంక శివఆంజనేయ ప్రసాద్, శ్రీ విష్ణుభట్ల ఆంజనేయశాస్త్రి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు దినమని ధనుష్ సుబ్రహ్మణ్య శర్మ ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ ప్రార్థనలు

- వాడవాడలా ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- అర్ధరాత్రి నుంచి విశ్వాసుల ప్రార్థనలు

మంగళగిరి టౌన్ చర్చి ప్రార్థనలలో పాల్గొన్న విశ్వాసులు

తాడేపల్లి రూరల్: క్రిస్మస్ వేడుకలను మంగళగిరి పట్టణం, రూరల్ పరిధిలో గురువారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ప్రార్థనా మందిరాల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఉదయం 9 గంటలకు పలు చర్చిల్లో మత పెద్దలు, ఫాదర్లు, పాస్టర్లు, చర్చికి వచ్చిన విశ్వాసులకు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. సాయంత్రం ఏసు క్రీస్తు చరిత్రను వివరించారు. అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. సీతానగరం బోటు ప్రాంతంలో ఏర్పాటు చేసిన శాంటాక్లాజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

తాడికొండ: క్రిస్మస్‌ను పురస్కరించుకుని తాడికొండ, తుళ్లూరు మండలాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మందిరాల్లో బుధవారం అర్ధరాత్రి మొదలైన ప్రార్థనలు గురువారం తెల్లవారుజాము వరకూ ఘనంగా కొనసాగాయి. దూర ప్రాంతాల నుంచి బంధుమిత్రుల రాకతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. బాలయేసు తేరు ప్రదర్శనను అన్ని గ్రామాల్లో మేళతాళాల నడుమ ఊరేగింపు నిర్వహించారు.

బాలఏసు ఆలయంలో విశ్వాసుల సందడి..

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బాలఏసు దేవాలయంలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విశ్వాసులు మండలానికి చేరుకుని బాల ఏసును దర్శించుకున్నారు. కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గురువులు విశ్వాసులను ఆశీర్వదించారు. ఉదయం విచారణ గురువు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి ఆధ్వర్యంలో క్రీస్తు జయంతి మహోత్సవం సమష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. సాయంత్రం రెవరెండ్ ఫాదర్ తిప్పాబత్తిని కమలేష్ ఆధ్వర్యంలో దివ్యసత్ప్రసాద ఆరాధన,

దుగ్గిరాల ది సాల్వేషన్ ఆర్మీ సంఘంలో క్రిస్మస్ వేడుకలు

ఆశీర్వచనాలు అందిస్తున్న గురువులు

మందిరంలో జపమాల, మహాదివ్యసత్ప్రసాద ఆరాధన నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో బాల ఏసుదేవాలయ రథోత్సవాన్ని(తేరు) మరియ మాత, బాల ఏసు స్వరూపాన్ని ఉంచి మేళతాళాలు, స్తుతిగీతాలు ఆలపిస్తూ ఊరేగించారు. కార్యక్రమంలో కథోళిక క్రైస్తవులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు క్రీస్తు..

ఫిరంగిపురం: లోక రక్షకుడు క్రీస్తు అని గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయ ప్రాంగణంలో క్రీస్తు జయంతి మహోత్సవ

చింతలపూడి ప్రార్థనలలో పాల్గొన్న విశ్వాసులు

ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య

జాగరణ ప్రత్యేక దివ్యపూజాబలి బుధవారం అర్ధరాత్రి నిర్వహించారు. మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనను బిషప్ హౌస్ నుంచి మేళతాళాలతో కథోళిక క్రైస్తవులు బాల ఏసు దేవాలయం వరకు తీసుకువచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు, దివ్య పూజాబలి నిర్వహించిన అనంతరం విశ్వాసులకు వాక్యోపదేశం చేశారు. కార్యక్రమంలో బాల ఏసు దేవాలయ విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి, సహాయ గురువు సాగర్, మత కన్యాస్త్రీలు, ప్యారిష్ కౌన్సిల్, సోడాలిటీ సభ్యులు, గుడిపెద్దలు, కథోళిక క్రైస్తవులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: క్రిస్మస్ వేడుకలను దుగ్గిరాల మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు పెద్ద ఎత్తున జరిపారు. దుగ్గిరాల ది సాల్వేషన్ ఆర్మీ చర్చిలో సంఘకాపరి సుబ్బారావు విశ్వాసులకు ప్రార్థనలు చేశారు. సంఘ పెద్దలు నాయుడు బాబురావు, కర్రి బెనర్జీ, బెజ్జం శాంతిరాజు, సాంబయ్య పాల్గొన్నారు. ఏఈఎల్ చర్చిలో

ముగ్గురోడ్డు తెలుగు బాప్టిస్టు చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న దైవ జనులు

మంగళగిరి టౌన్ చర్చిలో సందేశం ఇస్తున్న పాస్టర్లు

తాడికొండలో క్రిస్మస్ సందేశం అందిస్తున్న పాస్టర్ నల్లపు సుధాకర్

బాలఏసు దేవాలయంలో సందడిగా విశ్వాసులు

జరిగిన కార్యక్రమంలో సంఘకాపరి జాన్ మిల్టన్, సంఘ పెద్దలు ఉన్నం అనిల్ కుమార్, చిలువూరు రమేష్, ఉన్నం రాజేష్, పులివర్తి రవీంద్ర, పాల్గొన్నారు. చెన్నకేశవ నగర్‌లో అహరోను బాప్టిస్టు చర్చిలో సంఘకాపరి కె.షడ్రక్, సంఘ పెద్దలు కొండూరు రవి, సువర్ణరాజు, చిట్టిబాబు, మరియదాసు సమక్షంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చింతలపూడి గ్రామంలో షేబానా ప్రార్థనా మందిరంలో కేక్ కట్‌చేసి సంఘకాపరి ఎం.ఐజయ్య క్రీస్తు సందేశం అందించారు. కార్యక్రమంలో కేసంనేని శ్రీఅనిత, కొండలరావు, వెలివెల కృష్ణారావు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలి

తాడేపల్లి రూరల్: క్రీస్తు సందేశాల్లో ప్రేమ, వినయం, దీనత్వం ప్రధానమైనవని మంగళగిరి ఇందిరానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ పి.అనూష అన్నారు. పట్టణంలోని శాంతిదూత మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సైమన్ మెమోరియల్ ప్రేయర్ హాల్ ప్రాంగణంలో గురువారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. సమ సమాజానికి ఆధ్యాత్మిక వాతావరణం ఎంతో దోహదపడుతుందని వివరించారు. సెల్‌ఫోన్, సోషల్ మీడియా కాలుష్యం నడుమ చిక్కుకున్న నేటి యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయలేకపోతోందని వాపోయారు. క్రిస్మస్ వంటి పండుగలు సమాజంలో మార్పు తేవడానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ గోలి రామమోహనరావు మాట్లాడుతూ.. ధ్యానం, ప్రార్థన వంటివి ఆరోగ్యానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వేడుకల్లో క్రిస్మస్ సందేశాన్ని కె.నోవా సైమన్ అందించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌లను వైద్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిల్ జాషువా, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్‌కు సత్కారం

తాడేపల్లి రూరల్: మంగళగిరి మన్నెం వారి వీధిలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని 99 ఏళ్ల వయస్సు గల రిటైర్డ్ పాస్టర్ ఆనందరావును ఆయన నివాసంలో మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్నెం రమేష్‌బాబు ఘనంగా సత్కరించారు. పాస్టర్ ఆనందరావుకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి నూతన వస్త్రాలు, పండ్లు అందజేశారు. మన్నెం వెంట టీడీపీ కార్యదర్శి భైరబోయిన శ్రీనివాసరావు ఉన్నారు.

ఘనంగా మహాపడి.. భక్తుల సందడి

పూజలు నిర్వహిస్తున్న గురుస్వామి

పాల్గొన్న దీక్షాదారులు, భక్తులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధి చిర్రావూరులో అయ్యప్ప స్వామి 18వ పడిపూజ గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. చిర్రావూరులో శ్రీప్రసన్న లలిత నాగేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో కేరళ తంత్రి మధు నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి 18వ పడిపూజను వైభవంగా నిర్వహించారు. స్వామి 18 మెట్లను పూల మాలలతో అలంకరించి గణపతి, కుమారస్వామి, శివ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉదయం గణపతి పూజను ప్రారంభించారు. అనంతరం సుదర్శన హోమం, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, కలశం, అమ్మవారి పూజలు ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి 18 రకాల అభిషేకాలు, ఆభరణాల ఊరేగింపు నిర్వహించి పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. అయ్యప్ప నామస్మరణతో చిర్రావూరు ప్రాంతం మార్మోగింది. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అయ్యప్ప భక్తులు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. డప్పు శ్రీను బృందంతో భజన కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారిని కేరళ తంత్రి మధు నంబూద్రి ఆశీర్వదించారు.

అడ్డగోలు పార్కింగ్‌తో తీవ్ర ఇబ్బందులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, ఎగువ సన్నిధిలోని పానకాల స్వామి దేవస్థానానికి వెళ్లే వారు పార్కింగ్ స్థలం ఉన్నప్పటికీ రోడ్డు మీదే ఇష్టానుసారం వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో దేవాలయానికి వచ్చే భక్తులు, స్థానికులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దేవస్థానం వారు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేసినప్పటికీ ఆయా ప్రాంతాల్లో పార్కింగ్ స్థలం చూపించే బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో కొత్తగా దేవస్థానానికి వచ్చిన వారు వాహనాలు స్థానికంగా గల రోడ్లు, మెట్ల మార్గం, ఘాట్ రోడ్లల్లో ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. దీని వల్ల భక్తులతో పాటు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నరసింహస్వామి దిగువ సన్నిధిలో ఇష్టానుసారం పార్కింగ్ చేసిన వాహనాలు

ఇలా అడ్డగోలు పార్కింగ్‌తో పలు సందర్భాల్లో స్థానికంగా ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతోంది. దేవస్థానం వారు వెంటనే పార్కింగ్ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తెనాలిలో సీపీఐ శతవార్షికోత్సవం

తెనాలి: తెనాలి ముత్యంశెట్టిపాలెంలో సీపీఐ శత వార్షికోత్సవాలు మానవ హక్కుల జాతీయ నాయకులు పల్నాటి నాగరాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగరావు మాట్లాడుతూ సీపీఐ పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు కావస్తుంది దీనిలో భాగంగా శత వార్షికోత్సవాలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. సీపీఐ పార్టీ ఎప్పుడు ప్రజల పక్షాన నిలుస్తుందని చెప్పారు. సీపీఐ సీనియర్ నాయకులు పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ రోజు సీపీఐ పార్టీ నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తూ, ప్రజాసంక్షేమ దిశగా పురోగమిస్తోందని తెలిపారు. మానవ హక్కుల జాతీయ నాయకులు పల్నాటి నాగరాజు మాట్లాడుతూ సీపీఐ పార్టీ శత వార్షికోత్సవంలో భాగం జెండా ఆవిష్కరణ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్మికుల కోసం కర్షకులు కోసం, పేదల కోసం, రైతుల కోసం పోరాడే ఏకైక పార్టీ సీపీఐ పార్టీ అని నాగరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి బొల్లిముంత గోపీకృష్ణ, జి.ప్రసాద్, జిల్లా నాయకులు రేఖ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారకుండా కాలువకు అడ్డుకట్ట

తాడేపల్లి రూరల్: సుమారు 3,600 ఎకరాలకు సాగునీరు అందించే ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కాలువలో తరచూ మురుగు పారుతోంది. ప్రస్తుతం రైతులు మొక్కజొన్న, జొన్నపంట సాగు చేస్తున్నారు. కాలువ ద్వారా మురుగు రావడంతో రైతులు గురువారం మరోసారి పంట కాలువలోంచి మురుగు దిగువ ప్రాంతానికి రాకుండా అడ్డుకట్ట వేశారు. గతంలో మూడు సార్లు కాలువలో మురుగు పారకుండా అడ్డుకట్ట వేయగా స్థానికంగా ఉన్న బహుళ అంతస్థుల వారు రాత్రి సమయంలో వాటిని తొలగించారు. రైతులు ఇంటింటికీ తిరిగి పంట కాలువలోకి మురుగు వదలొద్దంటూ నివాసదారులను కోరారు. అయినా కాలువలోకి మురుగు వదలడంతో గత్యంతరం లేక రైతు సంఘం నాయకులు సూచనల మేరకు రైతులు దిగువ ప్రాంతానికి మురుగు రాకుండా పాతూరు–కుంచనపల్లి మధ్య

పాతూరు, కుంచనపల్లి మధ్యలో కాలువకు అడ్డుగా రైతులు వేసిన కట్ట

కాలువకు అడ్డుకట్టను ఏర్పాటు చేశారు. ఈ కట్ట వేయడం వల్ల నివాసాల్లోకి మురుగు చేరుతోందని స్థానిక నివాసదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు మేము నష్టపోలేమని.. కార్పొరేషన్ అధికారులను కలిసి మురుగునీటిని మరోవైపు మళ్లించాలంటూ ఖరాఖండిగా తేల్చి చెప్పారు.

బీవైఎస్‌సీ ఆధ్వర్యంలో క్రిస్మస్ క్రికెట్ లీగ్

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ తెలుగు బాప్టిస్టు సంఘం 90వ వార్షికోత్సవం, క్రిస్మస్ శుభ దినాన్ని పురస్కరించుకుని బాప్టిస్టు యూత్ స్పోర్ట్స్ క్లబ్ (బీవైఎస్‌సీ) ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించారు. క్రీడా పోటీలకు స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. లీగ్‌లో అవేంజర్స్ జట్టు విజయం సాధించి ఛాంపియన్లుగా నిలిచింది. విజేత క్రికెట్ జట్టుకు కట్టేపోగు రాజీవ్ ఆర్థిక సహకారంతో ప్రత్యేకంగా టీషర్ట్స్, విజేతల ట్రోఫీని అందించారు. బీవైఎస్‌సీ ట్రెజరర్, నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ ఆంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా గుంటూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్ మధు మంచాల ఛాంపియన్ ట్రోఫీని విజేతలకు బహూకరించారు. ఈ సందర్భంగా విజేత జట్టుకు బహుమ

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కమిటీ సభ్యులు

తులు అందజేసిన రాజీవ్ కట్టేపోగును బీవైఎస్‌సీ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు అభినందించారు. స్థానిక యువతలో క్రీడా నైపుణ్యాల అభివృద్ధి, క్రీడలకు ప్రోత్సాహం కల్పించడమే లక్ష్యంగా బీవైఎస్‌సీ సంస్థ నిరంతరం పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి ఆర్‌వీఆర్‌జేసీలో కొలరిడో- 2025 ఫెస్ట్

గుంటూరు రూరల్: ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నుంచి కొలరిడో- 2025 నేషనల్ ఫెస్ట్ ప్రారంభమవుతోంది. రెండు రోజులపాటు జరగనున్న కార్యక్రమంలో సాంకేతిక, సాంస్కృతిక, క్రీడల విభాగాల్లో జాతీయ స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జె. మురళీమోహన్, ఎం. జగదీష్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 26, 27 తేదీల్లో జరిగే ఈ పోటీల్లో దేశంలోని వివిధ కళాశాలల నుంచి 5,000 మందికి పైగా విద్యార్థులు హాజరవుతారన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ. 5 లక్షల నగదు బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. 26న ప్రారంభోత్సవ కార్యక్రమానికి అతిథులుగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఆర్‌ఐఓ రవిశంకర్, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్ మధుమూర్తి, తెలుగు సినీ చలనచిత్ర నటీనటులు నందు, యామిని భాస్కర్, ఇతర సినీ తారలు హాజరవుతారని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు.

ఇస్కాన్ టెంపుల్‌కు భూ కేటాయింపు రద్దు చేయాలి

తెనాలిటౌన్: పట్టణ నందులపేటలోని బసవమందిరానికి చెందిన వ్యవసాయ భూమిని ఇస్కాన్ టెంపుల్‌కు కేటాయింపులు రద్దుచేయాలని కోరుతూ జంగమ సంక్షేమ సంఘం నాయకులు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్‌ను కోరారు. కొల్లిపర మండల గ్రామంలో అత్తోటలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్ష ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను గురువారం సాయంత్రం పట్టణానికి చెందిన జంగమ సంక్షేమ సంఘం నాయకులు కలిశారు. తెనాలి నందులపేటలో ఉన్న బసవ మందిరానికి బుర్రిపాలెంరోడ్డులో గల ఎకరం మాగాణి భూమిని ఇస్కాన్ వారికి లీజుకివ్వటం సమంజసం కాదని సూచించారు. వెంటనే లీజు రద్దుచేస్తూ ఉత్తర్వులు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నవ్యాంధ్ర జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షులు యూఎంవీ నాగలింగం, తెనాలి జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేవీఎస్ నాగలింగం, కార్యదర్శి కొల్లిపర చంద్ర శేఖర లింగం, కార్యవర్గ సభ్యులు సమిధాల జయశ్రీ, సిద్ధుల సాయినాథ్, సోము లక్ష్మణ్ పలువులు సభ్యులు పాల్గొన్నారు.

ఎక్కడ సేవ అవసరమో అక్కడ మానవత

తెనాలి శాఖ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్

తెనాలి: మానవత సంస్థ తమ పరిధిలో ఎక్కడ సేవకు అవకాశం ఉంటుందో అక్కడ సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్టు సంస్థ తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్ చంద్ చెప్పారు. రూరల్ మండల గ్రామం నందివెలుగులోని మహర్షి దయానంద వృద్ధాశ్రమానికి గురువారం సాయంత్రం 12 కుర్చీలు కలిగిన నాలుగు స్టీల్ బెంచీలను బహూకరించింది. మానవత సంస్థ సేవలను గుర్తింపుగా ఇటీవల సౌతిండియా సీఎస్సార్ సమ్మిట్ అవార్డు లభించినట్టు గుర్తుచేశారు. మానవత సంస్థ నిబద్ధతకు అవార్డు నిదర్శనమన్నారు. వృద్ధాశ్రమాన్ని నడుపుతున్న కూరపాటి రవీంద్ర, కళ్యాణి దంపతులను మానవత సంస్థ అభినందించింది. అక్కడున్న వృద్ధులతో కొంత సమయం గడిపారు. సంస్థ రీజనల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, ప్రెసిడెంట్ పి వాసు, వైస్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, సెక్రటరీ

మానవత బహూకరించిన స్టీలు బెంచీల్లో వృద్ధాశ్రమవాసులు

పి.వెంకట్, జాయింట్ సెక్రటరీ డీవీ సోమయ్య శాస్త్రి, ట్రెజరర్ ఎస్‌వీ శర్మకు, రాంచంద్ కృతజ్ఞతలు తెలిపారు. వీరితోపాటు కార్యక్రమంలో మల్లాది అర్జున్, ఆలపాటి వెంకట్రామయ్య, చిట్టినేని సాంబశివరావు, యు.సూర్యనారాయణ, కె.నాగేశ్వరావు, పి.మల్లిఖార్జునరావు, శివ రాజకుమారి పాల్గొన్నారు.

క్యూలైన్‌లో ఇనుప కంచెల మధ్య నలిగిపోతూ భయంతో బిగ్గరగా అరుస్తున్న చిన్నారులు

టికెట్ల క్యూలైన్‌లో ఒక గేటు మాత్రమే తెరవడంతో ఇరుక్కుని ఉన్న భక్తులను లాగుతున్న సిబ్బంది

తొక్కిసలాట జరిగే ప్రమాదం తలెత్తడంతో కుమార్తెను పైకి ఎక్కిస్తున్న తండ్రి

దేవుడా.. ఏమిటీ పరీక్ష?

శ్రీవారి దివ్య దర్శన టోకెన్ల కోసం పోటెత్తిన భక్తులు

నియంత్రణలో టీటీడీ సిబ్బంది వైఫల్యం

తిరుపతి అన్నమయ్య సర్కిల్: టీటీడీ నిర్లక్ష్యంతో భక్తులకు తిప్పలు తప్పడం లేదు. గత ఏడాది వైకుంఠ ఏకాదశి టోకెన్ల పంపిణీ సమయంలో చోటుచేసుకున్న దుర్ఘటన నుంచి పాఠాలు నేర్చుకోలేదు. అందుకు అలిపిరి వద్ద గురువారం దివ్యదర్శనం టోకెన్ల పంపిణీ సమయంలో చోటు చేసుకున్న తోపులాటే నిదర్శనం. వారాంతపు సెలవులు రావడంతో గురువారం తిరుమల శ్రీవారి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. శ్రీవారి మెట్టు నడకదారిలో తిరుమలకు చేరుకునే భక్తులు.. శ్రీవారి దివ్యదర్శన టోకెన్ల కోసం తిరుపతిలోని అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. పరిమితికి మించి భారీగా భక్తులు రావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. భద్రతా సిబ్బంది క్యూలైన్ కౌంటర్ ప్రధాన గేటు సకాలంలో తెరవక పోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఒక్కసారిగా క్యూలైన్ గేటు తెరవడం, అదే సమయంలో భక్తులకు తగిన సూచనలు చేసే వారు లేకపోవడంతో టోకెన్ కౌంటర్ వద్ద తోపులాట జరిగింది. క్యూలైన్లలో అరుపులు, కేకలతో తీవ్ర ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ఏమి జరుగుతుందోనని భక్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భక్తులు తమ పిల్లలు, కుటుంబ సభ్యుల కోసం ఇనుప కంచెపైకి ఎక్కిమరీ అరుపులు, కేకలు వేయడం, మరికొందరు కంచెను ఎక్కి టోకెన్ల కోసం పరుగులు తీయడం, భక్తులను నిలువరించేందుకు అవసరమైన సిబ్బంది లేకపోవటం వంటి పరిస్థితుల్లో కొందరికి గాయాలయ్యాయి.

టీటీడీ నిర్లక్ష్యంపై భక్తుల ఆగ్రహం

టీటీడీ తీరుపై భక్తులు మండిపడ్డారు. గురువారం తెల్లవారుజామునుంచి టోకెన్ల కోసం తిండి తిప్పలు మాని క్యూలో వేచి ఉంటే.. మధ్యాహ్నం 12.30 గంటలకే టోకెన్ల జారీ ప్రక్రియ అయిపోయిందంటూ ప్రకటించడం... పైగా క్యూలైన్లలో అరుపులు, కేకలు, తోపులాటలు చోటుచేసుకోవడంపై భక్తుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పండుగలకు ముందు సెలవులు వస్తాయని, ఆ సమయంలోనే భక్తులు అధిక సంఖ్యలో తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తారని అధికారులకు ముందే తెలుసు. అయినా టీటీడీ అధికార యంత్రాంగం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోకపోవడాన్ని భక్తులు తప్పుపట్టారు.

రెండింతలు పెరిగిన భక్తులు

అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్‌లో సాధారణ భక్తులకు ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి 15 వేల స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డి) టోకెన్లు జారీచేస్తారు. అదే విధంగా కాలినడకన శ్రీవారిమెట్టు, అలిపిరి మెట్టు వెళ్లే భక్తులకు వేర్వేరు కౌంటర్ల ద్వారా రోజుకు 5 వేల చొప్పున 10 వేల దివ్యదర్శనం టోకెన్లను జారీ చేస్తున్నారు. ఈ లెక్కన ప్రతి రోజు 25 వేల మేరకు టోకెన్ల జారీ జరుగుతోంది. కాగా వారాంతపు సెలవులు రావడంతో అత్యధిక సంఖ్యలో దాదాపు 50 వేల మంది భక్తులు అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌కు చేరుకోవడం, టోకెన్ల కోసం శ్రమించడంలో గందరగోళం చోటుచేసుకుంది. దాదాపు 25 వేల మంది భక్తులు టోకెన్లు పొందలేక వెను తిరగాల్సిన పరిస్థితి చోటుచేసుకుంది.

టోకెన్ల జారీ విధాన మార్పుతోనే సమస్య

శ్రీవారి మెట్టు నడక మార్గంలోనే గతంలో దివ్యదర్శనం టోకెన్లు ఇచ్చేవారు. అయితే గత కొంత కాలంగా అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్‌లోనే అదనంగా కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. గురువారం కౌంటర్ వద్ద గందరగోళ పరిస్థితి ఏర్పడటానికి అది కూడా ఒక కారణం అని భక్తులు విమర్శిస్తున్నారు. టోకెన్ల జారీ ప్రక్రియ పూర్తయిన వెంటనే మైకు ద్వారా అనౌన్స్‌మెంట్ ఇచ్చిఉంటే పరిస్థితి సజావుగా సాగేదని చెబుతున్నారు. దివ్యదర్శనం టోకెన్లు లభించని వేలాది మంది భక్తులు 'గోవిందా నీవే దిక్కు.. నీదర్శనమే మాకు మొక్కు' అంటూ తిరుగు పయనమవడం కనిపించింది.

క్యూలైన్‌లో ఇనుప కంచెల మధ్య నలిగిపోతూ భయంతో బిగ్గరగా అరుస్తున్న భక్తులు

తగిన చర్యలు తీసుకుంటాం: ఎస్పీ సుబ్బరాయుడు

వారాంతపు సెలవుల నేపథ్యంలో అధిక సంఖ్యలో భక్తులు క్యూలైన్లలోకి రావడం వల్ల తోపులాట చోటుచేసుకుందని ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడించారు. సోషల్ మీడియాలో తొక్కిసలాట అంటూ వచ్చిన వార్తల్లో వాస్తవం లేదన్నారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆయన టీటీడీ సీవీఎస్‌వో మురళీకృష్ణతో కలసి అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని శ్రీవారి మెట్టు నడకదారి దివ్యదర్శన టోకెన్ల జారీ కౌంటర్ వద్దకు చేరుకున్నారు. పరిస్థితిని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ, మొదట ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ ప్రక్రియ పూర్తి కావడంతో భక్తులు ఒక్కసారిగా దివ్య దర్శన టోకెన్లకు ఎగబడ్డారన్నారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందుముందు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఎందుకొచ్చావ్..

సాక్షి ఫొటోగ్రాఫర్ సెల్‌ఫోన్ లాక్కున్న ఏవీఎస్‌వో

తోపులాటకు సంబంధించి మీడియా కవరేజి చేస్తున్న సాక్షి ఫొటోగ్రాఫర్ కేతారి క్రిష్ణమోహన్‌పై అక్కడే ఉన్న ఏవీఎస్‌వో రమేష్‌కృష్ణ దౌర్జన్యం చేశారు. ఆయనను అడ్డుకుని సెల్‌ఫోన్ లాక్కున్నారు. 'ఎందుకొచ్చావ్' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవీఎస్‌వో వ్యవహార శైలి తీవ్ర కలకలం రేపింది. 'కింద స్థాయిలో అధికారులు మీడియాకు సహకరించాలి'' అని ఉన్నతాధికారులు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో జరుగుతున్నదానికి పొంతన కుదరడంలేదంటూ పలువురు జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు.

అడ్డదారుల్లో వచ్చే వారికి టోకెన్

అడ్డదారులో వచ్చే వారికి టోకెన్ పొందే అవకాశాన్ని కల్పించారు. ఉదయం నుంచి క్యూలైన్‌లో ఏమీ తినకుండా.. పిల్లలకు కూడా పెట్టకుండా ఇబ్బందులు పడ్డాం. సామాన్యులకు శ్రీవారి దర్శనం సులభతరం చేసే చర్యలను టీటీడీ యంత్రాంగం తీసుకోవాలి.
– మాధురి, భక్తురాలు (బెంగళూరు)

ఏ రోజూ ఇంత దారుణంగా లేదు

గోవిందమాల ధరించి వెంకటేశ్వరస్వామి దర్శనార్థం 13వ సారి 20 మంది గోవింద మాల భక్తులతో కలసి వచ్చాను. తీరా కౌంటర్ వద్దకు సమీపించగానే టోకెన్లు లేవని చెప్పడం తీవ్ర నిరాశ కలిగించింది. ఏ రోజూ ఇంత దారుణం లేదు. –రఘురామయ్య, భక్తులు (నాయుడుపేట)

సిబ్బంది తోసేశారు

ఉదయం నుంచీ క్యూలైన్లో వేచి వున్నా.. టోకెన్లు లభించకపోగా.. సెక్యూరిటీ సిబ్బందితో చేదు అనుభవం ఎదురైంది. నేను డాక్టర్‌నని చెప్పినా.. సెక్యూరిటీ సిబ్బంది ఎటువంటి గౌరవం లేకుండా నాతోపాటు మా అమ్మను తోసేశారు. నిర్వహణ తీరు దారుణంగా ఉంది.
– తల్లితో డాక్టర్ వెంకటేశ్, భక్తుడు (హైదరాబాద్)

పిల్లలకు గాయాలు

కౌంటర్ వద్దకు చేరుకునే సరికే టోకెన్లు అయిపోయాయని చెప్పారు. తీవ్ర నిరాశ ఎదురైంది. పైగా తీవ్ర తోపులాటలో కిందపడిన నా పిల్లలకు గాయాలయ్యాయి. ఇలాంటి పరిస్థితి ఉంటుందని ఎప్పుడు అనుకోలేదు.
– విజయలక్ష్మి, భక్తురాలు (బళ్లారి)

ప్రజాభిప్రాయంపైనా బాబు లెక్కలేనితనం

- కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలపై కుట్రలకు మరింత పదును
- ప్రజా వ్యతిరేకతను గుర్తించే ముందుకురాని ప్రైవేట్ సంస్థలు
- నష్టమొస్తే వాటికి వయబిలిటీ గ్యాప్ ఫండ్ ఇచ్చేలా మరో ప్రజా వ్యతిరేక నిర్ణయం
- కమీషన్ల కోసం ఎంతకైనా దిగజారేందుకు చంద్రబాబు సిద్ధం
- వేతనాలకిచ్చే డబ్బులతో కాలేజీలు కట్టొచ్చు కదా..
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు చేసిన ప్రజలపై సీఎం చంద్రబాబు కక్ష పెంచుకున్నారని, ప్రజాభిప్రాయాన్ని సైతం లెక్క చేయకుండా తన కుట్రలకు మరింత పదును పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరు నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కోటి సంతకాల సేకరణ ఉద్యమంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టడంతో ప్రైవేట్ సంస్థలు ప్రజా వ్యతిరేకతను గుర్తించి వైద్య కళాశాలలను తీసుకోవడానికి ముందుకు రావడం లేదని ఆయన స్పష్టంచేశారు. దీంతో ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గాల్సిందిపోయి ప్రైవేట్ సంస్థలకు వయబిలిటి గ్యాప్ ఫండ్ కూడా ఇస్తానంటూ ముఖ్యమంత్రి సరికొత్త ఆఫర్లు ప్రకటిస్తూ ప్రజాభిప్రాయం అంటే తనకు లెక్కలేదనే సందేశం పంపుతున్నారని మండిపడ్డారు. కాకాణి ఇంకా ఏమన్నారంటే..

నియంతలా చంద్రబాబు..

మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై రాష్ట్ర ప్రజలు భగ్గుమంటున్నారు. కోటి సంతకాల ప్రతులను గవర్నర్‌కు అందించినప్పటికీ చంద్రబాబు వెనక్కి తగ్గకుండా నియంతలా వ్యవహరిస్తున్నారు. మొదట్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనాలు, భూములను ఎకరా వంద రూపాయలకే కట్టబెట్టిన చంద్రబాబు.. ఆ తర్వాత రెండేళ్లపాటు జీతభత్యాలకయ్యే ఖర్చును ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. నష్టమొస్తే వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద ఆ నష్టాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుందంటూ మరో ప్రజా వ్యతిరేక నిర్ణయం తీసుకున్నారు. కమీషన్ల కోసం చంద్రబాబు ఎంతకైనా దిగజారేందుకు సిద్ధమయ్యారు. నిజానికి.. వేతనాల రూపంలో ప్రైవేట్‌కు రెండేళ్లలో రూ.1,400 కోట్లు చెల్లించే బదులు ఆ మొత్తంతో మెడికల్ కాలేజీలను నిర్మించొచ్చు కదా!

మళ్లీ అధికారంలోకి రారని తెలిసే..

రాష్ట్రానికి ఎంతో కాలంపాటు సీఎంగా పని చేసిన చంద్రబాబు ఒక్క మెడికల్ కళాశాలను కూడా నిర్మించాలనే ఆలోచన చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని తలపెట్టి, అందులో ఏడింటిని పూర్తి చేయడాన్ని చంద్రబాబు ఓర్వలేకపోతున్నారు. వీటిని పూర్తి చేస్తే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మంచి పేరొస్తుందనే అక్కసుతోనే చంద్రబాబు ప్రైవేటీకరణకు పూనుకున్నారు. మరోసారి అధికారంలోకి వచ్చే పరిస్థితుల్లేవనే విషయం ఆయనకు అర్థమైనందువల్లే అధికారంలో ఉండగానే వీలైనంత దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఇంత ఆయాచిత లబ్ధిని ప్రైవేట్ వ్యక్తులకు చేకూర్చాలని సీఎం చంద్రబాబు తహతహలాడుతున్నారంటే, వారితో కుదుర్చుకున్న డీల్ ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. కరోనా కాలంలో దేశంలో ప్రైవేట్ ఆస్పత్రులు రోగుల్ని దోచుకున్న దారుణాలు చూసి కూడా అలాంటి వారికి ఆఫర్లు ప్రకటించడం వెనుక చంద్రబాబు ఉద్దేశం ఏమిటి? ప్రజా వ్యతిరేక నిర్ణయాలను మా పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదు.

బాబు పాలనలో మహిళలకు రక్షణ కరువు

- మంత్రి సంధ్యారాణి పీఏ వేధింపుల కేసులో బాధితురాలి అరెస్టు దారుణం
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కళ్యాణి ధ్వజం

సాక్షి, విశాఖపట్నం: కూటమి పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మంత్రి గుమ్మడి సంధ్యారాణి పీఏ వేధింపుల కేసులో బాధితురాలిని అరెస్టు చేయడం ప్రభుత్వ బరితెగింపునకు నిదర్శనమన్నారు. ఇది రెడ్ బుక్ రాజ్యాంగానికి పరాకాష్ట అని తేల్చి చెప్పారు. 'తనకు అన్యాయం జరిగిందని ఒంటరి మహిళ పోలీసులను ఆశ్రయిస్తే... వారు మాత్రం మంత్రి సంధ్యారాణి డైరెక్షన్‌లో నడుచుకోవడం ముమ్మాటికీ అధికార దుర్వినియోగమే. బాధితురాలినే నిందితురాలిగా చేయడం ద్వారా బాబు ప్రభుత్వం అత్యంత దుర్మార్గానికి పాల్పడింది. పోలీసులు తమ వ్యవస్థ సిగ్గుతో తలదించుకునేలా వ్యవహరించారు. మహిళలను వేధిస్తే అదే ఆఖరి రోజన్న సీఎం చంద్రబాబు, మహిళలపై చేయి వేస్తే తాట తీస్తానన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ కేబినెట్ సహచరి పీఏ వేధింపులపై ఏం చర్యలు తీసుకున్నారు? ఇప్పటికైనా నా నిందితుడిని అరెస్టు చేసి.. బాధిత మహిళకు న్యాయం చేయాలి'' అని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత విచారణ జరిపి, నిందితునితోపాటు అతడికి సహకరించిన పోలీసులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వార్థ రాజకీయాలే ప్రభుత్వ పరమావధి

ప్రజా ప్రయోజనాలను పణంగా పెట్టి, స్వార్థ రాజకీయాలే లక్ష్యంగా బాబు ప్రభుత్వం పనిచేస్తోందని కళ్యాణి విమర్శించారు. 'తాజాగా కదిరిలో ఓ గర్భిణిపై దాడి చేశారని ఒక వ్యక్తిని అరెస్టు చేసి విపరీతంగా వేధించారు. అతడిని వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా భావించి వేధించిన పోలీసులు... సదరు వ్యక్తి జనసేన కార్యకర్త అని తేలడంతో మౌనంగా ఉన్నారు. రాప్తాడులో 14 ఏళ్ల దళిత బాలికపై టీడీపీ కార్యకర్తలు ఆరు నెలలపాటు లైంగికంగా వేధించి, గ్యాంగ్ రేప్‌నకు పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తే అప్పుడు నిందితులను అరెస్టు చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఆదిమూలం వేధింపులకు గురైన ఒక బాధిత మహిళ.. తనకు ఏపీలో రక్షణ లేదని ఏకంగా హైదరాబాద్ వెళ్లి ప్రెస్ మీట్ పెట్టి తన గోడు వెళ్లబోసుకుంది. అయినా ఆదిమూలం మీద కేసుల్లేవు. జనసేన ఇన్‌చార్జి కిరణ్ రాయల్ వేధింపులకు గురైన లక్ష్మి అనే బాధిత మహిళ మీడియా ముందుకు వచ్చి ఆవేదన వ్యక్తం చేసినా కిరణ్ రాయల్ మీద కేసులేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలో సహానా అనే దళిత యువతిని రౌడీషీటర్ నవీన్ కొట్టి చంపేస్తే ఏం చర్యలు తీసుకున్నారని ఈ సందర్భంగా కళ్యాణి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రం వద్ద భక్తుల ఆందోళన

నిర్ణీత సమయానికంటే ముందే టోకెన్లు ఇవ్వడంపై నిరసన

తిరుమలలో శ్రీవారి టికెట్ల కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న భక్తులు

తిరుమల: నిర్ణీత సమయానికంటే ముందే శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేయడంతో భక్తులు ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళ్తే... తిరుమల అన్నమయ్య భవనం ఎదురుగా ఉన్న శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రం వద్ద బుధవారం రాత్రి నుంచే టికెట్ల కోసం భక్తులు వేచి ఉన్నారు. అయితే భక్తుల రద్దీ తెల్లవారుజామున 2 గంటల సమయానికి భారీగా పెరిగిపోవడంతో సంబంధిత కౌంటర్ సిబ్బంది అక్కడ ఇచ్చే 800 టోకెన్లనూ ముందుగానే ఇచ్చి, టికెట్లు జారీ చేశారు. దీంతో క్యూలైన్లో ఉన్న మిగిలిన వారు, ఆ తర్వాత వచ్చిన భక్తులు.. ముందుగానే శ్రీవాణి టికెట్లను ఎలా జారీ చేశారని ఆగ్రహిస్తూ గురువారం తెల్లవారుజామున ఆందోళన చేశారు. తిరుమల టూటౌన్ పీఎస్ సీఐ శ్రీరాముడు అక్కడికి చేరుకుని భక్తులకు సర్ది చెప్పారు. టీటీడీ విజిలెన్స్ అధికారులతో మాట్లాడారు.

రెడ్‌బుక్ రాజ్యాంగంలో న్యాయవ్యవస్థ నిర్వీర్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగం న్యాయ వ్యవస్థను కూడా ఖాతరు చేయడం లేదని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ కోర్టులో బుధవారం పోలీసులు వ్యవహరించిన తీరును ఖండిస్తూ గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక కేసులో నిందితుడు శివయ్యను న్యాయవాది కోర్టులో సరెండర్ చేస్తూ పిటిషన్ దాఖలు చేస్తే మేజిస్ట్రేట్ సరెండర్ పిటిషన్లపై చెక్ అండ్ పుట్ అప్ అని కోర్టు సిబ్బందిని ఆదేశించారన్నారు. అయితే చిప్పగిరి ఎస్ఐ సతీష్, పత్తికొండ ఎస్ఐ విజయ్‌కుమార్ మరి కొంతమంది పోలీసులు సివిల్ డ్రెస్‌లో వచ్చి కోర్టు హాల్‌లో ఉన్న నిందితుడు శివయ్యను బయటకు లాక్కెళ్లేందుకు యత్నించగా.. అడ్డుకున్న న్యాయవాది జె.రవి కుమార్‌ను సైతం పక్కకు తోసేసి దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. న్యాయస్థాన ప్రాంగణంలో ఉన్న సరెండర్ అయిన నిందితులను అరెస్ట్ చేయకూడదని తెలిసినా చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే తమ చేతుల్లోకి తీసుకుని న్యాయ వ్యవస్థను అగౌరవ పరిచారన్నారు. ప్రజాస్వామ్యవాదులు, న్యాయవాదులు, ప్రజలంతా ముక్తకంఠంతో ఈ ఘటనను ఖండించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి కారకులైన పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

కంధమాల్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

- నలుగురు మావోయిస్టులు మృతి
- మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు గణేష్ ఉయికే
- ఈయనపై రూ.1.10 కోట్ల రివార్డు
- ఈ ఘటనతో ఒడిశాలో మావోయిస్టుల శక్తి పూర్తిగా దెబ్బతిందన్న డీజీపీ

మల్కన్‌గిరి/సాక్షి ప్రతినిధి, వరంగల్ : ఒడిశా రాష్ట్రం కంధమాల్ జిల్లా చక్‌పాడ్ పోలీసుస్టేషన్ పరిధి.. గంజాం జిల్లా సరిహద్దు రాంభా అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం మావోయిస్టులకు పోలీసు దళాలకు మధ్య జరిగిన కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. వారిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గణేష్ (69) అలియాస్ రూపా, రాజేష్, తివారి, చమ్రు, పక్క హనుమంతు ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. గణేష్ స్వగ్రామం తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా పుల్లెమాల పంచాయతీ చేందూర్ గ్రామం. ఆయనపై రూ.1.10 కోట్ల రివార్డు ఉంది. కాల్పులపై డీజీపీ వైబీ ఖురానియా మాట్లాడుతూ.. అగ్రశ్రేణి మావోయిస్టు నేత గణేష్ మృతి పోలీసులకు గొప్ప విజయమన్నారు. గణేష్ మృతి తర్వాత ఒడిశాలో మావోయిస్టుల శక్తి పూర్తిగా దెబ్బతిందని తెలిపారు.

సంఘటన స్థలంలో గణేష్ మృతదేహం

ఈ ఆపరేషన్‌లో గణేష్‌తో పాటు మొత్తం నలుగురు మావోయిస్టులు మృతిచెందారని తెలిపారు. ఈ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించడమే తమ లక్ష్యమని డీజీపీ తెలిపారు.

మోస్ట్ వాంటెడ్ నేతలు గణపతి, దేవ్‌జీ, బర్సే దేవ

ఇదిలా ఉంటే.. నెలరోజులపాటు 'హైడ్'లో ఉంచిన అధికార వెబ్‌సైట్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఇటీవల అప్‌డేట్ చేసింది. మావోయిస్టు పార్టీ మోస్ట్ వాంటెడ్ నేతలుగా ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ పేర్లను ఎన్ఐఏ తాజాగా పేర్కొంది. కేంద్ర కమిటీ సభ్యుడు మడావి హిడ్మా ఎన్‌కౌంటర్ ఇప్పటికీ సంచలనం కలిగిస్తుండగా, ఆ స్థానంలో పనిచేస్తున్నట్లు ప్రచారమున్న బర్సే దేవ అలియాస్ బర్సే సుక్కను వాంటెడ్ జాబితాలో చేర్చింది. నల్లగొండ జిల్లాకు చెందిన ఏఓబీ ఇన్‌చార్జ్, కేంద్ర కమిటీ సభ్యుడు ఉయికే (ఊకే) గణేష్‌పై రూ.1.10 కోట్ల రివార్డు ఉండగా.. ఎన్ఐఏ తాజా మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఆయన పేరుంది. గణేష్ తాజా ఎన్‌కౌంటర్‌లో మరణించారు. అనిల్ దా, మెట్టూరి జోగారావు, సోమ్‌జీ, కుమ్మె మాడియం, జైలాల్ మాండవి, దేవా మడకామి, సోహాన్ అలియాస్ రంగా పొట్టం, అశ్విన్ అలియాస్ లచ్చు కోర్సల పేర్లు హిట్‌లిస్టులో ఎన్ఐఏ పేర్కొంది. అయితే, కేంద్ర కమిటీలో కీలకంగా ఉన్న మల్లా రాజిరెడ్డి, యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ మృతిచెందిన తర్వాత ఆయన స్థానంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన బడే దామోదర్ అలియాస్ చొక్కారావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్ తదితరుల పేర్లు ఎన్ఐఏ జాబితాలో కనిపించలేదు.

సంఘటన స్థలంలో మహిళ మావోయిస్టు మృతదేహం

ఆర్ఎస్‌యూ నుంచి..

డిగ్రీ చదువుతున్న సమయంలోనే పార్టీ పట్ల ఆకర్షితుడైన హన్మంతు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పాక హన్మంతు అలియాస్ గణేశ్‌ది వ్యవసాయ కుటుంబ నేపథ్యమే. ఆయనకు ఇద్దరు తమ్ముళ్లు, ముగ్గురు చెల్లెళ్లు ఉన్నారు. 1961లో జన్మించిన హన్మంతు 7వ తరగతి వరకు స్వగ్రామమైన పుల్లెంలలో చదువుకున్నాడు. చండూరులో పదో తరగతి వరకు, ఇంటర్ నల్లగొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివారు. ఆ తర్వాత నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీఎస్సీలో చేరారు. 1983లో డిగ్రీ చదువుతున్న సమయంలోనే మావోయిస్టు పార్టీ పట్ల హన్మంతు ఆకర్షితుడయ్యారు. రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో (ఆర్ఎస్‌యూ) పనిచేశారు. డిగ్రీ చదువును మధ్యలోనే వదిలేసి అజ్ఞాతంలోకి వెళ్లారు. నల్లగొండ ఏబీవీపీ నేత ఏచూరి శ్రీనివాస్ హత్య కేసులోనూ హన్మంతు నిందితుడిగా ఉన్నాడు. డిగ్రీ చదివే సమయంలో ఆర్ఎస్‌యూ అధ్యక్షుడిగా వ్యవహరించిన హనుమంతు మావోయిస్టు పార్టీలో చేరి కేంద్ర కమిటీ సభ్యునిగా ఎదిగారు. బస్తర్ జిల్లా కమిటీ సభ్యునిగా ఆయన ప్రస్థానం ప్రారంభమైంది. అక్కడి నుంచి స్పెషల్ కమిటీ కార్యదర్శిగా, ఆ తర్వాత వెస్ట్ బస్తర్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేశారు.

తల్లిదండ్రులు చనిపోయినప్పుడు...

విద్యార్థి దశ నుంచే మావోయిస్టు పార్టీలోకి వెళ్లిన హన్మంతు ఆ తర్వాత ఇంటికి వచ్చింది లేదు. తల్లిదండ్రులు ఏళ్ల తరబడి ఎదురుచూసినా ఒక్కసారి కూడా రాలేదని గ్రామస్తులు చెప్పారు. నాలుగేళ్ల కిందట ఆయన తండ్రి చంద్రయ్య, రెండేళ్ల కిందట తల్లి ఎట్టెమ్మ మృతి చెందారు. అయినా హన్మంతు వారిని చివరిసారిగా చూసేందుకు కూడా రాలేదు. కుటుంబ సభ్యులకు హన్మంతు ఎక్కడ ఉన్నది తెలియదు. హన్మంతు మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు సుముఖత వ్యక్తం చేసినట్టు పోలీసులు తెలిపారు. వారు శుక్రవారం ఒడిశాకు బయలుదేరే అవకాశముంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో భారతీయ మహిళలకు సంబంధించి 2025 కీలక సంవత్సరంగా నిలిచింది. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌డబ్ల్యూసీ) యశోద ఏఐ అభియాన్ కార్యక్రమం వల్ల క్షేత్రస్థాయిలో ఏఐ కోర్సులు చదివే మహిళల సంఖ్య బాగా పెరిగింది. టెక్నాలజీలో మహిళలకు సంబంధించిన ట్రెండ్‌లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) కోర్సులు కీలకంగా మారాయి.

ఏఐ... 2025 ఉమెన్ రైజింగ్

మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులలో మహిళల పెరుగుదల నాలుగు రెట్లు పెరిగింది. ఈ సంవత్సరం ప్రారంభమైన జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌డబ్ల్యూసీ) యశోద ఏఐ అభియాన్‌లాంటి ప్రభుత్వ కార్యక్రమాలు, ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్, రైజింగ్ 2025 సమ్మిట్‌లాంటి సదస్సుల ప్రభావం వల్ల ఏఐ కోర్సులు చేసే మహిళల సంఖ్య పెరుగుతోంది. మరోవైపు మహిళల నేతృత్వంలోని ఏఐ స్టార్టప్‌ల సంఖ్య పెరగడం శుభసూచకం.

డీప్-టెక్ డొమైన్‌లలో...

2024తో పోల్చితే 2025లో ఏఐ/ఎంఎల్ మాస్టర్ ప్రోగ్రామ్స్‌లో మహిళల సంఖ్య 20 శాతం పెరిగింది. 'ఏఐ, ఎంఎల్‌లలో మాస్టర్స్ చదువుతున్న ప్రతి ఐదుగురు విద్యార్థులలో ఒకరు మహిళ. సంవత్సరం క్రితం వరకు ఇరవైమందిలో ఒకరు ఉండేవారు' అని తెలియజేసింది యూజీసీకి సంబంధించిన 'కాలేజి విద్య' ప్లాట్‌ఫామ్ రిపోర్ట్.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్, డాటా సైన్స్‌లాంటి డీప్-టెక్ డొమైన్‌లలో మహిళల ప్రాతినిధ్యం పెరిగిందని రిపోర్ట్ తెలియజేసింది. ఈ సంవత్సరం ఏఐ ప్రోగ్రామ్‌లకు సంబంధించి మహిళల ఆసక్తి గణనీయంగా పెరిగిందని, ఎంసిఏ సైబర్ సెక్యూరిటీ ఎన్‌రోల్‌మెంట్స్‌లో మహిళలు 25 శాతం, జనరేటివ్ ఏఐలో డాక్టోరల్ క్యాండిడేట్స్ 15 శాతం మంది ఉన్నారని నివేదిక వెల్లడించింది.

మార్పు మంచిదే కదా!

'మనలో వచ్చిన మార్పుకు ఈ అభివృద్ధి రేటు అద్దం పడుతుంది. ఫ్లెక్సిబుల్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, ఇండస్ట్రీ రోల్ మోడల్స్ విజయగాథలు తెలుసుకునే అవకాశం ఈ పెరుగుదలకు కారణం. భారతదేశ సాంకేతిక భవిష్యత్తుకు సంబంధించి మహిళలు కీలకపాత్ర పోషించబోతున్నారని ఈ మార్పును చెబుతుంది' అంటున్నారు 'కాలేజి విద్య' చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రోహిత్ గుప్తా.

పెద్ద పెద్ద నగరాలలో మాత్రమే కాదు ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి పట్టణాలలో కూడా మహిళలు ఏఐ కోర్సులపై అమిత ఆసక్తి చూపిస్తున్నారు. సైబర్ భద్రతా నైపుణ్యాలపై మహిళలు దృష్టి సారించేలా యశోద ఏఐ అభియాన్ కార్యక్రమాలు చేపట్టింది.

స్టాన్‌ఫోర్డ్ ఏఐ ఇండెక్స్ 2025

స్టాన్‌ఫోర్డ్ ఏఐ ఇండెక్స్ 2025 ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక ఏఐ నైపుణ్యం కలిగిన వారిలో భారతీయ మహిళలు ఉన్నారు.'ఎనాలటిక్స్' ఇండియా మ్యాగజైన్ సమ్మిట్ ఏఐలో మహిళల భాగస్వామ్యంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. మొత్తంమీద, ఏఐకి సంబంధించి 2025 సంవత్సరం మహిళలకు కీలకమైన సంవత్సరం నిలుస్తుంది.

ఎన్ని స్టార్టప్‌లో!

ఈ సంవత్సరం మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌ల సంఖ్యలో పెరుగుదల కనిపించింది. ట్రాక్షన్ డేటా ప్రకారం...అక్టోబర్ 2025 నాటికి దేశవ్యాప్తంగా మహిళల నేతృత్వంలో 7,000 కంటే ఎక్కువ స్టార్టప్‌లు పని చేస్తున్నాయి. ఫండింగ్‌కు సంబంధించి వీటికి మంచి స్పందన వచ్చింది. మహిళల నేతృత్వంలోని ఏఐ వెంచర్‌లలో కొన్ని..

డా.గీతా మంజునాథ్-నిరామయి హెల్త్ ఎనాలిటిక్స్, అశ్వినీ అశోకన్-మ్యాడ్ స్ట్రీట్ డెన్, చంద్రాలిక హజారిక-బిగ్ థింక్స్, ప్రాంజలీ అవస్థీ-డెల్వ్.ఏఐ, కృష్ణప్రియ ఆకెళ్ల-స్టార్‌బజ్.ఏఐ, నిధి-నెమా ఏఐ, రిత్వికా చౌదురి-అన్‌స్క్రిప్ట్.ఏఐ, లైనా ఇమ్మాన్యుయేల్, రింజిమ్ అగర్వాల్-బ్రెయిన్‌సైట్.ఏఐ.

యశోద ఏఐ అంటే?

డిజిటల్ రంగంలో లింగ అంతరాన్ని తగ్గించడానికి ఈ సంవత్సరం మే 22న యశోద ఏఐ అభియాన్ ముందుకు వచ్చింది.

యువర్ ఏఐ సాక్షి ఫర్ షేపింగ్ హారిజన్స్ విత్ డిజిటల్ అవేర్‌నెస్‌కు సంక్షిప్తరూపం... యశోద ఏఐ.

ఎన్‌సీడబ్ల్యూ, ఫ్యూచర్ షిఫ్ట్ ల్యాబ్స్ (ఎఫ్‌ఎస్‌ఎల్) సహకారంతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రచార కార్యక్రమం బరేలీలోని మహాత్మా జ్యోతిబా పూలే రోహిల్‌ఖండ్ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైంది. 'భారతదేశం అంతటా ఒక కోటిమంది మహిళలకు డిజిటల్ నైపుణ్యం' అనే దీర్ఘకాలిక లక్ష్యంతో ప్రయాణం మొదలుపెట్టింది యశోద ఏఐ అభియాన్. మొదటి దశలో రెండు లక్షల మందికి పైగా మహిళలకు శిక్షణ ఇవ్వడాన్ని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

మొబైల్ యాప్, శిక్షణ కార్యక్రమాల ద్వారా మహిళలకు ఏఐ సాధనాలు, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ అక్షరాస్యతలో ఆచరణాత్మక జ్ఞానాన్ని అందిస్తోంది. ఏఐ సాంకేతికతను సులభతరం చేయడానికి స్థానిక భాషలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

మహిళలకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ ఎందుకు కీలకం?

హ్యాకింగ్, ఆన్‌లైన్ వేధింపులలాంటి సైబర్ నేరాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి, ఏఐ రంగంలో అద్భుతమైన ఉద్యోగాలు సాధించడానికి, సాధికారతకు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను సురక్షితంగా నావిగేట్ చేయడానికి, కొత్త అవకాశాలను అన్వేషించడానికి, లింగ వివక్ష లేకుండా ఉండడానికి మహిళలకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ ముఖ్యం అని యూఎన్ నివేదిక తెలియచేసింది. కాలేజీ స్టూడెంట్. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ (ఎస్‌హెచ్‌జీ), ఆశావర్కర్, టీచర్, పంచాయతీ వార్డు మెంబర్ ఇలా ఎవరైనా కావచ్చు... యశోద ఏఐ అభియాన్‌లో చేరవచ్చు.

'ఇది కేవలం శిక్షణా కార్యక్రమం మాత్రమే కాదు. ఏఐ, సైబర్ సెక్యూరిటీకి సంబంధించి మహిళా సాధికారతను ఉన్నతస్థాయిలో తీసుకువెళ్లే ఉద్యమం' అనే ప్రశంసలు అందుకుంటోంది యశోద ఏఐ అభియాన్.

ఏఐ బై హర్...గ్లోబల్ ఇంపాక్ట్ చాలెంజ్

గ్లోబ్ ఇంపాక్ట్ ఛాలెంజెస్...'ఏఐ బై హర్' 'ఏఐ ఫర్ ఆల్' 'యువ్ ఏఐ'ల కోసం భారత ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కి సంబంధించి నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి మహిళా సాంకేతిక నిపుణులను ఆహ్వానిస్తుంది. మహిళల నేతృత్వంలో ఏఐ ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడానికి, వ్యవసాయం. సైబర్‌సెక్యూరిటీ, విద్య, డిజిటల్ వెల్‌బీయింగ్, ఆరోగ్యసంరక్షణ, ఎనర్జీ అండ్ క్లైమేట్ రంగాలలో, ఏఐకి సంబంధించి నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, నీతి అయోగ్, ఇతర సంస్థల భాగస్వామ్యంతో గ్లోబల్ ఇంపాక్ట్ చాలెంజ్ 'ఏఐ బై హర్'కు శ్రీకారం చుట్టారు. 'ఏఐ-ఫర్-గుడ్ అప్లికేషన్స్' లక్ష్యంతో ఫిబ్రవరి 2026లో న్యూ ఢిల్లీలో ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సదస్సు జరగనుంది.

Rewind 2025

'కొత్త వ్యక్తులతో కలిసి పని చేయడం, మనల్ని మనం కొత్తగా పరిచయం చేసుకోవడం ఎప్పుడూ ఉత్సాహాన్ని ఇస్తుంది. ఒక మహిళగా నన్ను ఒక మూసలోనే ఉండమని చెప్పడానికి ఎవరికేం హక్కుంది? మీకు ఇబ్బందిగా ఉంటే దూరంగా ఉండండి..' అని ఘాటుగా చెబుతూనే ఈ యేడాది తన జీవితంలో చోటు చేసుకున్న మార్పులు, హెల్తీగా, ఫిట్‌గా ఉండటానికి చేసిన ప్రయత్నాలు, రాబోయే కొత్త సంవత్సరంలో చేసుకోదగిన ప్లాన్స్ గురించి సింగర్ శ్రావణ భార్గవి 'సాక్షి'తో పంచుకున్నారు.

లైఫ్ ఎప్పుడూ కొత్త ట్యూన్‌లోనే

* శ్రావణ భార్గవి

కొలంబియన్ యాసలో హిప్ హాప్ రాక్ మ్యూజిక్‌తో సింగర్ శ్రావణ భార్గవి తనను తాను కొత్తగా ఆవిష్కరించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ''కొలంబియన్ యాసలో ఉన్న ఒక పూర్తి ఆంగ్ల హిప్ హాప్ ర్యాప్ ట్రాక్‌ని సోషల్‌మీడియా ద్వారా తీసుకురావడానికి చాలా ఉత్సాహంగా పనిచేశాను. రంగారెడ్డి జిల్లా చేవెళ్లకు దగ్గరగా ఉన్న ఊరిలో ఈ పాటను రెండు రోజుల పాటు షూట్ చేశాం. పాట మొత్తం ఇంగ్లిష్‌లో ఉంటుంది కాబట్టి బ్యాక్ డ్రాప్‌లో మన సంస్కృతి ఉండాలనుకున్నాం.

భయాన్ని వదిలేయాల్సిందే!

ఈ సాంగ్ థీమ్‌లో టాక్సిక్ ఫెమినిజం గురించి ఉంటుంది. ఇదో తరహా విషపూరిత సంస్కృతి. అంటే, ఆడవాళ్లు తోటి ఆడవారి గురించి నెగిటివ్‌గా మాట్లాడటం. దీనిని వ్యంగ్య ధోరణిలో పాట ద్వారా చూపాను. ఉదాహరణకు.. ఒక లైంగిక దోపిడికి గురైన బాధితురాలు ఉంటే సానుభూతి చూపించకుండా ఆ అమ్మాయి గురించే తొందరపడి ఏదో ఒక మాట అనేస్తారు. ఇటీవల అమ్మాయిల డ్రెస్సింగ్ గురించి మాట్లాడేవాళ్లను ఎక్కువగా చూస్తున్నాం. ఆడవాళ్లు డ్రెస్సింగ్ మార్చుకోవాలి సరే.. ముందు మగవాళ్లు తమ సెన్స్ మార్చుకోవాలి కదా! .. ఇలాంటి ఒక కాన్సెప్ట్‌లో రాసిన పాట ఇది. ఎవరైనా ఒక మహిళ ఇండిపెండెంట్‌గా ఎదగడానికి ప్రయత్నం చేస్తుంటే ఆమె కుటుంబ జీవితం, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడేవారు అధికంగా ఉంటుంటారు. నా విషయంలోనూ అలాగే జరుగుతుంటుంది. 'వాళ్ల మాటలు వాళ్లను మాట్లాడుకోనిద్దాం. నేను ఎందుకు వాటిని పట్టించుకోవాలి' అనే ఆలోచనకు వచ్చాను. దీనివల్ల మరింత బాగా వర్క్ చేయగలుగుతున్నాను.

నేను అనుకున్న థీమ్‌లో పాట రాయడం, కంపోజ్ చేయడం, పాడటం నా మెయిన్ వర్క్ అయితే నాతో పాటు కొత్త గ్రూప్ కలిశారు. దీంతో మరింత ఉత్సాహంగా పనిచేశాను. మన ఎదుగుదలకు దోహదం చేసే స్నేహితులను పెంచుకోవడం చాలా అవసరం. అది నేను ఈ యేడాది నేర్చుకున్నాను. అంతేకాదు, ఈ పాట ద్వారా నాలో ఉన్న అన్ని భయాలు పోయాయి. నా మ్యూజిక్, వర్క్ ద్వారా ఈ యేడాది ఒక కొత్త లోకాన్ని పరిచయం చేసుకున్నాను.

వారి నుంచి అది నేర్చుకున్నాను

సోషల్ మీడియాను సరిగ్గా వినియోగించుకుంటే మనకు చాలా హెల్ప్ అవుతుంది. లేదంటే అదే మనకు థ్రెట్ అవుతుంది. ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకున్నాను. ఆఫ్‌లైన్‌లో ఎలా హద్దుల్లో ఉంటామో ఆన్‌లైన్‌లో కూడా అలాగే ఉండాలి. నేటి యువత ముఖ్యంగా జెన్‌జి గురించి మనం ఏదో అనుకొని ఆందోళన చెందుతుంటాం. కానీ, వాళ్లు చాలా క్లియర్‌గా ఉంటున్నారు. 'నాకు నచ్చింది చేస్తున్నాను' అనే క్లారిటీ వారికి ఉంది. 'నో అంటే నో' అనే చెబుతున్నారు. ఇది వారి నుంచి నేర్చుకున్నాను. ఇన్నాళ్లూ ఇలాంటి ఆలోచనను మిస్ అయ్యానే అనిపించింది.

బలంగా ఎదగాలని...

నా కూతురు పెద్దయ్యాక నన్ను చూసి గర్వంగా ఫీలయ్యేలా నా ఎదుగుదల ఉండాలని కోరుకుంటున్నాను. అమ్మాయిల్లో స్ట్రాంగ్ పర్సనాలిటీని పెంచడం అనేది చాలా ముఖ్యం. అది చెబితే రాదు. నన్ను చూసే నా కూతురు నేర్చుకుంటుంది కాబట్టి, నేను స్ట్రాంగ్‌గా ఉండాలనుకుంటాను. మేమిద్దరమే సినిమాలకు వెళతాం, ఇద్దరం ఒకేసారి బుక్స్ చదువుకుంటాం, పాటలు పాడుతుంటాం. ఒక నెల రోజులపాటు ఇద్దరం కలిసి యూరప్ దేశాలు తిరిగి వచ్చాం. మా ఇద్దరి ఆసక్తులు ఒకేలా అనిపిస్తాయి. మా అమ్మ నాన్నలు కూడా 'నచ్చిన పని చేయ్' అని ప్రోత్సాహాన్నిస్తారు. అదే పెద్ద బలం. అలాగే, అమ్మానాన్నలు మనల్ని చూసి ధైర్యం తెచ్చుకునేలా అమ్మాయిలు స్ట్రాంగ్‌గా ఎదగాలి.

ఈ ఏడాది చాలా హెల్దీగా...

నాకు నచ్చిన డ్రెస్సులతో రెడీ అవడం చాలా ఇష్టం. అలా ఉండటంలో నేను సంతోషంగా, కాన్ఫిడెంట్‌గా, మరింత క్రియేటివ్‌గా ఉంటాను. ఎవరో మాట్లాడుకుంటారు అని నాకు అసౌకర్యంగా ఉన్న డ్రెస్సులో ఉండలేను. ఫిట్‌గా ఉండటానికి వారంలో నాలుగు రోజులైనా జిమ్‌కు వెళతాను. స్ట్రెంత్ ట్రెయినింగ్ వర్కౌట్స్ చేస్తాను. పోషకాహారం పట్ల జాగ్రత్త తీసుకుంటాను. దీనివల్ల కిందటేడాదితో పోల్చితే ఈ యేడాది చాలా హెల్దీగా ఉన్నాను. ఆర్థిక విషయాల్లో నేనెప్పుడూ జాగ్రత్తగా ఉంటాను. అమ్మాయిలు డబ్బు సంపాదించడంలోనే కాదు పొదుపు చేయడంలోనూ శ్రద్ధ తీసుకోవాలి. అలాగని, డబ్బు వెంట కాకుండా నచ్చిన పని చేయడంలో ముందుండాలన్నది నా ఒపీనియన్. రాబోయే కొత్త సంవత్సరంలో మరింత క్రియేటివ్‌గా, మరింత ఉత్సాహంగా వర్క్ చేయడానికి రెడీగా ఉన్నాను'' అని నవ్వుతూ వివరించారు ఈ న్యూ హిప్ హాప్ ర్యాపర్.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఫొటో: గడిగె బాలస్వామి

2025 ఫ్యాషన్

కలర్‌లెస్ కాన్సెప్ట్

ఈ యేడాది ఫ్యాషన్‌లో టాప్‌లో ఉన్న కలర్స్ అన్నీ పేస్టల్స్. వెడ్డింగ్ డ్రెస్‌లోనూ ఈ కలర్స్ చాలా కనిపించాయి. వేడుకలలోనూ ఇవి ట్రెండ్‌లో ఉన్నాయి. వధూవరుల డ్రెస్సింగ్‌లోనూ వేడుకలకు వచ్చే అతిథులు కూడా ఈ కలర్‌లెస్ కాన్సెప్ట్ బాగా కోరుకున్నారు. లైట్ షేడ్స్‌లో పింక్, గ్రీన్, రెడ్.. ఏదైనా లేత రంగులదే ఎంపిక.

వేడుకలలో కలర్‌ఫుల్‌గా కనిపించాలనే తాపత్రయం చాలా మందికి ఉంటుంది. అందుకు మంచి బ్రైట్ కలర్స్‌ను ఎంచుకుంటారు అనుకుంటే పొరపాటే. ఈ యేడాది అంతా లేత రంగుల కాంబినేషన్‌లో వధూవరుల ఇద్దరి డ్రెస్సింగ్ కలర్‌లెస్‌గానే కనువిందు చేసింది. రాబోయే ఏడాది పాలమీగడ తెలుపుతో పాటు కలర్‌ఫుల్‌గానూ మారనుంది అంటున్నారు ఫ్యాషన్ డిజైనర్లు.

వెస్ట్రన్ వేర్‌లోనూ లేత రంగులే!

మన సంప్రదాయ వేడుకలలోనే కాదు సౌండ్ డౌన్, బ్యాచులర్స్, మెహిందీ .. వంటి పార్టీలలో ఇండో-వెస్ట్రన్స్ డ్రెస్సింగ్స్ కూడా లైట్ షేడ్స్ వేర్ ట్రెండ్ బాగా కనిపించింది. మగవారు కూడా లైట్ పింక్, లైట్ గ్రీన్, లైట్ ఎల్లో.. ఇలాంటివి ఎంచుకున్నారు.

రాబోయే యేడాది పాల మీగడ తెలుపు

వెండికొండల్లా వెలిగిపోయేలా, మబ్బులలో తేలిపోయినట్టుగా ఉండే తెలుపు రంగుతో 2026కు ఆహ్వానం పలుకుతున్నారు. పాంటోన్ క్లౌడ్ డాన్సర్ వైట్ పేరుతో కలర్ ఆఫ్ ది ఇయర్‌గా ప్రకటించింది. దీంతో ప్రశాంతత, ఆహ్లాదాన్ని ఇచ్చే పాలమీగడ రంగు బాగా ట్రెండ్ కానుంది. దీనికి ముదురు బంగారు రంగులు జతగా కలుస్తాయి. వివాహ వేడుకలైనా, వెస్ట్రన్ పార్టీ వేర్ అయినా తెలుపుతో మరింత వైబ్రెంట్‌గా మారనుంది.

బ్రైట్ కలర్స్

మరీ తెలుపు కాకుండా పూర్తి కాంట్రాస్ట్‌గా వేడుకలలో పాల్గొనే వారు కాంతిమంతమైన రంగులను ఎంచుకోవచ్చు. లైట్ కలర్స్ బోర్ అయిపోయాయని అనుకునేవారు బ్రైట్ కలర్స్‌లోనే క్లాసీ లుక్‌ను ఎంచుకోబోతున్నారు.

తరుణి, ఫ్యాషన్ డిజైనర్

● ముగ్గు ముచ్చట

పద్మ పుల్లమరాజు
సీతారాంబాగ్
హైదరాబాద్

20 చుక్కలు, 20 వరసలు

19 చుక్కలు
5 వరుసలు
అటు ఇటు వదిలి
5 వరకు

ప్రణవి ఉప్పులూరి
కాకినాడ

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) డిసెంబర్ 25న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,41,000	1,41,080	1,39,250	1,41,200	1,40,450	1,39,850
బంగారం (22 క్యారెట్లు)	1,21,000	1,27,350	1,27,650	1,31,480	1,29,210	1,28,200
వెండి	2,27,000	2,26,600	2,45,000	2,26,000	2,26,000	2,45,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

యువర్స్

● డిజిటల్ ట్రెండ్ 2025

డ్రోన్ స్టైల్ వీడియో

డ్రోన్-స్టైల్ వీడియోలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో పోస్ట్ చేయడం అనేది ఇప్పుడు ట్రెండ్‌గా మారింది. మరి మీరు కూడా ఈ ట్రెండ్ ఫాలో కావాలనుకుంటున్నారా?

మీరు ఒకే అంటే ఇలా...

● గూగుల్ జెమిని ఓపెన్ చేయాలి ● సెలెక్ట్ చేసుకున్న ఫొటోను అప్‌లోడ్ చేయాలి ● పొడి పొడిగా కాకుండా ప్రాంప్ట్ అనేది స్పష్టంగా, వివరంగా, సాధారణ భాషలో ఉండాలి ● మన ప్రాంప్ట్‌ను అర్థం చేసుకొని షార్ట్ వీడియోను క్రియేట్ చేస్తుంది జెమిని● ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో పోస్ట్ చేయవచ్చు. 'రీల్'గా అప్‌లోడ్ చేయవచ్చు. ట్రెండింగ్ మ్యూజిక్, కాప్షన్స్, హ్యాష్‌ట్యాగ్ ఉపయోగించవచ్చు.

డ్రోన్ షాట్స్ శాంపిల్ ప్రాంప్ట్స్:

● 'క్రియేట్ ఏ 360 డిగ్రీ డ్రోన్ షాట్ వీడియో' ● క్రియేట్ ఏ 360 –డిగ్రీ డ్రోన్ షాట్' ● 'జనరేట్ ఏ రియలిస్టిక్ ఏరియల్ డ్రోన్ వీడియో'

ఈ సంవత్సరం ఇలా ఉన్నారు... అన్నారు

చాలా స్పీడ్‌గా తమ కెరీర్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలనుకోవడం కంటే, వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై మన జెన్-జడ్ యువతరం అధికంగా దృష్టి సారిస్తోంది. 'జాబ్ లెర్నింగ్' అనేది 'కెరీర్ గ్రోత్'కు ఉపయోగపడుతుంది అని మన దేశ జెన్-జడ్‌లో 94 శాతం మంది చెబుతున్నారు.

లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు, సబ్‌స్క్రిప్షన్‌లకు యాక్సెస్ ద్వారా తమ వృత్తినైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటున్నట్లు చెబుతున్నారు.

జెన్ ఏఐ

మన దేశంలో 85 శాతం జెన్-జడ్‌లు, 85 శాతం మిలీనియల్స్ తమ రోజువారి పనిలో 'జెన్ ఏఐ'ని ఉపయోగిస్తున్నారు. జెన్-జడ్‌లు ఎక్కువగా డిజైన్, కంటెంట్ క్రియేషన్, డేటా విశ్లేషణ, ప్రాజెక్ట్ మెనేజ్‌మెంట్ కోసం జెన్ ఏఐని ఉపయోగిస్తున్నారు. తమ వృత్తినైపుణ్యాన్ని పెంచుకోవడానికి 'జెన్ ఏఐ' ఉపయోగపడిందని చెబుతున్నారు.

ఆర్థిక అభద్రత

ఆర్థిక భద్రత లేని పనిని అర్థవంతమైన పనిగా భావించే అవకాశం తక్కువగా ఉంటుందని, ఆర్థికభద్రత లేకుండా మానసిక ప్రశాంతత సాధ్యం కాదని జెన్-జడ్‌లు, మిలీనియల్స్ చెబుతున్నారు.

గత సంవత్సరం నుంచి యువతరంలో ఆర్థిక అభద్రత(ఫైనాన్షియల్ ఇన్‌సెక్యూరిటీ) పెరుగుతోంది. జెన్-జడ్‌లో 28 శాతం మంది, మిలీనియల్స్‌లో 31 శాతం మంది తాము ఆర్థికంగా సురక్షితంగా లేమని చెబుతున్నారు.

పాజిటివ్ వెల్‌బీయింగ్

పాజిటివ్ వెల్‌బీయింగ్ పనిలో ఉత్సాహాన్ని పెంచుతుంది. సమాజానికి ఉపయోగపడే ఉద్యోగం చేస్తున్నామని జెన్-జడ్‌లో 52 శాతం మంది, మిలీనియల్స్‌లో 60 శాతం మంది అభిప్రాయపడుతున్నారు.

ఇక 'పూర్ మెంటల్ వెల్-బీయింగ్' విభాగంలో జెన్-జడ్‌లు 32 శాతం, మిలీనియల్స్ 33 శాతం ఉన్నారు.

మరి కొన్ని...

● టైమ్ మేనేజ్‌మెంట్ అనేది కెరీర్‌లో ముందుకు సాగడానికి ఉపయోగపడుతుందని జెన్-జడ్, మిలీనియల్ ఇండియన్‌లు విశ్వసిస్తున్నారు
● ఉన్నత విద్యను అభ్యసించకపోవడానికి ఆర్థిక పరిమితులు ప్రధాన కారణం అంటున్నారు.
● జెన్-జడ్‌లో 32 శాతం, మిలీనియల్స్‌లో 44 శాతం తాము ఇప్పటికే 'జెన్ ఏఐ' ట్రెనింగ్ పూర్తి చేశామని చెబుతున్నారు. జెన్-జడ్‌లో 51 శాతం, మిలీనియల్స్‌లో 43 శాతం రాబోయే పన్నెండు నెలల కాలంలో 'జెన్ ఏఐ' శిక్షణ పూర్తిచేస్తామని చెబుతున్నారు.

● న్యూ చాప్టర్ 2025

ఇలా జరగడం ఇదే మొదటి సారి!

ఈ సంవత్సరం మొదటి అర్ధభాగంలో పర్సనల్ లోన్స్‌కు సంబంధించి ఒక కొత్త అధ్యాయం మొదలైంది. ఈ ఏడాది ఫస్ట్ హాఫ్‌లో పర్సనల్ లోన్స్ తీసుకున్న యువతరంలో 27 శాతం రుణాలు 'ట్రావెల్' కోసం తీసుకోబడ్డాయి. ఈ పరిణామం దేశ ఆర్థిక చరిత్రలో ఇదే మొదటిసారి.

'భారతదేశ చరిత్రలో మొదటిసారిగా కనిపించిన భారీ మార్పు ఇది. యువతరం పర్సనల్ లోన్స్ తీసుకోవడానికి ప్రధాన కారణం...వైద్య అత్యవసర పరిస్థితి, ఇంటి పునరుద్ధరణ, ఇల్లు కొనడం...మొదలైనవి కాదు. ఒకే ఒక కారణం...ప్రయాణం' అని చెప్పారు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్, రచయిత సార్థక్ అహుజ.

ఈ మార్పుకు కారణం ఏమిటి?

'ఇండ్ల ధరలు ఆకాశాన్ని అంటడంతో సొంత ఇల్లు అనే కల యువతరంలో చాలామందికి కలగానే మిగిలిపోతోంది. దీనికి ప్రత్యామ్నాయంగా తక్షణం సంతృప్తిని ఇచ్చే విషయాలకు యువతరం ప్రాధాన్యత ఇస్తోంది. ట్రావెల్, లగ్జరీ వస్తువులు కొనుగోలు...మొదలైనవి అందులో ఉన్నాయి'

ఫిన్‌టెక్ ఇన్నోవేషన్‌తో అప్పుల కోసం పడే ఇబ్బందులు యువతరానికి తగ్గాయి.

జీరో-కాస్ట్ ఇఎంఐలు, బై నౌ పే ల్యాటర్ (బీఎన్‌పీఎల్) స్కీమ్‌లు యువతరానికి స్పీడ్‌గా చేరువవుతున్నాయి.

వాళ్ళు అలా... మనం ఇలా...

చైనా యువతరం విషయానికి వస్తే...కోవిడ్ తరువాత 'రివెంజ్ స్పెండింగ్' నుంచి 'రివెంజ్ సేవింగ్'కు మళ్లింది. ఎంతో కొంత అయినా సరే బంగారం మదుపు చేయడంపై మోజు పెరిగింది. బంగారాన్ని మదుపు చేయడం అనేది సరికొత్త స్టేటస్ సింబల్‌గా మారింది.

'రేపు నేను సంపాదిస్తాను కాబట్టి ఈరోజు అప్పు చేయాలని మన యువతరం ఆలోచిస్తుంది. రేపు నా ఉద్యోగం ఉండకపోవచ్చు కాబట్టి ఈరోజే పొదుపు చేస్తాను అని చైనీస్ యువతరం అనుకుంటుంది' అంటున్నారు అహుజ.

ఫ్యాషన్ ఫార్వర్డ్ యూత్ 2025

● టైమ్‌లెస్ ఇండియన్ గార్మెంట్‌గా పేరున్న చీరకు యువతరం కొత్త లుక్ ఇస్తోంది. ప్రీ-డ్రేప్డ్ శారీస్, డెనిమ్-ఇన్‌ఫ్యూజ్‌డ్ ఫ్యాబ్రిక్స్, బాంబర్ జాకెట్‌లతో జత చేసే చీరలు... మొదలైనవి యువతరం ఫ్యాషన్‌లో కొన్ని. సంప్రదాయం, సమకాలీన నైపుణ్యాలను మిశ్రమం చేసిన ట్రెండ్ ఇది.

● సంప్రదాయ దుస్తులతో జత చేసిన కోర్సెట్‌లు ఆకట్టుకుంటున్నాయి. కుర్తాలతో జత చేసిన డెనిమ్ కోర్సెట్ నుండి షరారాలపై ధరించే ఎంబ్రాయిడరీ డిజైన్‌ల వరకు...ఈ ట్రెండ్ మోడ్రన్ ఇండియన్ ఫ్యాషన్ క్రియేటివిటీకి అద్దం పడుతుంది.

● 'హ్యాండ్లూమ్ ఫ్యాబ్రిక్స్ ఇన్ మోడ్రన్ సిల్హౌటీ' ట్రెండ్ మొదలైంది. ఖాదీ, ఇకత్, లినెన్‌లాంటి చేనేత వస్త్రాలను జంప్‌సూట్‌లు, వోవర్‌సైజ్‌డ్ కోట్స్, కో-ఆర్డర్ సెట్స్‌గా రూపొందించే ధోరణి పెరిగింది. ఈ ట్రెండ్ స్థానిక కళాకారులకు వృత్తిపరంగా సహాయపడుతోంది. ఎకో-ఫ్రెండ్లీ ఛాయిసెస్‌గా యువతరానికి అవకాశం కల్పిస్తోంది

● సంప్రదాయ జెండర్ రూల్స్‌ను బ్రేక్ చేస్తూ న్యూట్రల్-కలర్డ్ కుర్తాలు, పఠానీ సూట్స్, యునీసెక్స్ ధోతీలు యువతరంలో ప్రాచుర్యం పొందుతున్నాయి. సెల్ఫ్-ఎక్స్‌ప్రెషన్స్‌కు అవకాశం ఇస్తున్నాయి.

● వికాసం: 2025

మ్యూజిక్ ఇంజినీరింగ్

విద్యలు వేటికవి విడి విడి ద్వీపాలు కావు. అంతర్గతంగా ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయి. దీనికి తాజా ఉదాహరణ...ఇంజినీరింగ్ స్టూడెంట్స్ మ్యూజిక్‌పై ఆసక్తి ప్రదర్శించడం. మ్యూజిక్ స్టూడెంట్స్ ఇంజినీరింగ్‌పై ఆసక్తి చూపడం. సంగీత నేపథ్యం ఉన్న విద్యార్థులు ఇంజినీరింగ్ వైపు మొగ్గు చూపుతున్నారని ఐఐటీ, మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి అన్నారు. మ్యూజిక్ ఎడ్యుకేషన్ ప్రాముఖ్యతను ఆయన ప్రస్తావించారు. ఐఐటీ, మద్రాస్‌లో 'ఇళయరాజా సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ మ్యూజిక్' ఏర్పాటు చేయడం ద్వారా కళలతో, ఇంజినీరింగ్ విద్యను అనుసంధానించే పనికి శ్రీకారం చుట్టారు.

సాక్షి సినిమా

● 2025 రౌండప్

హిట్ స్టెప్

ఫస్ట్ స్టెప్ హిట్ స్టెప్ అయితే ఆ ఆనందమే వేరు. 2025లో అలా తొలి అడుగులోనే విజయం సాధించిన దర్శకులు అరడజనుకు పైనే ఉన్నారు. హారర్, కామెడీ, థ్రిల్, ఫ్యామిలీ, లవ్.. ఇలా ఒక్కో దర్శకుడు ఒక్కో జానర్‌ని ఎంచుకుని, హిట్ అయ్యారు. 2025లో 'హిట్ డైరెక్షన్'లో కెరీర్ ఆరంభించిన ఆ దర్శకుల గురించి తెలుసుకుందాం.

● రామ్ జగదీష్

● మన చట్టాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, లేకపోతే ఆ చట్టాలను ఆయుధాలుగా చేసుకుని బలహీనులను కొందరు బలవంతులు ఏ విధంగా ఇబ్బంది పెడతారనే అంశంతో రూపొందిన చిత్రం 'కోర్ట్'. పోక్సో చట్టం నేపథ్యంలో దర్శకుడు రామ్ జగదీష్ తెరకెక్కించిన ఈ చిత్రం సూపర్ హిట్ అయింది. ఈ చిత్రం ద్వారా పరిచయమైన హీరో, హీరోయిన్ హర్ష్ రోషన్, శ్రీదేవికి కూడా మంచి గుర్తింపు వచ్చింది. లాయర్‌గా ప్రియదర్శి మంచి మార్కులు కొట్టేశారు. హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం మార్చి 14న విడుదలైంది.

● సాయి మార్తాండ్

● యూత్‌ఫుల్ మూవీస్ ఆడియన్స్‌కు నచ్చాయంటే, కలెక్షన్స్‌కు కొదవే ఉండదు. అందుకు తాజా ఉదాహరణ 'లిటిల్ హార్ట్స్'. ఈ రొమాంటిక్ కామెడీ మూవీతో దర్శకుడు సాయి మార్తాండ్ బ్లాక్‌బస్టర్ హిట్ సాధించారు. చదువు పెద్దగా అబ్బని ఓ అబ్బాయి, అమ్మాయి లాంగ్‌టర్మ్ కోచింగ్‌లో చేరి, ప్రేమలో పడితే ఏం జరుగుతుంది? అన్న పాయింట్‌తో 'లిటిల్ హార్ట్స్' సినిమా తీశారు సాయి మార్తాండ్. ఈ చిత్రంలో మౌళి తనుజ్ హీరోగా, శివానీ నాగారం హీరోయిన్‌గా నటించారు. '90స్' బయోపిక్ వెబ్‌సిరీస్‌తో ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ సినిమాకు ఓ నిర్మాత. సెప్టెంబరు 5న ఈ చిత్రం విడుదలైంది.

● నీరజ కోన

● కాస్ట్యూమ్ డిజైనర్‌గా, స్టైలిస్ట్‌గా నీరజ కోన పాపులర్ అని తెలిసిందే. ఆమె దర్శకురాలిగా పరిచయం అయిన చిత్రం 'తెలుసు కదా'. ఈ చిత్రంలో సరోగసీ అనే సెన్సిబుల్ పాయింట్‌ను, ముగ్గురు వ్యక్తుల మధ్య నడిచే ట్రయాంగిల్ లవ్‌స్టోరీని, వారి మానసిక సంఘర్షణను వెండితెరపై బాగా చూపించారు నీరజ. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా, రాశీ ఖన్నా, శ్రీ నిధిశెట్టి హీరోయిన్లుగా టీజీ విశ్వప్రసాద్, కృతీప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 17న విడుదలైంది. మహిళా దర్శకుల సంఖ్య తక్కువ ఉన్న నేపథ్యంలో నీరజ కోన పరిచయమై, హిట్ సాధించడం హర్షించదగ్గ విషయం.

● జైన్స్ నాని

● పెద్ద వ్యాపారవేత్త అయిన కృష్ణకి (సాయికుమార్) అల్లర చిల్లరగా తిరిగే మాస్ కొడుకు కుమార్ అబ్బవరం (కిరణ్ అబ్బవరం) ఎంసెట్‌లో ర్యాంక్ సాధించకపోగా, అల్లరి చిల్లరగా ప్రవర్తిస్తుంటాడు. డొనేషన్ చెల్లించి మరీ కేరళలోని ఓ కాలేజ్‌లో మెడిసిన్ చదివించేందుకు కొడుకుని చేర్పిస్తాడు తండ్రి. అక్కడ కుమార్, మెర్సీ జాన్ (యుక్తి తరేజా) ప్రేమలో పడతారు. పెద్దలు వీరి పెళ్లికి పచ్చజెండా ఊపుతారు. అదే సమయంలో మెర్సీకి ఉన్న పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీఎస్‌టీడీ) వ్యాధి గురించి కుమార్‌కి తెలుస్తుంది. ఆ వ్యాధి పరిష్కారం కోసం కుమార్ ఏం చేశాడు? అనే అంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు జైన్స్ నాని. రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ మూవీ అక్టోబరు 18న విడుదలైంది. ఈ కథను నేర్పుగా డీల్ చేసి, ప్రేక్షకులతో చేత శెభాష్ అనిపించుకున్నారు జైన్స్ నాని.

● సాయిలు కంపాటి

● 2004లో తెలంగాణలో జరిగిన ఓ వాస్తవ ఘటన నేపథ్యంలో దర్శకుడు సాయిలు కంపాటి తెరకెక్కించిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. డప్పు మేస్త్రీగా పని చేసే రాజు (అఖిల్ రాజ్), అదే ఊరికి చెందిన ప్రభుత్వ ఆస్పత్రి కాంపౌండర్ వెంకన్న (చైతన్య జొన్నలగడ్డ) కూతురు రాంబాయి (తేజస్విని) ప్రేమలో పడతారు. అయితే ప్రభుత్వ ఉద్యోగస్తుడితోనే తన కూతురి పెళ్లి చేస్తానని తేల్చి చెబుతాడు వెంకన్న. రాజు, రాంబాయిల కథ చివరికి ఏమైంది? అనేది 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రకథ. సాయిలు కంపాటి దర్శకత్వంలో డా. నాగేశ్వరరావు పూజారి సమర్పణలో వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. ఈ చిత్రాన్ని వంశీ నందిపాటి, బన్నీ వాసు నవంబరు 21న విడుదల చేయగా, సూపర్ హిట్‌గా నిలవడంతో పాటు భారీ వసూళ్లను సాధించింది. సున్నితమైన కథని తన టేకింగ్, మేకింగ్ స్టైల్‌తో సాయిలు కంపాటి అందరి దృష్టినీ ఆకర్షించారు.

● ప్రదీప్ అద్వైతం

● బైరాన్‌పల్లి సంఘటన ఆధారంగా కాల్పనిక కథతో దర్శకుడు ప్రదీప్ అద్వైతం తెరకెక్కించిన చిత్రం 'చాంపియన్'. ఈ కథ గురించి చెప్పాలంటే... రజాకార్ల దౌర్జన్యాలను ఎదుర్కొనేందుకు బైరాన్‌పల్లి ప్రజలు పోరాటం చేస్తుంటారు. మరోవైపు సికింద్రాబాద్‌లో పుట్టి, పెరిగిన మైఖేల్ సి. విలియమ్స్ (రోషన్) ఫుట్‌బాల్ ప్లేయర్. ఇంగ్లాండ్ వెళ్లి, ఆడాలనేది అతని కల. అనుకోని పరిస్థితుల్లో బైరాన్‌పల్లి గ్రామం చేస్తున్న పోరాటంలోకి అడుగుపెడతాడు మైఖేల్. ఇంగ్లాండ్ వెళ్లాలనుకున్న అతని కల నెరవేరిందా? అనేది కథ. మూడేళ్ల గ్యాప్ తర్వాత హీరోగా రోషన్ రీ - ఎంట్రీ ఇచ్చిన ఈ సినిమా అతనికి ప్లస్ అయింది. ఈ కథని ప్రదీప్ అద్వైతం భావోద్వేగంగా తెరకెక్కించడంతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతున్నారు. సి. అశ్వినీదత్, జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ బ్యానర్స్‌పై ప్రియాంకా దత్ నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 25న విడుదలైంది.

● యుగంధర్ ముని

● వెయ్యేళ్ల చరిత్ర ఉన్న శంబాల ఊరి నేపథ్యంలో 1980 దశకంలో సాగే కథతో 'శంబాల' చిత్రాన్ని తెరకెక్కించారు యుగంధర్ ముని. శంబాల ఊరిలో జరిగే అనూహ్యమైన సంఘటనల తాలూకు మిస్టరీని ఛేదించడానికి యువ శాస్త్రవేత్త విక్రమ్ (ఆది) ఆ ఊరికి వెళతాడు. విజ్ఞానం వర్సెస్ శాస్త్రం, దైవ శక్తులు వర్సెస్ మూఢనమ్మకాలు.... వంటి రిస్కీ కథాంశాన్ని ఎన్నుకున్న యుగంధర్ ముని కన్విన్సింగ్‌గా చెప్పడం అభినందనీయం. రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని వంశీ నందిపాటి, బన్నీ వాసు విడుదల చేశారు. డిసెంబర్ 25న ఈ చిత్రం విడుదలైంది.

● మురళీకాంత్

● 'పెద్దజాతి, చిన్న జాతి అన్న తేడాల్లేవ్... మనందరం ఒక్కటే' అన్న సందేశాన్ని నినదిస్తూ థియేటర్స్‌లో 'దండోరా' వేశారు దర్శకుడు మురళీకాంత్. జీవితంలో తనకు ఎదురైన అనుభవానికి అక్షరరూపం ఇచ్చి.. అగ్రవర్ణాలు, అణగారిన వర్గాల మధ్య నేటికీ ఉన్న తారతమ్యాలు, కుల వివక్ష, ప్రేమ, పరువు హత్యలు..వంటి అంశాలను మేళవించి 'దండోరా' సినిమా తీశారు మురళీకాంత్. అగ్రవర్ణానికి చెందిన ఓ వ్యక్తి, తను చేసిన తప్పును తాను తెలుసుకుని, పశ్చాత్తాప పడితే, ఆ అగ్రవర్ణ కులపెద్దలు అతని మరణం పట్ల ఎలాంటి వివక్ష చూపించారు? అనే పాయింట్‌ను 'దండోరా' సినిమాలో చూపించారు. ఇలా తన ప్రతిభను తానే దండోరా వేసుకున్నారు. శివాజీ, నందు, మానికా రెడ్డి, నవదీప్, రవికృష్ణ, రాధ్య, బింధు మాధవి ఈ చిత్రంలోని ప్రధాన పాత్రల్లో నటించారు. ముప్పానేని రవీంద్ర బెనర్జీ ఈ సినిమాను నిర్మించారు. డిసెంబరు 25న ఈ చిత్రం విడుదలైంది.

● ప్రణీత్ ప్రత్తిపాటి

● పంతంగుల పోటీ నేపథ్యంతో రూపొందిన తాజా సినిమా 'పంతగ్'. ఈ యూత్‌ఫుల్ కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రంతో ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడిగా పరిచయం అయ్యారు. ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ఈ సినిమాలోని లీడ్ రోల్స్‌లో నటించారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీగా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఈ సినిమాను విజయ్ కుమార్ అన్నే, సంపత్, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 25న థియేటర్స్‌లో విడుదలైంది.

● తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో రూపొందిన 'రామం రాఘవం'తో ధన్‌రాజ్, రవితేజ నటించిన 'మాస్ జాతర' చిత్రంతో భాను భోగవరపు,'అల్లరి' నరేశ్ '12ఏ రైల్వేకాలనీ'తో నాని కాసరగడ్డ, రాజ్ తరుణ్ క్రైమ్ కామెడీ 'పాంచ్ మినార్'తో రామ్ కడుమల, కిరణ్ అబ్బవరం ఇంటెన్స్ లవ్‌స్టోరీ 'దిల్ రుబా'తో విశ్వకరుణ్, ప్రియదర్శి 'ప్రేమంటే..?'తో నవనీత్ శ్రీరామ్ వంటి నూతన దర్శకులు ప్రేక్షకులను మెప్పించే ప్రయత్నం చేశారు.

రాజే యువరాజే...

● ప్రభాస్

క్రిస్మస్ పండగని పురస్కరించుకుని 'ది రాజా సాబ్' మూవీ నుంచి ఓ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. 'రాజే యువరాజే...' అంటూ సాగే పాట ప్రోమోని రిలీజ్ చేశారు. ఈ పాటకు తమన్ సంగీతం అందించారు. ప్రభాస్ క్రిస్మస్ పండగ సెలబ్రేషన్స్ కోసం ఏర్పాట్లు చేయడం, చర్చికి వెళ్లి నిధీ అగర్వాల్‌తో ప్రేయర్ చేయించుకోవడం వంటివి ఈ ప్రోమోలో చూపించారు. త్వరలోనే పూర్తి పాటని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ప్రభాస్ హీరోగా నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం వచ్చే జనవరి 9న విడుదల కానుంది.



సాంటాగా మారిపోయారు రవితేజ. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'లో కొన్ని సన్నివేశాల్లో ఈ విధంగా కనిపించనున్నారు. క్రిస్మస్ సందర్భంగా ఈ ఫొటోను విడుదల చేశారు. కిశోర్ తిరుమల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం జనవరి 13న విడుదల కానుంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీలో ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటించారు.

ఈషా విజయాన్ని అడ్డుకోలేరు

- వంశీ నందిపాటి

''ఈషా' చిత్రానికి హైదరాబాద్‌లో 26 ప్రీమియర్స్ వేస్తే హౌస్‌ఫుల్ అయ్యాయి. మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. మౌత్ టాక్ బాగుంది. వసూళ్లు బాగున్నాయి. అయితే మా సినిమాని కొందరు టార్గెట్ చేసి, పెయిడ్ క్యాంపెయినింగ్ చేస్తున్నారు. ఒక మంచి సినిమా మీద ఇలా జరగడం దారుణం. ఎవరు ఎన్ని చేసినా మా సినిమా విజయాన్ని అడ్డుకోలేరు'' అని వంశీ నందిపాటి పేర్కొన్నారు. త్రిగుణ్, అఖిల్‌రాజ్ హీరోలుగా, హెబ్బా పటేల్, సిరి హనుమంతు హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఈషా'. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ సినిమాని వంశీ నందిపాటి, బన్నీ వాసు గురువారం విడుదల చేశారు.

ఈ సందర్భంగా దామోదర ప్రసాద్ మాట్లాడుతూ–''పాజిటివ్ రెస్పాన్స్ వస్తున్న మా సినిమాని కావాలని బ్యాడ్ చేయడం మంచిది కాదు. నా మూవీని డ్యామేజ్ చేసిన ఎవర్నీ వదలను'' అన్నారు. ''మా చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. అయితే సోషల్ మీడియాలో టార్గెట్ చేసి సినిమాను బ్యాడ్ చేస్తున్నారు'' అన్నారు బన్నీ వాసు. నిర్మాత హేమ వెంకటేశ్వరరావు మాట్లాడారు.

● వంశీ, బన్నీ వాసు, దామోదర, శ్రీనివాస్, వెంకటేశ్వర రావు

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు బుధవారం ముగింపు)

దేశీ సూచీలు (బుధవారం ముగింపు)

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
116	35
85,409	26,142

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,613	△	51
డోజోన్స్	48,731	△	289
ఎఫ్‌టీఎస్‌ఈ 100 (మంగళవారం ముగింపు)	9,889	△	24
డాక్స్ (మంగళవారం ముగింపు)	24,412	△	128
షాంఘై	3,960	△	19
నికాయ్	50,390	▽	69

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.15	90.17
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	119.50	122.53
€	యూరో	ఎస్‌బీఐ	104.30	107.15
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.83	58.23
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.57	61.43
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.58	71.33
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.05	24.53
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.55	24.81
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.92	13.75

2025లో అహో 2026లో ఓహో

ఈ కేలండర్ ఏడాది(2025) దేశీ స్టాక్ మార్కెట్ చరిత్రలో తొలిసారి ప్రైమరీ మార్కెట్లు లిస్టింగ్‌లతో సెంచరీ కొట్టాయి. మరోపక్క సెకండరీ మార్కెట్లు సైతం సరి కొత్త గరిష్టాలను చేరడం ద్వారా చరిత్ర సృష్టించాయి. ఇందుకు ప్రధానంగా రిటైలర్లు, దేశీ ఫండ్స్ కనీవినీ ఎరుగని రీతిలో చేపడుతున్న భారీ పెట్టుబడులు తోడ్పాటునిస్తున్నాయి. దీంతో కొత్త ఏడాది(2026)లోనూ ప్రైమరీ మార్కెట్లు సుప్రసిద్ధ కంపెనీల ఐపీవోలతో కదం తొక్కేందుకు సిద్ధపడుతున్నాయి. వివరాలు చూద్దాం..

–సాక్షి, బిజినెస్ డెస్క్

సరికొత్త చరిత్రకు తెరతీస్తూ 2025 జనవరి–డిసెంబర్ కాలంలో 103 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకి వచ్చాయి. తద్వారా ఇంతక్రితం ఎన్నడూలేని విధంగా రూ. 1.75 లక్షల కోట్లు సమకూర్చుకున్నాయి. నిజానికి గతేడాది(2024)లోనూ ప్రైమరీ మార్కెట్లు సందడి చేశాయి. రూ. 27,870 కోట్లు సమీకరించిన హ్యుందాయ్ మోటార్ ఇండియా తదితర ఇష్యూలతో 91 కంపెనీలు రూ. 1,59,784 కోట్లు అందుకున్నాయి. ప్రైమ్ డేటాబేస్ వివరాల ప్రకారం ఈ రికార్డును టాటా క్యాపిటల్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, ఐసీఐసీఐ ప్రు ఏఎంసీ తదితరాల లిస్టింగ్‌తో 2025 అధిగమించింది. అయితే స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ, డిజిటల్ సేవల దిగ్గజం రిలయన్స్ జియోసహా.. ఫ్లిప్‌కార్ట్, ఫోన్‌పే, జెప్టో, ఓయో, బోట్, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ తదితరాలు ఐపీవోకు క్యూ కట్టడం ద్వారా 2026లోనూ ప్రైమరీ మార్కెట్లు దుమ్మురేపే వీలున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

84 కంపెనీలకు సెబీ సై

ఈ ఏడాదిలో మార్కెట్ చరిత్రలోనే తొలిసారి సెన్సెక్స్ 86,000, నిఫ్టీ 26,000 పాయింట్ల మైలురాళ్లను అధిగమించాయి. మరోపక్క ఇప్పటివరకూ 103 కంపెనీలు రూ. 1.75 లక్షల కోట్లు సమీకరించి లిస్ట్‌కావడం ద్వారా సరికొత్త రికార్డ్ నెలకొల్పాయి. ఈ బాటలో 2026 కొత్త ఇష్యూలతో మరింత కళకళలాడనుంది. ఇందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఇప్పటికే 84 కంపెనీల ప్రాస్పెక్టస్‌లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సహకరించనుంది. తద్వారా రూ. 1.14 లక్షల కోట్లు సమకూర్చుకునేందుకు తెరలేవనుంది. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం ఇంతకుమించి మరో 108 కంపెనీలు సెబీ అనుమతి కోసం ఎదురుచూస్తున్నాయి. తద్వారా రూ. 1.46 లక్షల కోట్ల నిధుల సమీకరణపై కన్నేశాయి. వెరసి 190 కంపెనీలు రూ. 2.5 లక్షల కోట్ల పెట్టుబడులు అందుకోవడం ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యేందుకు ఎదురుచూస్తున్నాయి. కొన్నేళ్లుగా విదేశీ ఇన్వెస్టర్లకు మించి దేశీ ఇన్వెస్టర్లు స్టాక్స్‌లో భారీగా ఇన్వెస్ట్ చేస్తుండటం గమనార్హం! దీనికి కార్పొరేట్ పెట్టుబడులు సైతం జత కలుస్తుండటం విశేషమని విశ్లేషకులు తెలియజేశారు. కంపెనీలు విస్తరణ ప్రణాళికలు లేదా వృద్ధి ఆధారిత పెట్టుబడుల ప్రణాళికలు పక్కనపెట్టినప్పుడు ఆదాయ మార్గంగా మ్యూచువల్ ఫండ్ పథకాలలో అధికంగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వెల్లడించారు. వెరసి విదేశీ పెట్టుబడులను దేశీ ఇన్వెస్టర్లు తోసిరాజంటున్నట్లు వివరించారు.

బూమ్‌బూమ్ 2025	ఐపీవో నిధులు	సందడికి సై 2026
కంపెనీ పేరు	రూ. కోట్లలో	ఎన్‌ఎస్‌ఈ
టాటా క్యాపిటల్	15,512	ఫ్లిప్‌కార్ట్, బోట్
హెచ్‌డీబీ ఫై.సర్వీసెస్	12,500	ఓయో , జెప్టో
ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇం.	11,607	ఎస్‌బీఐ ఎంఎఫ్
ఐసీఐసీఐ ప్రు. ఏఎంసీ	10,603	హీరో ఫిన్‌కార్ప్
హెక్సావేర్ టెక్నాలజీస్	8,750	రిలయన్స్ జియో

- భారీ ఇష్యూలతో సందడే సందడి
- టాటా క్యాపిటల్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్
- హెచ్‌డీబీ, ఐసీఐసీఐ ప్రు లిస్టింగ్ జోష్
- ఇకపై రిలయన్స్ జియో, ఎన్‌ఎస్‌ఈ
- ఫోన్‌పే, ఫ్లిప్‌కార్ట్, జెప్టో, బోట్, ఓయో, హీరో ఫిన్‌కార్ప్ రెడీ



పెట్టుబడుల విక్రయం

ఐపీవో ద్వారా పలు దిగ్గజాలు నిధుల సమీకరణ చేపడుతుండటం పెట్టుబడుల విక్రయానికి దారి చూపుతోంది. తొలి దశ ఇన్వెస్టర్లు లేదా ప్రమోటర్లు కొంత వాటా విక్రయించడం ద్వారా నిధుల సమీకరణతోపాటు పెట్టుబడులపై లాభాలను ఆర్జిస్తున్నట్లు నిపుణులు తెలియజేశారు. 2025లో లిస్టయిన దిగ్గజాలను తీసుకుంటే.. ఉమ్మడిగా రూ. 1.75 లక్షల కోట్లు సమీకరించాయి. వీటిలో కొత్తగా ఈక్విటీ జారీని పక్కనపెడితే ప్రమోటర్లు లేదా ముందస్తు ఇన్వెస్టర్లు రూ. 1.1 లక్షల కోట్లను అందుకున్నారు. టాటా క్యాపిటల్ ఐపీవోలో టాటా మోటార్స్(రూ. 15,512 కోట్లు), హెచ్‌డీబీ ఫైనాన్షియల్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(రూ. 12,500 కోట్లు) భారీగా నిధులు సమకూర్చుకున్నాయి. ఇక ఐసీఐసీఐ ప్రు ఏఎంసీ ద్వారా యూకే భాగస్వామ్య సంస్థ రూ. 10,603 కోట్లు సమకూర్చుకుంది. ఈ బాటలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్(రూ. 11,607 కోట్లు), కేఎస్‌హెచ్ ఇంటర్నేషనల్(రూ. 290 కోట్లు)తో పాటు 2024లో స్విగ్గీ(రూ. 6,828 కోట్లు) అందుకోవడం ప్రస్తావించదగ్గ అంశం!

భారత్‌లో ఉద్యోగాలకు ఏఐ ముప్పు తక్కువే

ఐటీ శాఖ కార్యదర్శి కృష్ణన్

న్యూఢిల్లీ: పాశ్చాత్య దేశాలతో పోలిస్తే కృత్రిమ మేధతో (ఏఐ) భారత్‌లో వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు తక్కువేనని కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్ చెప్పారు. మొత్తం ఉద్యోగుల్లో వైట్ కాలర్ సిబ్బంది సంఖ్య తక్కువగా ఉండటం ఇందుకు కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ ఆఫీసు ఉద్యోగాలు ఎక్కువగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ (స్టెమ్) ఆధారిత విభాగాల్లోనే ఉంటున్నాయని తెలిపారు. ఉద్యోగులను పూర్తిగా తప్పించేసి, వారి స్థానాన్ని భర్తీ చేసే పరిస్థితి తలెత్తడం కన్నా, సిబ్బంది ఉత్పాదకత పెంపునకు ఏఐ ఉపయోగపడుతుందని వివరించారు. ఏఐ కొన్ని సందర్భాల్లో డేటాను సరిగ్గా అర్థం చేసుకోలేకపోయి, తప్పుగా ఇస్తున్న వివరాలను సరిచేసేందుకు ఇప్పటికీ మానవ ప్రమేయం అవసరం ఉంటోందని ఆయన చెప్పారు. ఏఐతో నిర్దిష్ట రంగాలు, అవసరాలకు తగ్గ సొల్యూషన్స్‌ని రూపొందించేందుకు అత్యుత్తమ నైపుణ్యాలున్న ఉద్యోగులు కావాల్సి ఉంటుందని కృష్ణన్ చెప్పారు. ఇలాంటి ఏఐ ఆధారిత ఉద్యోగావకాశాలను భారత్ అందిపుచ్చుకోవచ్చని వివరించారు. దేశీయంగా ఉద్యోగాల కల్పన, ఆర్థిక ప్రగతి సాధన కోసం కృత్రిమ మేధని ఉపయోగించుకోవడంతో పాటు ప్రపంచానికి కూడా ప్రయోజనం చేకూర్చగలిగే పటిష్టమైన స్థితిలో భారత్ ఉందని చెప్పారు.

లిస్టింగ్‌కు శాంసంగ్ నో

- ప్రొడక్టులలో ఏఐ వినియోగంపై దృష్టి
- కన్జూమర్ ఫైనాన్స్ విభాగం విస్తరణ

న్యూఢిల్లీ: దేశీయంగా లిస్టింగ్ యోచన లేదని దక్షిణ కొరియా దిగ్గజం శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ తాజాగా స్పష్టం చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలియజేసింది. వివిధ ప్రొడక్టులలో ఏఐను మరింత వినియోగించనున్నట్లు పేర్కొంది. కంపెనీకి అత్యంత ముఖ్యమైన దేశీ మార్కెట్లో అమ్మకాలు పెంచుకునేందుకు వీలుగా కన్జూమర్ ఫైనాన్స్ విభాగాన్ని విస్తరించనున్నట్లు తెలియజేసింది. భారత్‌లో తయారీ కార్యకలాపాలను మరింత లోతుగా విస్తరించే యోచనలో ఉన్నట్లు శాంసంగ్ నైరుతి ఆసియా ప్రెసిడెంట్, సీఈవో జేబీ పార్క్ తెలియజేశారు. దేశీయంగా మొబైల్ ఫోన్ డిస్‌ప్లేల తయారీపై ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకానికి(పీఎల్ఐ) దరఖాస్తు చేసినట్లు వెల్లడించింది. ప్రపంచంలోనే మొబైల్ ఫోన్ తయారీకి నోయిడాలో అతిపెద్ద ప్లాంటును నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలకాలంలో ఇది కీలక ఎగుమతుల కేంద్రంగా ఆవిర్భవించింది. కాగా.. దేశీయంగా ఐపీవో చేపట్టడంపై స్పందిస్తూ పార్క్ ప్రస్తుతానికి అలాంటి ప్రణాళికలులేవని స్పష్టం చేశారు. అయితే ఇతర దక్షిణ కొరియా దిగ్గజాలు హ్యుందాయ్ మోటార్ ఇండియా, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇటీవల పబ్లిక్ ఇష్యూతో నిధుల సమీకరణ చేపట్టడం ద్వారా దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన విషయం విదితమే. తద్వారా దేశీ కార్యకలాపాలను మరింత పటిష్టపరచుకుంటున్నట్లు పరిశ్రమవర్గాలు పేర్కొన్నాయి. వృద్ధికి అవసరమైన పెట్టుబడులను కలిగి ఉన్నట్లు పార్క్ తెలియజేశారు. అవసరమైతే కార్పొరేట్ బాండ్ల జారీ లేదా సంస్థాగత రుణాలు తదితర మార్గాలలో నిధులు సమకూర్చుకోనున్నట్లు వివరించారు.

పెట్రోల్ బంకులు @ 1,00,000

- పదేళ్లలో రెట్టింపు
- 90 శాతం ప్రభుత్వరంగంలోనే

న్యూఢిల్లీ: దేశంలో పెట్రోల్ బంక్‌లు నవంబర్ చివరికి 1,00,266 మార్క్‌ను చేరాయి. 2015లో ఉన్న 50,451 స్టేషన్ల నుంచి చూస్తే రెట్టింపైనట్లు ప్రభుత్వ డేటా తెలియజేస్తోంది. యూఎస్, చైనా తర్వాత అత్యధిక సంఖ్యలో పెట్రోల్ బంక్‌లు మనదేశంలో ఉండడం గమనార్హం. పీఎస్‌యూ చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్) మార్కెట్ వాటాను కాపాడుకునేందుకు విస్తరణ చేపడుతుండడంతో మారుమూల ప్రాంతాలకు సైతం పెట్రోల్ స్టేషన్లు చేరుతున్నాయి. మొత్తం పెట్రోల్ పంపుల్లో 90% ఈ 3 సంస్థల నిర్వహణలోనే ఉన్నాయి. ఐవోసీ నిర్వహణలో 41,664 స్టేషన్లు ఉంటే, బీపీసీఎల్‌కు 24,605, హెచ్‌పీసీఎల్‌కు 24,118 స్టేషన్లున్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 29% ఉన్నాయి. రష్యా రోజ్‌నెఫ్ట్‌కు చెందిన 'నయారా ఎనర్జీ' 6,921 పెట్రోల్ అవుట్‌లెట్లతో ప్రైవేటు రంగంలో తొలి స్థానంలో ఉంది. ఆ తర్వాత రిలయన్స్–బీపీ జేవీలో 2,114 స్టేషన్లు, షెల్ నిర్వహణలో 346 స్టేషన్లు ఉన్నాయి. మొదటిసారి 2004లో ప్రైవేటు రంగంలో పెట్రోల్ స్టేషన్ల ఏర్పాటయ్యాయి. యూఎస్‌లో 1,96,643 రిటైల్ గ్యాస్ స్టేషన్లు, చైనాలో 1,15,228 గ్యాస్ స్టేషన్లు ఉన్నట్టు అంచనా.

సాక్షి స్పోర్ట్స్

క్వార్టర్ ఫైనల్లో రష్మిక

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి, ప్రపంచ 481వ ర్యాంకర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సింగిల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. మహారాష్ట్రలోని సోలాపూర్‌లో ఈ టోర్నీ జరుగుతోంది. గురువారం జరిగిన సింగిల్స్ రెండో రౌండ్‌లో భారత రెండో ర్యాంకర్ రష్మిక 6–1, 6–1తో అరుజాన్ (కజకిస్తాన్)పై గెలిచింది. 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఏడు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. ఫస్ట్ సర్వ్‌లో 19 పాయింట్లు, సెకండ్ సర్వ్‌లో 7 పాయింట్లు సాధించింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసిన రష్మిక తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయింది. డబుల్స్ విభాగంలో రష్మిక–వైదేహి (భారత్) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్లో రష్మిక–వైదేహి జంట 6–3, 6–0తో లుండా కుమ్‌హోమ్–టానుచపోర్న్ యోంగ్‌మోడ్ (థాయ్‌లాండ్) ద్వయంపై విజయం సాధించింది.

క్వార్టర్ ఫైనల్లో సూర్య చరిష్మా

సాక్షి, విజయవాడ: జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి తమిరి సూర్య చరిష్మా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో సూర్య చరిష్మా 21–12, 21–9తో సాక్షి ఫొగాట్ (రాజస్తాన్)పై విజయం సాధించింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ ఉన్నతి హుడా (హరియాణా)తో సూర్య చరిష్మా తలపడుతుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఉన్నతి 19–21, 21–14, 21–12తో మేఘన రెడ్డి (తెలంగాణ)పై శ్రమించి గెలిచింది. తన్వీ శర్మ (పంజాబ్), రక్షిత శ్రీ (తమిళనాడు), తన్వీ పత్రి (ఒడిశా), ఆకర్షి కశ్యప్ (ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా), శ్రుతి (మహారాష్ట్ర), అనుపమ (ఢిల్లీ) కూడా క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. పురుషుల సింగిల్స్ విభాగంలో తెలంగాణ ప్లేయర్ ఎం.తరుణ్ క్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో తరుణ్ 21–15, 21–5తో అభినవ్ గార్గ్ (కర్ణాటక)పై గెలిచాడు.

టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో...

ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్ బరిలో హంపి

హంపి

దోహా: ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు నేడు తెరలేవనుంది. తొలి మూడు రోజులు ర్యాపిడ్ విభాగం గేమ్‌లు... ఆ తర్వాత రెండు రోజులు బ్లిట్జ్ విభాగం గేమ్‌లు జరుగుతాయి. మహిళల ర్యాపిడ్ విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది. 2019, 2024లలో ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా నిలిచిన హంపి మూడోసారి ఈ టైటిల్ సాధించాలనే లక్ష్యంతో ఉంది. మహిళల విభాగంలో భారత్ నుంచి హంపితోపాటు ద్రోణవల్లి హారిక, దివ్య దేశ్‌ముఖ్, వైశాలి, వంతిక, పద్మిని రౌత్, సవితా శ్రీ, నందిత, నూతక్కి ప్రియాంక, ఇషా శర్మ, రక్షిత, పర్ణాలి, చర్వీ పోటీపడుతున్నారు. ఓపెన్ విభాగంలో భారత్ నుంచి ఇరిగేశి అర్జున్, గుకేశ్, ప్రజ్ఞానంద, పెంటేల హరికృష్ణతోపాటు మరో 25 మంది గ్రాండ్‌మాస్టర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

ఓపెన్ ర్యాపిడ్ విభాగంలో 13 రౌండ్లు... మహిళల ర్యాపిడ్ విభాగంలో 11 రౌండ్లు నిర్వహిస్తారు. ఓపెన్ బ్లిట్జ్ విభాగంలో 19 రౌండ్లు... మహిళల బ్లిట్జ్ విభాగంలో 15 రౌండ్లు ఉంటాయి. బ్లిట్జ్ విభాగంలో నిర్ణీత రౌండ్లు ముగిశాక టాప్–4లో నిలిచిన వారు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తారు. ర్యాపిడ్ విభాగంలో మాత్రం అత్యధిక పాయింట్లు సాధించిన వారికి టైటిల్ లభిస్తుంది. ఓపెన్, మహిళల ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల విజేతలకు 70 వేల యూరోల (రూ. 74 లక్షలు) చొప్పున ప్రైజ్‌మనీ లభిస్తుంది.

సిరీస్ విజయంపై గురి

నేడు శ్రీలంకతో భారత్ మూడో టి20

- జోరు మీదున్న హర్మన్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

తిరువనంతపురం: భారత్, శ్రీలంక మహిళల జట్ల మధ్య టి20 సమరం వేదిక మారుతూ తిరువనంతపురానికి చేరింది. తొలి రెండు మ్యాచ్‌లకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వగా... ఇప్పుడు తర్వాతి మూడు మ్యాచ్‌లు తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో జరగనున్నాయి. ఇప్పటికే 2–0తో ఆధిక్యంలో ఉన్న భారత్ మరో మ్యాచ్ గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య నేడు మూడో టి20 మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. తొలి రెండు మ్యాచ్‌లలో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన హర్మన్‌ప్రీత్ బృందం ఇక్కడా అదే జోరు కొనసాగించాలని భావిస్తుండగా... ఇక్కడైనా పోటీనిచ్చి సిరీస్‌ను కాపాడుకోవాలని లంక లక్ష్యంగా పెట్టుకుంది.

దీప్తి శర్మ పునరాగమనం...

శ్రీలంకపై ఆడిన గత 11 టి20ల్లో భారత్ 9 గెలిచింది. 2024 జూలై తర్వాత మన జట్టుకు ఓటమి ఎదురు కాలేదు. బలమైన బ్యాటింగ్ లైనప్‌తో పాటు పదునైన బౌలింగ్‌తో రెండు మ్యాచ్‌లలో విజయం మన జట్టును వరించింది. జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ తమ బ్యాటింగ్‌తో కీలక పాత్ర పోషించారు. బౌలింగ్‌లో క్రాంతి గౌడ్, శ్రీచరణి, వైష్ణవి ఆకట్టుకోవడంతో లంక భారీ స్కోర్లు చేయడంలో విఫలమైంది. తొలి మ్యాచ్‌లో 121 పరుగులకే పరిమితమైన జట్టు రెండో టి20లో 128 పరుగులే చేయగలిగింది. రెండో మ్యాచ్‌కు అనారోగ్యం కారణంగా దీప్తి శర్మ దూరం కాగా, ఆమె స్థానంలో వచ్చిన స్నేహ్ రాణా కూడా 4 ఓవర్లలో 11 పరుగులే ఇచ్చి 1 వికెట్ తీసింది. ఇప్పుడు కోలుకున్న దీప్తి మూడో మ్యాచ్ బరిలోకి దిగనుంది. తొలి టి20లో ఫీల్డింగ్ పేలవంగా కనిపించినా... దాని నుంచి పాఠాలు నేర్చుకున్న జట్టు గత పోరులో ఆకట్టుకుంది. మూడు రనౌట్లతో ప్రత్యర్థిని పడగొట్టింది. స్మృతి, హర్మన్, రిచాలతో భారత బ్యాటింగ్ బలంగా ఉండగా.. పేస్ బౌలింగ్‌లో అమన్‌జోత్, అరుంధతి రెడ్డి మరోసారి ప్రధాన బాధ్యత తీసుకుంటారు. ఈ మ్యాచ్‌లో కొత్త ప్లేయర్ కమలినితో అరంగేట్రం చేయించే అవకాశాన్ని టీమ్ మేనేజ్‌మెంట్ పరిశీలిస్తోంది.

సమష్టి వైఫల్యం...

శ్రీలంక పరిస్థితి మాత్రం చాలా ఇబ్బందికరంగా ఉంది. బలహీన బ్యాటింగ్‌తో కనిపిస్తున్న జట్టును విజయం దిశగా నడిపించడం కెప్టెన్ చమరి అటపట్టుకు కష్టంగా మారింది. కనీసం 150 పరుగులు కూడా చేయకుండా తాము గెలుపు గురించి ఆలోచించలేమని ఆమె వ్యాఖ్యానించింది. జట్టు లైనప్‌లో చెప్పుకోదగ్గ ప్లేయర్లు ఎవరూ లేరు. అటపట్టు రెండో టి20లో ఆకట్టుకోగా, ఇతర బ్యాటర్లంతా విఫలమయ్యారు. ముఖ్యంగా లంక ఎన్నో ఆశలు పెట్టుకొని వరుసగా అవకాశాలు ఇస్తున్న టాపార్డర్ బ్యాటర్ హాసిని పెరీరా తన సత్తాను నిరూపించుకోవడంలో విఫలమైంది. 86 అంతర్జాతీయ టి20లు ఆడినా ఆమె కనీసం ఒక్క అర్ధ సెంచరీ కూడా సాధించలేకపోయింది. అయితే మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో శ్రీలంక గత మ్యాచ్‌లో ఆడిన తుది జట్టునే ఎలాంటి మార్పులు లేకుండా కొనసాగించే అవకాశం ఉంది. విష్మి గుణరత్నే, హర్షిత, కవీషా బ్యాటింగ్‌లో రాణిస్తేనే జట్టుకు అవకాశాలు ఉంటాయి.

హర్షిత

పిచ్, వాతావరణం

ఇప్పటి వరకు ఈ మైదానంలో నాలుగు పురుషుల టి20 మ్యాచ్‌లు జరగ్గా, ఒక్క మహిళల మ్యాచ్ కూడా జరగలేదు. అయితే 2023లో జరిగిన చివరి మ్యాచ్‌ను బట్టి చూస్తే బ్యాటింగ్‌కు అనుకూల పిచ్. భారీ స్కోరుకు అవకాశం ఉంది. వర్షసూచన లేదు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి, షఫాలీ, జెమీమా, రిచా, దీప్తి, అమన్‌జోత్, అరుంధతి, క్రాంతి, వైష్ణవి, శ్రీచరణి.

శ్రీలంక: చమరి అటపట్టు (కెప్టెన్), విష్మి, హాసిని, హర్షిత, నీలాక్షిక, కౌశిని, కవీషా, మల్కి, ఇనోక, కావ్య, శషిణి.

మరిన్ని క్రీడా వార్తలు
సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

ఆధునిక సాగు విధానాలతో అధిక దిగుబడులు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

విజ్ఞాన సమాచార కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

గుమ్మలక్ష్మీపురం: ఆధునిక సాగు విధానాలను అవలంభిస్తే దిగుబడులు పెరగడంతోపాటు వ్యయం, శ్రమ తగ్గుతాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం గొరడలో ఏర్పాటు చేసిన వావిలాల బాపూజీ స్మారక వ్యవసాయ విజ్ఞాన సమాచార కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో సాంకేతికత, విజ్ఞానం మేళవించి పంటలను సాగు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. రైతులకు సాంకేతిక విజ్ఞానాన్ని అందించేందుకు వ్యవసాయ విజ్ఞాన సమాచార కేంద్రం దోహదపడుతుందని చెప్పారు. ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో ఆరోగ్యకరమైన పంటలు పండించాలన్నారు. కార్యక్రమంలో 'ఈ ఎరువులు మాకొద్దు', కర్మణ్యేవాధికారస్తే' పుస్తకాలను జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ ఆవిష్కరించారు. నాబార్డు రూపొందించిన జీవ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

వైఎస్సార్ జిల్లాలో పునుగు పిల్లి

పులివెందుల రూరల్: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని చిన్న రంగాపురంలో విశ్వనాథరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో అమర్చిన బోనులో అరుదైన పునుగు పిల్లి చిక్కింది. విశ్వనాథరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో కోళ్లు పెంచుతున్నారు. వాటి కోసం ముంగిసలు, పాములు వస్తుండటంతో బోను ఏర్పాటు చేశారు. ఈ బోనులో గురువారం పునుగుపిల్లి చిక్కింది. దానిని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

అణ్వాయుధ సామర్థ్య క్షిపణి ప్రయోగం

విజయవంతం

విశాఖ తీరంలో పరీక్షించిన భారత్ / క్షిపణికి 3,500 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం

సాక్షి, విశాఖపట్నం: అణ్వాయుధ పరీక్షల్లో భారత రక్షణ దళం మరోసారి సత్తా చాటింది. విశాఖ తీరం వేదికగా అత్యంత కీలకమైన ప్రయోగాన్ని నౌకాదళం విజయవంతంగా నిర్వహించింది. అణ్వాయుధ సామర్థ్యం గల కే–4 క్షిపణిని అరిఘాత్ జలాంతర్గామి నుంచి బుధవారం ప్రయోగించారు. దీంతో శత్రుదేశాల దాడిని వ్యూహాత్మకంగా నిరోధించే సామర్థ్యం భారత్‌కు మరింత పెరిగిందని రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. అరిఘాత్ నుంచి కే–4 బాలిస్టిక్ మిసైల్స్ ప్రయోగం చేయడం ఇది రెండోసారి. గతేడాది నవంబర్‌లోనూ ఈ ప్రయోగం నిర్వహించారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో ఈ ప్రయోగం ప్రత్యర్థులకు ఓ హెచ్చరిక అని రక్షణ వర్గాలు చెబుతున్నాయి.

కే- 4 బాలిస్టిక్ మిసైల్ సత్తా ఇదీ

కే–4 బాలిస్టిక్ మిసైల్ అంటే కలామ్–4 అని అర్థం. పూర్తి అణు సామర్థ్యం కలిగిన ఇంటర్మీడియట్ రేంజ్ సబ్‌మెరైన్ లాంచ్ బాలిస్టిక్ క్షిపణిగా దీన్ని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో) తయారు చేసింది. ఐఎన్ఎస్ అరిఘాత్‌లో ఈ క్షిపణి అమర్చి ఉంటుంది. 3,500 కి.మీ. కంటే ఎక్కువ దూరంలో ఉన్న లక్ష్యాల్ని సులువుగా ఛేదించగల సత్తా కే–4 సొంతం. 17 టన్నుల బరువు, 10 మీటర్ల పొడవు, 4.3 మీటర్ల వెడల్పు ఉన్న ఈ మిసైల్ 2,500 కిలోల వరకు న్యూక్లియర్ వార్‌హెడ్‌ని మోసుకెళ్లగల సామర్థ్యం కలిగి ఉంటుంది.

ఆసియాలో రెండో దేశంగా భారత్

ఈ ప్రయోగంతో ఆసియా దేశాల్లో చైనాతో పోటీగా భారత్ నిలిచింది. ఇప్పటి వరకూ సబ్‌మెరైన్ల నుంచి మిసైల్ దాడి చెయ్యగల సామర్థ్యం ఆసియా దేశాల్లో చైనాకు మాత్రమే ఉండేది. కే–4 బాలిస్టిక్ క్షిపణి వరుస ప్రయోగాల తర్వాత సబ్‌మెరైన్ నుంచి అణుదాడి చేయగల సామర్థ్యం కలిగి ఉన్న ఆసియాలో రెండో దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. భవిష్యత్‌లో మరో అణు జలాంతర్గామి భారత్ అమ్ముల పొదిలోకి చేరనున్న క్రమంలో 5 వేల కి.మీ. రేంజ్ ఉన్న కే–5 మిసైల్స్‌ని కూడా ప్రయోగించే సామర్థ్యం మున్ముందు భారత్ సొంతం కానుందని, కే–5 సామర్థ్యం కూడా కలిస్తే, అణుదాడిలో ఇండియా తిరుగులేని శక్తిగా అవతరిస్తుందని రక్షణ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

నోటిఫికేషన్‌కు మనసొప్పట్లే!

- ఏపీపీఎస్సీ వద్ద 1,125 ఏఈఈ, ఏఈ పోస్టులు
- ఈ సంవత్సరం జూలై నాటికి ఉన్న ఖాళీలివి
- ఆశగా ఎదురుచూస్తున్న ఇంజినీరింగ్ అభ్యర్థులు
- నోటిఫికేషన్ ఇచ్చేందుకు చేయిరాని చంద్రబాబు ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఇంజినీర్ పోస్టులు భర్తీ చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వానికి మనసు రావడం లేదు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లను సైతం పూర్తి చేయకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గ్రూప్–1, 2 పోస్టులతో పాటు డీవైఈవో, డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీ ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరో పక్క వివిధ శాఖల్లోని ఇంజినీరింగ్ పోస్టులను భర్తీ చేసేందుకు ఏడాదిన్నర కాలంగా ఏపీపీఎస్సీ ఎదురుచూస్తున్నా ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. దీంతో ఇంజినీరింగ్ చదివిన వేలమంది అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతోంది. ప్రజారోగ్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, గ్రామీణ నీటి సరఫరా–శానిటేషన్, రోడ్లు భవనాలు, వాటర్ రిసోర్స్ శాఖల్లో దాదాపు 1,125 ఇంజినీరింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో పనులు ముందుకుసాగడం లేదని, వెంటనే నియామకాలు చేయాల్సిందిగా పలు శాఖలు ప్రభుత్వాన్ని అభ్యర్థించినా స్పందించకపోవడం గమనార్హం. ఖాళీలను పదోన్నతులతో నింపేందుకే ఆసక్తి చూపుతున్నారు గానీ కొత్త నోటిఫికేషన్లకు మాత్రం అంగీకరించడం లేదు.

మొత్తం 1,125 పోస్టులు

ప్రస్తుతం ప్రజారోగ్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో 88 ఏఈఈ, 33 ఏఈ (డిప్లొమా అర్హత), గ్రామీణ నీటి సరఫరా–పారిశుధ్య విభాగంలో 95 ఏఈఈ, 71 ఏఈ, రోడ్లు భవనాల శాఖలో 187 ఏఈఈ, 74 ఏఈ, వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్‌లో 211 ఏఈఈ, 366 ఏఈ.. మొత్తం 1,125 పోస్టులున్నాయి. 2021, 2022లో ఇచ్చిన నోటిఫికేషన్లలో మిగిలిన (క్యారీ ఫార్వర్డ్) పోస్టులు మరో 9 ఉన్నాయి. కేవలం నాలుగు శాఖల్లోనే 1,125 పోస్టుల ఫైల్ ఏపీపీఎస్సీ వద్ద ఉంది. నిబంధనల ప్రకారం ఆయా శాఖల్లోని ఖాళీలలో 70 శాతం పదోన్నతులతో, 30 శాతం నేరుగా భర్తీ చేయాలి. నేరుగా చేపట్టాల్సిన నియామకాలనూ పదోన్నతులతో నింపేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఏఈ ఉద్యోగాలకు డిప్లొమా ఇంజినీరింగ్ అభ్యర్థులు, ఏఈఈ పోస్టులకు బీటెక్, బీఈ చదివినవారు ఎదురుచూస్తున్నారు. తమ ఆశలను చంద్రబాబు ప్రభుత్వం కాలరాస్తోందని వీరంతా వాపోతున్నారు. అన్ని అర్హతలున్నా ప్రభుత్వ నిర్లక్ష్యంతో వయో పరిమితి దాటిపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంటల్లో మరో ట్రావెల్స్ బస్సు

ఐదుగురు ప్రయాణికులు, లారీ డ్రైవర్ సజీవ దహనం

కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఘోర ప్రమాదం

సాక్షి, బళ్లారి : ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ స్లీపర్ కోచ్ బస్సుకు జరిగిన ఘోర ప్రమాదంలో పలువురు సజీవ దహనమైన ఘటన మరువక ముందే కర్ణాటకలో తాజాగా మరో ఉదంతం చోటుచేసుకుంది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా హిరియూరు తాలూకా జవనగొండనహళ్లి వద్ద జాతీయ రహదారి–48పై జరిగింది. బెంగళూరు నుంచి ఉత్తర కన్నడ జిల్లాలోని గోకర్ణకు వెళ్తున్న ప్రైవేటు స్లీపర్ కోచ్ బస్సును ఎదురుగా అవతల లైన్‌లో వస్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి ఇటుపక్క లైన్‌లోకి అతివేగంగా దూసుకొచ్చి ఢీకొనడంతో బస్సులో మంటలు వ్యాపించి ఐదుగురు ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ ప్రమాదంలో లారీకి కూడా నిప్పంటుకోవడంతో లారీ డ్రైవర్ సైతం మరణించాడు. తీవ్రంగా గాయపడ్డ మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.

ఎలా జరిగిందంటే..

బెంగళూరు గాంధీనగర నుంచి బుధవారం రాత్రి 9 గంటలకు ట్రావెల్స్ బస్సు బయల్దేరింది. వేర్వేరు ప్రదేశాల్లో 33 మంది ఎక్కారు. వీరిలో చాలామంది 35 ఏళ్లలోపు యువతీ యువకులే ఉన్నారు. ఒకే ఐటీ కంపెనీ నుంచి ఎక్కువమంది ఐటీ ఇంజినీర్లు విహారయాత్రకని గోకర్ణకు బయల్దేరారు. హైవేపై బస్సు వెళ్తుండగా ఎదురుగా అవతలి లేన్‌లో వస్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి ఇటుపక్కకు దూసుకొచ్చి ట్రావెల్స్ బస్సును బలంగా ఢీకొట్టింది. సరిగ్గా బస్సు డీజిల్ ట్యాంకును కంటైనర్ లారీ ఢీకొనడంతో అది పేలిపోయి రెండు వాహనాలు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకున్నాయి. ఈ ఘటనతో బస్సులోని ప్రయాణికులు చాలామంది కిటికీలు, డోర్ నుంచి బయటకు దూకారు. తీవ్రంగా గాయపడ్డవారు బయటకు రాలేకపోయారు. బస్సును క్షణాల్లోనే మంటలు చుట్టుముట్టడంతో ఐదుగురు సజీవదహనమయ్యారు. మరణించిన వారిని మానస, నవ్య, రష్మి, బిందు.. ఈమె ఐదేళ్ల కుమార్తె గ్రేయగా డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించారు. వీరి వయసు 25–33 ఏళ్లలోపు ఉంటుందని భావిస్తున్నారు. ఇక ఈ ప్రమాదంలో 22 మందికి స్వల్ప గాయాలు కాగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో బెంగళూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ కూడా సజీవ దహనం కాగా, అతని వివరాలు తెలియరాలేదు. ఉత్తరప్రదేశ్ అని మాత్రం తెలిసింది. స్థానికులు, ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

42 మంది స్కూలు పిల్లలకు తప్పిన ముప్పు

ఈ బస్సు వెనుకే 42 మంది స్కూలు పిల్లలతో టూర్‌కు వెళ్తున్న మరో బస్సు తృటిలో ఈ ఘోరం నుంచి తప్పించుకుంది. ఒక్క నిమిషం అటూఇటూ అయినా పెను ప్రమాదం జరిగి ఉండేదని చెబుతున్నారు. చిత్రదుర్గ జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, తుమకూరు జిల్లా ఎస్పీ అశోక్, హిరియూరు డీఎస్పీ శివకుమార్ సహాయక చర్యలు చేపట్టారు.

'నువ్వు కావాలి.. మాట్లాడుకుందాం రా'

ఎస్టీ మహిళతో టీడీపీ నేత అసభ్య ప్రవర్తన

టీడీపీ కార్యకర్తలతో వెంకటరాముడు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ నాయకుల అకృత్యాలు పెచ్చుమీరాయి. ఈ క్రమంలోనే ఆ పార్టీకి చెందిన వెంకటరాముడు వ్యవసాయ కూలీలకు మేస్త్రీగా వ్యవహరిస్తున్న ఎస్టీ మహిళను కులం పేరుతో దూషించడమే కాకుండా అసభ్యంగా ప్రవర్తించాడు. పోలీసుల కథనం ప్రకారం.. బత్తలపల్లి మండలం సంగాల గ్రామానికి చెందిన దేవరకొండ గాయత్రి వ్యవసాయ పనులకు వెళుతుంటుంది. భర్త ధర్మవరం వెళ్లి దర్జీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గాయత్రి వ్యవసాయ కూలీలకు మేస్త్రీగా వ్యవహరిస్తుండటంతో సమీప గ్రామాల రైతులు కూలీలు కావాలంటే ఆమెకు ఫోన్‌చేసి పిలుస్తుంటారు. ఈ క్రమంలోనే మూడు వారాల క్రితం బత్తలపల్లి మండలం వరదాపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత నాగోతి వెంకటరాముడు ఫోన్‌చేసి పంట పొలంలో కలుపు తీయడానికి 20 మంది కూలీలను తీసుకుని రావాలని చెప్పాడు. దీంతో ఆమె 20 మంది కూలీలతో వేరుశనగ పంటలో కలుపు తీయడానికి వరదాపురం వెళ్లింది. అదే సమయంలో వెంకటరాముడు గాయత్రికి ఫోన్ చేసి.. 'నువ్వంటే ఇష్టం.. నువ్వు నాకు కావాలి. మాట్లాడుకుందాం.. పక్కకు రా' అని పిలిచాడు. ఆమె వెళ్లకపోవడంతో అదేరోజు సాయంత్రం ఆమె ఇంటికి వెళ్లి 'నేను పిలిచినా రావా. నీ అంతు చూస్తా.. ఒంటరిగా దొరకవా' అని బెదిరించాడు. దీంతో భార్యాభర్త కలసి వెంకటరాముడును మందలించారు. దీనిని మనసులో పెట్టుకున్న వెంకటరాముడు బాధితురాలికి జ్వాలాపురం గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందంటూ కరపత్రాలు రాయించి సంగాల నుంచి జ్వాలాపురం వరకు వీధుల్లో విసిరాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంకటరాముడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

భయోమెట్రిక్

- వేలి ముద్రలు చోరీ చేసి డబ్బులు కాజేస్తున్న వైనం
- ఏఈపీఎస్‌పై అవగాహన లేక ప్రజల జేబులకు సైబర్ నేరగాళ్ల చిల్లు
- డబ్బులు పోతే 1930కు కాల్ చేయాలంటున్న పోలీసులు

శ్రీకాకుళంలోని ఓ బ్యాంకు కస్టమర్ ఖాతాలో తనకు తెలియకుండానే పలుదఫాలుగా రూ.96,500లు మాయమయ్యాయి. ఫోన్‌కు మెసేజ్ లు కూడా రాలేదు. సడెన్‌గా ఓ రోజు బ్యాంకుకెళ్లి వివరాలు తెలిసి అవాక్కయ్యారు. అప్పుడు గుర్తొచ్చింది. అతను తన వేలిముద్రను రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఒకసారి వేశారు.

పలాసలో ఓ సిమెంట్ విధుల్లో ఎక్కడో ఉంటారు. ఆయన ఏటీఎం కార్డు, బ్యాంకు బుక్‌లు అన్నీ భార్య వద్దనే ఉన్నాయి. రూ. 4 లక్షల ఫిగా ఉన్న తన ఖాతాలో భార్య తీయకుండానే డబ్బులు రూ. 1.50 లక్షలు వారం రోజుల్లో మాయమయ్యాయి. బ్యాంకుకు తన భార్య వెళ్లాక ఎవరో సిమెంట్ ఆధార్ బయోమెట్రిక్‌లో ప్రవేశించి ఖాతా ను, యూపీఐ పిన్ నంబర్ తదితర వివరాలన్నీ తెలుసుకుని డబ్బులు తస్కరించారని తెలిసింది.

శ్రీకాకుళం క్రైమ్ :

ప్రతి చిన్న పనికీ తప్పనిసరిగా మారిపోయిన బయోమెట్రిక్ భయోమెట్రిక్‌గా మారుతోంది. జిల్లాలో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, డిజిటల్ అరెస్ట్స్, కస్టమర్ కేర్ పేర్లతోనే కాక ఆధార్‌కార్డు వేలిముద్రలు, కంటి ఐరిష్ ద్వారా కేటుగాళ్లు ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ వేలి ముద్రలతో వాళ్లేమైనా నేరాలు చేస్తే ఎక్కడ జైలుకెళ్లాల్సివస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

డేటా చౌర్యం జరుగుతోందా..?

ఇప్పుడు ప్రతి చిన్న పనికీ మిషన్‌పై వేలి ముద్ర వేయడం పరిపాటుగా మారింది. ఏఈపీఎస్ (ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సర్వీస్) మోసాలకు ఆజ్యం పడేది ఈ వేలిముద్రల వేసే చోటులోనే బ్యాంకు వర్గాలు తమకొచ్చిన కస్టమర్ల ఫిర్యాదుల ఆధారంగా చెబుతున్నారు. ఇదివరకు మీరు ఎక్కడైనా వేలిముద్ర వేశారా అంటే.. భూమి అమ్మినప్పుడు వేశాం, లేదంటే కొన్నప్పుడు వేశామని ఎక్కువ మంది చెబుతున్నట్లు గుర్తించారు.

ఫింగర్ ప్రింట్స్ తస్కరిస్తున్నారిలా..

సైబర్ మోసగాళ్లు పలు శాఖల వెబ్‌సైట్లలోకి అక్రమంగా చొరబడి డ్యాక్యుమెంట్లను ఫింగర్‌ప్రింట్ ప్రతాలను డౌన్‌లోడ్ చేసుకుని వాటి ద్వారా ఫేక్ ఫింగర్ ప్రింట్స్ సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి యూజర్‌ఐడీ, పాస్‌వర్డ్‌తోనే రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యే అవకాశముంది. కానీ గెస్ట్‌గా లాగి న్ అయ్యే అవకాశాన్ని ఆసరాగా చేసుకుని పత్రాలను కాజేసి డస్కాల్లోని వేలిముద్రలు సేకరించేందుకు నేరస్తులు బటర్ పేపర్‌ను వినియోగిస్తున్నట్లు సమాచారం. ఆ ఫింగర్ ప్రింట్స్ గాజు గ్లాస్‌పై ముద్రించి రబ్బర్ పోయడం ద్వారా పాలిమర్ ప్రింట్‌ను తయారు చేయడంతో ఫేక్‌ఫింగర్‌ప్రింట్స్‌గా మారుతాయి. బయోమెట్రిక్ మెషిన్‌లోకి ఫింగర్ ప్రింట్ పెట్టి సంబంధిత వ్యక్తి బ్యాంకు ఖాతాలోని నగదును ఖాళీ చేస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- సాధ్యమైనంత వరకు ఫింగర్ ప్రింట్, ఐరిష్ వేయకుండా నేరుగా బ్యాంకు ద్వారా విత్‌డ్రా, డిపాజిట్ చేసుకుంటే మంచిది.
- ఏఈపీఎస్ ద్వారా నేరాలను ఆపాలంటే ఆధార్‌ను లాక్ పెట్టుకోవడం, ఆధార్‌లో ఉన్న బయోమెట్రిక్‌కు లాక్ పెట్టుకోవడం ఉత్తమం.
- ఆధార్ కానీ, బయోమెట్రిక్ కానీ సెకండ్ అథంటికేషన్ పెట్టుకుంటే అమౌంట్ ట్రాన్స్‌ఫర్ అయ్యేముందు మన సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. సైబర్ నేరగాళ్లు బయోమెట్రిక్ లాక్ దొంగిలించినా ఓటీపీని ఎంటర్ చేస్తేనే దానిని యాక్సెస్ అయ్యేలా ఇది పనిచేస్తుంది.

అప్రమత్తత మేలు

- అకౌంట్‌లో డబ్బులు పోయాయని తెలిసిన వెంటనే సైబర్ సెల్ 1930కు కాల్‌చేసి వివరాలు చెప్పాలి.
- మీ పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ అయ్యేటట్లు చూసుకోవాలి.
- ఆర్బీఐ కొత్త మార్గదర్శకాల ప్రకారం సంబంధిత బ్యాంకుకు వెళ్లి పోలీస్ స్టేషన్ ఎఫ్ఐఆర్ కాపీని లేదంటే ఆన్‌లైన్ ఫిర్యాదు కాపీని సమర్పించాలి.
- బ్యాంకులో ఉన్న లావాదేవీల డిస్ప్యూట్ ఫామ్‌లో వివరాలు నింపి బ్యాంకు ప్రతినిధులకివ్వాలి. వారు కన్సల్టెంగ్ పై అధారిటీ వారికి పంపిస్తారు.
- 120రోజుల్లో 99% డబ్బులు వచ్చే అవకాశం ఉంది. రాకుంటే బ్యాంకుల మీద కూడా అంబుడ్స్‌మన్‌లో ఫిర్యాదు చేయొచ్చు.

ఆదాయం పెరుగుతుంది

రబ్బరు ఆధారిత పరిశ్రమ ఏర్పాటుతో సాగు రైతులకు ఆదాయం పెరుగుతుంది. రబ్బరు ఆధారిత పరిశ్రమలో రైతులను భాగస్వాములను చేస్తే బాగుంటుంది. ఈ దిశగా రంపచోడవరం ఐటీడీఏ, రబ్బరు బోర్డు అధికారులు చర్యలు చేపట్టాలి.

– కత్తుల రామిరెడ్డి, వేటుకూరు, మారేడుమిల్లి మండలం

ఆన్‌లైన్‌లో మార్కెటింగ్

రబ్బరు సాగు తొలుత దేవరపల్లిలో ప్రారంభమైంది. ఉత్పత్తి చేసిన రబ్బరును ఆన్‌లైన్ మార్కెట్‌లో ధరల వివరాలు తెలుసుకుని అమ్ముకుంటున్నాం. ఎటువంటి మోసాలకు అవకాశం లేదు. రబ్బరు బోర్డు, ఐటీడీఏ సహకారంతో మెరుగైన ఆదాయం పొందగలుగుతున్నాం.

– వల్లాల సూర్యవతి, దేవరపల్లి

రబ్బరు చెట్ల నుంచి సేకరించిన పాలు

మన్యం కొండల్లో ప్రకృతి ప్రసాదించిన చల్లని వాతావరణం ఇప్పుడు గిరిజన రైతుల పాలిట వరంగా మారుతోంది. మారేడుమిల్లి ప్రాంతం రబ్బరు సాగుకు అనుకూలంగా ఉన్నందున ఇక్కడ ఆధారిత పరిశ్రమ ఏర్పాటుకు రంపచోడవరం ఐటీడీఏ కసరత్తు మొదలుపెట్టింది. మూడు దశాబ్దాల క్రితం చిన్నగా మొదలైన ఈ రబ్బరు సాగు ప్రస్థానం, ఇప్పుడు వేల ఎకరాలకు విస్తరించడమే కాకుండా.. స్థానికంగానే వస్తువుల తయారీ పరిశ్రమ ఏర్పడే స్థాయికి చేరింది. రూ. 5 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమతో గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడనుంది.

రబ్బరు విప్లవం

రూ. 5 కోట్లతో పరిశ్రమ ఏర్పాటుకు అడుగులు

రబ్బరు పాలను సేకరిస్తున్న గిరి రైతు

- రంపచోడవరం ఐటీడీఏ కసరత్తు
- గిరిజన రైతులకు మంచి రోజులు
- మెరుగుపడనున్న ఆర్థిక పరిస్థితి
- ఫలించనున్న ఎన్నో ఏళ్లనాటి కల

రంపచోడవరం: అల్లూరి జిల్లాలో సముద్ర మట్టానికి ఎత్తులో ఉండి, చల్లని వాతావరణం కలిగిన మారేడుమిల్లి ప్రాంతం రబ్బరు సాగుకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఇక్కడి వాతావరణ పరిస్థితులు రబ్బరు ఉత్పత్తికి అనుకూలంగా ఉండటంతో, గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధికి కంకణబద్ధులైన ఐటీడీఏ అధికారులు ఈ ప్రాంతంలో రబ్బరు పరిశ్రమ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

యంత్రంతో రబ్బరు షీటు తయారీ

1994లో మొదలైన ప్రస్థానం..

రబ్బరు బోర్డు పర్యవేక్షణలో 1994లోనే ఇక్కడ సాగుకు పునాదులు పడ్డాయి. ఐటీడీఏ – రబ్బరు బోర్డు సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్ చేపట్టాయి.

బ్లాక్ ప్లాంటేషన్–1: దేవరపల్లి గ్రామంలో 1994లో 50 హెక్టార్లలో తొలిసారిగా రబ్బరు మొక్కలు నాటారు.

బ్లాక్ ప్లాంటేషన్–2 : పుజారిపాకలు, వేటుకూరు గ్రామాల్లో 1998 – 2003 మధ్య 35 మంది రైతులకు చెందిన 45 హెక్టార్లలో సాగు చేపట్టారు.

బ్లాక్ ప్లాంటేషన్–3 : పందిరిమామిడి కోటలో 2009–2013 మధ్య వంద హెక్టార్లలో మొక్కలు నాటారు.

- మొక్కలు నాటిన మూడేళ్ల వరకు రైతులకు సాంకేతిక సహకారం అందించగా, ఆ తర్వాత రెండేళ్లకు పాల ఉత్పత్తి ప్రారంభమై రైతులకు ఆదాయం మొదలైంది.

ఐటీడీఏ సహకారంతో విస్తరిస్తున్న సాగు

గతంలో సాంకేతిక లోపాలతో కొన్ని మొక్కలు దెబ్బతిన్నప్పటికీ, ప్రస్తుతం గిరిజనులు ఈ సాగుపై మక్కువ చూపుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఐటీడీఏ భారీ విస్తరణ ప్రణాళికలు సిద్ధం చేసింది.

- రంపచోడవరం, మారేడుమిల్లి, వై.రామవరం (అప్పర్ పార్ట్) పరిధిలో 3 వేల ఎకరాల్లో సాగుకు ప్రణాళికలు సిద్ధమైంది. ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో మొక్కలు నాటేందుకు రైతులను సిద్ధం చేస్తోంది.

- మిగిలిన రెండేళ్లలో మరో 2వేల ఎకరాల్లో సాగు విస్తరించనున్నారు. ఈ ప్రాంతంలో రబ్బరు బోర్డు ద్వారా 2024లో 370 ఎకరాలు, 2025లో 501 ఎకరాల్లో సాగు చేపట్టారు.

- ఏరాకానికి 450 కిలోల వరకు రబ్బరు షీట్లు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రస్తుతం కిలో ధర రూ. 170 వరకు ఉంది.

రూ. 5 కోట్లతో పరిశ్రమ

మారేడుమిల్లిలో పండుతున్న రబ్బరుకు స్థానికంగానే విలువలు జోడింపునకు రూ. 5 కోట్ల వ్యయంతో వస్తువుల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రూ. 2.50 కోట్ల నిధులు విడుదలయ్యాయి. స్థల సేకరణ ప్రక్రియ పూర్తయింది. రబ్బరు బోర్డు నుంచి డీపీఆర్ అనుమతి వచ్చిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ పరిశ్రమ అందుబాటులోకి వస్తే స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, రబ్బరు సాగుచేసే రైతులకు గిట్టుబాటు ధర లభించనుంది.

ఏడాదికి రూ.8 లక్షల ఆదాయం

పందిరిమామిడి కోటలో ఆరు ఎకరాల్లో 1200 రబ్బరు మొక్కలు ఉన్నాయి. ఏడాదికి రూ. 8లక్షలు వరకు ఆదాయం వస్తుంది. రబ్బరు పాల సేకరణ కోసం గ్రామంలో కొంత మందికి ఉపాధి కూడా కల్పిస్తున్నా. రబ్బరు సాగుకు మరింత ప్రోత్సాహం ఇస్తే ఇంకా రైతులు సాగు చేసేందుకు అవకాశం ఉంటుంది.

– కత్తుల సోమిరెడ్డి, పందిరిమామిడి కోట

స్మోక్ రూమ్‌లకు ప్రతిపాదనలు

రబ్బరు సాగు చేసే రైతుల సంఖ్య పెరగడంతో రబ్బరు షీట్ల తయారీకి స్మోక్ రూమ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పెట్టడం జరిగింది. ఇప్పటికే ఐదు స్మోక్ రూమ్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. మూడు వేల ఎకరాల్లో రబ్బరు మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

– దేవానందం, పీహెచ్‌వో, రంపచోడవరం

మూడు రోజులపాటు శ్రీవాణి టికెట్ల జారీ రద్దు

తిరుమల: తిరుమలలో అనూహ్య రద్దీ కారణంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో (శని, ఆది, సోమవారం) శ్రీవాణి ఆఫ్‌లైన్ టికెట్ల జారీని టీటీడీ రద్దు చేసింది. ఈ మూడు రోజులు తిరుమల శ్రీవాణి దర్శన టికెట్ల కౌంటర్‌లో, రేణిగుంట విమానాశ్రయంలో శ్రీవాణి ఆఫ్‌లైన్ టికెట్లు జారీ చేయరు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని దర్శన ప్రణాళికలను రూపొందించుకోవాలని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేసింది.

తిరుమలలో టీటీడీ చైర్మన్ తనిఖీలు

తిరుమల: తిరుమలలోని శ్రీవారి లడ్డూల విక్రయ కేంద్రంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు గురువారం తనిఖీలు చేశారు. భక్తులతో కౌంటర్ వద్దకు వెళ్లి లడ్డూల జారీ విధానాన్ని, సిబ్బంది పనితీరు, లడ్డూ బరువును పరిశీలించారు. దర్శనం చేసుకోని భక్తులు లడ్డూ కౌంటర్‌లోని కియోస్క్ యంత్రం వద్ద ఆధార్ నమోదు ద్వారా యూపీఐ చెల్లింపుతో లడ్డూలు పొందే విధానాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం టీటీడీ రోజుకు 4 లక్షల లడ్డూలు, 8 వేల కళ్యాణోత్సవ లడ్డూలను భక్తులకు విక్రయిస్తోందని తెలిపారు.

సెప్టిక్ ట్యాంకులో పడి మూడేళ్ల చిన్నారి మృతి

ఢిల్లీశ్వరి (ఫైల్)

తగరపువలస: విశాఖ జిల్లా ఆనందపురం మండలం ముచ్చర్ల పంచాయతీలో ఆడుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ సెప్టిక్ ట్యాంకులో పడి మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. ముచ్చర్ల గ్రామానికి చెందిన లెంక గణేష్, కనకం దంపతులకు ఢిల్లీశ్వరి(3)తో పాటు ఏడాది వయసు కలిగిన బాలుడు దాబాబ్జు ఉన్నాడు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో చిన్నారులతో ఆడుకోవడానికి వెళ్లిన ఢిల్లీశ్వరి ఇంటికి రాపోవడంతో తండ్రి గణేష్ గ్రామంలో వెతికారు. కాలనీలోని రెండో వీధిలో పైడిరాజు అనే వ్యక్తికి చెందిన నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంకులో విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించి బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించి వెంటనే సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు.

ఎదురు కట్నం ఇచ్చి మరీ పెళ్లి చేసుకుంటే..

- వరుడి కుటుంబానికి షాక్ ఇచ్చిన యువతి
- ఇచ్ఛాపురంలో వెలుగు చూసిన ఘటన

ఇచ్ఛాపురం రూరల్: పెళ్లి పేరిట అమాయకులను మోసం చేస్తున్న ఓ యువతి వ్యవహారం బయటపడింది. ఇప్పటికే రెండు, మూడు పెళ్లిళ్లు చేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమె ఈ నిజాలను దాచి మరోసారి వివాహం చేసుకుని వరుడి కుటుంబాన్ని బురిడీ కొట్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం భవానీపురంలో నివాసం ఉంటున్న యువతి వాణిని వివాహం చేసుకోవడానికి కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లాకు చెందిన నాగిరెడ్డి సురేష్‌రెడ్డి మధ్యవర్తుల ద్వారా రూ.లక్ష ఎదురు కట్నం ఇచ్చాడు.

ఈనెల 17న సోంపేట కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఇరు కుటుంబాల సమక్షంలో వివాహం చేసుకున్నారు. 19వ తేదీన తన స్వగ్రామం కోలార్ వెళ్లేందుకు సురేష్‌రెడ్డి భార్య వాణితో కలిసి పలాసలో ట్రైన్ ఎక్కారు. ఈ సమయంలో రైల్వేస్టేషన్‌కు వచ్చే సరికి భర్త కళ్లు గప్పి ఆమె నేరుగా ఇచ్ఛాపురంలోని తన ఇంటికి చేరుకుంది. భార్య కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన భర్త సురేష్ రెడ్డి అంతటా వెతికి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చాడు. తిరిగి ఇచ్ఛాపురం వచ్చి చూడగా వాణి ఇంట్లోనే ఉంది. ఎందుకిలా చేశావంటూ ప్రశ్నించగా తనకు పెళ్లి ఇష్టం లేదని చెప్పింది. దీంతో మోసపోయినట్లు గ్రహించిన సురేష్‌రెడ్డి తన

భర్త సురేష్‌రెడ్డితో వాణి

వారితో కలిసి గురువారం రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు.

ఎదురు కట్నం ఇచ్చినా..

ఇంతకు ముందే ఆమెకు పలువురితో వివాహాలు జరిగినట్లు పోలీసులు తమకు కనిపించాయని, ఎదురు కట్నంతో పాటు వెండి పట్టీలు, మెట్టెలు, బట్టలు ఇచ్చామంటూ వరుడు సురేష్‌రెడ్డి, వారి బంధువులు వీలేకరుల ఎదుట వాపోయారు. ఆయితే పెళ్లి కుమార్తెకు తాము ఇచ్చిన కట్నం, వెండి వస్తువులను తిరిగి ఇచ్చేస్తే కేసు పెట్టమని వారు డిమాండ్ చేశారు. ఆమెకు ఇప్పటికే ఇద్దరితో నిశ్చితార్థం జరిగిందని, ఇప్పుడు తమ అబ్బాయితో పెళ్లి జరిగిందని తెలిపారు. అయితే వరుడు ఇచ్చిన వస్తువులు ఇచ్చేందుకు యువతి తరఫు వారు సమ్మతించడంతో కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

దుంప తీపి.. ధర చేదు

చిలగడ దుంపస్వీట్ పొటాటో‌కు గిట్టుబాటు ధర లభించకపోవడంతో ఆదివాసీ రైతులు దిగాలు చెందుతున్నారు. దళారులు, వ్యాపారులు తక్కువ ధర చెల్లిస్తుండడంతో తమ శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదని వాపోతున్నారు.

కించుమండ సంతకు విక్రయానికి తీసుకొచ్చిన చిలగడ దుంపలు

- గత ఏడాది కంటే సగానికి తగ్గిన ధర
- 50 కిలోల బస్తా రూ.800కు కొనుగోలు
- గత ఏడాది రూ.1500తో వ్యాపారం
- సంతల్లో వ్యాపారుల సిండికేట్
- ఉసూరుమంటున్న గిరిజన రైతులు

సాక్షి, పాడేరు: అల్లూరి జిల్లాలో గిరిజన రైతులు సాగుచేస్తున్న చిలగడదుంప పంటకు గిట్టుబాటు ధర కరువైంది. వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వారపుసంతలు, మండల కేంద్రాల్లో వ్యాపారులు సిండికేట్‌గా మారి చిలగడదుంపలను తక్కువ ధరలను తగ్గించేస్తున్నారు. గత ఏడాది కంటే ధరలను భారీగా తగ్గించడంతో రైతులంతా ఉసూరుమంటున్నారు. 50కిలోల బస్తా ధర గత ఏడాది రూ.1500 ఉండగా, ఈఏడాది రూ.900కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే సగానికి సగం ధర పడిపోయింది.

700 ఎకరాల్లో సాగు

పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో 700 ఎకరాల్లో చిలగడదుంప పంటను గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. ఎకరంలో నాట్లు వేసేందుకు, కలుపు నివారణ, పంట సేకరణ, దుంపల సర్దుబాటుకి సుమారు రూ.20 వేల వరకూ ఖర్చు అవుతుంది. జీకే వీధి, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో పంట దిగుబడి ప్రారంభమవడంతో తవ్వి సేకరిస్తున్న గిరిజన రైతులు వాటిని శుద్ధి చేసి, వారపుసంతలకు తరలించి అమ్మకాలు జరుపుతున్నారు.

జీకే వీధి, చింతపల్లి మండలాల్లోని పలు గ్రామాల వ్యాపారులు నేరుగా వ్యాన్‌లతో వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ఎకరానికి 4 నుంచి 5 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. గత ఏడాది ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం లభించింది.ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి ధరలు తక్కువగా ఉండడంతో చిలగడదుంప సాగు నష్టాలను మిగుల్చుతోందని రైతులు వాపోతున్నారు.

పలు రాష్ట్రాల్లో డిమాండ్

గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగుచేసే చిలగడదుంపలకు మన రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణ,ఒడిశా,పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఆయా రాష్ట్రాల్లో పెద్ద వ్యాపారుల నుంచి వచ్చిన ఆర్డర్ మేరకు స్థానిక వ్యాపారులు.. గిరిజన రైతుల నుంచి చిలగడదుంపలను కొనుగోలు చేస్తారు. తెలుగు రాష్ట్రాల్లో రిటైల్‌గా చిలగడ దుంపలను కిలో రూ.40 నుంచి రూ.50 వరకు వ్యాపారులు అమ్ముతూ లాభపడుతున్నారు. బస్తా దుంపలను రూ.1500కు కొనుగోలు చేసిన వ్యాపారులకు అధిక లాభాలు వస్తున్నాయి, కానీ రైతులు మాత్రం నష్టపోతున్నారు.

వర్తకులు నిర్ణయించిందే ధర

గిరిజన రైతులు పండించిన చిలగడ దుంపకు మార్కెటింగ్ సదుపాయం లేదు. స్థానిక వర్తకులు గిరిజన గ్రామాలకు వెళ్లి కొనుగోలు చేస్తుంటారు. ధరలు కూడా వారే నిర్ణయిస్తారు. వ్యాపారులు నిర్ణయించిన ధరకు మాత్రమే రైతులు విక్రయించుకోవాల్సి వస్తోంది. దీంతో రైతులు నష్టపోతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

చిలగడదుంప పంట సాగు చేస్తున్న గిరిజన రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. రైతులు తమ సంప్రదాయ విత్తనాలనే సాగుకు ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయడం లేదని రైతులు వాపోతున్నారు. గిట్టుబాటు ధర కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆదివాసీ వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు ధర లేక నష్టం

సంతలో వ్యాపారులంతా సిండికేట్‌గా మారడంతో నష్టపోతున్నాం. చిలగడ దుంపలను వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. నాణ్యతలో నంబర్–1గా ఉన్న మన్యం దుంపలకు ఈఏడాది గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో నష్టాలు చవిచూస్తున్నాం.

–కెవంతాల రాము, గిరిజన రైతు, కింపమండ, డుంబ్రిగుడ మండలం

ధర తగ్గించేశారు..



చిలగడదుంప సాగుతో ప్రతి ఏడాది రూ.లక్ష వరకు ఆదాయం పొందుతున్నాం. గత ఏడాది 50 కిలోల బస్తాను రూ.1500 ధరతో అమ్ముకుని అధిక ఆదాయం పొందాం. ఈ ఏడాది హుకుంపేట, పాడేరు సంతల్లో బస్తా దుంపలను రూ.900కు మించి వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నాం.

– కె.తౌడన్న, గిరిజన రైతు, అల్లంపుట్టు, హుకుంపేట మండలం

విదేశాలకు మన 'మేధ'.. వేల కోట్ల సంపద ఆవిరి

- ఉన్నత విద్యపై నీతి ఆయోగ్ సంచలన నివేదిక
- విదేశీ విద్యలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం
- పంజాబ్, మహారాష్ట్రలను వెనక్కి నెట్టిన వైనం
- 2047 నాటికి 5 లక్షల మంది విదేశీ విద్యార్థులను ఆకర్షించడమే లక్ష్యంగా భారత్ ప్రణాళిక

న్యూఢిల్లీ: మన దేశ యువత ఉన్నత చదువుల కోసం విదేశాలకు పోటెత్తుతోంది. ఇందులో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉంది. 2012లో విదేశాలకు వెళ్లిన వారి కొద్ది మందే ఉండగా.. 2024 నాటికి ఈ సంఖ్య ఏకంగా 13.3 లక్షలకు చేరింది. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై భారీ ప్రభావం పడుతోంది. ఏటా లక్షలాది మంది విద్యార్థులు సరిహద్దులు దాటుతుండడంతో.. మన 'మేధ'తో పాటు వేల కోట్ల రూపాయల సంపద కూడా విదేశాల పాలవుతోంది. ఈ ఆందోళనకర పరిస్థితులకు చెక్ పెట్టి, భారత్‌ను ప్రపంచ స్థాయి విద్యాకేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం నడుంబిగించింది. ఇందుకోసం 'ఇంటర్నేషనలైజేషన్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా' పేరుతో నీతి ఆయోగ్ ఓ సమగ్ర నివేదికను విడుదల చేసింది. ఐఐటీ మద్రాస్ సహకారంతో రూపొందించిన ఈ నివేదికలో విస్తుపోయే వాస్తవాలు, కీలక విషయాలు ఉన్నాయి. 2047 నాటికి భారతను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న లక్ష్యంలో భాగంగా, విద్యారంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని నివేదిక సూచించింది. 2025 నాటికి భారతీయ విద్యార్థులు విదేశీ చదువుల కోసం చేసే ఖర్చు దాదాపు 70 బిలియన్ డాలర్లు (సుమారు రూ.6 లక్షల కోట్లు) దాటుతుందని అంచనా. ఇది మన దేశ విద్యాబడ్జెట్ కంటే ఎన్నో రెట్లు ఎక్కువ కావడం గమనార్హం.

విదేశీ విద్యలో ఏపీదే అగ్రస్థానం

దశాబ్దాలుగా విదేశీ విద్యకు చిరునామాగా ఉన్న పంజాబ్, ఆర్థికంగా బలమైన మహారాష్ట్ర వంటి రాష్ట్రాలను వెనక్కి నెట్టి, విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానాన్ని దక్కించుకుంది. సాధారణంగా కెనడా, యూకే వంటి దేశాలకు వెళ్లడంలో పంజాబ్ విద్యార్థులు ముందుంటారని ప్రచారం ఉంది. కానీ నీతి ఆయోగ్ లెక్కలు ఆ అపోహను తొలగించాయి. 2018 గణాంకాల ప్రకారం.. ఏపీ (62,771) మొదటి స్థానంలో ఉండగా, పంజాబ్ (60,331), మహారాష్ట్ర (58,850) తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

2016లో దేశవ్యాప్తంగా విదేశాలకు వెళ్లిన వారిలో ఏపీ నుంచి 46,818 మంది విద్యార్థులు ఉండగా.. అప్పటికే ఏపీ అగ్రస్థానంలో ఉంది. 2018లో ఈ సంఖ్య ఏకంగా 62,771కి చేరింది. ఇది దేశంలోనే ఆల్ టైమ్ రికార్డ్. 2020లో కరోనా మహమ్మారి ప్రభావంతో ప్రయాణ ఆంక్షలు ఉన్నప్పటికీ ఏపీ నుంచి 35,614 మంది విద్యార్థులు వెళ్లడం గమనార్హం. ఈ ఐదేళ్లలో కొద్ది మంది ఉంది. వీరిలో హవా కొనసాగించింది. కేవలం ఉత్తరాది రాష్ట్రాలే కాకుండా విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్యలో దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ కంటే ఆంధ్రప్రదేశ్ చాలా ముందంజలో ఉంది. 2016లో ఏపీ నుంచి 46,818 మంది వెళ్లగా.. తమిళనాడు (27,518), కేరళ (18,428), కర్ణాటక (17,719) రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

మన చదువులకు విదేశీయులు 'అంతంతే'

మనం లక్షల మంది విదేశీ విద్య కోసం వెళుతుంటే.. మన దేశానికి చదువుకోవడానికి వస్తున్న విదేశీ విద్యార్థుల సంఖ్య మాత్రం చాలా తక్కువగా ఉంది. ప్రస్తుతం మన దేశంలో కేవలం 46,878 మంది విదేశీ విద్యార్థులు మాత్రమే ఉన్నారు. చైనా, అమెరికా వంటి దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఈ అంతరాన్ని తగ్గించేందుకు 'ఇంటర్నేషనలైజేషన్ ఎట్ హోమ్' అనే వ్యూహాన్ని నీతి ఆయోగ్ తెరపైకి తెచ్చింది. 2047 నాటికి భారతీయ విద్యాసంస్థల్లో 5 లక్షల మంది విదేశీ విద్యార్థులను చేర్చుకోవాలని లక్ష్యాన్ని పెట్టుకుంది. మరోవైపు 2012–13లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేవలం 679 మంది విదేశీ విద్యార్థులు ఉండగా 2021–22 నాటికి ఆ సంఖ్య 3,106కు పెరిగింది. దీంతో విదేశీ విద్యార్థులను ఆకర్షించడంలో టాప్ – 10 రాష్ట్రాల జాబితాలో ఏపీ 7వ స్థానానికి ఎగబాకింది. 2012–13లో విదేశీ విద్యార్థులను ఆకర్షించడంలో తెలంగాణ (2,700 మందితో 4వ స్థానం) ఏపీ కంటే చాలా ముందు ఉండేది. కానీ 2021–22 నాటికి టాప్–10 రాష్ట్రాల జాబితాలో తెలంగాణ స్థానం కోల్పోగా, ఆంధ్రప్రదేశ్ మాత్రం 3,106 మంది విద్యార్థులతో 7వ స్థానానికి ఎగబాకడం గమనార్హం.

‘బార్’ బరి.. గెలుపెవరిదో మరి!

బార్ కౌన్సిల్ ఎన్నికలకు మోగిన నగారా

35,316 న్యాయవాదులకు ఓటు హక్కు ● బరిలోకి దిగుతున్న పాత సభ్యులు, కొత్త అభ్యర్థులు

రెండు దశాబ్దాల సేవలతో వైదొలుగుతున్న చైర్మన్ ● న్యాయవాద రక్షణ చట్టమే ప్రధాన ఎజెండా

సంక్షేమ పథకాలు తెస్తామంటూ ప్రచారం షురూ ● ఇప్పటికే కోర్టు ఆవరణల్లో భేటీలు

ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల నగారా ఎట్టకేలకు మోగింది. 2014లో ఉమ్మడి రాష్ట్రం విడిపోయినా.. హైకోర్టు మాత్రం 2018 డిసెంబర్ వరకు కలిసే పనిచేసింది. 2019 నుంచి ఇరు హైకోర్టులు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత బార్ కౌన్సిల్‌కు జరుగుతున్న తొలి ఎన్నిక ఇదే. అంటే.. తెలంగాణ బార్ కౌన్సిల్ మొదటి ఎన్నికలివి. దీంతో తీవ్ర పోటీ నెలకొంది. ఎమ్మెల్సీ ఎన్నికల మాదిరిగానే ‘ప్రాధాన్యత’ క్రమంలో సభ్యులను ఎన్నుకుంటారు. సభ్యులు.. చైర్మన్, వైస్ చైర్మన్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు సభ్యుడిని ఎన్నుకుంటారు. 25 మంది సభ్యుల కోసం జరిగే ఈ ఎన్నికల్లో దాదాపు 100 మందికి పైగా పాల్గొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే కొందరు జిల్లాల్లోని కోర్టుల్లో తిరుగుతూ ప్రచారం షురూ చేశారు. మరికొందరు త్వరలో రంగంలోకి దిగనున్నారు. మరి విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ ఎప్పుడు ఏర్పడింది? దాని విధులేంటి?.. తదితర ఆసక్తికర అంశాలపై కథనమిది.

- సాక్షి, హైదరాబాద్

వృత్తిపరమైన విభేదాలతో న్యాయవాదిపై దాడి చేసినా.. హింసించినా ఎవరిని ఆశ్రయించాలి?.. న్యాయవాది సంక్షేమాన్ని ఎవరు పర్యవేక్షిస్తారు? న్యాయ విద్యాలయాలకు అనుమతులు, సీట్ల కేటాయింపు.. వీటికి సమాధానమే బార్ కౌన్సిల్. ఇది ఓ చట్టబద్ధమైన సంస్థ. న్యాయవాదిగా నమోదు చేసుకోవడం, వారి హక్కులు, అధికారాలు, ప్రయోజనాలు కాపాడటం, దుష్ప్రవర్తనకు పాల్పడితే ఫిర్యాదులు స్వీకరించి చర్యలు చేపట్టడం.. ఇదంతా బార్ కౌన్సిల్ విధి. దేశవ్యాప్తంగా అతిపెద్ద చట్టబద్ధమైన సంస్థలో బీసీఐ ఒకటి. న్యాయవాదుల చట్టం ప్రకారం రాష్ట్ర కౌన్సిల్‌లో న్యాయవాదుల సంఖ్య 10,000 దాటితే సభ్యులు 25 మంది ఉండాలి. ఈ మేరకు తెలంగాణ కౌన్సిల్‌లో సభ్యుల సంఖ్య 25. వీరు చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. బరే యాక్ట్ చాప్టర్ 2 ప్రకారం రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుల కాల పరిమితి ఐదేళ్లు. ఆ తర్వాత 6 నెలల వరకు పొడిగించే అధికారం బీసీఐకి ఉంది.

బీసీఐ అవసరాన్ని నొక్కి చెబుతూ 1953లో ఎస్ఆర్ దాస్ నేతృత్వంలోని ‘ఆల్ ఇండియా బార్ కమిటీ’ ఓ నివేదిక సమర్పించింది. ప్రతి రాష్ట్రానికో బార్ కౌన్సిల్ ఉండాలని, వీటన్నింటిపై అత్యున్నత సంస్థగా అఖిల భారత స్థాయి బార్ కౌన్సిల్ పర్యవేక్షణ ఉండాలని ప్రతిపాదించారు. అనంతరం 1961లో న్యాయవాదుల చట్టం అమల్లోకి వచ్చింది. ఇందులో సెక్షన్ 3 మేరకు ప్రతి రాష్ట్రానికో బార్ కౌన్సిల్ ఉండాలన్న నిబంధన ప్రకారం ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్ ఏర్పాటు జరిగింది. 2018, జూలైలో తెలంగాణ బార్ కౌన్సిల్ ఏర్పాటైంది. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో దాదాపు 50,785కి పైగా న్యాయవాదులున్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు సభ్యుల ఎన్నికలో వీరంతా ఓటర్లుగా ఓటు వేస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలో ‘ప్రాధాన్యత’ ఓటు ఆధారంగా సభ్యులను ఎన్నుకుంటారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ విధులు..

- న్యాయవిద్య పూర్తి చేసిన వారిని న్యాయవాదులుగా చేర్చుకోవడం
- వారి జాబితాను సిద్ధం చేయడం, విధులను పర్యవేక్షించడం
- న్యాయవాదులెవరైనా దుష్ప్రవర్తనకు పాల్పడితే కేసులను స్వీకరించడం, చర్యలు చేపట్టడం
- న్యాయవాదుల హక్కులు, అధికారాలు, ప్రయోజనాలను కాపాడటం
- నిరుపేదలు, దివ్యాంగులు, ఇతర న్యాయవాదుల కోసం సంక్షేమ పథకాల నిర్వహణ
- విపత్కర సమయాల్లో పేద న్యాయవాదులకు ఆర్థిక సహాయం అందించడం
- ప్రముఖ న్యాయనిపుణులతో చట్టపరమైన అంశాలపై సెమినార్లు, చర్చలు నిర్వహించడం
- పేదలకు నిర్దేశించిన పద్ధతిలో న్యాయ సహాయం అందించడం
- న్యాయ విశ్వవిద్యాలయాలను, కాలేజీలను తనిఖీ చేయడం
- న్యాయ విద్య పూర్తి చేసిన వారికి విధిగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పరీక్ష నిర్వహించాలి

ఐదేళ్లుగా న్యాయవాదుల ఎన్‌రోల్‌మెంట్స్...

	పురుషులు	మహిళలు	మొత్తం
2020	1,318	730	2,048
2021	2,254	1,116	3,370
2022	3,461	2,349	1,112
2023	3,712	2,336	1,376
2024	--	--	5,031

(నోట్: 2024కు సంబంధించి పురుషులు, మహిళల లెక్క ఇంకా జరగలేదని బార్ కౌన్సిల్ వెల్లడించింది)

తెలంగాణ బార్ కౌన్సిల్‌లో మొత్తం సభ్యుల సంఖ్య **25**	వీరిలో చైర్మన్,వైస్ చైర్మన్‌ల సంఖ్య **2**
బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు నామినేటయ్యే సభ్యుల సంఖ్య **1**	ఎక్స్–అఫీషియో సభ్యుల సంఖ్య **1** (అడ్వొకేట్ జనరల్)

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా..

దేశవ్యాప్తంగా న్యాయవాదుల వృత్తిని నియంత్రించడానికి, ప్రాతినిధ్యం వహించడానికి పార్లమెంట్ ఏర్పాటు చేసిన ఓ చట్టబద్ధమైన సంస్థ. వృత్తిపరమైన ప్రవర్తన, మర్యాదల ప్రమాణాలను నిర్దేశించడం, బార్‌పై క్రమశిక్షణ అధికార పరిధిని అమలు చేస్తూ నియంత్రణ విధులను నిర్వహిస్తారు.

- న్యాయ విద్యకు ప్రమాణాలను కూడా నిర్దేశిస్తుంది
- న్యాయవాదులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికార పరిధి ఉంటుంది
- న్యాయవాదుల విధులను నియంత్రిస్తుంది.
- న్యాయ డిగ్రీ విశ్వవిద్యాలయాలకు గుర్తింపును మంజూరు చేస్తుంది
- న్యాయవాదుల హక్కులు, అధికారాలు, ప్రయోజనాలను పరిరక్షిస్తుంది
- సంక్షేమ పథకాల నిర్వహణకు ఆర్థిక సహాయం అందించడానికి నిధులను సృష్టిస్తుంది
- న్యాయవాదుల వృత్తిపరమైన ప్రవర్తన, ప్రమాణాలను నిర్దేశిస్తుంది.
- రాష్ట్ర బార్ కౌన్సిల్ క్రమశిక్షణ కమిటీలు అనుసరించాల్సిన విధానం నిర్దేశం
- న్యాయవాదుల హక్కులు, అధికారాలు, ప్రయోజనాలను కాపాడటం
- చట్ట సంస్కరణలను ప్రోత్సహించడం, మద్దతు ఇవ్వడం
- రాష్ట్ర బార్ కౌన్సిల్ సూచించే ఏదైనా సమస్యను పరిష్కరించడం
- బార్ కౌన్సిల్ నిధుల నిర్వహణ.. పెట్టుబడి పెట్టడం
- ప్రతి రాష్ట్ర బార్ కౌన్సిల్ నుంచి ఐదేళ్ల కాలపరిమితితో బీసీఐకి సభ్యులు ఎన్నికవుతారు.
- వీరంతా రెండేళ్ల కాలపరిమితికి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు.
- బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో అటార్నీ జనరల్ ఎక్స్–అఫీషియో సభ్యునిగా ఉంటారు.
- బీసీఐ తొలి చైర్మన్ ఎంసీ సెతల్వాడ్. ప్రస్తుతం మనన్ కుమార్ మిశ్రా.
- దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల్లో బార్ కౌన్సిళ్లు ఉన్నాయి.

ఆలిండియా బార్ కౌన్సిల్ పరీక్ష

న్యాయవాద వృత్తి ప్రమాణాలను మెరుగుపరచడమే ఏకైక ఉద్దేశంతో బీసీఐ దీన్ని ప్రవేశపెట్టింది. 2009–2010 విద్యా సంవత్సరం నుంచి పట్టభద్రులైన న్యాయ విద్యార్థులకు ఈ పరీక్ష తప్పనిసరి చేస్తూ బీసీఐ నిర్ణయం తీసుకుంది. న్యాయవాదుల చట్టం 1961లోని సెక్షన్ 24 ప్రకారం న్యాయవాదులుగా నమోదు చేసుకున్న తర్వాత మాత్రమే అభ్యర్థులు పరీక్షకు హాజరు కావడానికి దరఖాస్తు చేసుకోవాలి. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత అభ్యర్థికి ప్రాక్టీస్ సర్టిఫికెట్ ఇస్తారు. దేశంలోని ఏ కోర్టులోనైనా ప్రాక్టీస్ చేయడానికి అర్హత ఉంటుంది. ఈ పరీక్ష దేశంలోని జాతీయ, ప్రాంతీయ భాషల్లో ఏటా రెండుసార్లు నిర్వహిస్తారు. అభ్యర్థి విశ్లేషణాత్మక నైపుణ్యాలను అంచనా వేయడంతో పాటు, ప్రాథమిక స్థాయి జ్ఞానాన్ని అంచనాకు, న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించడానికి కనీస బెంచ్‌మార్క్‌ను ఈ పరీక్ష నిర్దేశిస్తుంది. న్యాయ విద్య పట్టా పొందినా వృత్తిలోకి ప్రవేశించడానికి ఆసక్తి లేని వారికి ఈ పరీక్ష అవసరం లేదు.

న్యాయవ్యవస్థ ప్రధాన పిల్లర్ న్యాయవాదులే..

ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించే న్యాయవ్యవస్థకు ప్రధాన పిల్లర్ న్యాయవాదులే. అలాంటి వారి రక్షణకు చట్టం అవసరం తప్పనిసరి. వైరి కక్షిదారుల బెదిరింపులు, దాడులు, హత్యలు ఇటీవల కాలంగా పెరిగిపోయాయి. యువ న్యాయవాదులకు శిక్షణా తరగతులు అవసరం. అత్యుత్తమ న్యాయవాదులను తయారు చేస్తే న్యాయవ్యవస్థ ఔన్నత్యం మరింత ఇనుమడిస్తుంది. సత్వర న్యాయానికి దోహదం చేస్తుంది.

– బీఎస్ ప్రసాద్, మాజీ అడ్వొకేట్ జనరల్

సంక్షేమానికి పాటుపడాలి

బార్ కౌన్సిల్ న్యాయవాదులు సంక్షేమానికి పాటుపడాలి. మరిన్ని పథకాలు అమలు చేసే దిశగా కృషి చేయాలి. వీలైతే రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి న్యాయవాదుల సమస్యలను వివరించాలి. జిల్లా కోర్టుల్లో డిస్‌ప్లే బోర్డుల సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కేసు ఎప్పుడు వస్తోందో తెలియక న్యాయవాదులు అవస్థలు పడుతున్నారు. న్యాయవాదుల రక్షణ చట్టంతోపాటు ఇలాంటి సమస్యలు పరిష్కరించే ‘కౌన్సిల్’ను ఎన్నుకోవాలి.

– పొన్నం అశోక్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు, హెచ్‌సీఏఏ

న్యాయవాదులకు ఆప్తుడు వైఎస్సార్

న్యాయవాదులకు ఆప్తుడు వైఎస్ రాజశేఖరరెడ్డి. నేరుగా కౌన్సిల్‌కు సాయం చేసిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి ఆయన. దాదాపు 20 ఏళ్లుగా చైర్మన్‌గా సేవలందిస్తున్నాను. రెండు దశాబ్దాల్లో ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చాం. ఇతర సభ్యులు, న్యాయవాదులు అందరూ తమ వంతు సహకరించారు. ఇన్నేళ్లు చైర్మన్‌గా కొనసాగడం ఓ రికార్డే. 2006 చైర్మన్‌గా తొలిసారి వైఎస్సార్‌ను కలిశా. అడిగిన వెంటనే రూ.1.65 కోట్లను మంజూరు చేశారు. విడతలవారీగా ఒక్కో పని చేసుకుంటూ పోదామని చెప్పారు. అడిగిన వెంటనే నిధులిచ్చే అలాంటి ముఖ్యమంత్రిని మళ్లీ చూడలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.3 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అందులో సగం మంజూరు చేశారు.

– నరసింహారెడ్డి, చైర్మన్, రాష్ట్ర బార్ కౌన్సిల్

ప్రధాన హామీ.. న్యాయవాద రక్షణ చట్టం

న్యాయవాదులపై దాడులు నిత్యకృత్యంగా మారాయి. వైరి వర్గాల వారు హత్య చేయడం, దాడులు చేయడం సర్వసాధారణంగా మారింది. ఓ న్యాయవాద దంపతుల కేసును సుప్రీంకోర్టు ఏకంగా సీబీఐకే అప్పగించింది. ఈ నేపథ్యంలో న్యాయవాద రక్షణ చట్టం తీసుకురావాలన్నది ప్రధాన ప్రచారాస్త్రంగా మారింది. యువ న్యాయవాదులకు స్టైపెండ్, శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, జీవిత బీమా, ప్రమాద బీమా మరింత మందికి అందుబాటులోకి తెస్తామని, సడలింపులు చేస్తామంటూ ప్రచారం సాగించనున్నారు.

పకడ్బందీగా నిర్వహణ

బార్ కౌన్సిల్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. ఓటర్ల జాబితాను రాష్ట్రంలో అన్ని బార్ అసోసియేషన్లకు పంపిన తర్వాతే తుది జాబితాను ప్రచురించాం. సుప్రీంకోర్టు నియమించిన ఎన్నికల కమిటీ సూచనల మేరకు చర్యలు చేపడుతున్నాం. ఎన్నిక లు ప్రజాస్వామ్యానికి నిదర్శనం. న్యాయవాదులు తమ ఓటు వినియోగించుకోవాలని కోరుతున్నాం.

– నాగలక్ష్మి, కార్యదర్శి, బార్ కౌన్సిల్

ఎన్నికలు నిర్వహించండి..

రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించడం లేదంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు నవంబర్‌లో తీర్పునిచ్చింది. ఎన్నికలు ఎప్పటిలోగా నిర్వహించాలో గడువు నిర్దేశించింది. ముగ్గురు సభ్యుల ఉన్నత స్థాయి ఎన్నికల కమిటీ పర్యవేక్షణ జరుపుతుంది.

జనవరి 31: ఉత్తరప్రదేశ్, తెలంగాణ
ఫిబ్రవరి 28: ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, త్రిపుర, పుదుచ్చేరి
మార్చి 15: రాజస్తాన్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, కర్ణాటక, గుజరాత్, పంజాబ్
మార్చి 31: మేఘాలయ, మహారాష్ట్ర
ఏప్రిల్ 30: తమిళనాడు, కేరళ, అస్సాం

ఉన్నతస్థాయి కమిటీ..

జస్టిస్ రవిరాజన్ (చైర్మన్)
మాజీ ప్రధాన న్యాయమూర్తి, జార్ఖండ్ హైకోర్టు
జస్టిస్ ఏఆర్ మక్సూది
మాజీ న్యాయమూర్తి, అలహాబాద్, హైకోర్టు
జస్టిస్ రేఖా పల్లి
మాజీ న్యాయమూర్తి, ఢిల్లీ హైకోర్టు

ప్రస్తుత బార్ కౌన్సిల్ ఏం చేసింది..?

- న్యాయవాది మరణ ప్రయోజనాలను రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు
- కోవిడ్ సమయంలో న్యాయవాదులను ఆదుకునేందుకు రూ.25 కోట్లు మంజూరు చేసేలా సర్కార్‌ను ఒప్పించడం
- కరోనా మహమ్మారి కష్టకాలంలో అనేక మంది నిరుపేద న్యాయవాదులకు ఆర్థిక సహాయం పంపిణీ
- అంతర్గత సెమినార్ల నిర్వహణ, ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌తో కలిసి రెండు రోజుల కీలకసెమినార్
- ఉమ్మడి బార్ కౌన్సిల్ విభజన తర్వాత తలెత్తిన వివిధ సమస్యలను విజయవంతంగా పరిష్కరించడం
- న్యాయవాదులు వృత్తికి సంబంధించి సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడం
- నిర్ణీత వయసు (35 ఏళ్లు) దాటిన న్యాయవాదులు అడ్వొకేట్స్ వెల్ఫేర్ ఫండ్‌లో సభ్యులు కావడానికి అవకాశం కల్పించడం.

తెరపైకి మహిళా రిజర్వేషన్

రాష్ట్ర బార్ కౌన్సిళ్ల పదవుల్లో 30 శాతాన్ని మహిళా న్యాయవాదులకు కేటాయించాలి. ఈ ఏడాది ఇంకా బార్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాని రాష్ట్రాల్లో ఈ ఆదేశాలను అమలు చేయాలి. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో మాత్రం నోటిఫికేషన్ ప్రకారం ముందుకు సాగవచ్చు. ఒకవేళ తగినంత మంది మహిళా న్యాయవాదులు లేకున్నా, పోటీ చేయడానికి ఇష్టపడకున్నా.. 20 శాతం పదవులను ఎన్నిక ద్వారా, మిగిలిన 10 శాతం పదవులను కో–ఆప్షన్ ద్వారా నియమించుకోవచ్చు. కో–ఆప్షన్ ద్వారా నియమించేందుకు ప్రతిపాదించే మహిళా న్యాయవాదుల పేర్లను తొలుత కోర్టు ముందు ఉంచాలి.

మహిళలకు సీట్ల రిజర్వు హర్షణీయం

మహిళలకు 30 శాతం రిజర్వేషన్ పాటించాలని అత్యున్నత న్యాయస్థానం తీర్పు హర్షణీయం. దశాబ్దాల తర్వాత బార్ కౌన్సిల్‌లో మహిళలకు సముచిత స్థానం దక్కనుంది. ఈ బార్ కౌన్సిల్ కార్యవర్గంలో ఒక్కరూ మహిళలు లేకపోవడం శోచనీయం. చట్టాల అమలు కోసం సమర్థవంతమైన వాదనలు వినిపించే మహిళా న్యాయవాదులు ముందుకు రావాలి. కేసులకే పరిమితం కాకుండా ఎన్నికల్లో పోటీ చేసి.. విజయం సాధించి మహిళా న్యాయవాదుల సంక్షేమానికి పాటుపడాలి.

– జి.సుభాషిణి, న్యాయవాది

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించాలి..

ఈ వృత్తిలో న్యాయవాద సంబంధిత అంశాలతో పాటు ఆంగ్ల పరిజ్ఞానం తప్పనిసరి. పేద, మధ్య తరగతి న్యాయవాదుల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చేవారున్నారు. వారు ఇబ్బంది పడకుండా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు బార్ కౌన్సిల్ కృషి చేయాలి. స్కిల్స్ లేకుండా రాణించడం కష్టం. కోర్టులో వాదనలు ఎలా జరుగుతాయి.. క్రిమినల్, సివిల్ చట్టాలపై తరగతులు నిర్వహించాలి. వారు కూడా చర్చల్లో పాల్గొనే అవకాశం ఇచ్చి భయాందోళన దూరం చేయాలి. దీని కోసం కౌన్సిల్ కృతనిశ్చయంతో పనిచేయాలి.

– పాలకుర్తి కిరణ్, మాజీ న్యాయమూర్తి

ఉమ్మడి రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్లు వీరే..

డి.నరసరాజు	1961-64	ఎ.నరసింహారెడ్డి	2012-17
ఎస్.మాలకొండారెడ్డి	1964-65	ఎ.నరసింహారెడ్డి	2017-18
బీవీ సుబ్రహ్మణ్యం	1965-70	ఎ.నరసింహారెడ్డి	2018-ప్రస్తుతం (తెలంగాణ)
పి.రామచంద్రారెడ్డి	1970-79		
కోకా రాఘవరావు	1979-84	ఘంటా రామారావు	2018-24 (ఆంధ్రప్రదేశ్)
ఈ ఎల్లారెడ్డి	1984-2001		
ఎం.రాజేందర్‌రెడ్డి	2001-06	ద్వారకానాథరెడ్డి	2024-ప్రస్తుతం (ఆంధ్రప్రదేశ్)
ఎ.నరసింహారెడ్డి	2006-12		

(2018లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ విడిపోయింది. మూడు నెలల పాటు స్పెషల్ కమిటీ పని చేసింది.)

ముఖ్యమైన పాయింట్లు...

- 1961లో బార్ కౌన్సిళ్లు ఏర్పాటైనా.. చైర్మన్ల ఎన్నిక మాత్రం 1969 నుంచి ప్రారంభమైంది. అప్పటివరకు అడ్వొకేట్ జనరల్ ఎక్స్ అఫీషియోమెన్ హోదాలో చైర్మన్‌గా ఉండేవారు.
- బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తొలి చైర్మన్ ఎంసీ సెతల్వాడ్
- ఆర్‌బీ జఠ్మలానీ, వీసీ మిస్త్రా, మనన్ కుమార్ మిస్త్రా.. బీసీఐ చైర్మన్‌గా రెండు సార్లు ఎన్నికయ్యారు.
- మనన్‌కుమార్ మిస్త్రా.. అత్యధిక కాలం... దాదాపు 14 ఏళ్లు చైర్మన్‌గా సేవలందించారు. 2012, ఏప్రిల్ 17 నుంచి 2014, ఏప్రిల్ 16 వరకు.. 2014, నవంబర్ 9 నుంచి ప్రస్తుతం...
- దేశవ్యాప్తంగా మొత్తం 24 బార్ కౌన్సిళ్లున్నాయి.
- మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్‌లో 2 లక్షలకుపైగా న్యాయవాదులున్నారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల షెడ్యూల్..

ప్రాథమిక ఓటర్ల జాబితా జారీ: డిసెంబర్ 1
తుది జాబితా విడుదల: డిసెంబర్ 10
నోటిఫికేషన్ గెజిట్ జారీ: డిసెంబర్ 20
నామినేషన్ల ప్రారంభం: డిసెంబర్ 29
నామినేషన్ల గడువు ముగింపు: జనవరి 9
నామినేషన్ల పరిశీలన: జనవరి 10
నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం: జనవరి 13 నుంచి 16 వరకు
అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ: జనవరి 17
బ్యాలెట్ పేపర్లు, బాక్సుల పంపిణీ: జనవరి 19
ఎన్నికల తేదీ: జనవరి 30
ఓట్ల లెక్కింపు: ఫిబ్రవరి 10
(బార్ కౌన్సిల్‌కు పోటీ చేయాలనుకునే వారు రూ.1.25 లక్షల నాన్ రిఫండబుల్ రిక్లరేషన్ సమర్పించాలి. ఒక్కో అభ్యర్థికి మద్దతుగా 10 మంది న్యాయవాదులు సంతకం పెట్టాలి)

ఓటు హక్కు వినియోగించుకోనున్న మొత్తం ఓటర్ల సంఖ్య: **35,316**	మహిళలు: **7,637**
	పురుషులు: **27,679**

హైకోర్టు ఆవరణలోని బార్ కౌన్సిల్‌ను సంప్రదించాల్సిన నంబర్లు: +91 40-24520443, 24524116, 9949755377 ఫ్యాక్స్: +91 40 24524116

దేశవాళీ మహిళా క్రికెటర్లకు వేతనాలు పెంపు

న్యూఢిల్లీ: దేశవాళీ టోర్నీల్లో పాల్గొనే మహిళా క్రికెటర్లకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భారీస్థాయిలో వేతనాలు పెంచింది. క్రికెటర్లతో పాటు మ్యాచ్ అఫీషియల్స్‌కు సైతం జీతభత్యాల్ని పెంచింది. ఇప్పుడు చెల్లిస్తున్న దానికి రెట్టింపును మించే విధంగా హెచ్చింపు చేసింది. ఈ మేరకు బోర్డు ఉన్నస్థాయి మండలి అమోదించడంతో పెరిగిన వేతనాల్ని మహిళా క్రికెటర్లు, అఫీషియల్స్ ఈ సీజన్ నుంచే అందుకోనున్నారు. ఇప్పటివరకు దేశవాళీ టోర్నీలు ఆడే సీనియర్ మహిళా క్రికెటర్లకు రోజుకి రూ. 20 వేలు (రిజర్వ్ ప్లేయర్లకి రూ. 10 వేలు) చొప్పున చెల్లిస్తున్నారు. తాజా వేతన సవరణతో ఏకంగా రూ. 50 వేల నుంచి రూ. 60 వేలు అందనున్నాయి. అంటే తుది జట్టులో ఆడితే రూ. 50 వేలు, రిజర్వ్ బెంచ్‌లో ఉంటే రూ. 25 వేలు ఇస్తారు. జాతీయ టి20 టోర్నీల్లో పాల్గొనే అమ్మాయిలకు మ్యాచ్‌కు రూ. 25 వేల చొప్పున (రిజర్వ్ రూ. 12,500) చెల్లించనున్నారు. దీంతో దేశవాళీ టోర్నీలకు సీజన్ ఆసాంతం అందుబాటులో ఉండే ఒక్కో సీనియర్ క్రికెటర్‌కు ఏడాదికి రూ. 12 లక్షల నుంచి 14 లక్షల చొప్పున వేతన భత్యాలు లభిస్తాయని బోర్డు అధికారులు వెల్లడించారు.

జూనియర్లకు ఇలా...

జూనియర్ మహిళా క్రికెటర్ల పంట కూడా పండింది. అండర్–23, అండర్–19 వయో విభాగాల టోర్నీలు ఆడే అమ్మాయిలు రోజుకి రూ. 25 వేలు (రిజర్వ్ రూ.12,500) చొప్పున పొందుతారు. దేశవాళీ మ్యాచ్‌లకు ఫీల్డ్ అంపైర్లు, రిఫరీలు, అఫీషియల్స్‌గా పనిచేసే వారికి రూ. 40 వేలు రోజుకు చెల్లిస్తారు. మ్యాచ్ ప్రాధాన్యతను బట్టి ఈ చెల్లింపు మొత్తం కూడా పెరగనుంది. అంటే నాకౌట్, సెమీఫైనల్స్, ఫైనల్ దశ మ్యాచ్ అధికారులకు రూ. 50 వేల నుంచి రూ. 60 వేలు చెల్లిస్తారు. దీనివల్ల రంజీ ట్రోఫీ మ్యాచ్‌కు ఒక్కో అఫీషియల్‌కు రూ. 1 లక్షా 60 వేలు, నాకౌట్ దశలో అయితే రూ. 2.5 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు మ్యాచ్ ఫీజుగా అందనుంది.

బీసీసీఐ ఆదాయానికి లోటు లేదు!

ఐసీసీ నుంచి తగ్గిన వాటా



ముంబై: టీమ్ ప్రధాన స్పాన్సర్‌గా డ్రీమ్ ఎలెవన్ అర్ధాంతరంగా తప్పుకున్న తర్వాత కూడా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆదాయానికి ఎలాంటి సమస్యా ఎదురు కాలేదు. ఎక్కువ మొత్తానికి అపోలో టైర్స్‌తో స్పాన్సర్‌షిప్ ఒప్పందం కుదుర్చుకోవడంతో పాటు కిట్ స్పాన్సర్ అడిడాస్ ద్వారా బోర్డు ఆ లోటును పూరించుకుంది. బోర్డు సంయుక్త కార్యదర్శి (గత కోశాధికారి) ప్రభ్‌తేజ్ భాటియా రాబోయే 2025–26 ఆర్థిక సంవత్సరంలో బీసీసీఐ ఆదాయ అంచనాల గురించి వివరిస్తూ గత ఏడాది 2024–25కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. దీని ప్రకారం గత ఏడాది బోర్డు ప్రాథమిక నిధిలో రూ. 3,358 కోట్లు పెరుగుదల కనిపిస్తూ మొత్తం రూ.11,346 కోట్లకు చేరింది. అపోలో టైర్స్‌తో రూ. 358 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్న బీసీసీఐ... జెర్సీ స్పాన్సర్ అడిడాస్ నుంచి కూడా పెద్ద మొత్తాన్ని పొందినట్లు సమాచారం. అయితే అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి ప్రతీ ఏటా వచ్చే ఆదాయంలో మాత్రం కోత పడిందని ఈ నివేదికలో పేర్కొన్నారు. ప్రతీ ఏడాది ఐసీసీ తమ ఆదాయం నుంచి భారత బోర్డుకు 38.5 శాతం అందిస్తుంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో బీసీసీఐకి రూ.8,963 కోట్ల ఆదాయం రావచ్చని అంచనా వేస్తున్నారు.

మరో విజయం లక్ష్యంగా...

నాలుగో టెస్టు బరిలో ఆస్ట్రేలియా

- పరువు కోసం ఇంగ్లండ్ ఆరాటం
- ఉదయం 5 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్టోక్స్

స్మిత్, లబుషేన్

మెల్‌బోర్న్: సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో అదరగొట్టి ప్రతిష్టాత్మక 'యాషెస్' సిరీస్ చేజిక్కించుకున్న ఆస్ట్రేలియా జట్టు నేటి నుంచి నాలుగో టెస్టు 'బాక్సింగ్ డే' మ్యాచ్‌లో బరిలోకి దిగనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇప్పటి వరకు జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ సంపూర్ణ ఆధిపత్యం చలాయించి నెగ్గిన ఆసీస్ 3–0తో సిరీస్ కైవసం చేసుకుంది. ఇక మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి 'క్లీన్‌స్వీప్' చేయాలని కంగారూలు భావిస్తుండగా... 'పోరాడితే పోయేదేమీ లేదు' అన్న తరహాలో తెగించి ఆడేందుకు ఇంగ్లండ్ సిద్ధమైంది. గాయం కారణంగా జట్టుకు దూరమైన నాథన్ లయన్ స్థానంలో మరో స్పిన్నర్ టాడ్ మర్ఫీకి బదులుగా ఆస్ట్రేలియా జట్టు అదనపు పేసర్‌కు అవకాశమివ్వనుంది. 'బాక్సింగ్ డే' టెస్టు కోసం మెల్‌బోర్న్ స్టేడియం ముస్తాబవగా... పచ్చికతో కూడిన పిచ్ ఆరంభంలో పేసర్లకు సహకారం అందించనుంది. అయితే కాస్త సంయమనం పాటిస్తే ఇక్కడ బ్యాటింగ్ చేయడం పెద్ద కష్టం కాదని రికార్డులు చెబుతున్నాయి. కమిన్స్‌కు విశ్రాంతినివ్వడంతో మరోసారి స్టీవ్ స్మిత్ ఆసీస్ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. ఈ సిరీస్ తొలి రెండు మ్యాచ్‌ల్లోనూ జట్టును నడిపించిన ఈ స్టార్ బ్యాటర్... రెండింట్లోనూ విజయాలు కట్టబెట్టాడు. ట్రావిస్ హెడ్ మంచి జోరు మీదుండగా... గత మ్యాచ్‌లో అలెక్స్ కేరీ గొప్ప ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకున్నాడు. స్మిత్, లబుషేన్, ఉస్మాన్ ఖ్వాజా, వెదరాల్డ్‌తో ఆసీస్ బ్యాటింగ్ బలంగా ఉంది. ఏడో స్థానంలో పేస్ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ బ్యాటింగ్‌కు దిగనున్నాడు. పచ్చికతో కూడిన పిచ్‌పై కంగారూలు ఐదుగురు పేసర్లతో బరిలోకి దిగుతున్నారు. ఈ సిరీస్ తొలి రెండు మ్యాచ్‌ల్లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు దక్కించుకున్న మిచెల్ స్టార్క్ మరోసారి బౌలింగ్ దళాన్ని నడిపించనున్నాడు. మికెల్ నెసెర్, బోలాండ్, డగెట్ అతడికి సహకరించనున్నారు.

సమష్టిగా రాణిస్తేనే...

మరోవైపు ఇంగ్లండ్ విషయానికి వస్తే... ఇప్పటికే సిరీస్ కోల్పోయిన ఆ జట్టు... చివరి రెండు మ్యాచ్‌ల్లోనైనా పోరాడాలని భావిస్తోంది. 'ఆస్ట్రేలియా నుంచి సానుకూల దృక్పథంతో తిరిగి వెళ్లాలనుకుంటున్నాం. సిరీస్ కోల్పోయినప్పటికీ ఇక మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేస్తాం' అని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అన్నాడు. 'బాజ్‌బాల్' ఆటతీరు పెద్దగా ఫలితాన్నివ్వని నేపథ్యంలో మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్ ఎలాంటి ప్రణాళికతో బరిలోకి దిగుతుందో చూడాలి. మూడో టెస్టుకు ముందు లభించిన విరామంలో బీచ్ రిసార్ట్‌కు వెళ్లిన ఇంగ్లండ్ ఆటగాళ్లు నియంత్రణ కోల్పోయే రీతిలో మద్యం సేవించి వార్తల్లోకెక్కగా... అందులో వైరల్‌గా మారిన బెన్ డకెట్‌పై టీమ్ మేనేజ్‌మెంట్ నమ్మకముంచింది. ఈ సిరీస్‌లో ఆడిన 6 ఇన్నింగ్స్‌లలో కలిపి డకెట్ 97 పరుగులే చేసినప్పటికీ... మరో మెరుగైన ప్రత్యామ్నాయం లేకపోవడంతో అతడినే కొనసాగించాల్సిన పరిస్థితి. ఇక ప్రధాన పేసర్ జోఫ్రా ఆర్చర్ గాయంతో సిరీస్‌కు దూరం కావడం ఇంగ్లండ్ జట్టును మరింత కష్టాల్లోకి నెట్టింది. అతడి స్థానంలో అట్కిన్సన్ బరిలోకి దిగనున్నాడు. సుదీర్ఘ కెరీర్‌లో ఈ సిరీస్‌లోనే ఆసీస్ గడ్డపై తొలి టెస్టు సెంచరీ నమోదు చేసుకున్న మాజీ కెప్టెన్ జో రూట్... ఆ తర్వాత అదే జోరు కొనసాగించడంలో విఫలమవడం సిరీస్ ఫలితంపై ప్రభావం చూపింది. మరి ఎలాంటి ఒత్తిడి లేని ఈ పోరులో క్రాలీ, డకెట్, బెథెల్, రూట్, బ్రూక్, స్టోక్స్, జేమీ స్మిత్‌తో కూడిన ఇంగ్లండ్ బ్యాటింగ్ ఆర్డర్ ఏమాత్రం ఆకట్టుకుంటుందనేది ఆసక్తికరం. బౌలింగ్‌లో కార్స్, జాక్స్ కీలకం కానున్నారు.

జట్ల వివరాలు

ఆస్ట్రేలియా (అంచనా): స్మిత్ (కెప్టెన్), వెదరాల్డ్, హెడ్, లబుషేన్, ఖ్వాజా, కేరీ, గ్రీన్, నెసెర్, స్టార్క్, డగెట్/జే రిచర్డ్‌సన్, బోలాండ్.

ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, బెథెల్, రూట్, బ్రూక్, జేమీ స్మిత్, విల్ జాక్స్, అట్కిన్సన్, కార్స్, టంగ్.

4 మెల్‌బోర్న్ మైదానంలో ఆస్ట్రేలియా జట్టుకు స్టీవ్ స్మిత్ నాయకత్వం వహించిన టెస్టులు. స్మిత్ సారథ్యంలో ఈ వేదికపై ఆస్ట్రేలియా రెండు టెస్టుల్లో నెగ్గి, మరో రెండు టెస్టులను 'డ్రా'గా ముగించి అజేయంగా ఉంది.

57 మెల్‌బోర్న్ మైదానంలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన టెస్టులు. 29 టెస్టుల్లో ఆస్ట్రేలియా నెగ్గగా... 20 టెస్టుల్లో ఇంగ్లండ్ గెలిచింది. 8 టెస్టులు 'డ్రా' అయ్యాయి.

117 మెల్‌బోర్న్ మైదానంలో ఇప్పటి వరకు ఆస్ట్రేలియా ఆడిన టెస్టులు. ఈ వేదికపై ఆస్ట్రేలియా 68 టెస్టుల్లో గెలిచి, 32 టెస్టుల్లో ఓడిపోయింది. 17 టెస్టులు 'డ్రా'గా ముగిశాయి.

ఐవరీకోస్ట్ గెలుపు బోణీ

ఎమాద్

రబాట్ (మొరాకో): ఆఫ్రికా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఐవరీకోస్ట్ జట్టు శుభారంభం చేసింది. మొజాంబిక్ జట్టుతో జరిగిన గ్రూప్ 'ఎఫ్' తొలి లీగ్ మ్యాచ్‌లో ఐవరీకోస్ట్ 1–0 గోల్ తేడాతో గెలిచింది. ఆట 49వ నిమిషంలో ఎమాద్ చేసిన గోల్‌తో ఐవరీకోస్ట్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని ఐవరీకోస్ట్ తమ ఖాతాలో మూడు పాయింట్లను వేసుకుంది. ఇదే గ్రూప్‌లోని మరో మ్యాచ్‌లో కామెరూన్ 1–0 గోల్ తేడాతో గాబోన్ జట్టును ఓడించింది. ఆట ఆరో నిమిషంలో ఇట్టా ఇయోంగ్ గోల్ చేసి కామెరూన్ ఖాతా తెరిచాడు. ఆ తర్వాత గాబోన్ జట్టు స్కోరును సమం చేసేందుకు యత్నించి విఫలమైంది. కామెరూన్–గాబోన్ మ్యాచ్‌తో ఆరు గ్రూప్‌ల తొలి రౌండ్ మ్యాచ్‌లు ముగిశాయి. గ్రూప్ 'ఎ'లో ఆతిథ్య మొరాకో జట్టు... గ్రూప్ 'బి'లో ఈజిప్ట్, దక్షిణాఫ్రికా జట్లు... గ్రూప్ 'సి'లో ట్యునీషియా, నైజీరియా జట్లు... గ్రూప్ 'డి'లో సెనెగల్, డీఆర్ కాంగో జట్లు... గ్రూప్ 'ఇ'లో అల్జీరియా, బుర్కినఫాసో జట్లు... గ్రూప్ 'ఎఫ్'లో ఐవరీకోస్ట్, కామెరూన్ జట్లు తమ ప్రత్యర్థి జట్లపై గెలుపొందాయి. నేడు జరిగే గ్రూప్ 'ఎ' రెండో రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో జాంబియాతో కొమొరోస్; మొరాకోతో మాలి... గ్రూప్ 'బి' రెండో రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో అంగోలాతో జింబాబ్వే; ఈజిప్ట్‌తో దక్షిణాఫ్రికా తలపడతాయి.

యశ్‌వర్ధన్ రెడ్డికి సింగిల్స్ టైటిల్

సాక్షి, హైదరాబాద్: అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) చాంపియన్‌షిప్ సిరీస్ (సీఎస్)–7 టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన యశ్‌వర్ధన్ రెడ్డి విజేతగా నిలిచాడు. హైదరాబాద్‌లో జరిగిన ఈ టోర్నీలో అండర్–12 బాలుర సింగిల్స్ విభాగంలో పదేళ్ల యశ్‌వర్ధన్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. మాజీ టెన్నిస్ ప్లేయర్ అపురూప్ రెడ్డికి చెందిన టెన్నిస్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న యశ్‌వర్ధన్... ఫైనల్లో 6–3, 6–0తో రాయన్‌పై గెలుపొందాడు. అంతకుముందు సెమీఫైనల్లో యశ్‌వర్ధన్ 6–4, 3–6, 6–0తో క్రెశివ్ శర్మపై, క్వార్టర్ ఫైనల్లో 6–4, 6–3తో అశ్వత్ చామర్తిపై విజయం సాధించాడు.

విలియమ్సన్ లేకుండానే...

- భారత పర్యటనకు న్యూజిలాండ్ జట్ల ప్రకటన
- బ్రేస్‌వెల్‌కు వన్డే సారథ్య బాధ్యతలు
- టి20 జట్టు కెప్టెన్‌గా సాంట్నర్

వెల్లింగ్టన్: విదేశీ లీగ్‌లు ఆడేందుకు న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్... భారత్‌తో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌లో పర్యటించనున్న న్యూజిలాండ్ జట్టు.. ఈ టూర్‌లో భాగంగా మూడు వన్డేలు, 5 టి20లు ఆడనుంది. దీని కోసం న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు వేర్వేరుగా జట్లను ప్రకటించింది. దక్షిణాఫ్రికా (ఎస్ఏ)20 లీగ్‌లో ఆడేందుకు గానూ విలియమ్సన్ ఈ సిరీస్‌కు దూరం కాగా... యువ ఆటగాళ్లకు న్యూజిలాండ్ బోర్డు పెద్దపీట వేసింది. వన్డేల్లో మైకేల్ బ్రేస్‌వెల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. పేసర్ కైల్ జేమీసన్ రెండు జట్లలోనూ చోటు దక్కించుకున్నాడు. ఎడంచేతి వాటం స్పిన్నర్ జేడెన్ లెనాక్స్ తొలిసారి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. గాయం నుంచి కోలుకొని తిరిగి వచ్చిన సాంట్నర్ టి20ల్లో న్యూజిలాండ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. క్రిస్టియన్ క్లార్క్, ఆదిత్య అశోక్, జోష్ క్లార్క్‌సన్, నిక్ కెల్లీ, మిచెల్ రే వంటి పెద్దగా అనుభవం లేని ఆటగాళ్లతో న్యూజిలాండ్ బరిలోకి దిగనుంది. జేడెన్ లెనాక్స్‌పై ఆ జట్టు భారీ అంచనాలు పెట్టుకుంది. 'న్యూజిలాండ్ 'ఎ' జట్టు తరఫున లెనాక్స్ చక్కటి ప్రదర్శన కనబర్చాడు. దానివల్లే అతడికి ఈ అవకాశం దక్కింది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో గత కొన్నాళ్లుగా అతడు నిలకడైన ప్రదర్శన చేస్తున్నాడు. దేశవాళీల్లో కనబర్చిన దూకుడే... అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగిస్తాడనే నమ్మకముంది' అని న్యూజిలాండ్ కోచ్ రోబ్ వాల్టర్ అన్నాడు. త్వరలో టి20 ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో... గాయం నుంచి ఇప్పుడే కోలుకుంటున్న టామ్ లాథమ్‌ను ఈ సిరీస్‌కు ఎంపిక చేయలేదు. దేశవాళీల్లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన బెవాన్ జాక్స్, టిమ్ రాబిన్‌సన్ టి20 జట్టులో చోటు దక్కించుకున్నారు. జేమ్స్ నీషమ్, ఇష్ సోధి కూడా జట్టుకు ఎంపికయ్యారు. నాథన్ స్మిత్, బ్లెయిర్ టిక్నెర్, మార్క్ చాప్‌మన్‌లను వన్డే జట్టు ఎంపికలో పరిగణనలోకి తీసుకోలేదు. టి20 జట్టులో మాత్రం చాప్‌మన్‌కు చోటు దక్కింది.

న్యూజిలాండ్ వన్డే జట్టు: బ్రేస్‌వెల్ (కెప్టెన్), ఆదిత్య అశోక్, క్రిస్టియన్ క్లార్క్, జోష్ క్లార్క్‌సన్, డెవాన్ కాన్వే, జాక్ ఫౌల్క్స్, మిచ్ హే, కైల్ జేమీసన్, నిక్ కెల్లీ, జేడెన్ లెనాక్స్, డారిల్ మిచెల్, హెన్రీ నికోల్స్, గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ రే, విల్ యంగ్.

న్యూజిలాండ్ టి20 జట్టు: సాంట్నర్ (కెప్టెన్), బ్రేస్‌వెల్, చాప్‌మన్, కాన్వే, జాకబ్ డఫీ, జాక్ ఫౌల్క్స్, హెన్రీ, జేమీసన్, బెవాన్ జాకబ్స్, డారిల్ మిచెల్, జేమ్స్ నీషమ్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, టిమ్ రాబిన్‌సన్, ఇష్ సోధి.

బాలాజీ కీలక ఆటగాడు

తదుపరి 'డేవిస్' పోరుకు పరిశీలిస్తాం ● భారత కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: అనుభవజ్ఞుడైన శ్రీరామ్ బాలాజీ భారత టెన్నిస్‌లో కీలక ఆటగాడని, తదుపరి డేవిస్ కప్ 'టై' కోసం అతని పేరును తప్పకుండా పరిశీలిస్తామని భారత కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ తెలిపాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7, 8 తేదీల్లో జరిగే డేవిస్ కప్ క్వాలిఫయర్స్‌లో నెదర్లాండ్స్‌తో తలపడే భారత జట్టుకు డబుల్స్ స్పెషలిస్ట్ ప్లేయర్ బాలాజీ పక్కన బెట్టారు. దీనిపై రాజ్‌పాల్ స్పందిస్తూ మేలైన కాంబినేషన్‌లో భాగంగానే అతన్ని పక్కన బెట్టాల్సి వచ్చిందని అన్నాడు. బాలాజీ జట్టు అవసరాల కోసం గతంలో సింగిల్స్ కూడా ఆడాడని కెప్టెన్ గుర్తు చేశాడు. సీనియర్ డబుల్స్ ఆటగాడిని తప్పకుండా తదుపరి డేవిస్ కప్ మ్యాచ్‌ల కోసం పరిగణనలోకి తీసుకుంటామన్నారు. 'డబుల్స్‌లో మంచి కాంబినేషన్ కోసం అన్వేషించాం. ఇందులో భాగంగా 'డ్యూస్–కోర్ట్' ప్లేయర్ అయితే బాగుంటుందనిపించింది. యూకీ బాంబ్రీ 'ఆడ్–కోర్ట్' ప్లేయర్ అందుకే హైదరాబాదీ ఆటగాడు రిత్విక్ బొల్లిపల్లిని 'డ్యూస్–కోర్ట్' ప్లేయర్‌గా భావించి యూకీకి జతగా ఎంపిక చేశాం' అని రాజ్‌పాల్ వివరణ ఇచ్చాడు. డ్యూస్–కోర్ట్ అంటే ఆట మొదలయ్యే కోర్ట్ కుడివైపు ఉండేది. ఆడ్–కోర్ట్ అంటే అడ్వాంటేజ్ ఎడమ వైపున ఉంటుంది.

ఆర్యన్ షా అవుట్

భారత డేవిస్ కప్ జట్టులో రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికైన ఆర్యన్ షాను తొలగించినట్లు ఆలిండియా టెన్నిస్ సంఘం (ఐటా) స్పష్టం చేసింది. 'నెదర్లాండ్స్‌తో జరిగే డేవిస్ పోరుకు అందుబాటులో ఉంటానని ఆర్యన్ చెప్పడంతోనే అతని రిజర్వ్ ఆటగాడిగా తీసుకున్నాం. కానీ జట్టును ప్రకటించాక తాను ఆ సమయంలో అందుబాటులో ఉండలేనంటూ ఐటాకు లేఖ రాశాడు. ఇది ఏమాత్రం ఆమోద యోగ్యం కానేకాదు' అని ఐటా ఉన్నతాధికారి ఒకరు ఆర్యన్ వ్యవహారశైలిని తప్పుబట్టారు. సింగిల్స్‌లో 403 ర్యాంకర్ ఆర్యన్ షా భారత నంబర్ వన్ సుమిత్ నగాల్ (277 ర్యాంకు) తర్వాత మేటి ర్యాంక్ ప్లేయర్. అయితే అతని కన్నా తక్కువ ర్యాంకుల్లో ఉన్న కరణ్ (471), దక్షిణేశ్వర్ సురేశ్ (524) ప్రధాన జట్టుకు ఎంపిక చేసిన తనను మాత్రం రిజర్వ్‌గా ఉంచడంతో తప్పుకున్నాడు.

ఒవైస్, మనోజ్, రాహుల్ మెరుపులు

తెలంగాణ హైకోర్టు లాయర్స్ జట్టు విజయం

ఒవైస్

సాక్షి, హైదరాబాద్: ఆలిండియా లాయర్స్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో తెలంగాణ హైకోర్టు లాయర్స్ జట్టు శుభారంభం చేసింది. కొచ్చిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఒడిశా హైకోర్టు లాయర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ హైకోర్టు లాయర్స్ జట్టు 57 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన తెలంగాణ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 230 పరుగులు చేసింది. ఒవైస్ 61 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 92 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మనోజ్ 32 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 54 పరుగులు... రాహుల్ తపాడియా 8 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో 44 పరుగులు సాధించారు. మరో బ్యాటర్ ఉన్నం కృష్ణ 21 పరుగులతో ఫర్వాలేదనిపించాడు. 231 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఒడిశా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసి ఓడిపోయింది. ఒడిశా జట్టులో లలిత్ 59 పరుగులు, సిద్ధాంత్ 51 పరుగులు సాధించారు. తెలంగాణ హైకోర్టు జట్టు బౌలర్లలో సాయిచంద్ (2/14), షాహిద్ హసన్ (2/34), రాజ్‌గోపాల్ రెడ్డి (2/29) రాణించారు. ఒవైస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

అమెరికాలోని లూసియానాలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా మిసిసిపీ నది ఒడ్డున వరుసగా వెలిగించిన మంటల వద్ద గుమికూడిన ప్రజలు

ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్ సమీప సట్టన్ కోల్డ్‌ఫీల్డ్‌లోని బ్లాక్‌రూట్ పూల్‌లో గురువారం వణికించే చలిలో జనం క్రిస్మస్ స్నానాలు

జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగర సమీపంలోని ఫెల్డ్‌బర్గ్ పర్వతంపై మంచుమయంగా మారిన చెట్లు

టెక్సాస్ న్యూట్రిషన్ అడ్వైజరీ కమిటీ సభ్యురాలిగా పద్మజా పటేల్

హ్యూస్టన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్ర న్యూట్రిషన్ అడ్వైజరీ కమిటీ సభ్యురాలిగా భారత సంతతికి చెందిన వైద్యురాలు పద్మజా పటేల్ నియమితులయ్యారు. మిడ్‌ల్యాండ్‌లో ఉంటున్న పద్మజా పటేల్ 2029 సెప్టెంబర్ వరకు ఈ బాధ్యతల్లో కొనసాగుతారని రాష్ట్ర గవర్నర్ గ్రెగ్ అబాట్ చెప్పారు. ఈ కమిటీ డైట్, న్యూట్రిషన్ సంబంధిత అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలిస్తుంది. వ్యాధుల నివారణ, నియంత్రణలో ఆహారం పాత్రను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తుంటుంది. పెద్ద ఎత్తున జరిగిన వడబోత ప్రక్రియ అనంతరం గవర్నర్ కార్యాలయం కమిటీకి పటేల్‌తో కలిపి నలుగురు సభ్యులను ఎంపిక చేసింది. బరోడా వైద్య కళాశాలలో చదువుకున్న పద్మజా పటేల్ అనంతరం అమెరికాలో వైద్య శిక్షణ పొందారు. ప్రస్తుతం ఈమె నుడ్జ్ హెల్త్‌లో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా, అమెరికన్ కాలేజ్ లైఫ్ స్టయిల్ మెడిసిన్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు.

మోదీ మాటలకు చేతలకు పొంతనేలేదు

ఆరావళి నిర్వచనంపై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ: పర్యావరణ సంబంధ అంశాల్లో మోదీ ప్రభుత్వం చెప్పేదానికి, చేసేదానికి పొంతనే లేదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఆరావళి శ్రేణికి సంబంధించి పర్వతాలపై కేంద్రం తాజాగా తీసుకువచ్చిన నిబంధనలతో 90% పర్వత ప్రాంతాలకు ఎటువంటి రక్షణ ఉండదని, మైనింగ్, రియల్ ఎస్టేట్ తదితర కార్యకలాపాలతో వాటి మనుగడే ప్రమాదంలో పడుతుందని తెలిపింది. ఆరావళికి సంబంధించి మోదీ ప్రభుత్వం ఇచ్చిన తాజా నిర్వచనం నిపుణుల సూచనలకు విరుద్ధం, ప్రమాదకరమని పేర్కొంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం ఎక్స్‌లో ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు. పర్యావరణ రక్షణ చట్టాలను బలహీనం చేయడం, కాలుష్య నిబంధనలను సడలించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను దెబ్బతీసేందుకు కేంద్రం ఉద్దేశపూర్వకంతో ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మరోవైపు, తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందంటూ ప్రభుత్వంపై ఆయన ధ్వజమెత్తారు.

అధికారుల ఫ్యూజులు ఎగిరిపోయాయ్!

విద్యుత్ స్తంభం ఎక్కి.. కనెక్షన్లు తొలగించి
- అప్రకటిత కోతలపై వినూత్న నిరసన

ప్రజల కష్టాలు అధికారులకు తెలియాలంటే, వాళ్లు కూడా అదే కష్టాన్ని అనుభవించాలి.. ఇదే సూత్రాన్ని నమ్మారు ఉత్తరాఖండ్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర జతి. తన నియోజకవర్గంలో గంటల తరబడి విధిస్తున్న విద్యుత్ కోతలపై ఆయన విసిగిపోయారు. దీంతో ఆయన, ఏకంగా విద్యుత్ స్తంభం ఎక్కి అధికారుల ఇళ్ల విద్యుత్ కనెక్షన్లు తొలగించి సంచలనం సృష్టించారు.

నిచ్చెన, కటింగ్ ప్లేయర్లతో బయల్దేరి..

మంగళవారం హరిద్వార్ జిల్లా రూర్కీలో ఈ హైడ్రామా చోటుచేసుకుంది. ఎమ్మెల్యే తన అనుచరులతో కలిసి నిచ్చెన, కటింగ్ ప్లేయర్లు పట్టుకుని నేరుగా విద్యుత్ శాఖ అధికారుల నివాసాలకు చేరుకున్నారు. మొదట సూపరింటెండింగ్ ఇంజనీర్ వివేక్ రాజ్‌పుత్ ఇంటి బయట ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి కనెక్షన్‌ను తొలగించారు. ఆ తర్వాత ఏకంగా చీఫ్ ఇంజనీర్ అనుపమ్ సింగ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వినోద్ పాండేల ఇళ్లకు కూడా విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

మీకు గంట.. మాకు 8 గంటలా?

'మా ప్రాంతంలో రోజుకు ఐదు నుండి ఎనిమిది గంటల పాటు అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ప్రజలు అల్లాడిపోతున్నారు, వ్యాపారాలు దెబ్బ తింటున్నాయి. పది రోజులుగా మొర పెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పుడు కేవలం గంటసేపు విద్యుత్ లేకపోతేనే అధికారులకు చెమటలు పడుతున్నాయి.. మరి గంటల తరబడి విద్యుత్ లేకపోతే సామాన్యుడి పరిస్థితి ఏంటి?'.. అని వీరేంద్ర జతి ఘాటుగా ప్రశ్నించారు.

ఎమ్మెల్యేపై విద్యుత్ శాఖ ఫిర్యాదు

ఎమ్మెల్యే చర్యపై విద్యుత్ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలాంటి ముందస్తు 'షట్‌డౌన్' తీసుకోకుండా విద్యుత్ తీగలు కట్ చేయడం వల్ల పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ఇది ప్రభుత్వ పనిలో జోక్యం చేసుకోవడమేనని ఆరోపిస్తూ రూర్కీ సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్రజా ప్రతినిధి స్వయంగా విద్యుత్ స్తంభమెక్కి నిరసన తెలపడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అధికారులు ఏసీ గదుల నుంచి బయటికొచ్చి ప్రజల కష్టాలను చూడాలని నెటిజన్లు ఎమ్మెల్యే చర్యను సమర్థిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బహుళ అంతస్తుల భవనంలో మంటలు

40 మందిని కాపాడిన ఫైర్ సిబ్బంది

ముంబై: ముంబై మహానగరం అంధేరి వెస్ట్‌లోని ఓ బహుళ అంతస్తుల భవనంలో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. వీర దేశాయ్ రోడ్డులో ఉన్న 23 అంతస్తుల సొరెంటో టవర్‌లో ఉదయం 10 గంటల సమయంలో మంటలు మొదలయ్యాయి. దీంతో, 16వ అంతస్తులో చిక్కుకున్న 30 నుంచి 40 మందిని మెట్ల మార్గం ద్వారా రక్షించినట్లు ఓ అధికారి చెప్పారు. ఒక మహిళ సహా ముగ్గురిని 15వ ఫ్లోర్‌లోని ఓ ఫ్లాట్ నుంచి సురక్షితంగా కిందికి దించామని చెప్పారు. మంటల కారణంగా 10, 21వ అంతస్తుల మధ్యలోని విద్యుత్ వ్యవస్థ మొత్తం దెబ్బతింది. 12, 13, 14వ అంతస్తులు పూర్తిగా కాలిపోయాయి. 14వ అంతస్తులో ఉంటున్న ప్రముఖ సినీ నిర్మాత సందీప్ సింగ్ నివాసం కూడా దెబ్బతింది. ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన ఆయన ఈ అగ్ని ప్రమాదంలో చిక్కుకున్నారు. ఫైర్ సిబ్బంది ఆయన్ను రక్షించారు. అనంతరం సందీప్ సింగ్‌ను నటి అంకిత లొఖాండే, ఆమె భర్త వికీ జైన్ తమ ఇంటికి తీసుకెళ్లారు.

నేపాల్‌లో ఇద్దరు భారతీయులు అరెస్ట్

కఠ్మాండు: మాదక ద్రవ్యాలు కలిగి ఉన్నందుకు నేపాల్ పోలీసులు రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు భారతీయులతోపాటు ఒక థాయ్‌లాండ్ వాసిని అరెస్ట్ చేశారు. జేవియర్ మాథ్యూ ధలియచెరీ(55), ముర్సలెన్ హుస్సేన్(21)లను సినమంగళ్ ప్రాంతంలో జరిపిన దాడిలో 3.750 కిలోల కొకైన్‌తోపాటు పట్టుకున్నట్లు తెలిపారు. లావోస్ నుంచి సింగపూర్ మీదుగా కఠ్మాండుకు చేరుకున్న హుస్సేన్ కొకైన్‌తో సినమంగళ్ వద్ద రోడ్డు పక్కన ఉండగా పట్టుకున్నామన్నారు. అదేవిధంగా, బ్యాంకాక్ మీదుగా లావోస్ నుంచి వచ్చిన థాయ్ వాసి రుసానీ కామా(40) బస చేసిన హోటల్ రూంలో 12 కొకైన్ క్యాప్సూల్స్ దొరికాయి. ఆమెను ఆస్పత్రిలో చేర్పించి, పొట్టలో దాచిన మరో 29 క్యాప్సూల్స్‌ను కక్కించారు. కోర్టు అనుమతితో ముగ్గుర్నీ జ్యుడీషియల్ కస్టడీకి తరలించామన్నారు.

67 విమానాలను రద్దు చేసిన ఇండిగో

ముంబై: అననుకూల వాతావరణం, నిర్వహణాపరమైన కారణాలు చూపుతూ ఇండిగో సంస్థ గురువారం వివిధ విమానాశ్రయాల్లో 67 విమానాలను రద్దు చేసింది. అయితే, ఇందులో నిర్వహణా పరమైన కారణాలతో రద్దయినవి నాలుగు మాత్రమేనని వివరణ ఇచ్చింది. వాతావరణం అనుకూలించక అగర్తల, చండీగఢ్, డెహ్రాడూన్, వారణాసి, బెంగళూరు తదితర విమానాశ్రయాల్లో విమానాలను రద్దు చేశామంది. ఈ నెల 10 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు 'అఫీషియల్ ఫాగ్ విండో'గా డీజీసీఏ ప్రకటించింది. దీని ప్రకారం ..తక్కువ దృగ్గోచరత ఉన్న వేళల్లో నడిపే విమానాలకు అనుభవజ్ఞులైన పైలట్లకు విమానయాన సంస్థలు విధులు కేటాయించాల్సి ఉంటుంది. ఇతర నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.

హెలికాప్టర్ కూలి.. ఐదుగురు మృతి

దారెస్సలామ్: టాంజానియాలో వైద్య సహాయక బృందంతో వెళ్తున్న హెలికాప్టర్ కూలి, అందులోని మొత్తం ఐదుగురూ ప్రాణాలు కోల్పోయారు.
ఆఫ్రికాలోని అత్యంత ఎత్తయిన కిలిమంజారో పర్వత ప్రాంతంలోని మౌంట్ బరాఫు, కిబో శిఖరం మధ్యన 4 వేల మీటర్ల ఎత్తులో బుధవారం సాయంత్రం ఘటన చోటుచేసుకుంది. కిలిమంజారో ఏవియేషన్ సంస్థకు చెందిన ఈ హెలికాప్టర్‌లో ప్రమాద సమయంలో పైలట్‌తోపాటు ఇద్దరు విదేశీయులు, ఒక వైద్యుడు, టూర్ గైడ్ ఒకరు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.
మసీదులో ఆత్మాహుతి దాడి..

ఆత్మాహుతి దాడిలో ఐదుగురు మృతి

లాగోస్: నైజీరియాలోని ఈశాన్య మైదుగురిలోని ఓ మసీదులో బుధవారం రాత్రి ప్రార్థనల సమయంలో ఆత్మాహుతి దాడి జరిగింది. ఘటనలో ఐదుగురు చనిపోగా, 30 మంది వరకు గాయాలపాలయ్యారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు, ఘటనా ప్రాంతంలో లభ్యమైన వస్తువుల ఆధారంగా ఆత్మాహుతి దాడిగా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బోకో హరామ్, ఇస్లామిక్ స్టేట్‌తోపాటు సాయుధ గ్రూపుల కార్యకలాపాల కారణంగా కల్లోల పరిస్థితులు నెలకొన్న మైదుగురిలో క్రిస్మస్ వేళ జరిగిన ఈ ఘటన ఉద్రిక్తతలను మరింతగా పెంచింది. తాజా ఘటనకు బాధ్యతను ఎవరూ ప్రకటించుకోనప్పటికీ ప్రధానంగా బోకో హరామ్‌పైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నేనెవరో నీకింకా తెలీదు.. ఇప్పుడు తెలుస్తుంది

ఉపాధ్యాయుడిని హెచ్చరించి మరీ కాల్చివేత
- అలీఘడ్ వర్సిటీలో దారుణ హత్య
- గుర్తు తెలియని దుండగుల దుశ్చర్య

అలీఘడ్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ క్యాంపస్‌లో బుధవారం రాత్రి దారుణం జరిగింది. యూనివర్సిటీ పరిధిలోని పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడిని గుర్తు తెలియని దుండగులు అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అసెంబ్లీలో రాష్ట్ర శాంతిభద్రతల గురించి ప్రశంసలు కురిపించిన కొద్ది గంటల్లోనే ఈ ఘటన జరగడం గమనార్హం.

సహచరులతో కలిసి వెళ్తుండగా..

క్యాంపస్‌లోని ఏబీకే హైస్కూల్‌లో 11 ఏళ్లుగా డానిష్ రావు కంప్యూటర్ సైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి 8.50 గంటల సమయంలో ఆయన తన ఇద్దరు సహచరులతో కలిసి వర్సిటీ సెంట్రల్ లైబ్రరీ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్నారు. ఆ సమయంలో స్కూటర్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు వారిని అడ్డుకున్నారు. కాల్పులు జరపడానికి ముందు ఒక నిందితుడు డానిష్‌తో 'నేనెవరో నీకింకా తెలియదు.. ఇప్పుడు తెలుస్తుంది'.. అంటూ హెచ్చరించి, పిస్టల్‌తో కాల్పులు జరిపాడు.

హత్యకు గురైన డానిష్ రావు

'లైబ్రరీ సమీపంలో కాల్పులు జరిగినట్లు మాకు రాత్రి 9 గంటలకు సమాచారం అందింది. ఏబీకే స్కూల్ ఉపాధ్యాయుడు డానిష్ రావు తలపై కాల్పులు జరగడం వల్ల ఆయన మరణించారు'.. అని వర్సిటీ ప్రొక్టర్ మొహమ్మద్ వసీం అలీ వెల్లడించారు.

ఆసుపత్రికి చేరేలోపే..

దుండగులు డానిష్‌పై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. ఇందులో రెండు బుల్లెట్లు ఆయన తలలోకి దూసుకుపోయాయి. రక్తపు మడుగులో పడిపోయిన డానిష్‌ను వెంటనే జవహర్‌లాల్ నెహ్రూ వైద్య కళాశాలకు తరలించారు. అయితే, ఆయన అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

నిందితుల కోసం ఆరు బృందాలు

ఈ ఘటనపై సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నీరజ్ జాదన్ స్పందిస్తూ.. 'నిందితులు ఇద్దరూ డానిష్‌ను లక్ష్యంగా చేసుకునే కాల్పులు జరిపారు. నిందితులను పట్టుకోవడానికి ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. క్యాంపస్‌లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నాం'.. అని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెరగడానికి కారణం ఇక్కడి భద్రతేనని సీఎం యోగి ఆదిత్యనాథ్ అసెంబ్లీలో ప్రసంగించిన రోజే, ఒక విద్యాలయంలో ఉపాధ్యాయుడిని కాల్చి చంపడంపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అలీఘడ్ వర్సిటీ క్యాంపస్‌లో ఉద్రిక్తత నెలకొంది. పాత కక్షల కారణంగా ఈ హత్య జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

115 మంది ఐఎస్ ఉగ్రదాడులు అరెస్ట్

ఇస్తాంబుల్: క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల సమయంలో ఉగ్రదాడులకు కుట్ర పన్నారన్న అనుమానంతో తుర్కియే అధికారులు గురువారం దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించారు. మొత్తం 124 ప్రాంతాల్లో సోదాలు జరిపి, ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)కు చెందిన 115 మందిని అదుపులోకి తీసుకున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనే వారే లక్ష్యంగా ముస్లిమేతరులపై దాడులు జరపాలంటూ ఐఎస్ ఇటీవల పిలుపునిచ్చిందని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు మొత్తం 137 మందికి వారెంట్లు జారీ చేశామని, ఇప్పటి వరకు 115 మందిని నిర్బంధంలోకి తీసుకున్నామని చీఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం వెల్లడించింది. దాడుల సందర్భంగా పలు మారణాయుధాలు, మందుగుండు సామగ్రి, కీలక పత్రాలు లభ్యమయ్యాయంది. ఉగ్ర వ్యతిరేక ఆపరేషన్‌ను పోలీసులు కొనసాగిస్తున్నారని కూడా తెలిపింది.

సెమీ కండక్టర్ రంగంలోకి ఆలస్యంగా ప్రవేశించినా

స్వయంసమృద్ధి సాధించాం..

హోం మంత్రి అమిత్ షా వెల్లడి

గ్వాలియర్/రేవా: సెమీ కండక్టర్ రంగంలోకి మన దేశం కాస్త ఆలస్యంగా ప్రవేశించినా బలోపేతమైందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ రంగంలో దేశం స్వయం సమృద్ధి సాధించి, ఎగుమతులను కూడా మొదలుపెట్టిందని ఆయన చెప్పారు. గురువారం గ్వాలియర్‌లో జరిగిన అభ్యుదయ మధ్యప్రదేశ్ గ్రోత్ సమిట్‌లో హోం మంత్రి మాట్లాడారు. కేవలం ఏడాది కాలంలోనే 4.57 లక్షల ఎంఎస్ఎంఈ(సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ)ల రిజిస్ట్రేషన్లను సాధించినందుకు రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. భౌగోళికంగా ఎంతో కీలకమైన, సారవంతమైన భూములున్న మధ్యప్రదేశ్‌లో చిన్న మొత్తంలో పెట్టుబడులు పెట్టిన వారు సైతం కోట్లాది రూపాయలు సంపాదించగలరన్నారు. ఇండోర్‌లో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కును ఏర్పాటు చేసి, దేశవ్యాప్తంగా ఉన్న కంపెనీలు అక్కడ వేర్‌హౌస్‌లు, హబ్‌లు ఏర్పాటు చేసుకునేలా ఆహ్వానిస్తామని చెప్పారు. అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా ఏర్పాటైన ఈ కార్యక్రమంలో మంత్రి అమిత్ షా రూ.2 లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అటల్ జీ గొప్ప వక్త, సున్నిత భావాలున్న కవి, ప్రజాసంక్షేమానికే జీవితం అంకితం చేసిన నేత, రాజకీయాల్లో అజాతశత్రువు'అంటూ కొనియాడారు. సీఎం మోహన్ యాదవ్, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, స్పీకర్ నరేంద్ర సింగ్ తోమర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆదాయం

మనకు వచ్చే ఎన్నో వ్యాధులకు రసాయన ఎరువులే మూల కారణమని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. అందుకే ప్రకృతి వ్యవసాయమే మేలన్నారు. ఈ పద్ధతిలో సాగు చేసిన రైతులకు ఆదాయం కనీసం ఒకటిన్నర రెట్లు అధిక ఆదాయం వస్తుందని, నీరు ఆదా అవడంతోపాటు పరిశుద్ధమైన ఉత్పత్తులతో ప్రజారోగ్యానికి దోహదపడుతుందన్నారు. ఒకే ఒక్క దేశ వాళీ ఆవు మూత్రం, పేడను వినియోగించుకుంటూ 21 ఎకరాల్లో వ్యవసాయ చేయవచ్చన్నారు. రేవాలో జరిగిన రైతుల సదస్సులో మంత్రి ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయానికి ఉన్న అపారమైన మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని దేశంలోని రైతుల వ్యవసాయ ఉత్పత్తులు ప్రపంచ స్థాయికి మరింత మెరుగ్గా చేరుకునేలా ప్రభుత్వం ఒక సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని షా చెప్పారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా 400కు పైగా ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తామని, ఇవి రైతులకు అవసరమైన భూసార, విత్తన పరీక్షలను చేస్తాయన్నారు.

యూనస్ ప్రభుత్వంలోని

వారే హాదీని చంపారు

- ఎన్నికల ప్రక్రియను భగ్నం చేసేందుకు కుట్ర
- మృతుడి సోదరుడి తీవ్ర ఆరోపణలు
- యూనస్ ప్రత్యేక సలహాదారు ఖుదా బక్ష్ రాజీనామా

ఢాకా: బంగ్లాదేశ్‌లో హత్యకు గురైన అతివాద విద్యార్థి నేత షరీఫ్ ఒస్మాన్ హాదీ సోదరుడు మహ్మద్ యూనస్ సారథ్యంలోని ఆపద్ధర్మ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యూనస్ ప్రభుత్వంలోని ఒక వర్గం దేశంలో ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల ప్రక్రియకు విఘాతం కల్గించేందుకు కుట్ర పన్నిందని, అందులో భాగంగానే హాదీని చంపించిందని ఆరోపించారు. హాదీ సోదరుడు ఒమర్ హాదీ ఇంక్విలాబ్ మంచ్ సారథ్యంలో జరిగిన ర్యాలీనుద్దేశించి మాట్లాడుతూ.. 'హాదీ మృతికి మీరే కారణం. ఇదే సాకుతో సాధారణ ఎన్నికలను భగ్నం చేసేందుకు ఇప్పుడు మీరు ప్రయత్నిస్తున్నారు. అధికారంలో ఉన్నవారు ఒస్మాన్ హాదీ హత్య ఘటనపై బాధ్యత నుంచి తప్పించుకోలేరు'అంటూ ఆపద్ధర్మ ప్రభుత్వం వైపు వేలెత్తి చూపారు. హాదీ హత్యకు జరిగిన కుట్రను, కారకులను ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'లేకుంటే దేశం నుంచి మిమ్మల్ని కూడా గెంటివేయక తప్పదు'అంటూ హెచ్చరించారు. గతేడాది షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలేందుకు హాదీ సారథ్యంలో జరిగిన ఇంక్విలాబ్ మంచ్ ఆందోళనలే కారణం. కాగా, ఒమర్ హాదీ ఆరోపణల నేపథ్యంలో హోం శాఖకు సంబంధించి యూనస్‌కు ప్రత్యేక సలహాదారుగా వ్యవహరిస్తున్న మహ్మద్ ఖుదా బక్ష్ చౌదరి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను అధ్యక్షుడు బుధవారం రాత్రి ఆమోదించారు.

వారి ఆచూకీ తెలిపితే బహుమానం

చిట్టోగ్రామ్‌లోని రావ్‌జాన్ ఏరియాలో మంగళవారం రాత్రి ఓ హిందువు ఇంటికి నిప్పంటించిన దుండగులు ఆచూకీ తెలిపిన వారికి బహుమానం అందజేస్తామని చిట్టోగ్రామ్ రేంజ్ పోలీస్ చీఫ్ అహ్సాన్ హబీబ్ ప్రకటించారు. ఖతార్‌లో ఉండే సుఖ్ షిల్, అనిల్ షిల్‌ల ఇంటికి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. దుండగులు బయటి నుంచి తలుపులకు తాళాలు వేయడంతో లోపలున్న రెండు కుటుంబాలకు చెందిన మొత్తం ఎనిమిది మంది పైకప్పును తొలగించుకుని, ఎలాగోలా సురక్షితంగా బయటపడ్డారు. ఇదే ప్రాంతంలోని పలు హిందువుల ఇళ్లపై దుండగులు దాడులకు పాల్పడ్డారు. ఈ ప్రాంతంలో గత ఐదు రోజుల వ్యవధిలో హిందువులకు చెందిన ఏడిళ్లకు నిప్పుపెట్టారని మీడియా తెలిపింది. ఈ ఘటనలకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్ చేశామని, మరికొందరి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

పాలస్తీనా నటుడు బక్రి కన్నుమూత

టెల్ అవీవ్: ప్రముఖ పాలస్తీనా నటుడు, దర్శకుడు మహ్మద్ బక్రి(72) కన్నుమూశారు. పాలస్తీనా గుర్తింపు, సంస్కృతిలోని సంక్లిష్టతలను అరబిక్, హీబ్రూ భాషల ద్వారా ప్రపంచానికి తెలియజెప్పేందుకు ఈయన కృషి చేశారు. 2003లో ఈయన దర్శకత్వం వహించిన 'జెనిన్, జెనిన్' అనే డాక్యుమెంటరీ మంచి పేరు తెచ్చిపెట్టింది. అంతకుముందు సంవత్సరం ఇజ్రాయెల్ ఆర్మీ వెస్ట్‌బ్యాంక్ సిటీలో చేపట్టిన ఆపరేషన్ ఫలితంగా జరిగిన విధ్వంసం, పాలస్తీనియన్లు పడిన ఇబ్బందులను ఇందులో కళ్లకుకట్టారు. ఆర్మీకి వ్యతిరేకంగా ఉందంటూ ఈ డాక్యుమెంటరీపై నిషేధం విధించారు. ఇందుకు సంబంధించిన కేసులతో దాదాపు రెండు దశాబ్దాలపాటు ఆయన కష్టాలనెదుర్కొన్నారు. 2025లో 'ఆల్ దటీస్ లెఫ్ట్ ఆఫ్ యూ'లో తన ఇద్దరు కుమారులతోపాటు ఈయన కూడా నటించారు. అకాడమీ అవార్డుకు ఎంపిక ఉత్తమ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్‌లో ఇదొకటి. ఇజ్రాయెల్‌లో జన్మించిన బక్రి, ఇజ్రాయెల్, పాలస్తీనా పౌరసత్వాలున్నాయి. టెల్‌అవీవ్ యూనివర్సిటీలో చదువుకున్న బక్రి పలు హీబ్రూ సినిమాల్లోనూ నటించారు.

- ఛాతీ నొప్పి అని మొత్తుకున్నా పట్టించుకోని వైనం
- 8 గంటల పాటు వెయిటింగ్ రూమ్ లోనే

కెనడాలో ఆస్పత్రి నిర్లక్ష్యానికి

భారతీయుని బలి

వాంకోవర్: ప్రశాంత్ శ్రీకుమార్ అనే 44 ఏళ్ల భారత సంతతి వ్యక్తి కెనడాలో ఆస్పత్రి నిర్లక్ష్యానికి బలైపోయాడు. ఛాతీలో భరించలేనంత నొప్పి అని మొత్తుకుంటున్నా అతనికి వైద్యమే అందించలేదు. ఈసీజీలో అంతా నార్మల్ గానే వచ్చిందని చెప్పి ఎమర్జెన్సీ గదిలో ఏకంగా 8 గంటల పాటు వేచిఉండేలా చేశారు. ఎట్టకేలకు చికిత్స కోసం తీసుకెళ్తుండగానే అతను తీవ్ర గుండెపోటుకు గురయ్యాడు. కూర్చున్న కుర్చీలోనే ఛాతీ పట్టుకుంటూ ఎగిరెగిరి పడి చివరికి నిస్సహాయంగా మరణించాడు. ''నాన్నా!. ఈ నొప్పి భరించలేకపోతున్నా' అంటూ చివరి క్షణాల్లో తన కొడుకు అల్లాడిపోయాడని తండ్రి కుమార్ రోదిస్తూ చెప్పారు. అవే తన చివరి మాటలు అయ్యాయంటూ కన్నీరు మున్నీరయ్యారు. డిసెంబర్ 22వ తేదీన జరిగిన ఈ దారుణం తాజాగా వెలుగులోకి వచ్చింది. కెనడాలోని ఎడ్మాంటన్‌లో ఉండే ప్రశాంత్ తన ఆఫీసులో పని చేస్తున్న సమయంలోనే విపరీతమైన ఛాతీ నొప్పితో అలసిపోయాడు. దాంతో సహోద్యోగి ఒకరు అతడిని వెంటనే గ్రే నన్స్ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చాలాసేపు వెయిటింగ్ రూమ్‌లో కూచోబెట్టాక ఈసీజీ చేశారు. అందులో అంతా నార్మల్‌గానే ఉందంటూ నొప్పికి 'టైలీనల్' అనే మందు ఇచ్చి సరిపెట్టారు. అంతలో ఆస్పత్రికి చేరిన నాన్నతో నొప్పి భరించరానిదిగా ఉందంటూ ప్రశాంత్ వాపోయాడు. 'తన రక్తపోటు(బీపీ) క్షణక్షణానికి పెరుగుతూనే పోయింది. కానీ ఎంత చెప్పినా నర్సులు పట్టించుకోలేదు'' అని తండ్రి ఆక్షేపించారు. ''ఎట్టకేలకు తనను చికిత్సకు తీసుకెళ్లేందుకు వచ్చారు. కానీ అప్పటికే చాలా ఆలస్యమైంది. ప్రశాంత్ నావైపు చూస్తూనే కూర్చున్న కుర్చీలో కుప్పకూలాడు'' అని చెప్పుకొచ్చారు. ఈ ఘటన పట్ల ఆస్పత్రి దిగ్భ్రాంతి వెలిబుచ్చింది. దీనిపై సమీక్ష జరుపుతున్నట్టు తెలిపింది. ప్రశాంత్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపింది. ప్రశాంత్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

రైలు టిక్కెట్ల కొత్త ధరలు

నేటి నుంచి అమల్లోకి..

న్యూఢిల్లీ: సాధారణ బోగీల్లో 215 కిలోమీటర్లకు మించి ప్రయాణించే వారికి కిలోమీటరుకు పైసా చొప్పున, మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీతోపాటు ఏసీ ప్రయాణికులకు కిలోమీటరుకు 2 పైసల చొప్పున చార్జీల పెంపునకు సంబంధించి రైల్వే శాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పెంచిన టిక్కెట్ల ధరలు నేటి (శుక్రవారం) నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నెల 21వ తేదీన చార్జీల పెంచాలని నిర్ణయించినట్లు రైల్వే శాఖ ప్రకటించడం తెల్సిందే. ప్రయాణికుల రైలు టిక్కెట్ల ధరలను పెంచడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. మొదటిసారిగా జూలైలో చార్జీలను పెంచింది. 'ప్రయాణికులకు భారం కాకుండా అందుబాటులో ఉండటం, సేవల నిర్వహణలో సుస్థిరతను సాధించే లక్ష్యంతోనే చార్జీల హేతుబద్ధీకరణ చేపట్టినట్లు రైల్వే శాఖ తెలిపింది. సబర్బన్ రైళ్లు, సీజన్ టిక్కెట్ల ధరల్లో ఎటువంటి మార్పులు లేవని తెలిపింది. సెకండ్ క్లాస్ ఆర్డినరీలో 215 కిలోమీటర్ల వరకు ఎటువంటి పెంపుదల లేదని, దీనివల్ల తక్కువ దూరాల్లో ప్రయాణించే వారిపై అదనంగా ఎటువంటి భారం మోపడం లేదని తెలిపింది.

క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేఖ, కేంద్ర మంత్రి ఖట్టర్

ఢిల్లీలో అటల్ క్యాంటిన్లు ప్రారంభం

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా రాజధాని నగరంలో అటల్ క్యాంటిన్లను ప్రారంభించారు. నిరుపేదలకు తక్కువ ధరకే ఆహారం అందించాలన్న లక్ష్యంగా అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని ప్రస్తుతానికి 45 అటల్ క్యాంటిన్లను ప్రారంభించామన్నారు. మరో 55 క్యాంటిన్లను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. మురికివాడలకు సమీపంలో ఏర్పాటు చేసే ఈ క్యాంటిన్ల ద్వారా రూ.5కే ఫుల్‌మీల్స్ అందిస్తామన్నారు. రూ.700 కోట్లు వెచ్చించి మురికివాడల్లో ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరుస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పాల్గొన్నారు.

వ్యక్తి వికాసానికి కనీస అవసరాలైన శాసనాలు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగంలోని మూడో భాగంలో ప్రకరణలు 12 నుంచి 35 వరకు ప్రాథమిక హక్కుల గురించి తెలుపుతాయి. ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలోని అత్యంత ముఖ్యమైన లక్షణంగా పేర్కొంటారు. వీటిని అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం నుంచి గ్రహించారు. అమెరికా రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను 'బిల్ ఆఫ్ రైట్స్' రూపంలో పొందుపరిచారు. చట్టబద్ధమైన హక్కులకు రాజ్యాంగంలో స్థానం కల్పించి, ప్రత్యేక ప్రతిపత్తితో గుర్తిస్తే వాటిని 'ప్రాథమిక హక్కులు'గా పేర్కొంటారు. వ్యక్తి వికాసానికి ఇవి కనీస అవసరాలు. దేశ ప్రాథమిక శాసనమైన రాజ్యాంగంలో గుర్తించడం వల్ల వీటిని 'ప్రాథమిక హక్కులు' అని అంటారు.

ప్రాథమిక హక్కుల నేపథ్యం

రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు సుదీర్ఘ చారిత్రక నేపథ్యం ఉంది. లోకమాన్య బాలగంగాధర తిలక్ 1895లో 'స్వరాజ్య బిల్లు'లో మొదటిసారిగా ఈ హక్కులను ప్రతిపాదించారు. ఆ తర్వాత..

- 1911లో కలకత్తాలో నిర్వహించిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో హక్కులపై తీర్మానాన్ని ఆమోదించారు.
- 1922లో మహాత్మా గాంధీ సాధారణ ప్రజల హక్కుల గురించి 'యంగ్ ఇండియా'లో ప్రస్తావించారు.
- 1925లో అనిబీసెంట్.. కామన్‌వెల్త్ ఆఫ్ ఇండియా బిల్లులో, ఐర్లాండ్ రాజ్యాంగంలో ప్రస్తావించిన విధంగానే భారతీయులకూ ప్రాథమిక హక్కులు ఉండాలని ప్రతిపాదించారు.
- 1927లో మద్రాసులో ఎం.ఎ. అన్సారీ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో భావి రాజ్యాంగానికి ప్రాథమిక హక్కులు ప్రాతిపదిక కావాలనే తీర్మానాన్ని ఆమోదించారు.
- 1928లో మోతీలాల్ నెహ్రూ కమిటీ వెల్లడించిన నివేదికలో 'ప్రాథమిక హక్కులకు ఆమోదం పొందడం పౌరుల అవసరం'గా పేర్కొన్నారు.
- 1931లో కరాచీలో వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన కొంతమంది ప్రముఖులు ప్రాథమిక హక్కుల గురించి డిమాండ్ చేశారు. మన రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చడానికి వీరి నివేదికే ప్రాతిపదిక అయింది.
- 1931లో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీ భావి భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చాలని కోరారు.
- 1945లో తేజ్ బహదూర్ సప్రూ నాయకత్వంలో ఏర్పడిన పార్టీ రహిత మేధావుల సంఘం కూడా ప్రాథమిక హక్కులు కావాలని డిమాండ్ చేసింది.

రాజ్యాంగ పరిషత్తు - ప్రాథమిక హక్కులు

హక్కులను రాజ్యాంగంలో చేర్చి, వాటికి ఒక నిర్దిష్ట స్వరూపాన్ని కల్పించడానికి రాజ్యాంగ పరిషత్తు 1947 జనవరి 24న సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన 54 మంది సభ్యులతో ఒక సలహా సంఘాన్ని నియమించింది. ఈ సలహా సంఘం ప్రాథమిక హక్కుల పరిశీలన కోసం 1947 ఫిబ్రవరి 12న ఆచార్య జె.బి. కృపలాని అధ్యక్షతన ఒక ఉప సంఘాన్ని నియమించింది.

ఉప సంఘం సూచన మేరకు రాజ్యాంగ పరిషత్ సలహాదారు బి.ఎన్. రావు హక్కులపై ఒక ముసాయిదా తయారు చేశారు. ఈ ముసాయిదాలో హక్కులను.. న్యాయ సంరక్షణ ఉన్న హక్కులు, న్యాయ సంరక్షణ లేని హక్కులుగా వర్గీకరించారు.

ప్రాథమిక హక్కులు - లక్షణాలు

- ప్రవేశికలో పేర్కొన్న న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అనే తాత్విక ఆదర్శాలకు వాస్తవికతను చేకూర్చే విధంగా ప్రాథమిక హక్కులను పొందుపరిచారు.
- ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ (Justiciable) ఉంది. ఇది అత్యంత ముఖ్యమైన లక్షణం. వీటి రక్షణ, అమలుకు రాజ్యాంగంలో న్యాయపరమైన ఏర్పాట్లు ఉన్నాయి.
- ప్రాథమిక హక్కులు ప్రభుత్వ నిరపేక్ష అధికారాల (Absolute Authority)పై పరిమితులు. ప్రభుత్వాలు తమ అధికారాలను రాజ్యాంగానికి లోబడి, ప్రజల హక్కులకు భంగం కలిగించకుండా వినియోగించాలి.
- కొన్ని ప్రాథమిక హక్కులు నకారాత్మకమైనవి (Negative). అంటే ఇవి ప్రభుత్వ అధికారితపై పరిమితులు.

ఉదా: నిబంధనలు 14, 15, 16, 20, 21 మొదలైనవి. ఇవి ప్రభుత్వం ఏయే అంశాలను చేయకూడదో సూచిస్తాయి.

- మరికొన్ని హక్కులు సకారాత్మకమైనవి (Positive). ఇవి ప్రభుత్వ బాధ్యతలను సూచిస్తాయి.

ఉదా: నిబంధన 17లోని అస్పృశ్యత నిషేధం, నిబంధన 24లోని బాల కార్మిక వ్యవస్థ నిషేధం.

- ప్రాథమిక హక్కులన్నింటినీ జాతీయ అత్యవసర పరిస్థితుల్లో రద్దు చేయవచ్చు. నిబంధనలు 20, 21 మాత్రం రద్దుకావు.
- ప్రాథమిక హక్కులన్నీ స్వతహాగా అమల్లోకి వస్తాయి. కానీ, నిబంధనలు 17, 23, 24లో ప్రస్తావించిన అంశాలు స్వతహాగా అమల్లోకి రావు (Non self-executory). వీటి అమలు కోసం పార్లమెంటు ప్రత్యేక చట్టాలు చేయాల్సి ఉంటుంది.
- ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. దీని కోసం రాజ్యాంగ సవరణ అవసరం. కానీ, సవరణ పేరుతో వీటి స్ఫూర్తికి భంగం కలిగించకూడదు.
- కొన్ని ప్రాథమిక హక్కులు కొన్ని వర్గాలు, సాయుధ బలగాలు, పోలీసులు, ఖైదీలు, అత్యవసర సర్వీసుల్లో పనిచేస్తున్నవారికి పరిమితంగా వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక హక్కులు పౌరుల చర్యలకు వ్యతిరేకంగా కూడా లభిస్తాయి.

ఉదా: ప్రకరణ 17 – అస్పృశ్యత నివారణ, ప్రకరణ 23 – వెట్టిచాకిరి రద్దు, ప్రకరణ 24 – బాలకార్మిక వ్యవస్థ రద్దు.

- కొన్ని హక్కులను అల్పసంఖ్యాక వర్గాల ప్రయోజనాలు కాపాడి, జాతీయ సమగ్రత నిలపడానికి ఉద్దేశించారు.

ఉదా: మతస్వేచ్ఛ హక్కు, విద్యా సాంస్కృతిక హక్కు.

- ప్రాథమిక హక్కుల్లో పేర్కొన్న నిషేధాలు/ వివక్షలు.. ప్రభుత్వాలు, పౌరులకు సమానంగా వర్తిస్తాయి.

ఉదా: జాతి, మత, కుల, లింగ, జన్మ సంబంధ వివక్షలను ఎవరూ పాటించకూడదు.

ప్రాథమిక హక్కుల వర్గీకరణ

భారత రాజ్యాంగంలో 7 రకాల ప్రాథమిక హక్కుల గురించి తెలిపారు.

1. సమానత్వ హక్కు (Right to Equality): ప్రకరణలు 14–18.
2. వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్య హక్కు (Personal Freedoms): ప్రకరణలు 19–22.
3. పీడనాన్ని నిరోధించే హక్కు (Right against Exploitation): ప్రకరణలు 23, 24.
4. మత స్వాతంత్ర్య హక్కు (Right to Religion): ప్రకరణలు 25–28.
5. సాంస్కృతిక, విద్యా హక్కులు (Cultural & Educational rights): ప్రకరణలు 29, 30.
6. ఆస్తి హక్కు (Right to Property): ప్రకరణ 31.
7. రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies): ప్రకరణ 32.

ప్రత్యేక వివరణ

పైన పేర్కొన్న ప్రాథమిక హక్కుల్లో అత్యంత వివాదాస్పదమైన ఆస్తి హక్కు (ప్రకరణ 31)ను, ఆస్తి సంపాదన విషయంలో వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన 19(1)(f)ను 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. వీటిని 12వ భాగంలోని 300(ఎ)లో చేర్చారు. ప్రస్తుతం ఆస్తి హక్కు రాజ్యాంగబద్ధ హక్కు (Constitutional Right) మాత్రమే. దీన్ని ఒక చట్టబద్ధమైన హక్కుగానూ పరిగణిస్తున్నారు.

ప్రకరణ 12 - రాజ్యం నిర్వచనం

ప్రాథమిక హక్కులను మౌలికంగా రాజ్యం నిరపేక్ష అధికారాలకు వ్యతిరేకంగా పొందుపరిచారు. రాజ్యాంగంలో రాజ్యం అనే పదాన్ని చాలా చోట్ల ప్రయోగించారు. అయితే రాజ్యం నిర్వచనాన్ని మాత్రం ప్రకరణ 12లో పేర్కొన్నారు. రాజ్యం అనే పదానికి విస్తృతమైన నిర్వచనాన్ని ఇచ్చారు. ప్రాథమిక హక్కులను రాజ్యం లేదా ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా గుర్తించారు. కాబట్టి ఏయే సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయి? అనే అంశాన్ని స్పష్టంగా నిర్వచించకపోతే కొన్ని సంస్థలు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినా వాటిపై న్యాయస్థానంలో ప్రశ్నించే అవకాశం ఉండదు. అందువల్ల దీనికి విస్తృతమైన నిర్వచనం అవసరం. దీని ప్రకారం రాజ్యం అంటే..

ఎ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు; కేంద్ర, రాష్ట్ర శాసనసభలు

బి. స్థానిక ప్రభుత్వాలు (మున్సిపాలిటీలు, పంచాయతీలు, జిల్లా బోర్డులు, ట్రస్టులు)

సి. ప్రభుత్వ ఆదేశాల ద్వారా ఏర్పాటైన చట్టబద్ధ, చట్టేతర సంస్థలు (ఎల్.ఐ.సి., ఓ.ఎన్.జి.సి., ఎన్.టి.పి.సి. మొదలైనవి)

డి. న్యాయవ్యవస్థ కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు తన తీర్పుల్లో తెలిపింది. అదేవిధంగా ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్న ప్రైవేట్ సంస్థలు కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయని పేర్కొంది.

పైన పేర్కొన్న సంస్థలతో పాటు ఎలాంటి ఇతర సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయనే అంశాన్ని సుప్రీంకోర్టు వివిధ కేసుల తీర్పుల సందర్భంగా స్పష్టపరిచింది. అవి:

అజయ్ సహాయ్ వర్సెస్ ఖలీద్ ముజీద్ (1981): సుప్రీంకోర్టు ఈ కేసు తీర్పులో ఒక సంస్థను రాజ్యం అనే నిర్వచనంలోకి చేర్చడానికి కింది ప్రాతిపదికలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది.

- మూలధనంలో ప్రభుత్వ వాటా ఉండాలి.
- ఆ సంస్థ మొత్తం ఖర్చును ప్రభుత్వం భరించాలి.
- ఆ సంస్థపై సంపూర్ణ పరిపాలనా నియంత్రణ ఉండాలి.
- ఆ సంస్థ ఆర్థిక లావాదేవీలు ప్రభుత్వ నియంత్రణలో ఉండాలి.

న్యాయస్థానాలు రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయి – సుప్రీంకోర్టు తీర్పులు

ఎ.ఆర్. అంతులే వర్సెస్ ఆర్.ఎస్. నాయక్ కేసు (1988): న్యాయస్థానాల కొన్ని చర్యలు రాజ్య నిర్వచనంలోకి వస్తాయని ఈ కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. దీనికి రాజ్యాంగంలో స్పష్టమైన ఆధారాలున్నాయి.

ప్రకరణ 145, 146 ప్రకారం సుప్రీంకోర్టు సొంత నియమ, నిబంధనలను రూపొందించుకోవచ్చు. అదేవిధంగా తన సిబ్బందిని నియ మించుకునే అధికారం కూడా సుప్రీంకోర్టుకు ఉంది. ఈ చర్యలు కార్యనిర్వాహకపరమైనవి. వీటివల్ల పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు వాటిని న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చు.

కాబట్టి న్యాయశాఖ కార్యనిర్వాహక విధులను నిర్వర్తిస్తున్నప్పుడు మాత్రమే రాజ్యమనే పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు ప్రకటించింది.

రాజ్యం నిర్వచనం - మినహాయింపులు

సహకార సంఘాలు; బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా; ప్రభుత్వ ధన సహాయం పొందని ప్రైవేట్ విద్యాసంస్థలు; ప్రభుత్వ పరిపాలన, ఆర్థిక నియంత్రణ లేని ఇతర సంస్థలు రాజ్యం నిర్వచనం పరిధిలోకి రావు.

ప్రకరణ 13 – చట్టం నిర్వచనం, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైన చట్టాలు – న్యాయ సమీక్షాధికారం

ప్రకరణ 13(1) ప్రకారం రాజ్యాంగం అమల్లోకి వచ్చిన వెంటనే అంతవరకు అమల్లో ఉన్న చట్టాలు ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైతే.. అవి చెల్లకుండా పోతాయి.

ప్రకరణ 13(2) ప్రకారం ప్రాథమిక హక్కులను హరించే లేదా పరిమితం చేసే చట్టాలు, ఆదేశాలు చెల్లవు.

ప్రకరణ 13(3)లో పేర్కొన్న చట్టం నిర్వచనం కిందకి వచ్చే అంశాలు:

- కేంద్ర, రాష్ట్ర శాసనసభలు రూపొందించిన శాసనాలు.
- రాష్ట్రపతి, గవర్నర్ జారీ చేసిన ఆదేశాలు, ఆర్డినెన్స్‌లు.
- ప్రభుత్వ రూల్స్, రెగ్యులేషన్స్, నోటిఫికేషన్స్, ప్రకటనలు.
- ప్రభుత్వం గుర్తించిన, చట్టబద్ధత ఉన్న ఆచార వ్యవహారాలు.

ప్రత్యేక వివరణ

1971లో 24వ రాజ్యాంగ సవరణ ద్వారా.. నిబంధన 368 ప్రకారం రాజ్యాంగానికి చేసిన సవరణలను నిబంధన 13లో పేర్కొన్న 'చట్టం' నిర్వచన పరిధి నుంచి మినహాయించారు. ఈ అంశాన్ని గోలక్‌నాథ్ కేసు(1967)లో సుప్రీంకోర్టు తీర్పును అధిగమించడానికి చేర్చారు. కానీ, సుప్రీంకోర్టు 19 73లో కేశవానందభారతి కేసులో ఈ సవరణ చెల్లద ని తీర్పు చెప్పింది. కాబట్టి రాజ్యాంగ సవరణ కూడా చట్టం నిర్వచన పరిధిలోకి వస్తుంది.

ఉదరంలో ఉత్పత్తయ్యే ఆమ్లం ఏది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

జనరల్‌సైన్స్ విభాగం నుంచి గతంలో వచ్చిన ప్రశ్నలు

1. మానవ శరీరంలో ఎన్ని ఎముకలుంటాయి? (ఏఈఈ-2007)
   1) 330 2) 280
   3) 206 4) 220
2. మానవ శరీరంలో అతి కఠిన భాగం? (ఏఎస్‌వో-2008)
   1) గోర్లు 2) ఎముకలు
   3) కొమ్ములు 4) ఎనామిల్
3. చెవుల్లోని మొత్తం ఎముకల సంఖ్య? (ఏఎస్‌వో-2008)
   1) రెండు 2) నాలుగు
   3) ఆరు 4) ఎనిమిది
4. దంతక్షయాన్ని అరికట్టడానికి నీటి సరఫరాలో కలిపే రసాయన పదార్థం? (గ్రూప్-2, 2000)
   1) క్లోరైడ్ 2) ఫ్లోరైడ్
   3) బ్రోమైడ్ 4) సల్ఫైడ్
5. పాలలోని చక్కెర? (జె.ఎల్.-2007)
   1) ఫ్రక్టోజ్ 2) గ్లూకోజ్
   3) సుక్రోజ్ 4) లాక్టోజ్
6. పాలు అంటే ఏమిటి? (గ్రూప్-1, 2002)
   1) కొవ్వు విస్తరించి ఉన్న రక్తం
   2) కొవ్వు విస్తరించి ఉన్న నీరు
   3) నీరు విస్తరించి ఉన్న కొవ్వు
   4) నీరు విస్తరించి ఉన్న చమురు
7. పాలలో కొవ్వు శాతం ఏ సమయంలో తగ్గుతుంది? (ఏఈఈ-2009)
   1) చలికాలం 2) వేసవికాలం
   3) వర్షాకాలం 4) ఏదీకాదు
8. ఆవు పాలు పసుపు రంగులో ఉండటానికి కారణం? (గ్రూప్-2, 2012)
   1) జాంతోఫిల్ 2) మాల్టోజ్
   3) రైబోఫ్లావిన్ 4) కెరాటిన్
9. కండరాలకు వచ్చే కేన్సర్ ఏది? (గ్రూప్-1, 2003)
   1) లింపోమా 2) ల్యూకేమియా
   3) సార్కోమా 4) అనీమియా
10. నేత్రదానంలో దాత తన కంటిలోని ఏ భాగాన్ని దానం చేస్తాడు? (గ్రూప్-1, 2003)
    1) కార్నియా 2) లెన్స్
    3) రెటీనా 4) పూర్తి కన్ను
11. పాలిష్ చేసిన బియ్యాన్ని ఎక్కువగా తీసుకుంటే ఏ విటమిన్ లోపిస్తుంది? (డిప్యూటీ ఈవో-2008)
    1) A 2) B_2
    3) D 4) B_1
12. ఏ విటమిన్ లోపం వల్ల చిగుళ్ల నుంచి రక్తస్రావమవుతుంది?
    1) A 2) D 3) K 4) C
13. తాడు రక్తం (Cord Blood) అంటే ఏమిటి? (గ్రూప్-2, 2005)
    1) కూతుళ్లకు తండ్రి దానం చేసే రక్తం
    2) కృత్రిమ రక్తం
    3) గుండె కాండ కణాల నుంచి వృద్ధి చేసిన రక్తం
    4) మాయ కాండ కణాల నుంచి వృద్ధి చేసిన రక్తం
14. హిమోగ్లోబిన్‌లో ఉండే లోహం? (గ్రూప్-1, 1987-88)
    1) మెగ్నీషియం 2) ఇనుము
    3) కోబాల్ట్ 4) మాంగనీస్
15. పేస్‌మేకర్ దేనికి సంబంధించింది? (గ్రూప్-1, 2010)
    1) గుండె 2) ఊపిరితిత్తులు
    3) కాలేయం 4) కిడ్నీ
16. రక్తం ఒక..? (గ్రూప్-1, 2010)
    1) ద్రావణం 2) కొల్లాయిడ్
    3) తరల పదార్థం 4) జెల్
17. శిశువు పితృత్వాన్ని నిర్ధారించేందుకు ఏ పరీక్ష నిర్వహిస్తారు? (సివిల్స్-2010)
    1) ఆమ్నియో సెంటాసిస్
    2) డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్
    3) జన్యు సైక్లింగ్ 4) ఏదీకాదు
18. AB రక్త గ్రూపునకు చెందిన ఒక వ్యక్తిని విశ్వగ్రహీత అని ఎందుకంటారు? (గ్రూప్-1, 2007)
    1) ప్రతిరక్షక జనకాలు లేనందువల్ల
    2) ప్రతిరక్షకాలు ఉన్నందువల్ల
    3) ప్రతిరక్షకాలు లేనందువల్ల
    4) ప్రతిరక్షకాలు – ప్రతి రక్షక జనకాలు లేనందువల్ల
19. సిరా రక్తాన్ని ఆక్సిజన్ కోసం ఊపిరితిత్తులకు చేరవేసేది? (గ్రూప్-2, 2008)
    1) పుపుస సిరలు 2) పుపుస ధమనులు
    3) కుడి జఠరిక 4) మహాధమని
20. చాలా కీటకాలు గాలిని సంగ్రహించే పద్ధతి?
    1) చర్మం ద్వారా 2) మొప్పల ద్వారా
    3) ట్రాకియల్ వ్యవస్థ ద్వారా
    4) లంగ్స్ ద్వారా
21. బయోగ్యాస్‌లోని ప్రధానాంశం? (గ్రూప్-1, 1987)
    1) ఈథేన్ 2) మీథేన్
    3) బ్యూటేన్ 4) ఎసిటలిన్
22. ఆక్సిజన్ లేకుండా ఒక జైవిక పదార్థాన్ని విచ్ఛిన్నం చేయడం ద్వారా ఏ వాయువును ఉత్పత్తి చేయొచ్చు? (గ్రూప్-2, 2001)
    1) బొగ్గుపులుసు వాయువు 2) నత్రజని
    3) SO_2 4) మీథేన్
23. ఆల్కహాల్‌ను తయారు చేయడానికి ఏది అవసరం? (గ్రూప్-2, 2001)
    1) ప్రోటోజోవా 2) శిలీంధ్రాలు – ఈస్ట్
    3) బ్యాక్టీరియా 4) వైరస్
24. పురుషుడి గొంతు కంటే స్త్రీ గొంతు కీచుగా ఉంటుంది. ఎందుకంటే? (గ్రూప్-2, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్- 2009)
    1) అధిక పీడన వ్యాప్తి 2) అల్ప పీడన వ్యాప్తి
    3) అధిక కంపన పరిమితి
    4) అల్ప కంపన పరిమితి
25. సిలికోసిస్ వ్యాధి ఏ అవయవానికి సంక్రమిస్తుంది?
    1) మూత్రపిండాలు 2) కాలేయం
    3) నరాలు 4) ఊపిరితిత్తులు
26. మొదటిసారిగా కృత్రిమంగా తయారు చేసిన జీవ సమ్మేళనం? (గ్రూప్-2, 2008)
    1) మీథేన్ 2) బెంజీన్
    3) గ్లూకోజ్ 4) యూరియా
27. సాధారణంగా మూత్రం ద్వారా విసర్జితమయ్యే పదార్థం? (గ్రూప్-2, 2003)
    1) పంచదార 2) గ్లూకోజ్
    3) క్రియాటిన్ 4) ప్రోటీన్
28. మానవ కిడ్నీలో ఏర్పడే రాళ్లలో అధికంగా ఉండేది?
    1) కాల్షియం ఆక్జలేట్ 2) సోడియం ఎసిటేట్
    3) మెగ్నీషియం సల్ఫేట్ 4) సోడియం సిట్రేట్
29. మూత్రపిండాల్లోని ఏ భాగంలో మూత్రం వడపోత అవుతుంది? (డీఎల్-2012)
    1) వృక్కం 2) మూత్ర కోశం
    3) ప్రసేకం 4) వృక్క సిర
30. మానవ మూత్రంలోని యూరియా తయారయ్యే భాగం? (గ్రూప్-2, 2000)
    1) మూత్రపిండాలు 2) పెద్దపేగు
    3) కాలేయం 4) మూత్రాశయం
31. కృత్రిమంగా మూత్రపిండాలు వ్యర్థ పదార్థాలను శుద్ధి చేయడాన్ని ఏమంటారు? (గ్రూప్-2బి, 1984)
    1) పనోరిసిస్ 2) మానోమీటర్
    3) డయాలసిస్ 4) డయామెంటేషన్
32. చక్కెర వ్యాధిగ్రస్థుని మూత్ర నమూనాలో ఉండేది? (ఏఈఈ-2009)
    1) లాక్టోజ్ 2) మాల్టోజ్
    3) గ్లూకోజ్ 4) సుక్రోజ్
33. క్లోమం ఒక ..? (గ్రూప్-1, 1999)
    1) అంతస్స్రావ గ్రంథి 2) బహిస్స్రావ గ్రంథి
    3) అంతస్స్రావ – బహిస్స్రావ గ్రంథి
    4) ఏదీకాదు
34. శరీరంలో తాప నియంత్రణను కలిగి ఉన్న గ్రంథి? (గ్రూప్-1, 2007)
    1) పీనియల్ గ్రంథి
    2) పిట్యూటరీ గ్రంథి/ హైపోథలమస్
    3) థైరాయిడ్ 4) అడ్రినలిన్
35. మానవ శరీరంలో 'ఆడమ్స్ ఆపిల్' అని పిలిచే గ్రంథి? (గ్రూప్-1, 2007)
    1) అడ్రినల్ గ్రంథి 2) లివర్/కాలేయం
    3) థైరాయిడ్-బాలగ్రంథి
    4) థైమస్-బాలగ్రంథి
36. తన జాతి జీవులపై ప్రభావం చూపే, జీవి శరీరం నుంచి బాహ్యంగా స్రవించే సమ్మేళనాన్ని ఏమంటారు? (గ్రూప్-1, 1995)
    1) సబ్ హార్మోన్ 2) న్యూరో హార్మోన్
    3) ఫిరామోన్స్ 4) న్యూరో ట్రాన్స్‌మీటర్
37. పాల పొదుగు నుంచి – చూషణ ద్వారా పాలను స్రవించేందుకు తోడ్పడే హార్మోన్? (సివిల్స్-1989)
    1) ప్రోలాక్టిన్ 2) ఆక్సిటోసిన్
    3) అడ్రినలిన్ 4) థైమోసిన్
38. రక్తపోటు (బ్లడ్ ప్రెజర్)కు కారణమైన హార్మోన్? (అసిస్టెంట్ తెలుగు ట్రాన్స్‌లేటర్-2010)
    1) కాలేయం 2) థైమోసిన్
    3) అడ్రినలిన్ 4) సెక్రిటిన్
39. కణం శక్తి గృహం (కణ శక్తి భాండాగారం) అని పిలిచే కణాంగం? (గ్రూప్-1, 1994, ఎ.ఎం.వి. ఇన్‌స్పెక్టర్- 2009)
    1) క్లోరోప్లాస్ట్ 2) మైటోకాండ్రియా
    3) గ్రానా 4) ప్రోటోప్లాజమ్
40. తుమ్ములు, మింగడం, వాంతులు, వెక్కిళ్లు దేని నియంత్రణలో ఉంటాయి? (గ్రూప్-1, 1990)
    1) మజ్జాముఖం 2) మస్తిష్కం
    3) అనుమస్తిష్కం 4) హైపోథాలమస్
41. అనుమస్తిష్కం (సెరిబెల్లమ్) దేనికి సంబంధించింది? (టౌన్ ప్లానింగ్ - 2010)
    1) కండరాల కదలిక సమన్వయం
    2) గ్రాహకాంగం 3) జ్ఞాపక శక్తి 4) దృష్టి
42. జంతు రాజ్యంలో అతిపొడవైన కణం? (గ్రూప్-1, 2010)
    1) ఆస్ట్రిచ్ అండం 2) శుక్రకణం
    3) నాడీకణం 4) మైకోప్లాస్మా
43. మెదడును కప్పి ఉంచే లోపలి పొర? (డీఎల్-2012)
    1) ప్లూరా 2) డ్యూరామ్యాటర్
    3) పియామ్యాటర్ 4) అరాకినాయిడ్ మెంబ్రేన్
44. పార్కిన్సన్ వ్యాధి ఏ అవయవానికి వస్తుంది? (ఏఈఈ-2006)
    1) గుండె 2) కాలేయం
    3) మెదడు 4) చర్మం
45. శరీరంలో వార్తలను గ్రహించి సమన్వయ పరిచే కేంద్రం? (జె.ఎల్.-2007)
    1) గుండె 2) మెదడు
    3) మూత్రపిండాలు 4) పీయూషగ్రంథి
46. మెదడులో ఏ భాగం జ్ఞాపకశక్తికి మూలం? (జె.ఎల్.-2004)
    1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
    3) దవ్వ 4) అథోపర్యంకం
47. కిందివాటిలో జీర్ణక్రియా ఎంజైమ్ కానిది? (సివిల్స్-2007)
    1) ట్రిప్సిన్ 2) పెప్సిన్
    3) టయలిన్ 4) గ్యాస్ట్రిన్
48. హెపటైటిస్ వ్యాధి దేనికి సంబంధించింది? (గ్రూప్-2, 2000)
    1) కాలేయంలో మంట 2) గుండెలో మంట
    3) మూత్రపిండాల్లో మంట
    4) పేగులో మంట
49. బేరియాట్రిక్ శస్త్ర చికిత్స అంటే ఏమిటి? (గ్రూప్-1, 2004)
    1) గుండె బైపాస్ శస్త్ర చికిత్స
    2) పొట్ట బైపాస్ శస్త్ర చికిత్స 3) మెదడు సర్జరీ
    4) సియామీ కవలలను విడదీసే సర్జరీ
50. కోసిన తర్వాత 2-3 వారాల్లోనే తన పూర్వ స్థితిని తిరిగి దాదాపు 85 శాతం వరకు పెంచుకునే సామర్థ్యం ఉన్న మానవ శరీర అవయం ఏది? (గ్రూప్-1, 2004, ఏఈఈ-2008)
    1) మెదడు 2) మూత్రపిండాలు
    3) కాలేయం 4) ఊపిరితిత్తులు
51. మానవుని సొల్లు (సెలైవా)లో ఉండే ఎంజైమ్? (గ్రూప్-2, 2003)
    1) రెనిన్ 2) అమైలేజ్
    3) లైపేజ్ 4) టయలిన్
52. 'రూట్ కెనాల్ థెరపీ' వేటికి సంబంధించిన చికిత్స? (గ్రూప్-2, 2000)
    1) దెబ్బతిన్న పళ్లు
    2) దెబ్బతిన్న మూత్రనాళం
    3) రక్తనాళాలు 4) గోర్లు
53. మానవుడిలో అతిపెద్ద గ్రంథి? (ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్-2012)
    1) కాలేయం 2) ఊపిరితిత్తులు
    3) ప్లీహం 4) క్లోమం
54. మానవ ఉదరంలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం? (గ్రూప్-1, 2012)
    1) ఎసిటికామ్లం 2) హైడ్రోక్లోరికామ్లం
    3) ఫార్మికామ్లం 4) నైట్రికామ్లం
55. కిందివాటిలో సరైన వరస క్రమం ఏది?
    1) గడ్డి–తోడేలు–జింక–గేదె
    2) గడ్డి–కీటకం–పక్షి–పాము
    3) బ్యాక్టీరియా–కీటకం–పాము–జింక
    4) బ్యాక్టీరియా–గడ్డి–కుందేలు–తోడేలు
56. అండోత్పత్తి స్థానం నుంచి అండాలు గర్భాశయంలోకి ప్రవేశించడానికి ఏ భాగం సహాయపడుతుంది? (గ్రూప్-1, 2004)
    1) సెర్విక్ 2) యోని
    3) జరాయువు 4) ఫెల్లోపియన్ నాళాలు

సమాధానాలు

1) 3;	2) 4;	3) 3;	4) 2;
5) 4;	6) 2;	7) 2;	8) 3;
9) 3;	10) 1;	11) 4;	12) 4;
13) 4;	14) 2;	15) 1;	16) 2;
17) 2;	18) 3;	19) 2;	20) 3;
21) 2;	22) 1;	23) 2;	24) 4;
25) 4;	26) 4;	27) 3;	28) 1;
29) 1;	30) 3;	31) 3;	32) 3;
33) 3;	34) 2;	35) 3;	36) 3;
37) 2;	38) 3;	39) 2;	40) 1;
41) 1;	42) 3;	43) 3;	44) 3;
45) 2;	46) 1;	47) 4;	48) 1;
49) 2;	50) 3;	51) 4;	52) 1;
53) 1;	54) 2;	55) 2;	56) 4.

పీష్వాలను ఓడించిన పరాక్రమశీలి శంకరమ్మ

తెలంగాణలో ముఖ్యమైన సంస్థానాలు

స్వాతంత్ర్యం రాక ముందు భారతదేశంలో 562 సంస్థానాలు ఉండేవి. తెలంగాణ ప్రాంతంలోనూ అనేక సంస్థానాలున్నాయి. కాకతీయులు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీల కాలంలో ఇవి ఆవిర్భవించాయి. వీటిలో ఆత్మకూరు, బోరవెల్లి, సీర్నవెల్లి, దుబ్బాక, దొంతి, దోమకొండ, గద్వాల, జటప్రోలు, పాల్వంచ, పాపన్నపేట, నారాయణపురం సంస్థానాలు ప్రధానమైనవి. సైనిక చర్య అనంతరం నిజాం రాష్ట్రంతో పాటు ఇవి భారతదేశంలో విలీనమయ్యాయి.

తెలంగాణ సంస్కృతి నిర్మాణంలో, సాహిత్య వికాసంలో సంస్థానాల పాత్ర మరువలేనిది. ఆంధ్ర ప్రాంతంలో నాయక రాజులు పోషించిన పాత్రను తెలంగాణలో సంస్థానాలు పోషించాయి.

ఆత్మకూరు సంస్థానం

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఆత్మకూరు సంస్థానం వైశాల్యం 190 చ.కి.మీ. దీని తొలి రాజధాని తివుడంపల్లి. వర్ధమానపురం పాలకుడైన గోనబుద్ధారెడ్డి తిరుపతి వెళ్లినప్పుడు చంద్రగిరికి చెందిన గోపాలరెడ్డి అతడికి సకల సౌకర్యాలు కల్పించాడు. గోపాలరెడ్డి ఆతిథ్యానికి ముగ్ధుడైన బుద్ధారెడ్డి అతణ్ని మగతలనాడు గౌడ పదవిలో నియమించాడు. ఇతణ్నే ఈ సంస్థాన స్థాపకుడిగా చెప్పవచ్చు. ఇతడి చిన్న కుమారుడు చినగోపిరెడ్డి యుద్ధాల్లో బహమనీ సుల్తాన్లకు సహకరించాడు. ఇందుకు ప్రతిఫలంగా ముజఫర్ పరగణాలో నాడగౌడ, సర్‌నాడ గౌడ, దేశ్‌ముఖ్, దేశ్‌పాండ్య, దేశాయిగిరి పదవులను పొందాడు.

చినగోపిరెడ్డి మనవడు రెండో గోపిరెడ్డి. ఇతడు అబ్దుల్లా కుతుబ్‌షా సమకాలీనుడు. రెండో గోపిరెడ్డి కుతుబ్‌షా దగ్గర నుంచి అల్లిపురం జాగీర్‌ను పొందాడు. గోపిరెడ్డి సోదరుడు సాహెబ్‌రెడ్డి. కడేచూరు, మగతల సీమలను పాలించేందుకు సాహెబ్‌రెడ్డికి కుతుబ్‌షా అనుమతిచ్చాడు. గోపిరెడ్డి తర్వాత సర్వారెడ్డి ఈ సంస్థానాన్ని పాలించాడు. సర్వారెడ్డి మనవడు రెండో సర్వారెడ్డి. ఇతడు యుద్ధాల్లో ఔరంగజేబుకు సహకరించి దుప్పల్లి జాగీర్‌ను పొందాడు. ఇతడి కుమారుడైన మొదటి తిమ్మారెడ్డి తర్వాతి కాలంలో రాజ్యాన్ని పాలించాడు. తిమ్మారెడ్డి మనవడు రెండో సాహెబ్‌రెడ్డి. ఇతడు కర్ణాటక దండయాత్రల్లో అసఫ్‌జాహీలకు సహకరించి 'సవైరాజా' బిరుదును పొందాడు. ఈ వంశంలో రెండో సాహెబ్‌రెడ్డి తర్వాత ఏడో తరానికి చెందినవాడు పెద వెంకటరెడ్డి. ఇతడు నిజాం రాజైన సికిందర్‌జాకు యుద్ధాల్లో సహకరించాడు. ప్రతిఫలంగా అమరచింత, వడ్డేమాను పరగణాల పట్టా పొందాడు. ఇతడు రాజధానిని తివుడంపల్లి నుంచి ఆత్మకూరుకు మార్చాడు. పెద వెంకటరెడ్డి తర్వాత అతడి కుమారుడు బాలకృష్ణారెడ్డి, మనవడు సోమభూపాలరావు సంస్థానాన్ని పరిపాలించారు. సోమభూపాలరావు అమరచింత, వడ్డేమాను పరగణాలను శాశ్వతంగా బిల్‌మఖ్తాగా పొందాడు. సోమభూపాలుడి కుమారుడు రాజా సీతారామభూపాలరావు. ఇతడి కుమారుడైన సవైరాజా రామభూపాలరావు బల్వంత్ బహద్దూర్ సంస్థానాన్ని పరిపాలించాడు. ఇతడు ప్రజలకు ఉపయోగపడే అనేక నిర్మాణాలను చేపట్టాడు. ఇతడి మరణానంతరం భార్య భాగ్యలక్ష్మమ్మ నిజాం నుంచి పరిపాలనా అనుమతి పొందింది. ఈమె కాలంలోనే ఈ సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

నారాయణపురం, రాజాపేట

ఇవి నల్లగొండ జిల్లాకు చెందిన చిన్న సంస్థానాలు వీటికి సొంత అధికారాలు ఉండేవి కావు. నిజాం ఉల్ ముల్క్ కాలంలో నల్లగొండ జిల్లా గట్టుప్పల్ ప్రాంతంలో ఒక గజదొంగ దురాగతాలకు పాల్పడేవాడు. మంచల్‌రెడ్డి అనే వ్యక్తి ఆ దొంగను చంపి, నారాయణపురం ప్రాంతాన్ని ఇనామ్‌గా పొందాడు. ఇతడి సోదరుడు సోమిరెడ్డి నారాయణపురం పటేల్‌గా నియమితుడయ్యాడు. తర్వాత మంచల్‌రెడ్డి కుమారుడైన రాయన్‌రెడ్డి పాలకుడయ్యాడు. నిజాంను ధిక్కరించిన ఒక సామంతరాజును ఇతడు బంధించి తెచ్చాడు. ఈ చర్యకు మెచ్చిన నిజాం ఇతడికి సర్‌మన్నెవార్, సర్దేశ్‌ముఖ్, సర్దేశ్‌పాండే, సర్‌నాడగౌడ బిరుదులు ఇచ్చి గౌరవించాడు. తర్వాత ఇతడిని రాచకొండ, భువనగిరి, అడవిమర్రి, షాద్‌నగర్, నర్సికొండ, ఇందుర్తి, ఇంద్రియాల, ఇబ్రహీంపట్నం పరగణాల మీద అధికారం కల్పించాడు.

రాయన్‌రెడ్డి 1775లో రాజాపేట కోటను నిర్మించాడు. 1782లో ఇతడి కుమారుడు వెదిరె వెంకట నారాయణరావు పాలకుడయ్యాడు. ఇతడే నారాయణపురం సంస్థానాన్ని స్థాపించాడు. ఇతడి కుమారుడైన రాయన్న మీర్ లాయక్ అలీ, సాలార్జంగ్ లాంటి గొప్పవారితో కలిసి చదువుకున్నాడు. ఇస్లాం మతాన్ని స్వీకరించాడు. ఇతడికి ఆరుగురు భార్యలు. చివరి భార్య హుస్సేన్ బేగంకు మాత్రమే ఒక కూతురు జన్మించింది. ఆమె పేరు జహీరున్నీసా బేగం. ఆమే ఈ సంస్థాన చివరి పాలకురాలు. రాజాపేట సంస్థానం పరిధిలో కుర్రారం, నమిలె, మాసాయిపేట, కోరుకొండ, పెదపాడు, సాదువెల్లి, చల్లూరు, వెంకిర్యాల, రాజాపేట గ్రామాలుండేవి..

పాపన్నపేట సంస్థానం

పాపన్నపేట అతి ప్రాచీన సంస్థానం. ఇది ఒకప్పుడు అన్ని సంస్థానాల కంటే పెద్దది. మెదక్ జిల్లా మొత్తం ఈ సంస్థాన పరిధిలో ఉండేది. రాణి శంకరమ్మ పాలనా కాలం నుంచి సంస్థాన చరిత్ర తెలుస్తోందని బి.ఎస్.శాస్త్రి తెలిపారు. సురవరం ప్రతాపరెడ్డి కూడా గోల్కొండ పత్రికలో ఈ సంస్థాన చరిత్రను రాశారు. అందులో రాణి శంకరమ్మ, సదాశివరెడ్డి గురించి మాత్రమే పేర్కొన్నారు. తర్వాతి కాలంలో కొన్ని గ్రంథాల ద్వారా ఈ సంస్థాన చరిత్ర కొంత వెలుగులోకి వచ్చింది.

చిదిరె వంశీయులు ఈ సంస్థాన రాజపురోహితులు. ఈ వంశానికి చెందిన చిదిరె లక్ష్మణశాస్త్రి 1928-29లో సంస్థాన చరిత్రను రచించాడు. ఇందుకోసం రాణి లింగాయమ్మ రాసిన మా పూర్వ వంశావళి, రాజా వెంకట నరసింహారెడ్డి ఉర్దూలో రాసిన మా వంశ చరిత్ర, వెంకటాద్వరి రచించిన మా సంస్థాన చరిత్ర, లింగాయమ్మ చరిత్ర; తిరుమలాచార్యుల శౌర్యరాజ్య వంశావళి, ముదిగొండ రామకృష్ణ కవి శ్రీమజ్జోగినాథ చరిత్ర అనే గ్రంథాలను ఆధారంగా చేసుకున్నాడు. వీటితోపాటు తమ పూర్వీకులు చెప్పిన విషయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాడు. లక్ష్మణశాస్త్రి సంస్థాన చరిత్ర రాతప్రతిని సురవరం, బిరుదురాజు రామరాజుకు ఇచ్చాడు. కానీ కొన్ని కారణాల వల్ల దాన్ని తిరిగి పొందలేదు. దీంతో తన వద్దనున్న చిత్తుప్రతి ఆధారంగా 1979-80లో మెదక్ రాజుల చరిత్రను ముద్రించాడు. ముదుంగ రంగ కృష్ణమాచార్యులు 2006-07లో 'అందోల్-జోగిపేట', 2012లో 'శౌర్యవీర్యరెడ్డి త్రయం' అనే పుస్తకాలు రాశాడు.

ఆందోల్ రాజుల చరిత్ర, మెదక్ రాజుల చరిత్ర, రంగంపేట చరిత్ర అనే వివిధ పేర్లతో పాపన్నపేట సంస్థాన రాజుల చరిత్ర వ్యవహారంలో ఉంది. కాకతీయుల సేనానుల్లో అనంతరెడ్డి ఒకరు. కాకతీయ రాజ్య పతనం తర్వాత ఇతడు సంగారెడ్డి సమీపంలోని కల్పగూరు వచ్చి స్థిరపడ్డాడు. ఇతడు నాటి పాలకులకు సాయం చేసి, వారి నుంచి కల్పగూరు పరగణాను పొందాడు. ఇతడే ఈ వంశ స్థాపకుడు. తర్వాత ఇతడి మనవడైన రామినేడు 1398లో పట్టాభిషిక్తుడయ్యాడని ఆందోల్ తహశీల్దార్ రాసిన మెదక్ చరిత్రలో ఉంది. రామినేడు ఆందోల్ కోటను నిర్మించాడు. 1418లో ఆందోల్‌ను రాజధానిగా చేసుకున్నాడు. కొండాపూర్, ఓంకారపురం, పొటన్ చెర్వు (పటాన్ చెరువు), తెలంగాణాపురం, రుద్రారం, మెతుకు, కాపాల, అతినగరం, డాకూరు మొదలైనవి ఇతడి సంస్థానంలో భాగంగా ఉండేవి. తర్వాత భువనగిరి, నిజాంపేట, చందంపేట, దేవరకొండ, నర్సాపూర్, దౌల్తాబాద్ తదితర ప్రాంతాలు కూడా ఇతడి సంస్థానంలో భాగమయ్యాయి.

రామినేడు తర్వాత ముసలారెడ్డి, పెద్దరెడ్డి, అల్లమయ్య చౌదరి, రామిరెడ్డి, మొదటి సదాశివరెడ్డి, పెద్దనరసింహారెడ్డి, లింగాయమ్మ, లింగారెడ్డి తదితరులు ఈ సంస్థానాన్ని పరిపాలించారు. రామదుర్గా వెంకట నరసింహారెడ్డి (1720-60) కాలంలో ఈ సంస్థాన పరిధి తగ్గి చిన్న సంస్థానంగా మారింది. శంకరమ్మ పరాక్రమం చూసిన నరసింహారెడ్డి ఆమెను వివాహమాడాడు. నరసింహారెడ్డి మరణం తర్వాత శంకరమ్మ సంస్థాన పాలన బాధ్యతలను చేపట్టాల్సింది. కానీ ఒక కుట్ర వల్ల రెండో లింగాయమ్మ రాణి అయింది. ఈమె 1760-64 వరకు సంస్థానాన్ని పాలించింది. మహారాష్ట్ర పీష్వాలు నిజాం రాజ్యంపై దండెత్తారు. కానీ శంకరమ్మ తన శక్తియుక్తులతో వారిని ఓడించింది. దీంతో నిజాం ఆమెకు రాయ్‌భాగన్ (ఆడ సింహం లాంటి రాణి) అనే బిరుదునిచ్చి రాణిగా నియమించాడు. 1764లో అధికారంలోకి వచ్చిన శంకరమ్మ రాజ్యాన్ని పునర్ నిర్మించింది. తన తండ్రి పేరు మీద సంగారెడ్డిని, తల్లి పేరు మీద రాజంపేటను నిర్మించింది. తన పేరు మీద శంకరంపేటను, మీరెల్లి పాపన్న పేరు మీద పాపన్నపేటను నిర్మించింది. ఈమె గొప్ప పరాక్రమవంతురాలు, పరిపాలనాదక్షురాలు. శంకరమ్మ పేరు మీద అనేక జానపదులు, వీరగాథలు ప్రచారంలో ఉన్నాయి. అందుకే చరిత్రకారులు ఈమెను రుద్రమదేవి, అహల్యాబాయితో పోల్చారు. వ్యవసాయాభివృద్ధికి శంకరమ్మ అనేక చెరువులు నిర్మించింది. ఈమె గొప్ప సంస్కరణశీలి. దళితుడైన నీరుడి పాపన్నను దళపతి చేసింది.

శంకరమ్మకు సంతానం లేదు. అందువల్ల పేద బాలుడైన సదాశివరెడ్డిని దత్తత తీసుకుంది. 1774లో ఈమె మరణించింది. దీంతో సదాశివరెడ్డి రాజ్యానికి వచ్చాడు. గద్వాల సంస్థానాధీశుడైన సోమనాథ భూపాలుడు ఇతడి ధైర్య సాహసాలకు ముగ్ధుడయ్యాడు. అందుకే ఇతడికి తన కుమార్తె అయిన పార్వతీదేవినిచ్చి వివాహం చేశాడు. సదాశివరెడ్డి కూడా మరాఠా పీష్వాలను ఓడించి నిజాం అలీఖాన్ (రెండో అసఫ్‌జా)కు సహాయం చేశాడు. నిజాం అలీఖాన్ పెద్ద కుమారుడు అక్బర్ అలీ. ఇతడు తండ్రి మీద తిరుగుబాటు చేసి సదాశివరెడ్డి, గాలిబ్‌జంగ్ సహాయం కోరాడు. ఈ సందర్భంగా జరిగిన మూడు యుద్ధాల్లో సదాశివరెడ్డి గెలుపొందాడు. కానీ చివరి యుద్ధంలో ఓటమిపాలై హత్యకు గురయ్యాడు. తర్వాత ఇతడి భార్య పార్వతీదేవి అధికారంలోకి వచ్చింది. రాజా రామచంద్రారెడ్డి బహద్దూర్ ఈ సంస్థాన చివరి పాలకుడు. ఇతడి కాలంలోనే పాపన్నపేట సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

వనపర్తి సంస్థానం

తెలంగాణలోని పెద్ద సంస్థానాల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి సంస్థానం ఒకటి. ఈ సంస్థానం సాహిత్యంలో మేటి. దీని పరిధిలో 124 గ్రామాలుండేవి. నూగూరు రాజధానిగా పాలించారు కాబట్టి వీరిని నూగూరు సంస్థానాధీశులని పిలిచేవారు. వీరి పూర్వీకులు నంద్యాలకు చెందినవారు. ఈ సంస్థాన స్థాపకుడు జనుంపల్లి వీరకృష్ణారెడ్డి. ఈ వంశంలో నాలుగో తరం వాడు వేమడి వెంకటరెడ్డి(1625-53). నెల్లూరు, ఉదయగిరి దుర్గాలను జయించడంలో అబ్దుల్లా కుతుబ్‌షాకు ఇతడు సహాయపడ్డాడు. ఈ వంశంలో అష్టభాషా గోపాలరావు ప్రసిద్ధుడు. ఇతడు రెండో వెంకటరెడ్డి కుమారుడు. ఈ వంశంలో బహారి బిరుదును పొందిన తొలి వ్యక్తి గోపాలరావు. ఇతడు 8 భాషల్లో ప్రసిద్ధుడు. ఇతడు రామచంద్రోదయం అనే కావ్యాన్ని, బాణం అనే సంస్కృత గ్రంథాన్ని రచించాడు. మిన్‌జానీబ్ సర్కారు తరఫున గోపాలరావు రెండేళ్లపాటు జటప్రోలు సంస్థానాన్ని పాలించాడు. ఇతడి దత్తపుత్రుడు మూడో వెంకటరెడ్డి. ఢిల్లీ సుల్తాన్ ఇతడికి సవై బిరుదును ఇచ్చాడు. వెంకటరెడ్డి తన తండ్రి పేరుమీద గోపాలపేట సంస్థానాన్ని స్థాపించాడు.

నూగూరు సంస్థానంలోని 12 గ్రామాలను అందులో చేర్చి, దానికి తన సోదరుడైన రంగారెడ్డిని పాలకుడిగా నియమించాడు. ఈ కాలంలో మొగలుల పరిస్థితి దిగజారింది. ఇదే అదనుగా వెంకటరెడ్డి పన్ను ఎగ్గొట్టాడు. దీంతో సుల్తాన్ సైన్యం ఇతడిపై దండెత్తింది. ఈ దాడిలో ఓడిపోయిన వెంకటరెడ్డి 1711లో ఆత్మహత్య చేసుకున్నాడు. గోపాలరావు కాలంలో ముద్రించిన నూగూరు సిక్కాలు (నాణేలు) సంస్థానానికి ఎంతో పేరు తెచ్చాయి. కానీ 'నూగూరు వెట్టి' వల్ల ఈ సంస్థానం అప్రతిష్ట పాలైంది. తర్వాతి కాలంలో ఈ వంశంలో చెప్పుకోదగిన వ్యక్తి మొదటి రామకృష్ణారావు (1807-1822). ఇతడు సంస్థానాన్ని వనపర్తికి మార్చాడు. నిజాం ఇతడికి 1817లో రాజబహద్దూర్ బిరుదునిచ్చాడు. ఇతడు మంచి పండితుడు. చాలా మంది ఫకీర్లు ఇతడి స్నేహితులుగా ఉండేవారు.

ఈ సంస్థానంలో అందరిలోకెల్లా ప్రసిద్ధి చెందినవాడు రాజా రామేశ్వరరావు. ఇతడిలో ఆధునిక భావాలు మెండు. ఆంగ్ల విద్య ఆవశ్యకతను గుర్తించిన రామేశ్వరరావు మద్రాస్ వెళ్లి ఆంగ్లం నేర్చుకున్నాడు. 1802లో రెవెన్యూ సెటిల్‌మెంట్ భూమిని కొలిచి సర్వే నంబర్లు వేశాడు. రైతులకు పట్టాలు ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టాడు. తెలంగాణలో రైతులకు పట్టాలు ఇచ్చిన తొలి సంస్థానం ఇదే. సాలార్జంగ్ కంటే ముందే ఇక్కడ సంస్కరణలు చేపట్టారు. అందుకే సాయుధ పోరాటం ఇక్కడ ప్రభావం చూపలేదు. రాజా రామేశ్వరరావు కులాంతర ప్రేమ వివాహం చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. సంస్థానంలో ఆధునిక సిద్ధాంతాలను ప్రవేశపెట్టి నిజాం సర్వసైన్యాధ్యక్ష పదవి పొందాడు. బ్రిటిషర్లు ఇతడికి 'హిస్ హైనెస్' అనే బిరుదును ప్రకటించారు. మూడో రామేశ్వరరావు కాలంలో ఈ సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

Common nouns followed by 'of'..

NOUNS

We use nouns to refer to animals, people, places and things.

Kinds and uses

- **Proper nouns:** The specific names by which we know an individual animal, a person, a place, such as an institution, a building or a town, or something such as a month, a day of the week, a season or a festival.

E.g. Smith; Delhi; India Gate; January; Sankranthi.. etc.

Note: that all proper nouns begin with a capital letter.

- **Common nouns:** words that name people, animals, places and things of the same kind Dog (as in my dog, Goldie), doctor (as in Satish, a doctor), library (as in central library), spoon(as in a plastic spoon)

Note: that all common nouns begin with a lower-case letter.

- **Common nouns are countable when:**
  - We use a / an in front of them.

    A bag, an orange, a shirt, an engineer
  - We can talk about many of them using their plural forms, with or without numbers in front of them.

    Ships, two books, seven women, many sheep, a few lemons.
  - We can use them in questions that begin with 'how many'.

    How many pens do you need?
    How many children are present today?
- **Common nouns are uncountable when:**
  - We do not use a/an in front of them.

Not a slat, but salt; not an oil, but oil.

  - We do not use their plural forms, with or without numbers in front of them, to specify what quantity we are talking about.

    Not a sugar, two sugars, many milks, but a grain of/two spoons of/four bags of/ ten kilograms of / many packets of / a lot of sugar, a little milk.
- We do not use them in questions that begin with 'how many', but only in those that begin with 'how much'.

Not How money do you owe him? but How much money do you owe him? not A How many plastic is manufactured in a day?, but How much plastic is manufactured in a day?

- **Note:** that some nouns can be used both as countables, when they refer to a thing, and as uncountables, when they refer to the substance or material it is made up of.

There are three glasses on the tray. ('glasses', countable noun).

The tray is made of glass. ('glass', uncountable noun).

Some countable nouns are concrete and represent people, things or activities that can be seen, touched or heard, for example rose, table, basket. Other countable nouns are abstract and represent states, feelings or qualities, which can only be felt or imagined, for example hop, ambition, joy. Similarly, some uncountable nouns are concrete, for example cotton, clothing, bread, while others are abstract, for example peace, pain, anger.

- **Collective nouns:** common nouns followed by 'of' and referring to groups of people or things.

A team of players, an army of soldiers, a bouquet of flowers.

- **Note:** that when using collective nouns, you will usually have to use the complete expression in order to make sense. For example, the collective noun 'bunch' by itself would not tell people what you are talking about because it could be used for grapes, roses or letters. Exceptions to this are, for example, 'an army', 'a bouquet' and 'a gang', which are usually used for soldiers, flowers and thieves respectively.

Plural forms of nouns

We use plural forms of nouns to talk about people, places and things that are more than one in number, for example 'two trolleys', 'a box of brushes', 'a few monkeys'.

Regular forms: You can follow the patterns below to form the plural forms of most nouns.

1. **Add-s in the case of most nouns:** mugs, pets, beds, cups, tubs, chiefs, cans, sums, teachers, dolls, months, smiles, tongues, days, windows.
2. **Add-es after nouns ending in:**
   -s: glasses, classes, passes, masses.
   -x: boxes, taxes, faxes.

BANK EXAMS

GENERAL ENGLISH

   -ch: matches, clutches, stitches.
   -sh: wishes, bushes, dishes.
3. **Add-s after nouns ending in -ay, -ey,-oy, -uy:** rays, keys, toys, guys.
4. **In nouns ending in a consonant letter+-y, replace the final-y with 'ies':** countries, cities, ladies, babies.
5. **In nouns ending in-fe, replace the letters with-ves:** knives, lives, wives.

Irregular forms: There are some nouns for which you cannot find the plural forms by following the patterns above. You will have to learn the plurals of these nouns through reading or by looking them up in a standard dictionary Look at some plurals that do not follow the usual pattern.

1. **Nouns ending in-f forms plurals:**
   - **With a final -f :** roof/ roofs, chief/ chiefs, proof/ proofs.
   - **With a final -ves in place of the -f :** calf/calves, loaf/loaves, leaf/ leaves.
   - **With either a final-s or a final -ves:** dwarf/ dwarfs or dwarves, hoof / hoofs or hooves, scarf/ scarfs or scarves.
2. **Nouns ending in -o form plurals:**
   - **Always with a final-oes:** potatoes, tomatoes, echoes.
   - **With either a final-oes or-os:** buffaloes/ buffalos.
   - **Always with a final-os:** kilos, radios, videos, photos.
3. **Nouns whose plural forms are formed by adding-en/-ren:** oxen, children
4. **Nouns whose plural forms are formed by changes in letters within the singular form:** foot/feet, mouse/mice, man/men.

Tips to remember

- The following words are countable and are normally used in singular form only. The indefinite article a/an should not be used with them.
- The words such as measles, mumps, ethics, maths, politics, phonetics, rickets, billiards and innings look like plural nouns but give singular meaning. So, they take singular form of verbs.
- Some nouns have the same form whether singular or plural.

Sheep, deer, service, series, species, apparatus.

- The following nouns are always used in the plural form only.

Cattle, scissors, spectacles, electorate, binoculars, crackers, clergy. These are used with plural form of verbs.

- Add**'s'** to the main word in compound noun to make it plural.
  Sister-in-law, sister's- in-law
- The possessive case of a compound noun is formed by adding**'s'** to the last word.
  Father-in-law's property.
- After the phrases *one of, some of, each of, either of, neither of, any of, none of,* a plural form of a noun is used.
- Nouns indicating numerals should be used in singular form.

A dozen eggs/ two dozen oranges.

- After collective noun either a singular or plural form of verb is used.
- An apostrophe and 's' is used with living beings only to show possession.
- When two nouns are connected by **'and'** and are closely related add an apostrophe and **s** to the last noun.
- Collective nouns, such as ***family, majority, audience,*** and ***committee*** are singular when they act in a collective fashion or represent one group. They are plural when the members of the collective body act as individuals. Collective nouns will usually be singular in Sentence Correction sentences.

A majority of the shareholders wants the merger.

This sentence is grammatically correct - but confusing. To determine whether a confusing noun requires a singular or plural verb, it might be helpful to visualize what's actually going on in the sentence. Is the sentence talking about something that acts as a *singular entity*? Or is it talking about the individual elements *within* that entity?

In the sentence here, there is no indication that the sentence is referring to the *individuals within* the majority. The "majority" acts as one - as a singular entity - and therefore requires a singular verb, "wants."

Again, the "flock of birds" is referred to as a singular group - we're not talking about *each bird's* direction of flight, but the direction of the flock as a whole - thus it requires the singular verb "is" not the plural verb "are".

The team are always fighting amongst themselves.

This is an example of a collective noun that requires a ***plural*** verb. While 'team' is often used as a singular collective noun, in this case, the sentence describes the fighting that occurs *between the individual members of the team.* "Team" therefore refers to several *individual members*, and requires a plural verb, "are," as a result.

The key to these questions is simplicity: recognize the collective noun, visualize what's going on in the sentence, and proceed.

Directions (Q. 1-15): *Each question below has a blank, indicating that something has been omitted. Choose the word from the five options for the blank that best fits the meaning of the sentence as a whole.*

1. The work increases our ___ about how the body fights disease.
1) knowledge 2) knowledges
3) knowledgably 4) acknowledge
5) knowledgeable

2. They are doing some fascinating-__________ into the language of dolphins.
1) Researches
2) researcher
3) research 4) re searches
5) re search

3. In our family, we share the ______ between us.
1) Houseworks
2) housework
3) houses works 4) house works
5) house working

4. The first task is to clean up the _____ left behind by the factories.
1) Pollutions 2) pollution
3) polluting 4) pollute
5) polite

5. They are suffering from _____ lack of medical supplies.
1) a serious 2) serious
3) seriously 4) seriousness
5) series

6. He's starting to get a few grey _____ now.
1) Hair 2) heirs 3) heir
4) hairs 5) hairy

7. Would you like some more ___ on your plate?
1) Cauliflower 2) cauliflowers
3) the cauliflowers
4) a cauliflowers
5) an cauliflowers

8. The doctor said that she was making _____ and she would probably be out of hospital by next week.
1) a good progress
2) good progress
3) good progresses
4) better progress
5) good progressing

9. The book has ______ at the end of every chapter.
1) Exercises 2) exercise
3) excess 4) exceed
5) execute

10. Do you want any help in bringing your ______ from the van?
1) stuffs 2) stuff 3) stuffing
4) stuffy 5) stuffed

11. _____ was the ideal punishment for her.
1) A prison 2) Prison 3) prisons
4) the prisons 5) an prison

12. Emily ate six _____ and two eggs for breakfast.
1) bacons 2) rashers of bacon
3) bacon 4) rash of bacon 5) bake

13. Is there _____ for all of us to fit in?
1) a room 2) rooms 3) room
4) the room 5) room's

14. They think she put _____ on their family.
1) a curse 2) curse 3) cursory
4) curses 5) an curse

15. Their offices have small upholstered _____ and comfortable chairs.
1) sofa 2) sofa's 3) sofas
4) an sofa
5) the sofas

Key:

1) 1 2) 3 3) 2 4) 2
5) 1 6) 4 7) 1 8) 2
9) 1 10) 2 11) 2 12) 1
13) 3 14) 1 15) 3.